# కె. చిరంజీవి రచనలు-పరిశీలన


పరిశోధన:

మల్లికార్జున్. వై

పర్యవేక్షణ:

ఆచార్య. సి. ఆనందలక్ష్మి



పి.హెచ్.డి పట్టం కోసం

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంత వ్యాసం

హైదరాబాదు

1996

DEPARTMENT OF TELUGU
SCHOOL OF HUMANITIES
UNIVERSITY OF HYDERABAD

June 29, 1996

This is to certify that I Y.MALLIKARJUN have carried out the research embodied in the present thesis for the full period prescribed under Ph.D. Ordinances of the University, My topic of the Ph.D. Programme is CHIRANJEEVI RACHANALU - PARISEELANA.

I declare to the best of my Knowledge that no part of this thesis was earlier submitted for the award of research degree of any University.

29/6

Signature of the Candidate

29/6

Signature of the Supervisor

29/6

HEAD OF THE DEPARTMENT

Dr R. SRIHARI
Professor and Head
Department of Telugu
University of Hyderabad
Central University Post
HYDERABAD-500 134

3/7/96

DEAN OF THE SCHOOL

DEAN
SCHOOL OF HUMANITIES
University of Hyderabad.
Hyderabad-500 134.

# కృతజ్ఞతలు

అక్షరం అంటే ఏమిటో తెలియకపోయినా, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, ప్రాథమిక విద్యనుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఎంతో శ్రద్ధతో చదివించిన అవ్వ, బాపులకు –

ఈ పరిశోధనకు పర్యవేక్షకత్వం వహించి, నా ఆలోచనా పరిధిని పెంచి, నన్ను ఆదరాభిమానాలతో ప్రోత్సహించి పుత్రునిగా భావించిన మాతృసమానురాలు ఆచార్య. సి. ఆనందారామం గారికి –

ఆత్మీయంగా పలకరించే మానవీయశాఖాధ్యక్షులు ఆచార్య కె.కె. రంగనాథాచార్యుల గారికి –

పరిశోధనాంశాన్ని సూచించి, పరిశోధనచేసే అవకాశం కల్పించి, ఆప్యాయంగా మాట్లాడుతూ వెన్నుతట్టి ప్రోత్సహించే తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య రవ్వా శ్రీహరి గారికి –

ఎప్పుడు కనిపించినా శిష్యవాత్సల్యం కురిపించే ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం, డాక్టర్. ముదిగొండ వీరభద్రయ్య, డా॥ పి. రామనరసింహం, డా॥ ఎన్.ఎస్. రాజు

డా॥ శరత్‌జ్యోత్స్నరాణి గార్లకు -

తెలుగుశాఖ సిబ్బంది పరమేశ్వర్, భవానిశంకర్, అయూబ్ గార్లకు -

ఎల్లప్పుడూ నాపై అభిమానం కురిపించే శ్రీ రామాచార్యులుగారికి, వారి కుటుంబ సభ్యులకూ-

నాకు విద్యా గంధాన్ని ప్రసాదించిన ఆత్మీయ గురువు సోముల మల్లారెడ్డి సారుకు -

'మాష్టారు! మీ రచనలపై పరిశోధన చేస్తున్నాను', అని తెలపగానే సంతోషించి తన దగ్గరున్న మొత్తం పుస్తకాలిచ్చి వెన్నుతట్టి ప్రోత్సహించిన శ్రీ కె. చిరంజీవి గారికి -

అనునిత్యం నా అభివృద్ధిని కాంక్షించే అక్కయ్య, బావలకు, తమ్ముళ్ళు మరియు అత్తయ్య, మామయ్యలకు, ప్రత్యేకించి ఆర్థికంగా సన్నాదుకొన్న రమేష్‌కు -

స్నేహ సుమాలు అందిస్తున్న నా అర్థాంగి 'కల్పనకు మరియు నా చిన్నారి 'కావ్య'కు -

ఈ విశ్వవిద్యాలయంలో ప్రవేశించినప్పటి నుండి నన్ను అనుక్షణం ప్రోత్సహించిన ఆత్మీయులు, మిత్రులు, బంధువులు శ్రీకాంత్, జవహర్, నరేంద్ర, జయ, ప్రకాశ్, మోషే, విజయ్, వేణు, దాపులూరి, సుబ్బు, హేమంత్, కళ్యాణ్, నారాయణ, రాజు, సురేష్, పెరుమాళ్ళు, కోటి, కాంతా, పద్దు, పాత్రో, భారతి, రామకృష్ణ, వెంకి మరియు బాల్యమిత్రులు శంకర్, కొమురి, మూర్తి లకు –

ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయం

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం వారికి –

న్యూ ఆర్ ఎస్ హాస్టల్ సిబ్బందికి –

ఇంకెందరో వారందరికీ –

నా హృదయపూర్వక కృతజ్ఞతలు

మీ
/
మల్లికార్జున్

# ఉపక్రమణిక

ఆధునిక సాహిత్యంలో ph.D డిగ్రీకై పరిశోధన చేయాలనేది నాఆశయం. ఈరంగంలో కె. చిరంజీవిపేరు సూచించి నన్ను ప్రోత్సహించింది ఆచార్య రవ్వా శ్రీహరిగారు. ప్రాచీనసాహిత్యంలో నిష్ణాతులయిన ఆచార్య రవ్వాశ్రీహరిగారు ఆధునికసాహిత్యాన్ని కూడా అభిమానించి అధ్యయనం చేస్తారు. ఆకారణం చేతనే ఆధునికసాహిత్యంలో వివిధ ప్రక్రియలు చేపట్టిన చిరంజీవి రచనల మీద పరిశోధన చేసే అవకాశం కల్పించారు.

చిరంజీవి నవల, నాటకం, నాటిక, రేడియో నాటిక కథానిక – మొదలైన అన్ని ప్రక్రియలను చేపట్టి సమర్థంగా నిర్వహించారు. నిజానికి ఈప్రక్రియలలో ఏఒకదా-దానిమీదనయినా ph.Dకై పరిశోధన చేయవచ్చు. అయినా చిరంజీవి రచనలన్నింటిపై పరిశోధన చేయాలనే ఆరాటంతో వారి రచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నాను.

చిరంజీవిగారి సాహిత్యాన్ని ఐదు అధ్యాయా-లుగా విభజించుకున్నాను.

1. చిరంజీవి జీవితం-సాహితీ వ్యక్తిత్వం

2. నవలా రచయితగా చిరంజీవి

3. నాటక రచయితగా చిరంజీవి

4. రేడియో నాటక రచయితగా చిరంజీవి

5. కథానిక రచయితగా చిరంజీవి

ఒక్కొక్క ప్రక్రియకు ప్రక్రియ సంబంధమైన స్వరూప స్వభావ వివరణ ఇచ్చాను. సంగ్రహంగా ఆయా ప్రక్రియ చరిత్రను పరిచయం చేసాను.

నవలా ప్రక్రియ పరిశోధనలో ఆయా నవలలకు సంబంధించిన సామాజిక రాజకీయ నేపథ్యాన్ని వివరిస్తూ ఇతివృత్త నిర్వహణ నైపుణ్యాన్ని కూడా ఎత్తిచూపాను. పాత్రపోషణను సోదాహరణంగా వివరించాను. అక్కడక్కడ రచయిత ప్రదర్శించిన వ్యంగ్యాన్ని వ్యాఖ్యానించి దాని ప్రయోజనాన్ని నిర్ధారించాను. రచయిత చేసిన ప్రయోగ విశేషాలను శిల్పదృష్టితో వివరించాను.

రచయిత అభ్యుదయ దృక్పథాన్ని సోదాహరణంగా

విశ్లేషించాను.

నాటిక రచనలోను నాటకరచనలోను ప్రయోగవిశేషాలను సమీక్షించాను. నాటకీయ విశేషాలను సందర్భానుసారంగా వివరించి ఇతివృత్తంలోని ప్రాధాన్యాన్ని, దాన్ని నాటికగా లేక నాటకంగా మలచుకోవటంలో రచయిత చూపించిన నేర్పును విశదీకరించాను.

రేడియో నాటికలకు ధ్వని ప్రధానం. కాని ముద్రిత ప్రతిలో రచయిత ఇచ్చిన సూచనలే తప్ప రేడియోలో ప్రసారమయిన ధ్వనులన్నీ లభ్యంకావు. అందుచేత రచయిత సూచననుసరించే రేడియో నాటికా శిల్పాన్ని వ్యాఖ్యానించాను.

ఇతివృత్త నిర్వహణా సామర్థ్యాన్ని అన్ని ప్రక్రియలలోనూ ప్రక్రియానుగుణంగా వివరించాను

"భారతి భారతీసముద్రము, దఱియంగ నీదను విధాతృనకైనను నేరఁ బోలునే." అని నన్నయగారన్నట్లు బహుళప్రక్రియమయమైన చిరంజీవి సాహితీ ప్రపంచాన్ని

తుదముట్టా పరిశోధించటం కష్టసాధ్యమే అయినా నానేర్చినకొలది ప్రయత్నించాను. అన్ని ప్రక్రియల పరిశోధన-లోను చిరంజీవిగారి అభ్యుదయ దృక్పథాన్ని నిర్ధారించాను.

# విషయ సూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| | కృతజ్ఞతలు | |
| | ఉపక్రమణిక | |
| I | చిరంజీవి జీవితం - సాహితీ వ్యక్తిత్వం | 1 — 25 |
| II | నవలా రచయితగా చిరంజీవి | 26 - 153 |
| | 1. నవల - పరిచయం | 26 - 29 |
| | 2. టోల్ స్వతంత్ర భారత్ కి జై | 30 - 85 |
| | 3. ఎకడెడికీ ప్రస్థానం | 86 - 100 |
| | 4. అనంతయాత్ర | 101 - 122 |
| | 5. ముళ్ళ గులాబి | 123 - 138 |
| | 6. చీమ మనుషులు | 138 - 153 |
| III | నాటకరచయితగా చిరంజీవి | 154 - 232 |
| | 1. నాటకం - నాటిక - పరిచయం | 154 - 170 |
| | 2. నీలిదీపాలు | 171 - 194 |
| | 3. సోనార్ బంగ్లా | 195 - 202 |
| | 4. పొలిటిక్స్ | 203 - 207 |

5. మహాభినిష్క్రమణం 208 - 21

6. నర్తన బాల 214 - 22

7. దేవుడెరుగని నిజం 222 - 22!

8. ఇక్కడ పెళ్ళి చేయబడును 226 - 228

9. ప్రేమ పక్షులు 229 - 232

IV రేడియో నాటకరచయితగా చిరంజీవి 233 - 316

1. రేడియో నాటకం - పరిచయం 233 - 255

2. వంశాంకురం 256 - 266

3. బొమ్మ తిరగబడుతున్నాయి.
4. శాంతి సమరం
266 - 281

5. శ్రీకృష్ణశిరోభారం 282 - 294

6. కొక్కొరొకో 294 - 298

7. ఆకలిమందు 299 - 304

8. కాలయంత్రం 304 - 307

9. ఊరేళ్ళు మేలుకుంటున్నారు 308 - 316

| | | |
|---|---|---|
| V | కథానిక రచయితగా చిరంజీవి | 317 - 347 |
| | 1. కథానిక - పరిచయం | 317 - 326 |
| | 2. పండు వెన్నెల - నిండు చీకటి | 326 - 330 |
| | 3. గాజుల గలలమంద | 330 - 333 |
| | 4. మంచివాడు | 333 - 335 |
| | 5. రెండు కన్నీటి చుక్కలు | 336 - 338 |
| | 6. దేవుడెరగని నిజం | 339 - 341 |
| | 7. సదువు బలికోరుద్ది | 342 - 345 |
| | 8. విలనుడు | 345 - 347 |
| | ఉపసంహారం | 348 - 356 |
| | ఉపయుక్త గ్రంథసూచి | 357 - 366. |
| | సంకేత పద వివరణ | 367. |

# చిరంజీవి జీవితం

# సాహిత్య వ్యక్తిత్వం

కొందరు వ్యక్తులకు వారి వృత్తిని బట్టి ప్రవృత్తి రూపుదిద్దుకొంటుంది. మరికొందరికి వారి వారి ప్రవృత్తిని బట్టి వారు ఎన్నుకున్న వృత్తి శోభిస్తుంది. రెండవ కోవకు చెందినవారు కె. చిరంజీవి.

సృజనాత్మక ప్రతిభ గల ప్రథమ శ్రేణి రచయితల్లో ఒకరైన చిరంజీవికి మొదట పత్రికారంగంలోను, తర్వాత ఆకాశవాణి లోను ఉద్యోగవకాశాలు రావడం వారి సృజనాత్మక ప్రతిభకు సానపెట్టినట్లయింది. వారి వృత్తి వల్ల ప్రతిభ, ప్రతిభ వల్ల వృత్తి పరస్పరం శోభించాయి.

ఏ మనిషికైనా అన్ని పాఠశాలల కంటే గొప్ప పాఠశాల, జీవితం. ఈ బతుకు పుస్తకాన్ని అన్ని కోణాలలోంచి అధ్యయనం చేయగలిగే అవకాశాలు చిరంజీవికి లభించాయి.

కె. చిరంజీవి 1935 మార్చి 18వ తేదీన ఒక రైతు కుటుంబంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు తుంటముకేల రామదాసు, రామమ్మ దంపతులు. ఈ దంపతులకు కడగొట్టు సంతానం చిరంజీవి. చిరంజీవికి వెంకటేశ్వర్లు అనే అన్నగారు

లక్ష్మమ్మ అనే అక్కగారు ఉన్నారు. పుట్టింది ప్రకాశం జిల్లాలోని పైదన అనే గ్రామంలో. అప్పట్లో ఈ చిన్న గ్రామం గుంటూరు జిల్లాలోని నరసరావుపేట తాలూకాలో ఉండేది. అక్కడ విద్యా సౌకర్యాలు లేని కారణంగా తన మేనమామ ఉంటున్న తెనాలి పట్టణానికి విద్యాభ్యాసం కోసం వచ్చాడు.

తెనాలి తాలూకా హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సి వరకు మాత్రమే చదివారు. స్కూలు ఫైనలయినా కావడంతోనే ఆంధ్ర క్రాంతి థియేటర్స్‌తో పరిచయమైంది. అది 1952 ప్రాంతం. కమ్యూనిష్టులు తెలంగాణా సాయుధ పోరాటాన్ని విరమించుకొని బయటుకు వస్తున్న రోజులు. అలాంటి నేపథ్యంలో క్రాంతి థియేటర్స్‌తో ఏర్పడిన పరిచయం చిరంజీవి జీవితం ఒక మలుపు తిరగడానికి కారణమైంది. ఆయన జీవితంలో ప్రధానమైన మలుపు ఇది. ఇక చిరంజీవి జీవితమంతా నాటకాలు, సాహిత్యం, కమ్యూనిజం - ఇవే సర్వస్వమై పోయాయి. మార్గ నిర్దేశం లభించి నట్లయింది. జీవిత గమ్యమేమిటో బోధపడినట్లయింది.

1953 వ సంవత్సరంలో అంటే 18 ఏళ్ళ ప్రాయంలో

నాటకరంగంతో పరిచయమేర్పడింది. ఎన్నో నాటకాలాడారు. ఆ తర్వాత సాహితీపరుల సాంగత్యం వల్ల అభ్యుదయోద్యమం వైపు మొగ్గు చూపారు.

1957 లో హైదరాబాదు నుండి వెలువడే సోషలిస్టు పార్టీ పత్రిక 'నవశక్తి' లోను, మరి రెండేళ్ళ పాటు చిత్రభాను గారి 'యువ' లోను పని చేసారు. ఆ పత్రికలలో పనిచేస్తోన్న కాలంలో సాహిత్యంలోని వివిధ ప్రక్రియలను వివిధమైన కలం పేర్లతో రచించారు అయినా రాశి కంటే వాసికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చే చిరంజీవి చాల తక్కువ రచనలు చేసారనే చెప్పవచ్చు. వస్తువు, శిల్పమనే గాకుండ ప్రతి వాక్యానికి, ఆ వాక్యంలోని ప్రతి మాటకి నగిషీలు దిద్దాలంటారు. అర్థమూ, భావమే గాక అందులోని సంగీతాన్ని సైతం చూసే 'పెర్‌ఫెక్షనిస్టు' చిరంజీవి.

1959 జూలై 19 న మేనమామ గంపా రంగనాయకులు పెద్దకు మార్తె అంబుజమ్మను వివాహమాడాడు. ఈయన వివాహం కేవలం రూపాయిన్నర ఖర్చుతో జరిగింది. ఆ రెండు పూలమాలల ఖర్చు అంతే. కామ్రేడ్ చింతల సత్యనారాయణ గారు తెనాలి

సత్యనారాయణ టాకీసులో వీరి వివాహాన్ని జరిపించారు.

హైదరాబాదులో స్థిరనివాసమేర్పరచుకున్న చిరంజీవికి ముగ్గురు పిల్లలు. కవిత, నవత అనే ఇద్దరమ్మాయిలు, చైతన్య అనే అబ్బాయి.

1961 ఏప్రిల్ 1న ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో చేరి 32 ఏళ్ళపాటు పనిచేసి 1993 మార్చి 17న పదవీ విరమణ చేసిన చిరంజీవి గొప్ప మానవతావాది.

స్వాతంత్ర్యానికి కొంచెం ముందుగా జన్మించిన ఈ రచయిత, స్వాతంత్ర్యానంతర సంక్షుభిత భారతంలో కలం పట్టి దేశంలోని అల్లకల్లోలాలన్నీ తన మనసులోని తీవ్రోద్వేగాలలో కలబోసుకొని తన భావ సంచయాన్ని వివిధ సాహితీ ప్రక్రియలుగా పాఠక లోకం ముందుంచారు.

రచయిత వ్యక్తిగత జీవితానుభవాలు రచనకు ఊపిరి కాగా వృత్తిలో వచ్చిన అవకాశాలు ఆ రచనలకు సరికొత్త ప్రయోగాత్మక రూపాలను కల్పించటానికి దోహదం చేసాయి.

## 1947 తర్వాత భారతదేశంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు:

స్వాతంత్ర్యానంతరం గడచిన నాల్గున్నర దశాబ్దాల కాలంలో అనేక రాజకీయ మార్పులతో పాటు ఆర్థిక, సాంఘిక పరిస్థితుల్లో కూడా మార్పులు వచ్చాయి. మన సాంఘిక సమస్యలు నూతన పరిస్థితుల్లో నూతన స్వరూపాలు ధరించుతున్నాయి. ఫ్యూడల్ సంస్కృతి, నాగరికత, ఆచార వ్యవహారాలు కొంతైనా మారాయి. కన్యాశుల్కం, బాల్య వివాహాలు, ఘోష పద్ధతులు తగ్గాయి. నిర్బంధ వైధవ్యం లేదు. అంటరానితనం - బాగా వెనకబడిన ప్రాంతాలలో తప్ప, చాలా వరకు పాటించబడటం లేదు. వారిలోను విద్యా, విజ్ఞానాలు పెరిగాయి. అన్ని కులాల పెళ్ళిళ్ళకు అన్ని కులాల వారు వెళ్ళడం, విందులారగించడం జరుగుతోంది. కులాంతర వివాహాల పట్ల ఒకనాడున్న తీవ్ర వ్యతిరేకత నేడు లేదు. భోజన-ప్రతి భోజనాలు, వర్ణాంతర వివాహాలు - మొదలైన విషయాలలో 'కులం లోంచి వెలి' అన్నది ఇంచుమించు అదృశ్యం అవుతోంది. అయితే కులం వేరు, కుల తత్వం వేరు. మతం వేరు, మత తత్వం వేరు. కానీ నేడు

కొంతమంది తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం పని గట్టుకొని కులమత తత్వాలు రెచ్చగొడుతున్నారు. ఇది నూతన పరిస్థితి.

ఇక సాంఘిక సమస్యల స్వరూపం ఎలా ఉందో చూద్దాం: వరకట్నాల సమస్య, వరకట్న దురాచారం, ఫ్యూడల్ సంస్కృతి అవశేషాలపై పెట్టుబడిదారి వ్యాపార సంస్కృతి వచ్చి పడటంతో. మరింత విషమ స్వరూపం దాల్చింది. ఒకనాటి అతి బాల్య వివాహాలు, నిర్బంధ వైధవ్యం స్థానంలో నేడు ఇంటింట పెండ్లి కాని యువతులు, వృద్ధ కన్యల సంఖ్య పెరుగుతోంది. కట్నాలు ఇవ్వలేక ఆడపిల్లల్ని - గర్భస్థ పిండాల దశలోనే హతమార్చే ఎమినో సింటసిస్- పరీక్షలు - భ్రూణ హత్యలు జరుగుతున్నాయి. కట్నాల వేధింపుల వల్ల వివాహితల హత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి.

పట్టపగలే స్త్రీలను ఎత్తుకు పోవడం, వ్యభిచార గృహాలకు అమ్మడం ఎక్కువైంది. స్త్రీలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. ఉన్నత విద్యా విజ్ఞానాలు, ఉద్యోగాలు పొందిన స్త్రీల శాతం పెరిగినప్పటికీ - ఈనాటికి నూటికి 50-60 మంది స్త్రీలు

నిరక్షరాస్యత లోనే మగ్గుతున్నారు. ముఖ్యంగా పురుషాధిక్య భావం ప్రవర్తన, స్త్రీల అభివృద్ధికి పెద్ద ఆటంకంగా తయారవుతోంది. వివాహం, వారసత్వం, విడాకులు, ఉద్యోగాలు, ప్రయోజనాలు, సమాన పనికి సమానవేతనం మున్నగు విషయాలలో స్త్రీ పురుషుల మధ్య అసమానత్వ వివక్షత కొనసాగుతోంది.

మద్యపానం, మత్తుమందులు, మాదకద్రవ్యాలు సమాజానికి పెనుభూతాల్లా నేడు పరిణమించాయి. అంటరానితనం క్రమంగా అస్తమయం పడుతున్నప్పటికీ, అట్టడుగు దళితవర్గాలపై అగ్రవర్గ భూస్వాములు, పెత్తందారీ వర్గాల దౌర్జన్యకాండలు, దహనకాండలు, హత్యాకాండలు పెరుగుతున్నాయి.

చంద్రునిపై మానవుడు కాలుపెట్టాడు. రోదసీ యుగం లోకి, అణు యుగం లోకి మానవుడు పురోగమిస్తున్నాడు. కాని ఈనాటికీ నరబలులు, బాణామతి, జోగినులు, హేతువాద విరుద్ధమైన మహిమలు, మహాత్మ్యాలు - అనేక రకాల మూఢ విశ్వాసాలు మన సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. బాబాలు శూన్యం లోంచి పదార్థాన్ని సృష్టించుతామని ప్రజలను దగా, మోసం చేస్తున్నాయి.

దేశంలో అవినీతి, లంచగొండితనం, అక్రమార్జనలు పెచ్చు పెరిగాయి. లంచం ఇవ్వనిదే ఏ పని జరగడం లేదు. బ్లాక్ మార్కెట్, బ్లాక్ మనీ అవినీతికి, అక్రమార్జనలకు కారణం అవుతున్నాయి.

రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో నైతిక ప్రమాణాలు, నైతిక విలువలు పడిపోయాయి. నీతి నిజాయితీ తగ్గిపోయి పదవీ వ్యామోహం, స్వార్థం, మోసం అన్ని రంగాల్లోను విపరీత స్థాయికి చేరుకున్నాయి. త్యాగ దీక్షలు, నిస్వార్థ ప్రజాసేవా భావం సన్నగిల్లిపోతున్నాయి. దోపిడీలు, దొంగతనాలు, హింసాకాండ, హత్యాకాండలు భయంకరంగా సాగుతున్నాయి. డబ్బు విలువ ముందు మనిషి ప్రాణం విలువ, మానవ జీవిత విలువ దమ్మిడీకి కొరగాకుండా పోయింది. కిరాయి హంతక ముఠాలు బయలుదేరాయి. అరక్షిత స్థితి రోజు రోజుకు పెరుగుతోంది. రాజకీయ రంగంలోకి నేరస్థులు, నేర ప్రవృత్తి గలవారు ప్రవేశించారు, ప్రవేశిస్తున్నారు. హింసా ప్రవృత్తి, కిడ్నాపులు, హత్యాకాండలు – రాజకీయ రంగంలో ప్రధాన సాధనాలుగా తయారయ్యాయి. చదువు సంధ్యలు పెరిగినంతగా సంస్కారం పెరగలేదు. జాతీయోద్యమ కాలం లోను

ళ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంలోను నిరాడంబరత, పొదుపుగా జీవించడం మొదటి కర్తవ్యంగా ఉండేది. అటువంటి నిరాడంబర జీవితం కనుమరుగవుతుంది.

నేడు పత్రికా రంగంలో సర్క్యులేషన్ పోటీలో అనేక అవాంఛనీయ ధోరణులు బయల్దేరాయి. వార, మాస పత్రికలు సెక్స్, క్రైమ్ సాహిత్యాన్ని విరివిగా ప్రచురిస్తున్నాయి. పరిశోధనాత్మక పత్రికా రచన పేరిట బ్లాక్ మెయిలింగ్, (వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కథలు) కట్టుకథల సృష్టి ఊహాగానాలు ఎక్కువయ్యాయి. ఈ అనారోగ్యకరమైన పోటీలో వ్యాపార దృష్టి ప్రధానమవుతుంది తప్ప సామాజిక శ్రేయస్సు, సామాజిక మార్పుల కోసం చేసే కృషి వెల్లుఅంటున్నాయి. వ్యాపార ప్రకటనలలో, సినిమాలలో, సాహిత్య రంగంలో సెక్స్, క్రైమ్, అశ్లీలత, అసభ్యత విపరీత స్థాయికి పెరిగింది. స్త్రీ - అంగడిబొమ్మగా చేయబడుతోంది.

రాజకీయ రంగంలోకి కులాన్ని, మతాన్ని ప్రవేశపెట్టి కులతత్వాలను, మత తత్వాలను రెచ్చగొట్టి అధికార సాధనాలుగా చేసుకుంటూ దేశ సమైక్యత సమగ్రతలకు ముప్పు తెస్తున్న

నేటి కుల,మత, ఛాందసవాద శక్తులకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య వాదులు, దేశభక్తులందరూ సమైక్య పోరాటం చేయడం, ఈ పోరాటంలో జోడించి - ఆర్థిక, సాంఘిక న్యాయం కోసం, దారిద్ర్యం, నిరుద్యోగం, అధిక ధరలు, ఆర్థిక అసమానతలు వ్యతిరేకంగా పోరాడటం, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలతో పాటు సోషలిస్టు సమాజ నిర్మాణం అంతిమ లక్ష్యంగా ముందుకు సాగడం ప్రప్రథమ జాతీయ కర్తవ్యంగా భావించాలి.

ఈ నేపథ్యంలో చిరంజీవి కమ్యూనిస్టుగా, అభ్యుదయ రచయితగా జీవితం ప్రారంభించారు. ఇది ఏటికి ఎదురీత. పాలక వర్గాన్ని అనుసరించటానికి ఎవరైన ముందుకు వస్తారు గాని, ఎదురించి నిలవటానికి అతి తక్కువ మంది సంసిద్ధులవుతారు. చిరంజీవి వ్యవస్థను రాజకీయంగాను, సామాజికంగాను కూడా ఎదురించి నిలబడ్డ ధీరుడు. ఆ ధీరత్వం ఈయన చేపట్టిన సాహితీ ప్రక్రియలన్నింటిలోనూ ప్రతిఫలిస్తుంది. (ఈ విషయం ఆయా అధ్యాయాలలో మరింత విపులంగా వివరిస్తాను).

ఇంగ్లీయుల పరిపాలన వల్ల దేశానికి కల్గిన కీడులా మేల్లు 1. జాతీయ సమైక్యత 2. సాహిత్య వికాసం. అప్పటికే ఎంతో పరిపుష్టి పొందిన ఇంగ్ల సాహిత్యం లోని ప్రక్రియలన్నీ తెలుగు సాహిత్యం లోని ప్రక్రియలను ప్రభావితం చేసాయి. ఇంగ్ల భాషా ప్రభావంతో తెలుగు సాహిత్యంలో వికసించిన నవల, కథానికా ప్రక్రియలు ప్రధానమైనవి కాగా, నాటకం, రేడియో నాటకం, గల్పికలు మొదలైనవి ప్రయోగాత్మక ప్రక్రియలు.

ఆధునిక రచయితలలో ప్రముఖ సాహితీవేత్తగా, రేడియో నాటక కర్తగా, నటుడుగా, ప్రయోక్తగా కె. చిరంజీవికి విశిష్ట స్థానం ఉంది. నవల, నాటకం, నాటిక, రేడియో నాటకం, కథానిక ప్రక్రియలను చేపట్టి విజయవంతంగా నిర్వహించారు. సమసమాజ నిర్మాణం ధ్యేయంగా పెట్టుకొని అనేక రచనలు చేసారు. వీరి రచనలు చదివితే రాశి కంటే వాసికి ప్రాధాన్యం ఇస్తారు అన్న విషయం సుస్పష్టం అవుతుంది. చరిత్రలో మార్పులు, పురోగమనాలు, తిరోగమనాల గురించి స్థిరమైన భావాలను వ్యక్తం చేసారు. తెలుగునాట ప్రజ్వరిల్లిన ఉద్యమాలు, ఉద్వేగాలు

ఆవేశాలు, ఆందోళలనలను నవలలుగా, నాటకాలుగా, రేడియో నాటకాలుగా మలచి ప్రాణం పోసి సమాజానికి అందించిన సాహిత్య జీవిగా చిరంజీవిని పేర్కొనవచ్చు. రేడియో నాటకం అనగానే చిరంజీవి పేరు గుర్తుకొస్తుంది. రేడియో నాటకం ఎలా రాయాలో, ఎలా చేయాలో చెప్పి చూపారు. తెలుగు రేడియో నాటకానికి ఒక స్థిర రూపమిచ్చి, దీనికి సాహిత్య గౌరవం సంతరించి పెట్టింది ఈయనేనంటే అతిశయోక్తి కాదు.

చిరంజీవి రాసిన నవలలు:

1. ముళ్ళ గులాబి
2. అనంత యాత్ర
3. ఎకెటడికీ ప్రస్థానం
4. చోలో స్వతంత్ర భారత్ కి పై
5. చీమ మనుషులు

వీరు రాసిన నవలలన్నింటిలోకి ప్రధానమైనది 'చోలో స్వతంత్ర భారత్ కి పై' అనే నవల. 1947 ఆగష్టు 15 తో ప్రారంభించి 1983 ఆగష్టు దాకా ఈ మూడున్నర

దశాబ్దాల కాలంలో మనదేశంలో- రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, నైతికంగా జరిగిన పరిణామాలేమిటో తూసగుచ్చినట్లు డాక్యుమెంటరీ ఎవిడెన్సుతో రాసిన సవిమర్శక నవల. స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రను ఉన్నదున్నట్టుగా పలుకోణాల నుంచి చూసి సజీవమైన అనేకానేక పాత్రలతో రూపుకట్టించాడు రచయిత.

విజయలక్ష్మి స్మారకట్రస్టు వారు ఈ నవలకు అవార్డు నిచ్చి ప్రచురించారు. దీనికి తెలుగు విశ్వవిద్యాలయం 1985లో 'ఉత్తమ నవల' బహుమతి నిచ్చింది.

## చిరంజీవి రాసిన నాటకాలు :

1. నర్తనబాల
2. ప్రేమ పక్షులు
3. దేవుడెరుగని నిజం
4. సోనార్ బంగ్లా
5. ఇచ్చట పెళ్ళి చేయబడును
6. పొలిట్రిక్స్
7. నీలి దీపాలు
8. మహా నిష్క్రమణం

ఈ ఎనిమిది నాటకాలను 'ఆటబొమ్మలు' పేరుతో నాటక సంకలనంగా తీసుకొచ్చారు. దీనికి తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం చేసింది.

<u>నర్తనశాల:</u> తొలి ప్రదర్శన 1965 డిసెంబర్ 11. ఆంధ్రా ఆర్ట్స్ థియేటర్, విజయవాడ వారు పోలవరపు సూర్యప్రకాశరావు, కొడాలి ఆదిశేషయ్యల దర్శకత్వంలో ఆంధ్ర నాటక కళాపరిషత్తు 24వ వార్షిక మహాసభల నాటక పోటీలలో ప్రదర్శించారు. ఈ నాటకానికి పాటలు రాసింది డాక్టర్. దాశరథి రంగాచార్య, డాక్టర్. వెల్దుర్తి వేంకటేశ్వరరావులు. చిరంజీవి ఈ నాటకాన్ని 1961లో ఆమ్నారెడ్డి రఘురామరావు, బెనర్జీల ప్రేరణతో రాసారు.

<u>ప్రేమ పక్షులు:</u> తొలి ప్రదర్శన 1967లో. కనిని టి.ఆర్. ఆడబాల దర్శకత్వంలో ప్రదర్శించారు. తర్వాత ఆంధ్ర నాటక అకాడమీ, హైదరాబాదు ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించిన నటశిక్షణ శిబిరంలో చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో 22-12-1981, 31-12-1981, 2-1-1982 తేదీలలో ప్రదర్శించారు.

<u>దేవుడెరుగని నిజం</u> : శ్రీ కళా నికేతన్, సికింద్రాబాదు వారి ఆధ్వర్యాన కె. సూర్యనారాయణ మూర్తి దర్శకత్వంలో 1969 లో తొలి ప్రదర్శన జరిగింది. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం నాటక శాఖలు ప్రదర్శించాయి.

<u>సోనార్ బంగ్లా</u> : 1972 డిసెంబర్‌లో రాసిన ఈ నాటకం ఇంతవరకు రంగస్థలం మీద ప్రదర్శించలేదు.

<u>ఇక్కడ పెళ్ళి చేయబడును</u>: తొలి ప్రదర్శన 1973 ఆగష్టు 11. ఆలిండియా రేడియో స్టాఫ్ ఆర్టిస్టుల యూనియన్ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో ప్రదర్శించారు. ఆ తర్వాత హిందీలోకి అనువదించబడి రేడియో నాటకంగా ఆకాశవాణి జాతీయ కార్యక్రమాలలో ప్రసారమైంది.

<u>పోలిట్రిక్స్</u> : తొలి ప్రదర్శన 1979 నవంబరు. ఆంధ్ర రాజకీయాల నేపథ్యంలో రాసిన ఈ ఆధునిక వీధి నాటికను ప్రజా నాట్యమండలి, హైదరాబాదు నగర శాఖ వారు దేవిరాజు హనుమంతరావు దర్శకత్వంలో వీధి వీధిన తిరిగి దాదాపు నూట యాభై ప్రదర్శనలిచ్చారు.

<u>నీలి దీపాలు</u> : ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ వారు 1981 నవంబరు నుంచి 1982 జనవరి దాకా నల్గొండ జిల్లా సూర్యాపేటలో నిర్వహించిన నట శిక్షణా శిబిరంలో ఈ నాటకం ఊపిరి పోసుకుంది. చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో 1982 జనవరి 9న సూర్యాపేటలోను, జనవరి 10న దేవరుప్పులలోను, 13-14 తేదీలలో 'రవీంద్ర భారతి' హైదరాబాదులో ప్రదర్శించారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం నాటక విభాగం వారు, ప్రజా నాట్య మండలి, హైదరాబాదు శాఖ వారు కూడా ప్రదర్శించారు.

1976 లో 'బోళ్ళు ఆరగబడుతున్నాయి' అనే శీర్షికన ఈ రచయితే రాసిన రేడియో నాటకం దీనికి మూలం.

ఆరుసగరి రామాంజనేయులు ఈ నాటకానికి ఋగ్రకథ రాసి పెట్టారు.

ఈ నాటకంలోని విప్లవగీతం రాసినవారు ప్రఖ్యాత ఉర్దూ కవి కే. శే. మఖ్దూం మొహియుద్దీన్

1978లో ఈ 'నీలిదీపాలు' నాటక రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి బహుమతి నిచ్చింది.

మహా నిష్క్రమణం: దీని రేడియో నాటక ప్రతి దొరకక పోవటంవ నాటకంగా తీసుకున్నాను. ఈ నాటకాన్ని రచయిత 1991 అక్టోబర్‌లో రంగస్థల ప్రదర్శనం కోసం రాసారు. అయితే ఇంతవరకు దీనిని ప్రదర్శించలేదు. తర్వాత రేడియో నాటకంగా రూపాంతరం చెంది హైదరాబాదు కేంద్రం నుంచి 22-12-1991 న శ్రీమతి శారదా శ్రీనివాసన్ నిర్వహణలో ప్రసారమైంది. జాతీయస్థాయిలో జరిగే ఆకాశవాణి వార్షిక పోటీలలో 1991 సంవత్సరానికి గాను దీనికి 'ద్వితీయ ఉత్తమ నాటకం' బహుమతి లభించింది.

చిరంజీవి రాసిన రేడియో నాటకాలు :

1. ఆకలి మందు
2. కొక్కొరోక్కో
3. వంశాంకురం
4. బీళ్ళు తిరగబడుతున్నాయి
5. శాంతి సమరం
6. శ్రీ కృష్ణ నిరోభారం
7. కాల యంత్రం
8. ఊరి రోళ్లు మేలొంటున్నరు

పైన పేర్కొన్న రేడియో నాటకాలన్నింటిని కలిపి 'జీవితమే నాటక రంగం' అనే పేరున శ్రవ్య నాటక సంకలనంగా ముద్రించారు.

'కొక్కొరొకో', 'తీర్పు ఆరగబడుతున్నాయి', 'శాంతి సమరం' అనే రేడియో నాటకాలను "మూడు జాతీయ నాటకాలు" పేరున ఒక నాటక సంకలనంగా తీసుకొచ్చారు. ఈ మూడు నాటకాలను దాశరథి రంగాచార్య హిందీలోకి అనువాదం చేసారు. దీనిని అరసం వారు అచ్చు వేసారు.

'శ్రీ కృష్ణ శిరోభారం', 'వంశాంకురం' నాటకాలను "రేడియో నాటకాలు" అనే పేరున నాటక సంకలనంగా తీసుకొచ్చారు. దీనికి తెలుగు విశ్వవిద్యాలయం 1986 లో 'ఉత్తమ నాటక సంకలనం' బహుమతి నిచ్చింది.

ఈ శ్రవ్య నాటక సంకలనం లోని నాటకాలన్ని కొన్ని హిందీలోకి, కొన్ని ఇంగ్లీంలోకి అనువదించబడ్డాయి. మొదలి నాగభూషణశర్మ, డాక్టర్ బోయినేపల్లి నిర్మల్, దండమూడి మహీధర్, వేమూరి రాధాకృష్ణమూర్తి, వాకాటి పాండురంగారావు లు

అనువాదం చేసారు.

చిరంజీవి రాసిన 6 రేడియో నాటకాలు భారతీయ భాషలన్నింటిలోకి అనువదించబడి జాతీయ నాటకాలుగా ఆకాశవాణి ఆలిండియా కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి.

అవి.

1. కాకాకి రోకో
2. బీళ్ళు తిరగబడుతున్నాయి
3. గాంధీ సమరం
4. ఇక్కడ పెళ్ళి చేయబడును
5. మహాభి నిష్క్రమణం
6. ఆకలి మందు

చిరంజీవి రాసిన 'ఆకలి మందు' నాటకాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఏషియా-పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రాడ్ కాస్ట్ డెవలప్‌మెంట్ సంస్థ ఒక 'నమూన రేడియో నాటకం'గా వాడుకుంటున్నది.

## రేడియో నాటకాల వివరాలు- ప్రసారం చేసిన తేదీలు:

ఆకలి మంటలు:

రచనా కాలం 1955. అప్పటికి రచయిత వయస్సు 20 సంవత్సరాలు. మొదట ఈ నాటకం 'పతంజలి' అనే కలం పేరుతో 'అభ్యుదయ' (1957 నవంబరు సంచిక) లో అచ్చయింది. రచన primitive గా, Crude గా ఉండని 1964 లో ఒకసారి, 1979 లో మరోసారి దీనిని తిరగరాసి రేడియోలో ప్రసారం చేసారు.

క్రాస్‌రోడ్స్:

మొదట దీనిని దృశ్యనాటికకు అనుగుణంగా రాసి తర్వాత మార్పుచేసి శ్రవ్య నాటికగా రాసారు. ఈ నాటిక రచనా కాలం 1975 జూలై. ఇది 1975 సెప్టెంబర్ 15వ తేదీన ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారమైంది. ఆ తర్వాత అన్ని ప్రాంతీయ భాషల్లోకి అనువదింపబడి, జాతీయ నాటకంగా 'నయా సవేరా' పేరిట 1975 డిసెంబర్ 25 న రేడియో కేంద్రాలన్నింటా ప్రసారమైంది.

వంశాంకురం :

తొలి ప్రసారం, 1975 అక్టోబర్ 20 వ తేదీన, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారమైంది. దీనిని 'అభ్యుదయ' మాస పత్రిక (1979 మార్చి, ఏప్రిల్ సంచికలు) అచ్చువేసింది.

చీకట్లు ఆరగబడుతున్నాయి :

తొలి ప్రసారం, 1976 ఫిబ్రవరి 19 వ తేదీన ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారమైంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి కోసం 'నీల దీపాలు' పేరుతో రాసిన రంగస్థల నాటకానికి ఇది ఆధారం.

శాంతి సమరం :

1976 మే 20 వ తేదీన ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారమైంది. 'చీకట్లు ఆరగబడుతున్నాయి' నాటకానికి తరువాయి భాగం ఈ నాటకం.

శ్రీకృష్ణ నిరోధారం:

1976 నవంబరు 18వ తేదీన ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారమైంది.

కాల యంత్రం:

తొలి ప్రసారం: 1982 జూలై 15వ తేదీ.

దీనిని ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారం చేసారు.

ఊరోళ్లు మేలుకుంటున్నరు:

తొలి ప్రసారం: 1986 అక్టోబర్ 16వ తేదీ.

దీనిని ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారం చేసారు.

చిరంజీవి రాసిన కథానికలు:

1. రెండు కన్నీటి చుక్కలు
2. మంచివాడు
3. సముద్రం బలి కోరుద్ది
4. విలువు డు
5. నిండు వెన్నెల- నిండు చీకటి
6. గాజుల యలమంద
7. దేవుడెరగని నిజం

పై కథానికలన్నింటిని 'రెండు కన్నీటి చుక్కలు' అనే పేరున కథానిక సంకలనంగా తీసుకొచ్చారు.

చిరంజీవి, తెలుగు లిపి సంస్కరణ ఆవశ్యకతను గుర్తించి, ఇప్పుడున్న తెలుగు లిపిని దోషరహితం గావించి, దానిపై ప్రామాణికమైన ఒక పత్రాన్ని 1973 లోనే ప్రకటించారు.

చిరంజీవి ముఖ్య పాత్ర వహించి ప్రసారం చేసిన రేడియో నాటకాలలో కొన్ని:

| | |
|---|---|
| కంఠాభరణం | పొగమేఢ |
| రాజా ఈడిపస్ | ప్రజా శత్రువు |
| పురూరవ | హృదయ కమలం |
| భాగ్యనగరం | హేమ శిఖరం |
| సంపంగి | పవిత్ర పాపి |
| ఉత్తమ ఇల్లాలు | కాబూలీవాలా |
| తుగ్లక్ | గుడ్డివాడు |
| షాజహాన్ | నిరీక్షణ |
| పతితప్రతి | రిన ఖరీదు ఆణా |

ప్రపంచంలో ఎవరికీ ఋణపడకుండా, అన్ని ఋణాలు తీర్చుకొని, ప్రశాంతంగా వెళ్ళిపోవాలని చిరంజీవి ఆకాంక్ష. సమాజం నుంచి మనం తీసుకున్న దానికంటే మనం ఆ సమాజానికిచ్చింది ఆవగింజంత ఎక్కువ ఉన్నా ఆ జన్మ సార్థక్యమే నంటారు.

'తెనాలి లో ఒకప్పుడు 'గాడిబావి' ఉండేది, ఇప్పుడు లేదు. తెనాలిలో ఒకప్పుడు 'కోతుల చెట్టు' ఉండేది, ఇప్పుడు లేదు. అవి లేకపోయినా వాటి జ్ఞాపకాలు మాత్రమే మిగిలి ఉంటాయి. అలాగే మానవ జీవితమూను. మనం పోతాం, మన జ్ఞాపకాలు మాత్రమే మిగులుతాయి. మనం మంచి చేస్తే మంచి మిగులుతుంది, చెడు చేస్తే చెడు మిగులుతుంది' అని అంటాడు చిరంజీవి.

రచయితకు నిబద్ధత అత్యంత ప్రధానమని అంటారు అభ్యుదయ వాదులు. చిరంజీవి అభ్యుదయ రచయిత, నిబద్ధత ఉన్న రచయిత. ఏనాడు తన 'అక్షరాన్ని' డబ్బుకు తాకట్టుపెట్టని మనిషి. తలదింపులు

ఆగ్రయింపులు, ప్రలోభాలు, ప్రచారాలు ఎరుగని విశిష్ట వ్యక్తిత్వం చిరంజీవిది. సాహిత్యాన్ని వ్యాపార వస్తువుగా పరిగణిస్తోన్న ~~ఈ~~ రోజుల్లో నిర్దిష్ట ధ్యేయంతో సడలని నిబద్ధతతో రచనలు సాగించిన - సాగిస్తోన్న రచయిత, చిరంజీవి.

# నవలా రచయితగా
# చిరంజీవి

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో నవల విశిష్టమైంది. విశాలమైన మానవ జీవితాన్ని, దీనిలో ముడిపడి ఉన్న సామాజిక సంబంధాలను వివరంగా, గాఢంగా చిత్రించడానికి అవకాశం ఉన్న ఏకైక సాహిత్య ప్రక్రియ నవల. ఇంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో ఆవిర్భవించిన నవల, అతితక్కువ కాలంలో ఎక్కువ ప్రచారాన్ని పొందడమే గాకుండా సామాన్య జనానికి కూడా అందుబాటులో ఉండే సాహిత్య ప్రక్రియగా బహుళ జనాదరణ పొందింది. నవల, సామాన్య మానవునికి చేరువ కావడమే గాకుండా, సమకాలీన సమాజంలో బలమైన వ్యాపార సాధనమైంది. సమకాలీన నవల, మనోరంజనంతో పాటు సరికొత్త విజ్ఞానాన్ని అందిస్తూ సృజనాత్మక నుండి పరిశోధనాత్మక దిశగా సాగుతోంది.

విమర్శకులు నవల స్వరూప స్వభావాలను పలు రకాలుగా నిర్వచించారు.

"సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవితగమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం"[1]

---

[1] మొదలి నాగభూషణ శర్మ - 'తెలుగు నవలా వికాసం' - పు.20

అని నవల గురించి మొదట నాగభూషణం శర్మ వ్యాఖ్యానించారు.

"వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకొని, సామాజిక జీవితాన్ని స్ఫురింపచేసే సాహిత్య ప్రక్రియ నవల"[1] అని ఆర్. ఎస్. సుదర్శనం అన్నట్లుగా నవల ఒక వ్యక్తి జీవితానికి సంబంధించిందే అయినా దానితో పాటు ఆనాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలన్నింటిని విశ్లేషిస్తుంది.

"ప్రస్తుత సంఘం నందలి ఆచార వ్యవహారములను గమనించి, అందలి లోటుపాటులను సవరించి, సంస్కరణ పూర్వకమైన చక్కని భవిష్యత్తును చూపు అపూర్వమైన సాహిత్య సాధనం సాంఘిక నవల"[2] అని పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు సాంఘిక నవల గురించి చక్కని నిర్వచనం చెప్పాడు.

"సాహిత్యాన్ని సమాజంతో అనుసంధించే సాహితీ ప్రక్రియ నవల"[3] అని సి. ఆనందారామం పేర్కొన్నారు.

ఇప్పటి వరకు నవలా సాహిత్యంలో అనేక ప్రామాణిక గ్రంథాలు వచ్చాయి. వాటిలో కొన్ని—

---

(1) ఆర్. ఎస్. సుదర్శనం – 'తెలుగు నవల - సమకాలీనత' - (వ్యా) తెలుగు నవల నూరు సంవత్సరాలు. పు. 41

(2) పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు – 'తెలుగు నవలా సాహిత్య వికాసం' – పు. 32

అక్కిరాజు రమాపతి రావు 'శ్రీ వీరేశలింగం పంతులు గారి కృతులు' అనే పరిశోధనా గ్రంథం మొదటి అధ్యాయంలో నవలా నిర్వచనం, లక్షణాలు మొదలైనవన్నీ పొందుపరిచారు. మొదలి నాగభూషణ శర్మ 'తెలుగు నవలా వికాసం' లో నవల నిర్వచనం, లక్షణాలను వివరించడమే గాకుండా కొన్ని ప్రఖ్యాత నవలల్ని సవివరంగా విశ్లేషించారు. బొడ్డపాటి కుటుంబరాయ శర్మ 'ఆంధ్ర నవలా పరిణామము'లో నవలా చరిత్ర ప్రారంభం నుండి 1960 వరకు వచ్చిన నవలల తేదీ సంగ్రహాన్ని ఇచ్చారు. పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు 'తెలుగు నవలా సాహిత్య వికాసం' ను రాసారు. వల్లంపాటి వెంకట సుబ్బయ్య నవలలను గురించి అనేక రకాలుగా చర్చించారు. సి. ఆనందారామం 'నవలా-విమర్శ' అనే గ్రంథంలో నవల-ఆధునికతను వివరిస్తూ తెలుగులో వచ్చిన ప్రముఖ నవలలను విశ్లేషించారు.

మొదటి సాంఘిక నవల అయిన కందుకూరి వీరేశలింగం పంతులు 'రాజశేఖర చరిత్ర' నుండి నేటి రా.వి. శాస్త్రి 'ఇల్లు' వరకు సాగిన ప్రస్థానంలో ఇతివృత్తంలో, కథనంలో, శిల్పంలో, శైలిలో, భాషలో, మారుతున్న సామాజిక సాహిత్య దృక్పథాలకు అనుకూలంగా అనేక మార్పులు పొందుతూ వచ్చింది నవల. అనుసరణలు, అనువాదాలతో ప్రారంభమైన నవల క్రమక్రమంగా ఎదిగి వేగియతను సంతరించుకొని ఇప్పుడు స్థిరమైన స్వీయ వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకుంటుంది.

చిరంజీవి కమిట్‌మెంట్ ఉన్న రచయిత. ఆయన కలం నుండి వెలువడ్డ నవలలన్నీ సామాజికమైనవే అయినా వాటిలో ఎంతో వైవిధ్యం ఉంది. 1962 నుండి 1987 వరకు సాగిన వీరి నవలా రచనలు ఆ కాలం నాటి రాజకీయ, సామాజిక చైతన్యం వివిధ కోణాలలో పరిఢవిస్తుంది. నవలా సాహిత్యంలో వ్యాపార యుగం 1960 నుంచి ప్రారంభమైనట్లుగా విమర్శకులు భావిస్తున్నారు. అయినా చిరంజీవి రచనలలో ఏ ఒక్కటీ వ్యాపార పరిధిలో లేదు. స్థూలంగా చిరంజీవి నవలల్ని ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

1. రాజకీయ రంగాన్ని విపులంగా చిత్రించిన నవల:

   'బోలో స్వతంత్ర భారత్ కీ జై'

2. గ్రామీణ రాజకీయాలను చిత్రించిన నవల:

   'ఎకరాడికీ ప్రస్థానం'

3. గ్రామీణ సమిష్టి కుటుంబాన్ని చిత్రించిన నవల:

   'అనంత యాత్ర'

4. స్త్రీల సమస్యలను ప్రధానంగా చిత్రించిన నవలలు:

   1 'ముళ్ళ గులాబి'
   2. 'చీమ మనుషులు'

## బోలో స్వతంత్ర భారత్‌కి జై :

చిరంజీవి రచనలలో బహుముఖ ప్రశంసలందుకొన్న నవల 'బోలో స్వతంత్ర భారత్‌కి జై'. రచయిత స్వయంగా ఈ నవల గురించి ఇలా చెప్పుకున్నాడు. " ఇది నా దేశ చరిత్ర. నా జాతి ప్రజల మూడున్నర దశాబ్దాల చరిత్ర. ఇందులో వేడి వేడి దుఃఖాశ్రువులున్నాయి. చల్లటి ఆనందబాష్పాలున్నాయి. చరిత్రలోని ఈ కాలంలో పుట్టి పెరిగిన నేను, ఈ కాలంలో మన సమాజం ఎలా వున్నది? ఏ తీరున నడుస్తున్నది? ప్రస్తుత సామాజిక వ్యవస్థ పట్ల మన వైఖరి ఏమిటో నిర్ణయించుకోవడానికి దాన్ని గురించిన విశ్వసనీయమైన సమాచారం మనం తెలుసుకోవాలి. అలా తెలుసుకుంటేనే తప్ప మనం సరియైన వైఖరిని తీసుకోలేము. సక్రమమైన నిర్ణయానికి రాలేము. అందుకోసమే నా తల్లి ఋణం నేను తీర్చుకుంటున్నట్లుగా ఈ రచన చేసాను. పవిత్ర కర్తవ్యంగా యెంచి, డైరీ రాసుకున్నంత చిత్తశుద్ధితో, ఈ పని చేసాను. ఇది నా ఆత్మావిష్కరణ ..."[1] అని తన పుస్తకానికి రాసుకున్న పీఠికలో చెప్పుకున్నారు.

---

① 3. చిరంజీవి – పీఠిక – బోలో స్వతంత్ర భారత్ కి జై – పు-6

రచయిత ధ్యేయం ఈ నవలలో పూర్తిగా నెరవేరిందని చెప్పుకోవాలి. ఇదొక ఆధునిక ఆంధ్ర భారతం. అంటే భారతదేశంలోని ఆంధ్రదేశం యొక్క ఆధునిక చరిత్ర.

భారతదేశం పారతంత్ర్యంలో మగ్గుతోన్న రోజుల్లో ప్రాణాలొడ్డి స్వాతంత్ర్యం కోసం ఎందరో యోధులు పోరాడారు. వేల వేల గొంతుకలెన్నో కలిసి స్వాతంత్ర్య కాంక్షను ప్రకటించాయి. ఎన్నో సింహగర్జనలు చేసాయి. ఎంతో రక్తపాతం జరిగాక - ఎందరో త్యాగధనులు ఉరికంబాలు ఎక్కాక - అహింసా మార్గాన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటించారు. అది 1947 ఆగష్టు 15. బండా సైకిల్ జోగయ్య లాంటి సగటు భారతీయులెందరో దేశానికి స్వతంత్ర్యం వచ్చిందని పొంగి పోయిన రోజు. అయితే ఆ పొంగు వెనక ఉన్న తీవ్ర సంక్షోభాన్ని ఈ నవలలో సమర్థంగా చూపారు రచయిత.

రచయితకు నిష్పాక్షిక దృష్టి ఉండటం అనేది అసాధ్యం. అతడు తప్పనిసరిగా ఏదో ఒక పక్షాన్ని అవలంబించి తీరాల్సిందే. తనది నిష్పాక్షికమైన దృష్టి అని ఏ రచయితైన చెప్పుకున్నాడంటే అతడు పాలకవర్గాన్ని సమర్థిస్తున్నాడని అర్థం చేసుకోవచ్చు.

చిరంజీవి కమ్యూనిష్టు పార్టీ పక్షపాతి. నిజ జీవితానుభవాలు సాహిత్యాన్ని ప్రభావితం చెయ్యక మానవు. సాహితీ సృష్టిలో నిజాయితీ ఉంటుంది. రూపకల్పనలో గాఢత చోటు చేసుకుంటుంది. ఆంధ్ర క్రాంతి థియేటర్స్‌తో రచయితకు ఏర్పడిన పరిచయం, దాని ఫలితంగా కమ్యూనిష్టు పార్టీ పట్ల రచయితకున్న అభిమానం ఈ రచనలో స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ప్రశంసనీయమైన అంశమొకటి ఉంది. రచయితలో ఉన్నది గుడ్డి అభిమానం కాదు. కమ్యూనిష్టు పార్టీని గుడ్డిగా అభిమానిస్తూ, కమ్యూనిష్టులు ఏంచేసినా మంచిదే అంటూ కాంగ్రెస్‌ను దుయ్యబట్టడం ఈ నవలలో మనకు కనిపించదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తలయెత్తిన స్వార్థం, ప్రబలిన లంచగొండితనం, విస్తరించిన పెట్టుబడిదారీ విధానం ఈ రచయితకు కాంగ్రెస్ పార్టీ పట్ల విముఖత కలగడానికి కారణాలుగా తోస్తాయి.

ప్రధానంగా రాజకీయ నవలే అయినా దేశ రాజకీయాలు, ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలు, రాజకీయ రంగంలోని కుట్రలు మాత్రమే గాక సామాజిక జీవితంలోని వివిధ రంగాలలో ఇతివృత్తం అవినాభావంగా పెనవేసుకొని ఉండడం గొప్ప విశేషం.

ఇతివృత్తం : 'తామరకొలను' గ్రామంలో అమ్మయ్య పుట్టిన ఒక రైతు కుటుంబంలో ప్రారంభమవుతుంది ఈ నవల. గ్రామంలో రాజకీయ జీవితానికి జెండా సైకిల్ జోగయ్య అనే గాంధీవాది శ్రీకారం చుడతాడు. దేశం కోసం ఆస్తినంతా ఖర్చుపెట్టి, సైకిల్‌కు కాంగ్రెస్ జెండా కట్టుకొని తన జీవితమంతా దేశసేవలో గడిపిన అమాయక దేశభక్తుడు జెండా సైకిల్ జోగయ్య. అమ్మయ్య చిన్నతనంలోనే చదువుకు స్వస్తి చెప్పి నాటకాల పిచ్చిలో పడి మంచి నటుడై పౌరాణిక నాటకాల నుండి సాంఘిక నాటకాలలోనికి, అందులో నుండి ప్రజానాట్యమండలి ఉద్యమంలోకి వస్తాడు. చంద్రవదన వేశ్యా కుటుంబంలో పుట్టి హరికథలు చెప్పుకుంటూ అమ్మయ్యపట్ల ఆకర్షితురాలై అతనిపట్ల అనురాగంతో ఉంపుడుకత్తె జీవితాన్నుండి విముక్తి పొంది ఇద్దరూ కలసి భార్యాభర్తలుగా జీవిస్తారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు దోహదం చేస్తారు. కమ్యూనిస్టు పార్టీ అభిమానులై సంఘ సంస్కరణ విధానాలను, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహిస్తారు. అమ్మయ్య అన్న కూతురు పార్వతి, కొడుకు ప్రకాశరావు కూడా కమ్యూనిస్టు వ్యవస్థ వైపు మొగ్గు చూపుతారు. పార్వతి-నారాయణ చార్యులు, ప్రకాశరావు-

సంతోషం. కుల వర్ణాంతర వివాహాలు చేసుకుంటారు. కంభంపాటి సీనియర్ కమ్యూనిస్టు వ్యవస్థ గురించి, ఆ సమాజం లోని లోటుపాట్ల గురించి చర్చిస్తాడు. జెండా సైకిల్ జోగయ్య జాతీయోద్యమం లోను, కాంగ్రెస్ ఉద్యమం లోను వచ్చిన మంచి-చెడు పరిణామాలకు సాక్షి భూతుడుగా ఉంటూ, పేదలపట్ల సానుభూతి ప్రదర్శించుతూ, అధికారం, అవినీతి, అక్రమాలకు నిలయాలమైన కాంగ్రెస్ పరిపాలనను ఏవగించు కుంటారు. చివరకు తాను దైవంగా పూజించే కాంగ్రెస్ జెండాను ముక్కలు చేస్తాడు. జాతీయోద్యమ కాలం నాటి కాంగ్రెస్-అధికారం లోకి వచ్చాక స్వార్థపర వర్గాల చేతి పనిముట్టుగా ఎలా మారింది, జాతీయోద్యమ లక్ష్యాల సాధన ఏ విధంగా విఫలమైంది, దేశంలో పెట్టుబడిదారీ విధానం ఎలా పెంచి పోషించబడింది రచయిత వివిధ రూపాలలో చిత్రించాడు. కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలికలు, ఆ తర్వాత వచ్చిన అవాంఛనీయ ధోరణులు, నక్సలైటు ఉద్యమం వేసిన వెర్రితలలు మొదలైనవన్నీ రచయిత ఎంతో ఆవేదనతో చిత్రించారు. సమైక్యంగా సాగిన చల్లపల్లి భూ పోరాటం ప్రశంసతో, అది చూపే ఆదర్శంతో నవల ముగుస్తుంది.

ఈ నవలను సమీక్షిస్తూ కె.కె. మీనన్ " ఈ పుస్తకంలో కమ్యూనిష్టు పార్టీ-రైతుకూలీ ఉద్యమాలు, ఉమ్మడి కుటుంబాల్లో ఆస్తి వ్యవహారాలు - ఆడవాళ్ళ మనస్తత్వం, పంచాయితీరాజ్ వ్యవస్థ- అది పట్నాల నుంచి పల్లెలకు దోపిడీని దిగుమతి చేసిన వైనం, భూసంస్కరణల బూటకం, సినీ ప్రపంచం- చిత్ర విచిత్ర మాయా జాలం, శ్రీమతి గాంధీ రాజకీయ రంగప్రవేశం - రంగుల మార్పు, కమ్యూనిష్టుల్లో చీలికలు, కాంగ్రెస్ పాలనలో వ్యాపార సంస్కృతి విస్తరణ, మారిన విలువలు, అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో కుహనా కవుల పాత్ర - మొదలైనవెన్నో రచయిత అద్భుతంగా చిత్రించారు"- అని పేర్కొన్నారు.

'బోలో స్వతంత్ర భారత్‌కి జై' నవలలో ప్రధానంగా చర్చించిన సమస్యలు.

1. రాజకీయ వ్యవస్థ
2. ఆర్థిక వ్యవస్థ
3. సామాజిక వ్యవస్థ
4. సాంస్కృతిక వ్యవస్థ

① కె.కె. మీనన్. 'నవలలా సాగిన చరిత్ర'- 'ఉదయం' దినపత్రిక. 11-3-1985.

1. రాజకీయ వ్యవస్థ:

    1. కాంగ్రెస్ పాలనలో వ్యాపార సంస్కృతి
    2. రాజకీయ కుట్రలు
    3. కమ్యూనిస్టు పార్టీ - రైతు కూలీ ఉద్యమాలు
    4. కమ్యూనిస్టు పార్టీలో చీలికలు
    5. పార్టీ ఫిరాయింపులు
    6. రాజకీయ పార్టీల పతనోత్థానాలు
    7. అసెంబ్లీలో సభ్యుల ప్రవర్తన

2. ఆర్థిక వ్యవస్థ:

    1. నిరుద్యోగ సమస్య
    2. రిజర్వేషన్ల సమస్య
    3. భూ సంస్కరణలు
    4. కార్మికుల సమ్మె

. సామాజిక వ్యవస్థ:

    1. కులాంతర వర్ణాంతర వివాహాలు
    2. చేతివృత్తుల వారి తపన
    3. స్వాతంత్ర్యానంతరం స్త్రీల ప్రస్థానం
    4. ప్రేమ
    5. మాదక ద్రవ్యాల వ్యాపారం

4. సాంస్కృతిక వ్యవస్థ:

1. సినిమా రంగం అది చేస్తోన్న వికృత చేష్టలు

2. క్షుద్ర సాహిత్యంలో వ్యాపారం చేసుకునే పత్రికలు

## రాజకీయ వ్యవస్థ:

రచయిత చిరంజీవి 1947 నుండి 1983 వరకు జరిగిన రాజకీయ పరిణామాలను శేడీలు-అరెలలో సహా విశ్లేషించి చూపారు.

1947 కు పూర్వం రాజకీయనాయకులు దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా ఒడ్డినారు. తమ ఆస్తిని సంతతిని పూర్తిగా దేశానికి ధారపోశారు. దేశం కోసం సర్వం సమర్పించుకున్న దేశభక్తులు వాళ్ళు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఎటువంటి పదవులు స్వీకరించకుండా నిరాడంబరంగా బతికిన బొండా సైకిల్ టోగయ్య అనే గాంధీవాదితో రాజకీయ వ్యవస్థను విశ్లేషించాడు రచయిత.

తనకు ఉన్న మొత్తం ఆస్తిని దేశం కోసం సమర్పించుకున్న బొండా సైకిల్ టోగయ్య దేశానికి స్వతంత్ర్యం వచ్చేనాటికి చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో తమ్మురి బిళ్ళలు కాని ప్రజలకు పంచిపెట్టాడు-

1947 ఆగస్టు 15వ తేదీన.

" వెనకటి లాగా ఎత్తుతుందా? నేతుల్లో పంచదార లడ్డు చేయించి, దేశంలోని గ్రామాలన్నీ సైకిలు మీదనే చుట్టబెట్టి ముప్పై నాలుగు కోట్ల తన సోదరులందరికీ పరిపూర్ణ హృదయంతో పంచి పెట్టేవాడు" (పు.11) అని రచయిత సానుభూతి చూపిస్తాడు.

1932 లో విదేశీ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్న కారణంగా ఒక సంవత్సరం పాటు బళ్ళారి జైల్లో కాపురం చేసివచ్చి సైకిల్ కొని దానికి కాంగ్రెస్ జెండా పెట్టుకొని ఊరూర ప్రచారం చేసాడు. చివరకు అతనికి దక్కిందేమిటయ్యా అంటే స్వాతంత్ర్య సమరయోధునిగా తామ్ర పత్రం, ఇంత భూమి. ఆయన వేసిన పునాది రాళ్ళ మీద ఎందరో చెంచురామయ్యలు, మరెందరో వెంకటరత్నం లాంటి వాళ్ళు తమ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకున్నారు.

" తనేమో వ్యాపారం చేస్తాడు; పెద్ద కొడుకేమో రాజకీయ నాయకుడవుతాడు; చిన్న కొడుకేమో పెద్ద ప్రభుత్వాధికారి:

ఇంక చూసుకో గాంధీ మహాత్మా!

వద్దు. ఇంకేమి మాటా పలుకూ వద్దు. గమ్మునుండు. నువ్విలా

నిలబడి చల్లని చూపు మా మీద గుమ్మరిస్తే చాలు" (పు. 48) అని వెంకటరత్నం లాంటి భూస్వాములు తమ ప్రణాళికలు రూపొందించుకున్నారంటే ఈ చలవ ఎవరిదీ? అని ప్రశ్నిస్తాడు రచయిత.

అక్కయ్య లాంటి సామాన్యుడు తన కొడుకు కూతురు ఇద్దరిని ఇంగ్లీసు చదువులు చదివించుకొని ఒకరిని కలెక్టర్, మరొకరిని జిల్లా పోలీసాఫీసరు చేయాలని కన్నకలలు నిజం కాలేదంటే ఈ పాపం ఎవరిది? ఈ వ్యవస్థది. కాంగ్రెస్ సంస్థలలో రూపుదాల్చుకున్న నేటి వ్యవస్థది.

స్వాతంత్ర్యానికి పూర్వం జస్టిస్ పార్టీలో ఉండి మాకు స్వాతంత్ర్యం అవసరం లేదంటూ పర ప్రభుత్వ నీడలో బతికిన పెద్దలే స్వాతంత్ర్యానంతరం దొడ్డి దారిన కాంగ్రెస్‌లోకి ప్రవేశించి పదవులు చేపట్టారు. వీరికి స్వాతంత్ర్య ఫలం నేరుగా దక్కింది. కానీ జెండా సైకిల్ భోగయ్యకు దాని జాడే దొరకలేదు, అమ్మిన బిళ్లల ఖర్చు తప్ప - అని ఆవేదన వ్యక్తం చేస్తాడు రచయిత.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 16న అమరులుకాగా

ప్రజల క్రోధాగ్ని నాలుకలు సాచుతూ మింటికెగిసింది. ప్రభుత్వం స్తంభీభూతమై నిలిచింది. చివరకు జవహర్‌లాల్ నెహ్రు దిగివచ్చి డిసెంబర్ 19 వ తేదీన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన చేసాడు. కర్నూలు రాజధానిగా 1953 అక్టోబరు 1 వ తేదీన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన ప్రప్రథమ భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రమే.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడే 'విశాలాంధ్ర' రాష్ట్రానికి బీజాలు పడ్డాయి. హైదరాబాదు పర్యటించిన నెహ్రూకు ఎక్కడ చూసిన 'విశాలాంధ్ర' నినాదాలే వినపడ్డాయి. ఆంధ్ర ప్రాంత నాయకులు, తెలంగాణా ప్రాంత నాయకులు సమైక్య రాష్ట్ర నిర్మాణాన్ని డిమాండ్ చేసారు. చివరకు 1956 నవంబరు 1 వ తేదీన హైదరాబాదు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

రచయిత కాంగ్రెస్‌లో, విలువలపరులైన గాంధేయ వాదులకు ప్రతీకగా జెండా సైకిల్ జోగయ్యను ఎంచుకోగా, కాంగ్రెస్ పార్టీ క్రమంగా ఎలా పతనమైంది అనేది ఎమ్మెల్యే రంగారావు పాత్ర ద్వారా చూపించాడు.

గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఓడిపోయిన ఎమ్మెల్యే రంగారావు

ఖద్దరు పంచె కట్టడం ప్రారంభించి కొద్ది కాలంలోనే సమితి ప్రెసిడెంట్ అయ్యాడు. హైదరాబాదులో రాజభవనం లాంటి ఓ ఇంటికి ఓనరయ్యాడు. నగరంలో నాలుగైదు ఇళ్ల స్థలాలు, నగర శివార్లలో ఇళ్ళ స్థలాలకు పనికొస్తుందని కొంత భూమిని, నిజామాబాద్ జిల్లాలో నూట పది ఎకరాల వ్యవసాయ భూమికి యజమాని అయ్యాడు. ఇది కాంగ్రెస్ సంస్కృతి.

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళి తన్నులు తిని దేశం కోసం సర్వం సమర్పించిన జెండా సైకిల్ జోగయ్యను కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకు వెళ్లాడనీ, వాళ్ళ నాయకుడెవరికో పూలమాల వేసాడనే ఆరోపణలో కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీని ప్రాణ సమంగా ప్రేమించిన జోగయ్య ఇది భరించ లేక పోయాడు. చివరకు ఆయనకూడా ఎమ్మెల్యే రంగారావే శరణ్యమయ్యాడు.

"చూడు జోగయ్యా! పాత కాంగ్రెస్ వేరు, కొత్త కాంగ్రెస్ వేరు. కొత్త కాంగ్రెస్‌లో ఉంటూ పాత కాంగ్రెస్ పాట పాడుతానంటే కుదరదు. కాలానుగుణమైన మార్పులకు ప్రతి మనిషీ లోను కావాలి. చలి కాలం వచ్చిందంటే దుప్పటి కప్పుకోవాలి. వేసవిలో చొక్కా కూడా తీసి ఆరుబయట పడుకోవాలి. మనకు తెలిసిందే గదా! నువ్వింతకాలం రికామిగా తిరిగావు. నిన్నిప్పుడు

ఏ ఖాదీబోర్డు చైర్మన్‌గానో వేయిస్తాననుకో, అప్పుడూ తిరుగుతానంటావా? తిరగలేవు. అప్పుడు ఉద్యోగ ధర్మం నెరవేర్చవలసి వుంటుంది. కాబట్టి ధర్మాలు మారతాయని తెలుసుకో" (పు.107) అని ఎమ్మెల్యే రంగారావు బెండా సైకిల్ భోగయ్యకు హితబోధ చేస్తాడు. నాకు ఏ పదవీ వద్దు, నన్ను మళ్ళీ నా పార్టీలో చేర్పించు చాలు అని భోగయ్య వేడుకుంటాడు.

ఒకప్పుడు జాతీయోద్యమానికి, స్వాతంత్ర్యోద్యమానికి ప్రతినిధియైన కాంగ్రెస్ పార్టీ, నేడు అవినీతికి, లంచగొండితనానికి ఎలా పట్టుగొమ్మలా మారింది ఎమ్మెల్యే రంగారావు ద్వారా చూపిస్తాడు రచయిత.

<u>రాజకీయ కుట్రలు</u> :

ప్రజాస్వామ్యంలో ప్రజలెన్నుకున్న ప్రతినిధులే పరిపాలకులు. కానీ నేడు ప్రజల చేత 'ఛీ' అనిపించుకున్న రాజకీయ నాయకులు కేంద్రం ద్వారా దిగుమతి అయి పరిపాలకులవుతున్నారు. ఈ పద్ధతి స్వాతంత్ర్యం లభించిన వెంటనే ఏర్పడిన తొలి మంత్రి మండలితోనే ప్రారంభమైంది. ఎన్నికల్లో ఎక్కడా పోటీ చేసి గెలవని రాజగోపాలచారిని తెచ్చి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేశారని అంటూ పాశ్చాత్య దేశాలలో 'హార్స్ ట్రేడింగ్' అని పిలవబడే గుర్రపు వ్యాపార సరళిగా విమర్శించాడు

రచయిత.

మద్రాసు శాసనసభలో ప్రకాశం పంతులు గారి నాయకత్వం లోని కమ్యూనిష్టులతో కూడిన యునైటెడ్ ఫ్రంట్‌కి 164 స్థానాలుంటే, 150 కి మించని స్థానాలున్న కాంగ్రెస్ కూటమికే పరిపాలనా పగ్గాలు చేతికిచ్చారు పేరుమోసిన శ్రీ గవర్నరు గారు.

1953 అక్టోబరు 1 న ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర తొలి మంత్రివర్గానికి ప్రకాశం పంతులు నాయకుడయ్యాడు. కొన్ని రోజుల లోనే ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి సంజీవరెడ్డికి విభేదాలు ప్రారంభమైనవి. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై అధికారపక్ష సభ్యులే క్రాస్ ఓటింగ్ చేయడం వలన ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ప్రభుత్వం పతనమైంది.

'పెద్ద మనుషుల ఒప్పందం' ప్రకారం 1956 నవంబరు 1న తెలంగాణా, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలు కలిసి సమైక్య ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడ్డాయి. మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి. 1960 లో నీలం సంజీవరెడ్డి దిగిపోయి మొదటి హరిజన ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య పదవీ స్వీకారం చేసాడు. 1961 ఎలక్షన్లలో కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చి మళ్ళీ సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు.

అధికారం కోసం రాజకీయ నాయకులు ఏ పని చేయడానికైనా సిద్ధమే. అవసరమనుకుంటే తమ పార్టీలని వారినైన సరే అధికారం నుండి దింపటానికి వెనుకాడరు. వారికి కావలసింది అధికారం. దానికోసం అమ్మని బొమ్మ చేయగలరు, బొమ్మని అమ్మ చేయగలరు. కానీ ఓటేసి గెలిపించిన ప్రజలను మాత్రం పట్టించుకునే వాడేవరూ లేరు. ఇది నేటి రాజకీయ చిత్రపటం.

ప్రపంచంలో ఎన్నికల ద్వారా కమ్యూనిష్టు ప్రభుత్వం అనేది తొలిసారిగా ఏర్పడింది కేరళలో. 1957 ఎన్నికలలో ప్రజల మద్దతులో అఖండ విజయం సాధించి నంబూద్రిపాద్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం సామాన్య ప్రజలకు చేయతలపెట్టిన సంస్కరణలు కేంద్ర ప్రభుత్వానికి, కొందరు భూస్వామ్య పెత్తందార్లకు నచ్చలేదు. శ్రీమతి ఇందిరాగాంధీ రంగంలోకి దిగారు. ఫలితంగా కేరళలో అల్లర్లు, బృందాలను. ప్రభుత్వ కార్యాలయాలను బలవంతంగా మూయించారు, కాదు - బల పరాక్రమాలతో ఆక్రమించుకున్నారు. దాదాపు 'సివిల్ వార్' నడిచింది నడిరోడ్ల మీద. చివరకు 1959 జూలై 31 న ప్రజ ఎన్నుకున్న కమ్యూనిష్టు ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసింది కేంద్రం.

సామాన్య ప్రజల సామాజిక జీవన విధానాన్ని, గమ్యాన్ని నిర్దేశించాల్సిన రాజకీయ నాయకులు ఆ విషయం మర్చిపోయి పదవీ పరుగుపందెంలో పోటీ పడుతున్నారు. దీని కోసం ఎన్నో కుట్రలు కుతంత్రాలు పన్నుతున్నారు. సమైక్యంగా జీవిస్తున్న ప్రజలలో ప్రాంతీయ అభిమానాలు నాటారు, అల్లర్లు లేవదీసారు, సమ్మెలు చేయించారు. ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేక ఆంధ్ర కావాలని బజారున పడ్డారు. చివరకు తమకు కావలసిన పదవులు లభించగానే చల్లబడిపోయారు.

ఈ పార్టీ నుంచి ఆ పార్టీకి, ఆ పార్టీ నుంచి ఈ పార్టీలోకి దూకడమనేది సర్వసాధారణమైంది. మంత్రి పదవి వస్తుందంటే దూకడం, పదవి రాలేదంటే దూకడం. చొక్కాలను మార్చినంత తేలికగా పార్టీలను మార్చిన ప్రముఖులున్నారు. రెండు వారాలలో నాలుగు పార్టీలు మార్చిన రాజకీయ నాయకులున్న దేశం మనది అని అంటాడు చెరబండి.

మానసికంగా గాని శారీరకంగా గాని ఎప్పుడూ ఎలాంటి పరిస్థితులలోనూ కలవడానికి వీలు లేనటువంటి పార్టీలు కాంగ్రెస్ వ్యతిరేకత పేరుతో సునాయాసంగా కలిసిపోతున్నాయి. కాపురాలు పెడుతున్నాయి. 'ఫ్రంట్' ప్రభుత్వాలన్నీ దాదాపుగా ఇలా తయారయినవే.

కొన్నింటికి ఉమ్మడి కార్యక్రమం ఉంటుంది. మరికొన్నింటికి అసలేమీ ఉండదు. ఉన్నదొకటంటే ధ్యేయం, కాంగ్రెస్‌ను పడగొట్టడం. తత్ఫలితంగా కొందరు గద్దెనెక్కడం. 1978లో ఇదే జరిగింది, 1989 లోను ఇదే జరిగింది. ఫలితం శూన్యం. ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదని రచయిత అసంతృప్తి వెళ్ళగక్కుతాడు.

1966లో లాల్‌బహదూర్ శాస్త్రి చనిపోయాక ప్రధానమంత్రి పదవి కోసం జరిగిన కుమ్ములాటలో సిండికేట్‌కి, ఇండికేట్‌కి మధ్య పోటీ పడింది. చివరకు ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా నియమించబడ్డారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతి పదవికి పోటీలో తమ అభ్యర్థిగా నీలం సంజీవరెడ్డిని నిలబెట్టగా ఇందిరాగాంధీ కాదు, కూడదన్నది. ఉపరాష్ట్రపతిగా ఉన్న వి.వి. గిరిని స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దించి 'ఆత్మ ప్రబోధం' ప్రకారం ఓట్లేయమన్నది. ఫలితం వి.వి. గిరి గెలుపు, కాంగ్రెస్ రెండు ముక్కలుగా చీలడం.

చెన్నారెడ్డి నాయకత్వంలో ఉద్యమం నడిపించిన ప్రత్యేక తెలంగాణా వాదులను సంతృప్తి పరచడానికి రాష్ట్ర ముఖ్యమంత్రిని గద్దె దిగమని ఆదేశించింది ప్రధాని. ఫలితంగా కాసు బ్రహ్మానందరెడ్డి 1970

సెప్టెంబరు 16 వ తేదీన రాజీనామా చెయ్యక తప్పలేదు. సెప్టెంబరు 30వ తేదీన రాష్ట్రముఖ్యమంత్రిగా గద్దెనెక్కాడు పి.వి.నరసింహారావు.

1977 మార్చిలో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఎమర్జెన్సీ వేసప్పటి దెబ్బ గట్టిగా తగిలింది అధికార కాంగ్రెస్‌కు. ఐదు రాజకీయ పక్షాలతో కూడిన జనతా పార్టీ 281 సీట్లను గెలుచుకొని కేంద్రంలో మొట్టమొదటిసారి కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. ప్రధానమంత్రిగా మురార్జీ దేశాయ్ నియమించబడ్డాడు. ఇది కూడా చాల రోజులు ఉండలేదు. అధికార పార్టీలో పదవుల కోసం కుమ్ములాటలు ఎకువయ్యాయి. ప్రధానమంత్రి పదవి కోసం చౌదరి చరణ్ సింగ్ ప్రణాళిక వేసాడు. ఆయనకు ఇందిరాగాంధీ మద్దతునిచ్చింది. ఫలితంగా మురార్జీ గద్దె దిగడం, చరణ్ సింగ్ గద్దెనెక్కడం జరిగింది. రాజకీయాలలో ఎవడు ఎవడికి మిత్రుడు కాడు. ఎవడు ఎవడికి శత్రువు కాడు. ఆయా సందర్భాలను బట్టి మిత్రుడు శత్రువవుతాడు, శత్రువు మిత్రుడవుతాడు. పార్లమెంటులో చరణ్ సింగ్ తన ప్రభుత్వం మెజారిటీ నిరూపించుకునే రోజునే కాంగ్రెస్ తన సహకారాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. చరణ్ సింగ్ ప్రభుత్వం

పేక మేడలా కూలిపోయింది. పార్లమెంట్ రద్దయింది. మధ్యంతర ఎన్నికలలో ఇందిరాగాంధీ ఘన విజయం సాధించింది.

ఇకపోతే మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి చెన్నారెడ్డి షష్టిపూర్తి చేసుకుంటున్నాడు. తులాభారాలు తూగుతున్నాడు. ఇతనిపై ఫిర్యాదులపై ఫిర్యాదులు శ్రీమతి గాంధీకి చేరాయి. ఫలితంగా చెన్నారెడ్డి దిగిపోయి అంజయ్య వచ్చాడు. 1982 ఫిబ్రవరి 28వ తేదీన అంజయ్యను దించి భవనం వెంకట్రామ్‌ను గద్దెనెక్కించింది ప్రధాని. కాని కొన్ని రోజులలోనే భవనం దిగిపోయి 1982 సెప్టెంబరు 20వ తేదీన విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు.

ఇలా కేంద్రం నుండి దిగుమతి అవుతోన్న ముఖ్యమంత్రులను చూసి ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు విసుగు పుట్టింది. ఆ సమయం లోనే ప్రఖ్యాత సినీ నటుడు నందమూరి తారక రామారావు ఆత్మాభిమానం పేరుతో 'తెలుగు దేశం' పార్టీని స్థాపించాడు. అంతవరకు కాంగ్రెస్‌లో ఉన్న నాదెండ్ల భాస్కర రావు, నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జానారెడ్డి, వసంత నాగేశ్వర రావు మొదలైన నాయకులంతా గోడ దూకి తెలుగుదేశంలో చేరారు. నందమూరి తెలుగుదేశమంతా సుడిగాలిలా పర్యటించాడు.

పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్నాడు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 35 సంవత్సరాలు గడిచింది. ఈ మూడున్నర దశాబ్దాల కాలంలో సామాన్య ప్రజలకు ఒరిగిందేమిటి? నిజంగా చెప్పాలంటే ధనికుడు మరింత ధనికుడయ్యాడు. పేదవాడు మరింత పేదవాడయ్యాడు. దేశ స్వాతంత్ర్యానికి అర్థం లేకుండా పోయింది.

" 1947 లో టాటాల ఆస్తి 24 కోట్లు. అది 1969 కి 342 కోట్లకు పెరిగింది. అలాగే 1947 లో బిర్లాల ఆస్తి 22 కోట్ల రూపాయలు. అది 1969 నాటికి 505 కోట్ల రూపాయలుగా పొదిగి పిల్లలను పెట్టింది. ఇది ప్రభుత్వానికందించిన లెక్కల ప్రకారం మాత్రమే సుమా!

మచ్చుకు ఒక పేదవాని పద్దు:

1947 లో బాలవెంకయ్య సన్నకారు రైతు. 2 ఎకరాల 25 సెంట్ల పొలం, 10 సెంట్ల ఇళ్ళ స్థలం. 1 పాడి గేదె, 2 మేకలు, 4 కోళ్ళు ఉండేవి. 1969 నాటికి చుట్టకి చుట్టకి, పట్నం పాలై, కన్యకా పరమేశ్వరి సత్రం వీధి మూల మీది చెత్తకుండిలో పడే ఎంగిలాకుల కోసం కుక్కలతో కాట్లాడుతున్నాడు" (పు. 274) అని రచయిత అంకెలతో సహా నిరూపిస్తూ

నేటి రాజకీయ వ్యవస్థపై, రాజకీయ నాయకులపై నిరసనను వ్యక్తం చేస్తాడు.

రాజకీయాల గురించి రచయిత స్పష్టంగా తన దృక్పథాన్ని చెప్తాడు ఈ నవలలో. రాజకీయాలు లేకుండా ప్రస్తుత సమాజమే లేదు అంటాడు రచయిత. రాజకీయాలు వద్దంటే ఈ సమాజాన్ని వద్దనడమే. మనక్కు మనం లేము అని అనుకోవడమే. అస్తిత్వాన్ని గుర్తించ నిరాకరించడమన్న మాట. అలాంటి భ్రమ లోకి, మాయలోకి మనం వెళ్ళవద్దు. మనం ఉన్నాం, మనకు మన జీవిత సమస్యలున్నాయి. అయితే, ఈ జీవిత సమస్యలన్నింటికీ రాజకీయాలతో విడదీయరానటువంటి సంబంధం వుంది అని అంటాడు చిరంజీవి. మనం ఎలా జీవిస్తున్నాం? ఎక్కడ జీవిస్తున్నాం? ఎటువైపుకు పయనిస్తు-న్నాం? అన్నవాటిని నిర్ణయించేది ఈ రాజకీయమే. అధికారంలోకి వచ్చిన రాజకీయ శక్తులే మన సామాజిక జీవన విధానాన్ని, గమ్యాన్ని నిర్దేశిస్తాయి. అందువల్ల విధిగా ఈ రాజకీయాలు చెప్పుకోవాలి. పైపెచ్చు మనం రాజకీయాలలో పాల్గొనకపోవడం కూడా మన తప్పిదమే. మన విధిని కళ్ళు మూసుకొని మరొకరి చేతుల్లో పెట్టడమే అని స్పష్టంగా చెప్తాడు రచయిత చిరంజీవి.

## కమ్యూనిస్టు పార్టీ :

నైజాం నవాబు సంస్థానం లోని తెలంగాణా ప్రాంతం ఎంతటి దుర్భర బానిసత్వంలో పడి నలిగిందో చెప్పలేము. ఎవరిని కదిపినా చాలు 'బాంచన్ దొరా, నీ కాల్మొక్త' అన్నమాట తప్ప మరొకటి వినిపించదు. జాగిర్దారు, దేశముఖ్‌ల దౌర్జన్యాలకు అంతులేదు. వెట్టిచాకిరీ పొట్టకు కూడు. అలాంటి స్థితిలో ఆంధ్ర మహాసభ ఏర్పడి 1930 నుంచి హక్కుల కోసం పోరాడింది. 1942 లో కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభలో కలిసింది. రెండూ ఏకమై ఉవ్వెత్తున లేచి నైజాం రాజుపై కెరటంలా విరుచుకు పడ్డాయి. రాజు రజాకారు మూకలను ఉసికొల్పాడు. వేట కుక్కల్లా గ్రామాల మీద పడ్డాయి కిరాయి మూకలు. దోపిడులు, మానభంగాలు, సజీవ దహనాలు - చెప్పుకోవడానికి వీల్లేకుండా నాలుకలు తెగ్గోసారు. వాటికి తోడు నెహ్రూ సైన్యాలు వంతు పలికాయి. తెలంగాణాలో యూనియన్ సైన్యాల ప్రవేశంతో కమ్యూనిస్టులు పూర్తిగా అజ్ఞాతవాసంలోకి వెళ్ళి పోయారు. చివరకు ప్రభుత్వం 1948 ఫిబ్రవరిలో కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది.

...లో అజ్ఞాతంలో ఉండే, కమ్యూనిస్టు పార్టీ సాయుధ గెరిల్లా పోరాటం మొదలెట్టింది. భూస్వామ్య విధానం రద్దు కావాలని, 'దున్నేవాడికే భూమి' అని నినదిస్తూ ఎర్రజెండా ఎత్తి పదిలక్షల ఎకరాల భూమిని పేదలకు పంపకం చేసింది. దాదాపు 2500 గ్రామాలు భూస్వామ్య విధానం నుండి విముక్తి పొందాయి. దీంతో కమ్యూనిస్టు పార్టీ ప్రజల్లో అభిమానం సంపాదించింది. ఫలితంగా 1952 జనరల్ ఎలక్షన్లలో ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్‌కు 40 సీట్లు వస్తే కమ్యూనిస్టు పార్టీకి 41 సీట్లు లభించాయి. తెలంగాణాలో కాంగ్రెస్‌కు 44 సీట్లు వస్తే కమ్యూనిస్టుల నాయకత్వం లోని పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కి 37 సీట్లు వచ్చాయి. కమ్యూనిస్టుల ఈ విజయానికి కారణమేమిటి? సుబ్బన్న శాస్త్రిలా ఒక ముక్కలో చెప్పాలంటే - ఇది వారి సేవా తత్పరతకు, ఎనలేని త్యాగానికి ప్రజలిచ్చిన బహుమానం అని రచయిత చెప్తాడు.

రచయిత కమ్యూనిజం గురించి, దాని పుట్టు పూర్వోత్తరాలు, దాని క్రమ వికాస పరిణామం గురించి వివరంగా చర్చిస్తాడు ఈ నవలలో.

"మనిషి ఒకడే. మనుష్యులందరి పోలికా ఒకటే కదా. మళ్ళీ మనిషికీ మనిషికీ పోలిక వుండదు: ఏ మనిషికా మనిషే. అలాగే కమ్యూనిజమనేది ఒకటే.

సినో కమ్యూనిజమనీ, యూరో కమ్యూనిజమనీ, ఇండో కమ్యూనిజమనీ-
యిన్ని కమ్యూనిజాలుండవు. ఉండేది ఒక్కటే కమ్యూనిజం. ఒక్కటే మార్క్సిజం.
అయితే దాన్ని ఏ దేశానికి ఆ దేశం వర్తింప చేసుకోవాలి. మనుషులలోని తేడాలను
గుర్తు పట్టినట్లే ఆయా దేశాలలోని తేడాలను, పరిస్థితులలోని ప్రాబల్యాలను సరిగా
గుర్తుపట్టగలగాలి. ఈ పరిశీలనకు సాధనం మార్క్సిజం. పరిశీలించిన దాన్ని మార్చడానికి
సాధనం కూడా మళ్ళీ ఈ మార్క్సిజమే.... మార్క్సిజమనేది ఒక సైన్స్, ఒక శాస్త్రం.
సైన్స్ ఎక్కడా ఏ పాయింటు దగ్గరా ఆగదు కదా. ఎప్పటికప్పుడు అభివృద్ధి పథాన
ముందుకు పోతూనే వుంటుంది కదా. మనకు తెలుసు; ప్రకృతిలో ప్రతిదీ ప్రతినిత్యం
మారుతూనే వుంటుంది. ఒక వస్తువు యొక్క కదలిక, అందుకు గల కారణాలు, దానిపై
వాటి ప్రభావాలు, మళ్ళ వీటన్నింటి యొక్క అంతర్గత సంబంధాలు - ఈ whole
scientific body of thought అంతా - తార్కికంగా, సశాస్త్రీయంగా యోచిస్తుంది
మార్క్సిజం. ప్రకృతి లాగానే మార్క్సిజం కూడా ఎప్పుడూ పరిణామశీలంగానే
వుంటుంది: పరిణామక్రమంలోనే వుంటుంది. అందుకే అది ఎల్లప్పుడూ సృజనాత్మకం!
సజీవం: సజీవ సామాజిక శాస్త్రం: 'Theory cannot be thought up. సిద్ధాంతం
ఊహించబడేది కాదు. అనేక అనుభవాల, పరిశీలనల ఫలితంగా పుట్టేది' అన్నాడు
లెనిన్. సర్వ ప్రపంచం లోని మానవ సమాజాల విజ్ఞానాన్నంతటినీ ప్రోది చేసుకొని

పెరుగుతుంటుంది మార్క్సిజం. 'ఇదే సంపూర్ణ సత్యం' అని దేన్నీ గురించీ ఏనాడు చెప్పదు మార్క్సిజం. ఎందుకు చెప్పదంటే, ఏదీ సంపూర్ణ సత్యం కాదు గనక, సంపూర్ణత్వమనేదే దేనికీ లేదు గనక. అసలు వుండదు గనక. అయితే 'ఏదీ సంపూర్ణ సత్యం కానప్పుడు దీని గతి కూడా యింతే కదా' అని అర్థాలు తీస్తారు కొందరు అవకాశవాదులు. సంపూర్ణం కాదంటే 'ఇప్పటి సత్యం యిది. ఇంతవరకే. ఇంతవరకిది సంపూర్ణ సత్యం. ఇదే సత్యం ఎల్లకాలమూ వుంటుందా (కాదే వుండదు. ఉండదని చెప్పడం మాత్రమే'. ఈ రోజు ఒక పువ్వు మొగ్గగా ఉండటం వరకు సత్యం. సంపూర్ణ సత్యం ఈనాటికిది. రేపు వికసించినప్పుడు, ఆ వికసనం సత్యం. ఎల్లుండి వాడినప్పుడు అది సత్యం. ఆవల ఎల్లుండి రాలినప్పుడు, ఆనాటికది సత్యం. అంతేగాని కలకాలాలకు తావులేదికడ. 'అంటే మార్క్సిజానికి నియమ నిబంధనలు లేవు గనక యిది అన్ని దేశాలకు వర్తించదు' అని కొందరు, అందుకు విరుద్ధంగా 'ఇది నిబద్ధమైనది గనక విశ్వజనీనతకు యింకులో చోటు లేదు' అని మరికొందరు వాదిస్తుంటారు. ఈ రెండూ అసంగతాలు, అజ్ఞాన పూరితాలు. Absolute truth is historically conditional but the existence of such is unconditional. సత్యానికెప్పుడూ దూరం కాదు మార్క్సిజం. పరమ సత్య పదార్థాన్ని విడిచి సాము చేయదు. అలా సాము చేసే స్వాములు కొందరున్నారు. వీరు లోతులకు దిగరు. పైపై

స్వరూపాన్ని మాత్రమే చూస్తారు. తమకేమనిపిస్తుందో కల్పనాత్మకంగా చెబుతారు. ఊహాత్మకంగా యోచిస్తారు. మానసిక భావాల నాధారం చేసుకొని ఊహాలనల్లుతారు. సత్య పదార్థాన్ని ఊహాపోహాలతో కొలుస్తారు. అస్పష్టత, అయోమయం, సంభ్రమం, డాంబికం, మాయ, మర్మం, మంత్రం, తంత్రం యిలాంటి కవచాలు తొడుక్కుంటారు. సత్యానికి విరుద్ధమైన కట్టుకథలనేకం కల్పిస్తారు. వాస్తవిక ప్రపంచానికి వ్యతిరేకమైన ఊహాత్మక ప్రపంచాన్ని సృష్టిస్తారు. ఇలాంటి వాటి నన్నిటిని కమ్యూనిస్టులమైన మనం ఖండించాలి...... ఆదిమ సమిష్టి వ్యవస్థ, దాని నుంచి బానిస యుగం, ఆ బానిస యుగం నుంచి ఫ్యూడల్, పెట్టుబడిదారీ సమాజాలు ఉత్పన్నమయ్యాయి. ఈ పెట్టుబడిదారీ సమాజం నుంచీ సోషలిస్టు వ్యవస్థ ఉద్భవించడమనేది పరమ సత్యం! దోపిడీ, పీడనా లేని సమాజం, స్వేచ్ఛాయుత శ్రమపై ఆధారపడిన సమాజం స్వప్నమూ, ఊహాజనిత స్వర్గమూ కాదు! అది చారిత్రక నియమం! ఆ నియమాన్ని లెనిన్ తన దేశంలో నిజం చేసి చూపాడు; 1917 లోనే" ⟨331-333⟩ అని కామ్రేడ్ కేంభంపాటి సీనియర్‌తో ప్రకాశరావుచేత చెప్పిస్తాడు రచయిత.

కమ్యూనిష్టు పార్టీ చీలికల గురించి కూడా రచయిత తాను చెప్పదల్చుకున్నదీ స్పష్టంగా చెప్తాడు. దానివల్ల వాళ్ళు ఏం కోల్పోతున్నారో వివరంగా రాసాడీ నవలలో.

కమ్యూనిస్టులు రివిజనిస్టులని మార్క్సిస్టులంటే, మార్క్సిస్టులు, కమ్యూనిస్టులిద్దరూ రివిజనిస్టులేనని - మార్క్సిస్టు - లెనినిస్టులంటున్నారు. మరి ఈ మార్క్సిస్టు - లెనినిస్టులయినా ఒకే దారిన పోతున్నారా అంటే అదీ లేదు. 1970 ఆఖరు నాటికే సాయుధ పోరాటం విఫలమైంది అంటారు కొందరు. 'కాదు, కాలేదు' అంటారు మరి కొందరు. 'కొనసాగించి తీరుతాం' అంటారు ఇంకొందరు. ఇలా సి.పి.ఐ (యం.యల్) పార్టీ చీలి చీలి, చెట్టుకొక గ్రూపు, పుట్టకొక గ్రూపుగా తయారయింది. దీనివల్ల వారు ఏం కోల్పోయారో, ఏం కోల్పోతున్నారో వారికే తెలియడం లేదంటాడు రచయిత.

ఒకప్పుడు ఐక్య కమ్యూనిస్టు పార్టీగా ఉన్నప్పుడు 1952 జనరల్ ఎన్నికలలో ఆంధ్ర తెలంగాణాలలో కలిపి 78 స్థానాలు వస్తే, 1955 మధ్యంతర ఎన్నికలలో 15 సీట్లకు దిగజారారు. 1952 లో 40 గా ఉన్న కాంగ్రెస్ బలం 1955లో 115కు పెరిగింది. 1962 లో కాంగ్రెస్ బలం 177 కాగా, కమ్యూనిస్టు పార్టీ బలం 57. ఆ తర్వాత పార్టీ విచ్చిన్నమైనా చీలి CPI, CPM గా విడివడి వేరు వేరుగా పోటీ చేసిన ఎన్నికలలో ఈ పార్టీలు ఎంతగా దిగజారాయో రచయిత అంకెలతో సహా విశ్లేషించి చూపారు.

| సంవత్సరం | ఐక్య కమ్యూనిస్టు పార్టీ | కాంగ్రెస్ |
|---|---|---|
| 1952 | 78 సీట్లు | 40 సీట్లు |
| 1955 | 15 " | 115 " |
| 1962 | 57 " | 177 " |

1964 లో కమ్యూనిస్టు పార్టీ చీలిన తర్వాత

| సంవత్సరం | సీ.పి.ఐ | సీ.పి.యం | కాంగ్రెస్ |
|---|---|---|---|
| 1967 | 11 | 9 | 165 |
| 1971 (లోకసభ) | 1 | 1 | 28 |
| 1972 (అసెంబ్లీ) | 7 | 1 | 219 |
| 1978 " | 8 | 6 | 175 |

రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం ఆవిర్భవించిన తర్వాత

| సంవత్సరం | సీ.పి.ఐ | సీపి.యం | కాంగ్రెస్ | బి.జె.పి | తెలుగుదేశం |
|---|---|---|---|---|---|
| 1983 | 4 | 5 | 60 | 3 | 198 |

చివరకు జాతీయ పార్టీలయిన CPI, CPM లు ప్రాంతీయ పార్టీగా పుట్టిన 'తెలుగు దేశం'తో 1985,లో ఎన్నికల పొత్తు పెట్టుకున్నాయి. ఒక చిల్లర మల్లర పార్టీలుగా తయారయ్యాయి. ఒక నటుని ఆకర్షణ మీద నమ్మకం, తాము కలిసి పోరాడితే వస్తుందన్న జ్ఞానం లేకపోయింది. CPI, CPM ఈ రెండు పార్టీల సిద్ధాంతం ఒకటే అయినా దానిని సాధించడంలో అవి వేరు వేరుగా అనుసరిస్తున్నాయి. ఒకటి చైనాకు అనుకూలంగా ఉంటే ఇంకొకటి రష్యాను సమర్థిస్తోంది. ఈ రెండు పార్టీలు కలిసిపోయి ప్రజా ఉద్యమాలను మళ్ళీ నడిపించాలని, మీరు మీరు కొట్టుకొంటూ శత్రువుకు పరోక్షంగా సాయం చేస్తున్నారని అని అంటూ రచయిత, ఈ నవలలోని వెంకటసుబ్బారావు పాత్ర ద్వారా కమ్యూనిష్టు పార్టీలన్నింటికీ ఒక బహిరంగ లేఖను రాయిస్తాడు. అందులో ఎన్నెన్నో రాజకీయాలను, తప్పొప్పులను ఎత్తి చూపాడు.

" మీలో మీరే తన్నుకు చస్తుంటే, మీరే కలవక పోతే, ఇక దేశాన్నంతా ఏకోన్ముఖం చేసే జాతీయ పార్టీగా ఎలా రూపొందుతారని ప్రశ్నించాడు. ఎప్పటికి వస్తుంది సోషలిజం అని నిలదీశాడు. 1921 నాటి భారతదేశం 'తగలబడి పోతున్న ఇల్లు' లాగా వున్నానని గాంధీజీ

రాసినట్లే ఇప్పటి స్వేచ్ఛా భారతం ఆగలబడుతున్నదన్నాడు. విప్లవాన్ని సాధించగలిగేది బలిష్ఠమైన, సుశిక్షితమైన పార్టీయేననీ, అది లేనినాడు దేశంలో ఎలాంటి విప్లవకర పరిస్థితులున్నా విప్లవం రాదనీ తెగేసి చెప్పాడు. నాయకత్వం కోసమైతేనేమి, మరి దేనికోసమైతేనేమి మీలో మీరు కలహించుకుంటూ శత్రువర్గానికేది కావాలో అది చేసి పెడుతున్నారనీ, ఈ రకంగా పరోక్షంగా శత్రువుకు సాయం చేసినవారవు-తున్నారనీ, బుద్ధి తెచ్చుకొని కలవమనీ రాశాడు. మీకోసం కాకపోయినా, జనం కోసమైనా, దేశం కోసమైనా కలిసి చావమన్నాడు! చివరలో ప్రాణాను మించిన ఆవేశమొస్తే పోయెట్రీ రాశాడు

'గతకాలపు అప్పుదాల చీకటి నీడలలో నివసించకు
రా కామ్రేడ్, రా బయటకి
నీడలు విదిలించుకురా
రా త్వరగా, రా రా
చరిత్ర నీ కోసం పడిగాపులు పడుతున్నది
తెల్లవారేది ఎప్పుడని!" (పు-363-364) అని

వెంకటసుబ్బారావు పాత్ర చేత కమ్యూనిష్టు పార్టీలకు ఆవేశంగా లేఖ రాయిస్తాడు.

చివరకు కమ్యూనిష్టు ప్రభుత్వమే వస్తే దేశం ఎలా ఉంటుందో

కూడా రచయిత, కంభంపాటి సీనియర్ పాత్రతో చెప్పిస్తాడు.

" కార్మికులు లేని, యజమానులు లేని, కూలీలు లేని, కామాంధులు లేని, నవ్య భవ్య దివ్య సమాజమేర్పడుతుంది. ధర్మ కర్తృత్వ సంఘాలు రద్దు. ధర్మం వద్దు; బిచ్చం వద్దు; వాళ్ళ అధికారాలను వాళ్ళే హస్తగతం చేసుకోనీ; వాళ్ళ సంపదకు వాళ్ళే అధినాథులు కానీ! ప్రజా రాజ్యాన్ని ప్రజలే ఏలుకోనీ; ఈ పంథాలో పార్టీని నడిపించు. పార్టీని పునరుజ్జీవింప చేయి" (పు. 359-360) 'పార్టీని ఎలా నడిపించాలి' అన్న ప్రశ్న వేసిన వెంకటసుబ్బారావుకు కంభంపాటి సమాధానం ఇది. రచయిత ఆశాజీవి. తన దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకునేవాడు అని అర్థమవుతుంది.

## కులాంతర వర్ణాంతర వివాహాలు:

రచయిత శ్రీ చిరంజీవి ఈ నవలలో కులాంతర, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాడు. ఈ నవలలో ప్రకాశరావు - సంతోషం కులాంతర వివాహం, పార్వతి - నారాయణాచార్యులు, చంద్రవదన-అమ్మయ్యల వర్ణాంతర వివాహాల ద్వారా రచయిత సమాజంలో ఇటువంటి వివాహాలను ప్రోత్సహించవల్సియుంది. సమ సమాజ స్థాపనకు నాందీపలికాడు.

## భూ సంస్కరణలు :

1972 మే 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్సుతో భూసంస్కరణల బిల్లును తెచ్చింది. దానిని రాష్ట్ర శాసన మండలి ఆమోదించింది. దీని ప్రకారం 10 ఎకరాల మాగాణి, 25 ఎకరాల మెట్టకు పైబడిన వ్యవసాయ భూముల అన్యాక్రాంతాలను నిషేధించింది. ఈ ఆర్డినెన్సుతో భూస్వాములు మల్లగుల్లాలు పడ్డారు. వాళ్ళకు దిక్కు తోచలేదు. దీనికి విరుగుడు మందు కనిపెట్టడంకోసం కోసం పెద్ద తలకాయలన్నీ కూడి ఒక ప్లాను వేసి దానిని విద్యార్థులకు అందచేసారు. దాంతో 'జై ఆంధ్రా' అంటూ రోడ్ల మీద పడ్డారు. తర్వాత ప్రభుత్వోద్యోగుల సమ్మె, పోలీసు కాల్పులు, కాల్పులకు నిరసనగా జరిగే సమ్మె. దాంతో ప్రభుత్వమే మారాల్సి వచ్చింది. పి.వి. నరసింహారావు గద్దె దిగాడు. తర్వాత రాష్ట్రాన్ని ఏలడానికి కాంగ్రెస్ వాళ్ళకు నాయకుడే దొరకలేదు. ఫలితంగా 1973 జనవరి 18న రాష్ట్రపతి పాలన విధించారు. ఇక భూమి లేదు, భూ సంస్కరణలు లేవు - అంటూ భూసంస్కరణల ఆర్డినెన్సు ఎలా చెత్తబుట్టలోకి వెళ్ళింది కూలంకషంగా వివరించాడు రచయిత. ఈ దేశంలోని భూస్వాములు, పెత్తందార్లు సామాన్యులను

కనీసపు దారిద్ర్యపు రేఖ కూడా దాటనీయరు.

'జై ఆంధ్ర' ఉద్యమం కారణంగా వాయిదా పడిన భూగరిష్ఠ పరిమితి చట్టం 1975 జనవరి 1 నుంచి అమలులోకి వచ్చింది. దీని ప్రకారం మాగాణి భూమిని రెండు రకాలుగా భాగించారు. రెండు పంటల పల్లపు భూమి, ఒక పంట పల్లపు భూమి అని, ఇందులో మళ్ళీ ఆరు తరగతులు ప్రాంతాన్ని బట్టి.

తరగతులు

| A | B | C | D | E | F |
|---|---|---|---|---|---|
| 10 ఎకరాలు | 12 ఎ | 13½ ఎ | 15 ఎ | 16½ ఎ | 18 ఎకరాలు |

↳ (ఈ విభజన రెండు పంటల భూమికి వర్తిస్తుంది)

| A | B | C | D | E | F |
|---|---|---|---|---|---|
| 15 ఎకరాలు | 18 ఎ | 20 ఎ | 22½ ఎ | 25 ఎ | 27 ఎకరాలు |

↳ (ఇది ఒక పంట పండే భూమికి వర్తిస్తుంది)

పోతే, మెట్ట భూమిని అయిదు తరగతులుగా భాగించారు

| G తరగతి | H తరగతి | I తరగతి | J తరగతి | K తరగతి |
|---|---|---|---|---|
| 35 ఎకరాలు | 40 ఎ | 45 ఎ | 50 ఎ | 54 ఎకరాలు |

ఇవీ గరిష్ఠ పరిమితులు. ఈ పరిమితికి మించిన భూమిని ప్రభుత్వం భూస్వాముల నుంచి స్వాధీన పరచుకోవచ్చు. కానీ భూస్వాముల, పెత్తందార్ల, పెట్టుబడిదార్ల చేతుల్లోని ఈ ప్రభుత్వం వారికి కొన్ని రాయితీలు కల్పించింది. అవి, తోటలు, దొడ్లు మినహాయించారు. పశువుల మేతకు మూడోవంతు భూమిని అట్టిపెట్టుకోవచ్చు అన్నారు. అంతేకాదు,

హైకోర్టుకు రివిజన్ పిటిషన్ పెట్టుకునే అవకాశాన్ని కల్పించారు.

ఇన్ని అవకాశాలు ఇస్తే ఇక భూమి ఇచ్చే నాథుడెవ్వడు? అని ప్రశ్నిస్తాడు రచయిత. అంతేకాదు భూస్వాములు తమకున్న భూములను భార్యల పేర, బిడ్డల పేర, పుట్టిన బిడ్డల పేరనే కాదు; కడుపులో ఉన్న బిడ్డల పేర, ఇంకా కడుపున పడని బిడ్డల పేర, తోటల కింద, చెరువుల కింద, దొరవుల కింద రాయించారు. దొంగ లెక్కలు చూపెట్టారు. భార్యాభర్తలే విడాకులిచ్చుకున్నట్టు దొంగ కేసులు కోర్టులకెక్కాయి-అని అంటూ రచయిత ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో భూసంస్కరణలు అమలు చేసిందో వ్యంగ్యంగా విమర్శించాడు.

## కార్మికుల సమ్మె:

పెట్టుబడిదారి వర్గాలు తమ తమ స్వార్థ రాజకీయాలకు అనుగుణంగా, సమ్మె చేస్తున్న కార్మికులలో విభజనను తీసుకవచ్చి వారిలో వారినే తన్నుకునేట్లు చేస్తూ కార్మికులలో అశాంతి రేగడానికి కారణభూతులవుతున్నారు. కొంతమంది కార్మికులను తమ చెప్పు చేతల్లో ఉంచుకొని తాము ఆడమన్నట్టు ఆడిస్తున్నారు. విననివారిని పోలీసులతో, గూండాలతో అణగదొక్కుతున్నారు. మొత్తం కార్మిక వ్యవస్థ

జరుగుబాటు చేస్తే ఫ్యాక్టరీకి నష్టం వచ్చిందంటూ లాకౌట్ ప్రకటిస్తున్నారు. గుత్త పెత్తందారీ పోషకులైన ప్రభుత్వం, వారినే సమర్థిస్తుంది. సరిగ్గా ఇలాగే జరిగింది ప్రకాశరావు విషయంలో. చంద్రమౌళి కంపెనీలో జరుగుతోన్న సమ్మె నాయకత్వాన్ని ప్రకాశరావు చేతుల్లోకి పోనీయకుండా యమ్మెల్యే వెంకటప్పు తన 'హస్తం' మారుటలోకి తీసుకున్నాడు. దాంతో మేనేజ్‌మెంట్ తేలికగా కొన్ని ఎముక ముక్కలు విదిలించటం, దానికి కార్మిక నాయకులు తోకలు ఊపటంతో సమ్మె విజయవంతంగా విరమించబడింది.

శ్రామికుడంటే ఎవరో కాదు, శ్రమ ద్వారా ఉత్పాదనా కార్యక్రమాలలో పాల్గొంటూ సంపదకు హేతువయ్యేవాడు అని చెప్తాడు రచయిత. శ్రామిక వర్గ నియంతృత్వమంటే ఏమిటి అన్న ప్రశ్నకు కంభంపాటి సీనియర్‌తో ఇలా చెప్పిస్తాడు. నియంతృత్వం అనేది సరైన పదం కాదు. శ్రామికవర్గ శాసనాధికారం లేదా రాజ్యాంగాధికారం అనాలి. ఈ అధికారం శ్రామికవర్గానికి దఖలు పడుతుంది సోషలిస్టు సమాజంలో. ఇందులో ఏ వ్యక్తి నియంతృత్వమన్న ప్రశ్నే లేదు. మిగతా పక్షాలవారి దోపిడీరహిత ప్రయోజనాలకు, ప్రజాస్వామ్య విధానాలకు

భిన్నంగా ఉండదు, సరికదా వారి ప్రయోజనాలు సమగ్రంగా పరిరక్షింప బడతాయి. ఇతర దోపిడికి మాత్రమే వ్యతిరేకం. బహు కొద్దిమంది, యావత్తు ప్రజల భవిష్యత్తును నాశిస్తామంటే ఇక కుదరదు గాక కుదరదని చెబుతుంది ఈ అధికారం అని అంటాడు రచయిత. సోషలిస్టు సమాజంలో అందరూ సమానమే. ఎవరు ఎక్కువ కాదు, ఎవరు తక్కువ కాదు. అలాంటి సమాజమే మనకు కావాలని రచయిత ఆకాంక్ష.

## అణు యుద్ధం గురించి:

ప్రపంచం మొత్తాన్ని సర్వనాశనం చేసే అణు యుద్ధాన్ని, అణు బాంబులను తయారు చేస్తోన్న దేశాలను ఘాటుగా విమర్శిస్తాడు రచయిత ఈ నవలలో.

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారి 1945 ఆగష్టులో నాగసాకి, హిరోషిమా పట్టణాలపై అణుబాంబులను ప్రయోగించింది అమెరికా. ఆనాడు ఈ అణుబాంబుల దాడికి 'జపాన్' మొత్తం అతలా-కుతలం అయింది. ఎన్నో లక్షల మంది అమాయకులు చనిపోయారు. ప్రపంచం మొత్తం మీద కనీసం అయిదున్నర కోట్ల మంది అమాయకులు

రెండవ ప్రపంచం యుద్ధం వల్ల చనిపోయారు. అందువల్లనే యుద్ధం సంభవించరాదని, అణుబాంబుల తయారీని నిలిపివేయాలని రచయిత కోరుతాడు. 1982 వరకు ప్రపంచంలో 15 వేల మెగాటన్నుల శక్తి గల అణుబాంబులున్నాయి. అణుబాంబులే కాదు, ఆటం బాంబులు, హైడ్రోజన్ బాంబులే కాదు, 1 లక్ష 50 వేల టన్నుల రసాయనిక బాంబులు నిల్వ ఉన్నాయి. ఇవేగాక న్యూట్రాన్ బాంబులనీ, బైనరీ గ్యాస్ బాంబులనీ, యం. యక్స్ మిసైళ్లనీ కొత్త కొత్త విధ్వంసక ఆయుధాల ఉత్పత్తికి అమెరికా పూనుకొంది. అందుకే, " ఓ అమెరికా దేశమా! ఈ ప్రపంచం వెన్నున పుట్టిన రాచపుండా! మా గడ్డ మీద నీ రక్త సిక్త అణు ఆయుధాలను పెట్టనివ్వం " అని ఆవేశంగా హెచ్చరిస్తాడు రచయిత.

## క్షుద్ర సాహిత్యంతో వ్యాపారం చేసుకునే పత్రికలు :

ఆధునిక కాలంలో వస్తున్న సాహిత్యం పూర్తిగా వ్యాపారమై పోయింది. 30 సంవత్సరాలకు పూర్వం నేడు ఉన్నన్ని వారపత్రికలు గాని, దినపత్రికలు గాని లేవు. కాని నేటి వ్యాపార ప్రపంచంలో వారపత్రికలు, దినపత్రికలు లెక్కలేనన్ని పెరిగాయి. అంతేగాక అక్షరాస్యత శాతం పెరిగింది.

మధ్య తరగతి పాఠకులు పెరిగారు. దాంతో పత్రికలు సాహిత్యాన్ని వ్యాపారం చేయడం ప్రారంభించాయి. దినపత్రికలలో, వారపత్రికలలో 'సీరియల్' నవలలు రావడం ప్రారంభమైంది. 1960 వరకు కొంతవరకైన సమాజాని కుపయోగపడే సాహిత్యం వచ్చినా 1960 తర్వాత కాల్పనిక సాహిత్యం పెరిగింది. రచయితలు, రచయిత్రులు ఎక్కువయ్యారు. ప్రేమ, పెళ్ళి, షికారు, హనిమూన్-కల్పన ఇతివృత్తమే వారి సాహిత్యమైంది. తీరని కోరికలతో, ఊహా లోకాలలో ఉండే మధ్యతరగతి పాఠకులకు ఇటువంటి సాహిత్యం నచ్చింది. దాంతో ఆ కాలంలో వచ్చిన రచనలన్నీ ఒకే మూసలో పోసినట్లు వచ్చాయి. పాఠకులకు విసుగు పుట్టింది. ఈ సమయంలోనే పాఠకులకు ఉత్కంఠ నెలకొల్పే మంత్రాలు, తంత్రాలు, సెక్స్, క్రైమ్ తో కూడిన క్షుద్ర సాహిత్యం రావడం ప్రారంభమైంది. దానితో తెలుగు నవలా రంగం రూపురేఖలే మారిపోయాయి. వాటిని పత్రికలు కూడా పోటీలు పడి సీరియల్స్‌గా ప్రచురించి క్షుద్ర సాహిత్యాన్ని పెంచి పోషించాయి, పోషిస్తున్నాయి. ఇలాంటి క్షుద్ర సాహిత్యాన్ని రచయిత చిరంజీవి ఈ నవలలో తీవ్రంగా విమర్శించాడు.

చిరంజీవి, మిత్రవర్మ అనే రచయిత పాత్రను పరిచయం

చేస్తాడు ఈ నవలలో. ఆ మిత్రవర్మ ఎలాంటి వాడంటే పాముతోనూ స్నేహం చేస్తాడు. కప్పతోనూ స్నేహం చేస్తాడు. ఎలాంటి దుర్భరమైన ఆకలి కూకటివేళ్ళతో కుళ్ళగిస్తుంటే ఆ చిరుకప్పను చేరు విషంగా మింగవలసి వచ్చిందో పాము కోసం పద్యం రాస్తాడు. అలాగే కప్పలు బెకబెక లాడుతూ వచ్చి బారులు తీరి నిలబడితే, పాముల యొక్క దౌష్ట్యం, దురహంకారం, దురన్యాయాల మీద దండెత్తే గద్యం రాస్తాడు. పాత కాంగ్రెస్ కోసం పంచరత్నాలు, కొత్త కాంగ్రెస్ కోసం అభ్యుదయోస్తు, కమ్యూనిష్టుల కోసం సమసమాజం, మార్క్సిస్టుల కోసం వీరగంధం, మార్క్సిస్టు లెనినిస్టుల కోసం తుపాకి గుండు — యిలాంటి రచనలన్నీ ఒంటిచేతి మీదుగానే చేస్తాడు అని చెప్తాడు రచయిత. ఈనాటి సాహిత్యమెంత కుళ్ళి కంపుకొడుతుందో సోదాహరణ ప్రసంగం చేయగలడు. ఏమండీ, ఇలాంటి రచనలతో మనం ప్రజలను మోసం చేస్తున్నట్లు కాదా? అన్న ప్రకాశరావుతో — కానే కాదు. ప్రజలు వెర్రివాళ్ళు కారు. మీకంటే, నాకంటే తెలివైనవాళ్ళు. సరసమైన ధరకు లభించే సారాయినే తాగుతారు. ఒంటికి వేడి పుట్టిస్తుందంటునే ఆ సినిమా చూస్తారు. ఊహాలోకాలలో విహరింపచేసే నవలనే కొంటారు. దేనికైనా ఒళ్ళు

గగుర్పొడవాలి లేదా గిలిగింతలైన పెట్టాలి. వంకాయముళ్ళ, బీరకాయముళ్ళ గీచి గీచి బేరమాడే ఆడవాళ్ళకు తెలియదనుకున్నావా దేని విలువ ఎంతో? ఇది నాడీ శాస్త్రం! చదువుకొండి అని ప్రకాశరావుకు హితబోధ చేస్తాడు. నేటి నవలా రచయితలు, వాళ్ళు చేస్తోన్న అబద్ధపు ప్రచారం ఎంతటి అధఃలోకాలకు తీసుకెళ్తుందో రచయిత కళ్ళకు కట్టినట్టు వివరిస్తాడు.

ప్రకాశరావు 'గ్రాస వాసో దైన్యం' అనే కథ రాసి ఒక పత్రికకు పంపిస్తాడు. నెల తిరక్కుండానే అది తిరిగి వచ్చింది. శీర్షిక బరువుగా ఉందేమోనని 'ఒంటి చీర' అని పేరు మార్చి మరో పత్రికకు పంపిస్తాడు. వారంలోనే మళ్ళీ తిరిగివచ్చింది. దాంతో పాటు ఆ పత్రికా సంపాదకులు ఒక చిన్న నోటు రాసి పంపించాడు. "ప్రియ మిత్రమా! మీరు మిత్రులనే అభిప్రాయంతోను, మంచి రచయితలనే గౌరవంతోను, ఈ ముక్క రాయడానికి సాహసిస్తున్నాను. ఇలాంటి కథలు ఇకముందెన్నటికీ వ్రాయకండి. వ్రాసిన మా పత్రికకు పంపకండి. ఇటువంటి రచనలకు గిరాకి లేదు. గిరాకీ వున్న వాటినే ప్రచురిస్తాము మేము. అన్యథా భావించక, మీరు మీ కలాన్ని సెక్స్ మీదికో, క్రైమ్ మీదికో, థ్రిల్లర్ మీదికి మళ్ళించవలసిందిగా

మనవి. ఏమీ అనుకోరు కదూ, ఉన్నమాట అంటున్నందుకు? ఇట్లు, ఎల్లప్పటికీ, మీ ప్రియమైన సంపాదకుడు" (పు.234). భ్రష్ట రచయితలు బయల్దేరారు, దుష్ట సాహిత్యాన్ని అమ్ముతున్నాయి పత్రికలు అంటూ రచయిత నేటి వ్యాపార సాహిత్యంపై, రచయితలపై, రచయిత్రులపై తన నిరసనను వ్యక్తం చేస్తూనే తీవ్రంగా విమర్శిస్తాడు.

"ఆరడుగుల పురుషులతో, పన్నెండడుగుల పడవ కార్లతో, బొట్టి షికార్లు చేస్తూ ఊహాలోకంలో జోగిపోతున్న రచయిత్రులను, రచయితలను భూత, ప్రేత, పిశాచ, ఢాకిని, శాకినీ, గాలి దెయ్యాలుగ రచయిత తన వాలంటియున్నే జుట్టు పట్టి పడగొట్టిన తీరు" (పు.344) అద్భుతంగా ఉంది.

పెట్టుబడిదారీ శ్రేణి సంస్కృతి ఒకవైపున, దెయ్యాల భూతాల భ్రష్ట రచయితలు ఇంకో వైపున విద్యార్థులలో, యువకులలో, రచయితలలో కల్గిస్తున్న అపభ్రంశ ధోరణులు, దేశంలోకి దిగుమతి అవుతున్న అమెరికా నాగరికత అరాచక లక్షణాలు మొదలగు వాటి గురించి రచయిత చాల నిశిత వ్యంగ్యంతో విమర్శించాడు. ఈ సందర్భంలో సృష్టించబడిన మిత్రవర్గ పాత్ర, గాడ్ ఫాదర్ కామశాస్త్రి

పాత్ర, వశమంత్రపు సిరి వర్ణాలలో సెక్స్ అరాచక లక్షణాలు, స్త్రీల అంగాంగ ప్రదర్శనలు, సెక్స్, క్రైమ్, థ్రిల్ సాహిత్యంతో వ్యాపారం చేసుకునే పత్రికల వ్యాపార నాగరికత మున్నగు విషయాలను రచయిత అద్భుతంగా బహిర్గతం చేసారు.

## సినిమా రంగం - అది చేస్తోన్న వికృత చేష్టలు:

సినిమా రంగాన్ని కూడా వదలిపెట్టలేదు రచయిత. నేటి సినిమా రంగంలో వస్తున్న విపరీత ధోరణులను తీవ్రంగా విమర్శించారు. ఈనాడు, నిర్మాతలు ప్రబోధాత్మక చిత్రాలు తీయడం లేదంటూ వాళ్ళు ఎలాంటి సినిమాలు ప్రజల్లోకి వదులుతున్నారో సోదాహరణంగా వివరించారు. ఈ మధ్య హాలీవుడ్ నుంచి ఒక చిత్రం దిగుమతి అయింది. దానిని చదువుకున్న పిల్లలూ, పెద్దలూ విరగబడి చూసారు. ఒకసారి కాదు, నాలుగైదు-సార్లు చూసి తరించిన వారు కూడా ఉన్నారు. అందులో ఉన్న విశేషమేమిటి? సైకో ఎనాలిసిస్. మనో విశ్లేషణను అత్యద్భుతంగా చిత్రించిందంట. లోపల, లోలోపల అతి సూక్ష్మ మనోజీవ కోణాలను గాలించి గాలించి పట్టుకున్నదట. ఈ కథలోని నాయకుడు ఒక కాలేజీ ప్రిన్సిపాలు. సుస్మిత సుందర మనస్కుడు. వివాహం చేసుకుంటే ప్రేమ భగ్నమై

పోతుందని అవివాహితుడుగా ఉంటాడు. కాని స్త్రీలు కావాలి– లైంగిక సుఖానికి. తప్పు. తప్పు. అతని పరిభాషలోని విశుద్ధ ప్రేమకి. ఆ విశుద్ధ ప్రేమకోసం తపించిపోతాడు. తపస్సు చేస్తాడు. అనేకానేకమైన కష్టాలు పడతాడు. అయిదారుగురు కథానాయికలను దోసిళ్ళతో పట్టి తాగుతాడు. తృప్తి లేదు. తనివి తీరడం లేదు. మూలాంశ ఒకటేదో ఏదో జారి పోతున్నది. దొరకకుండా ఉన్నది. ఆ మానసిక సుఖజీవ పదార్థం కోసం అన్వేషణ చేసి చేసి, చివరకు వృద్ధురాలైన తన తల్లిలో కనుగొంటాడు. చివరి సీనులో సుఖాంతమంటు, తల్లీ కొడుకు అక్షరాలా ఏక శయ్యాగతులై విశాల విశ్వంలో కలిసిపోయినట్లూ, వారి అనంత వాయువులు వినీలాకాశంలోకి పోకుండా ప్రపంచ ప్రజలకు 'శంబుక్కు' చేస్తున్నట్లూ మంచి పనివాడితనంతో, సాంకేతిక నైపుణ్యంతో శిల్ప వైభవంతో కేనువింపు చేసారని, సినీ విమర్శకులు సంతోషిస్తున్నారని రచయిత తీవ్రంగా విమర్శించాడు.

## స్త్రీల సమస్యలు:

ఈ నవలలో స్త్రీల సమస్యలను అన్ని కోణాల్లోంచి చర్చించారు. సమాజంలో స్త్రీల స్థితిని అంచెలంచెలుగా వివరించారు. సగటు స్త్రీ జీవితం ఎలా వికసిస్తుందో పార్వతి ద్వారా స్పృశించారు.

ఈ నవలలో పార్వతిని కథానాయికగా చెప్పకపోయినా, భారతదేశం లోని స్త్రీ దశలను ఆ పాత్ర ద్వారా రచయిత వివరించారు.

మొదటి దశ: ఇష్టం లేకుండ పెళ్ళి చేయడం:

భారతదేశం లోని అన్ని ప్రాంతాలలోను, పెళ్ళి విషయంలో స్త్రీకి ఎటువంటి స్వాతంత్ర్యం ఇవ్వడం లేదు. ఇక్కడకూడా పార్వతికి తెలుపకుండానే చలపతి అనే వరుణ్ణి ఎంపిక చేసి ఆమె తల్లిదండ్రులు వివాహం నిశ్చయం చేస్తారు. ఈ విషయం మనకు పార్వతి- మూగి మేష్టారుల సంభాషణ వలన తెలుస్తుంది.

" 'నీకు వివాహం నిశ్చయమైందట, నిజమేనా? అని పలకమీద రాసి శిష్యురాలికి చూపెట్టాడు మూగి మేష్టారు.

'ఏమో నాకు తెలవదు' అని బదులు చెప్పింది పార్వతి.

' నాకు మీ తమ్ముడు చెప్పాడు .

వాడికి చెప్పారేమో, నాకయితే తెలవదు'.

నీకు ఇష్టం లేకపోయినా పెళ్ళి చేస్తానంటే నువ్వు చేసుకుంటావా?

'మా అయ్య మాటకి ఎదిరించను!" (పు.24)

అన్న మాటతో మూగి మేష్టారు స్తబ్దుడైపోయాడు. పిల్లల ఇష్టం లేకుండా వరుడు ఎవరో తెలుపకుండానే, చదువుకునే వయస్సులో మనదేశంలో స్త్రీల పెళ్ళిళ్ల జరిపిస్తున్నారు అని విమర్శిస్తాడు రచయిత.

రెండవ దశ: తల్లిదండ్రులు బరువు దించుకోవడం – భర్త వ్యసనపరుడు కావడం:

పార్వతికి చలపతికి వివాహం జరిపిస్తారు. చలపతి వ్యసనపరుడుగా తయారవుతాడు. భర్త చెడు అలవాట్లకు బలయ్యి పుట్టింటికి వచ్చిన పార్వతిని మళ్ళీ బలవంతంగా అత్తవారింటికే పంపిస్తారు. ఆ సందర్భంలో పార్వతి తండ్రి,

“పెళ్ళి కానంతవరకే నా బిడ్డ. ఇంక మీ బిడ్డే ఇది. మీరు చేయించాల్సిన వైద్యం కూడా నేనే చేయించి మీ బిడ్డను మీ కప్పగిస్తున్నాను” (పు.57) అని అంటాడు చలపతి నాయనమ్మతో. స్త్రీలను, వివాహం కాకముందు ఆమె బిడ్డగా, వివాహం అయింతర్వాత పరాయి వాళ్ళ మనిషిగా చూస్తుంది మన వ్యవస్థ అంటాడు రచయిత. పార్వతి భర్త పూర్తిగా

వ్యసనాలకు బానిసై పోతాడు. మద్రాసు వెళ్ళి సినిమా కం~~పెనీలతో~~ సంబంధాలు పెట్టుకొని ఉన్న ఆస్తినంతటిని హారతి కర్పూరం చేయడమే గాక తనప్రాణాన్ని కూడా బలి తీసుకున్నాడు. పార్వతి, భర్త మిగిల్చిపోయిన బీజాన్ని మోస్తూ మళ్ళీ పుట్టింటికి వచ్చింది.

<u>మూడవ దశ</u>: మళ్ళీ చదువుకోవడం:

పార్వతిని తెచ్చి తన ఇంట్లో పెట్టుకున్నాడు అమ్మయ్య. అమ్మయ్య పార్వతికి బాబాయి. మధ్యలో చదువు మానివేసిన పార్వతిని ఒక ట్యుటోరియల్ కాలేజీలో చేర్పించి మెట్రిక్ చదివించాడు. అమ్మయ్య భార్య చంద్రవదన పార్వతిని కంటికి రెప్పలా కాపాడుతుంది. కొన్ని రోజుల తర్వాత పార్వతికి మగపిల్లవాడు పుట్టి చనిపోయాడు. ఆ సంఘటన నుండి తేరుకొని గట్టిగా చదివి మెట్రిక్ పాసవుతుంది. అమ్మయ్య ఇంట్లోనే నారాయణ చార్యులు పరిచయమవుతాడు పార్వతికి. నారాయణ చార్యులు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త. పార్వతి అనారోగ్యంలో ఉన్నప్పుడు రోజు ఆసుపత్రికి వచ్చి పరామర్శించి వెళ్ళేవాడు. పార్వతి మెట్రిక్ పాసయిన తర్వాత బి.ఎ లో చేరుతుంది.

నాల్గవ దశ: వచ్చిన వాళ్ళి మళ్ళీ పెళ్ళి చేసుకోవడం:

అమ్మయ్య, చంద్రవదనలు ఇద్దరూ కలిసి పార్వతితో మాట్లాడి నారాయణాచార్యులతో వివాహం జరిపిస్తారు. పార్వతీ-నారాయణాచార్యులు అమ్మయ్య ఇంట్లోనే కాపురం పెడ్తారు. పార్వతి బి.ఏ పాసవుతుంది. తర్వాత ఉపాధ్యాయ శిక్షణలో కూడా చేరి పూర్తి చేస్తుంది.

ఐదవ దశ: ఉద్యోగం చేయటం

Teacher Training పూర్తయిన వెంటనే ప్రభుత్వ స్కూల్లో ఉపాధ్యాయినిగా చేరుతుంది. అనుకూలుడైన భర్త నారాయణాచార్యులు, ఆత్మీయాభిమానాలు పంచి ఇచ్చే బాబాయి, పిన్ని వాళ్ళ సహచర్యంలో కాలం వేగంగానే మారిపోతుంది. పార్వతికి కూతురు పుడుతుంది. తన పుట్టింటిలో బలాదూరుగా తిరుగుతున్న అన్న కొడుకు వెంకటసుబ్బారావును తీసుకొచ్చుకుని స్కూలులో చేర్పించి చదివిస్తుంది.

ఆరవ దశ: వ్యవస్థకు బలి కావడం

జీవితంలో ఒకొక్కటి మెట్టు ఎక్కుతూ వచ్చినా, స్వయంకృషితో ఎంత సాధించినా, ఈ వ్యవస్థలో చివరకు పురుషుడి

మానసిక ప్రవృత్తులకు బలి అయిపోవడం కంటే ఏమి సాధించలేక పోయింది పార్వతి.

పార్వతి ఉపాధ్యాయినిగా చేస్తూనే ఎం.ఏ తెలుగు కరస్పాండెన్స్ చేస్తుంది. ఒకరోజు రిటైర్డ్ తెలుగు లెక్చరర్ కుటుంబరావు ఇంటికి వెళ్ళి తెలుగు పాఠం చెప్పించుకొని వస్తున్న పార్వతిని ఎవరో రేప్ చేసారు. తర్వాత పార్వతి అని తెలిసి కార్మిక నాయకుడు నారాయణాచార్యుల భార్య అని గుర్తుపట్టి, సమయం మించిపోయిందని చంపివేసారు. ఈ విషయం తెలిసి వెంకట సుబ్బారావు ఆవేశంతో "సమాజానికి కుష్టు పట్టి ఒక భాగం తరువాత మరొక భాగం అంటుకుపోయి పురుగులతో లుకలుకలాడి పోతూంటే ప్రేక్షకులకు మల్లే చూస్తూ నిలబడ్డారు మీరు. అందుకే అత్యంత విలువైన, అమూల్యమైన ప్రాణాన్ని పోగొట్టుకున్నారు" (పు.362) కమ్యూనిష్టు నాయకుడైన నారాయణాచార్యులను తప్పు పట్టాడు.

పై ఘటనల ద్వారా రచయిత భారతదేశం లోని స్త్రీల సమస్యలు, వారి స్థితిగతులు, ఆటంకాలు మొదలైన వాటిని సవిమర్శకంగా వివరించాడు.

ఈ నవలలో రచయిత ఏదో ఒక పార్టీనే మాత్రమే ప్రత్యేకించి వేరొక పార్టీని విమర్శించలేదు. ఇటు కాంగ్రెస్ పార్టీని, అటు కమ్యూనిష్టు పార్టీని కూడా రచయిత విమర్శించకుండా వదలలేదు.

కాంగ్రెస్‌లో నిజాయితీ పరులైన గాంధేయవాదులకు ప్రతినిధిగా జెండా సైకిల్ జోగయ్యను ఎంచుకున్నారు. ఆయన ఏనాడు ధనానికి, లాభానికి ఆశపడలేదు. తాను ఎంతో ప్రాణ ప్రదంగా ప్రేమించే కాంగ్రెస్ పార్టీ తప్పుదోవలో నడుస్తుందని తెలిసినప్పుడు, తాను అంత ప్రాణంగా భావించే కాంగ్రెస్ జెండాను ముక్కలు ముక్కలుగా చేస్తాడు. సైకిల్‌ను కాలువలోకి విసిరేస్తాడు. గాంధీ వాదం ద్వారా దేశం బాగు పడుతుందని త్రికరణ శుద్ధిగా నమ్మిన వ్యక్తి జోగయ్య.

జాతీయోద్యమానికి, స్వాతంత్ర్యోద్యమానికి ప్రతీక అయిన కాంగ్రెస్ పార్టీ క్రమంగా ఎలా పతనమైందీ, అవినీతికి, లంచగొండి తనానికి ఎలా పుట్టగొమ్మలా మారింది ఎమ్మెల్యేన రంగారావు పాత్ర ద్వారా చూపిస్తాడు రచయిత.

కమ్యూనిష్టు పార్టీలో లోకనాథం, ప్రకాశరావు, నారాయణ చార్యులు, అమ్మయ్య, కంభంపాటి సీనియర్ - లాంటి ఉత్తములు

ఉన్నట్లే తాగుబోతులు, వ్యక్తాలాపాలు చేసేవారు కూడా ఉన్నారని ఎత్తి చూపాడు. కమ్యూనిస్టులు ఎలాంటి అజ్ఞాతవాసంలో ఉండాల్సి వస్తుందో మూగి మేష్టారు (లోకనాథం) పాత్ర ద్వారా చూపించాడు.

ఈ నవలలో ఉన్న ఒక సజీవ పాత్ర కామ్రేడ్ కంభంపాటి సీనియర్. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ నాయకులలో ఒకరైన శ్రీ కంభంపాటి సత్యనారాయణను అదే పేరుతో ఆయనను ఒక పాత్రగా సృష్టించడం గొప్ప ప్రయోగం. కంభంపాటి సీనియర్ ద్వారా రచయిత తన భావాన్ని ఎప్పటికప్పుడు సామాజిక స్థితిని వ్యాఖ్యానించడం ద్వారా వ్యక్తం చేసాడు.

చివరకు తెలుగుదేశం పార్టీని కూడా సమర్థించలేదు. ఆ పార్టీ నాయకుల్ని, యం.ఎల్.ఏ లను, మంత్రులను కూడా వదలకుండా వాళ్ళు చేసిన ఘన కార్యాలను తేదీలు, అంకెలతో సహా నిరూపిస్తూ విమర్శించాడు.

వర్తమాన భారతంలో రాజకీయాలు ఒక వ్యాపారంగా మారిపోయాయనీ, అన్ని పార్టీలలోను కొందరు మంచి వ్యక్తులున్నా, రాజకీయాల పేరిట జరిగే అక్రమాలకు, లంచగొండితనానికి, గూండాయిజానికి అన్ని పార్టీలలోని వ్యక్తులే బాధ్యులు అని విమర్శిస్తాడు.

భారతదేశంలోని మూఢ నమ్మకాలు, వ్యభిచారం, నిరుద్యోగం, రిజర్వేషన్లు, భూసంస్కరణలు, చేతివృత్తుల వారి ఆపన - ఇలా ఎన్నో ఎన్నెన్నో. ఈ నవలలో చిరంజీవి స్పృశించని అంశం లేదు.

## ఆదర్శీకరించిన పాత్రలు

లోకనాథం: మరణంలో అన్యాయం జరగలేదు. మరణించి అమరజీవి అయ్యాడు లోకనాథం(మూగ పుష్పాలు). మొదట్లో రచయిత, లోకనాథయు - పార్వతికి పెండ్లి చేయకపోవడంలో ఉద్దేశ్యం లోకనాథం కమ్యూనిష్టు పార్టీకి అంకితమైనవాడు. వివాహం జరిగితే పార్టీకి దూరం అవుతాడేమో అని భావించి కేవలం కమ్యూనిష్టుగానే చూపించాడు.

అమ్మయ్య: ఒక రైతు కుటుంబంలో పుట్టి నాటకాలపై మోజుతో ప్రజానాట్యమండలిలో చేరి కమ్యూనిష్టు పార్టీ సానుభూతిపరుడిగా మారాడు. వేశ్యా కుటుంబం నుండి వచ్చిన చంద్రవదనను రెండవ వివాహం చేసుకోవడం ద్వారా ఆదర్శవంతుడయ్యాడు. తన ఆస్తినంతటిని అన్న సంతానానికి ఇవ్వడమేగాక అన్న కూతురు పార్వతిని చేరదీసాడు. జీవితాంతం కమ్యూనిష్టుగానే ఉండి కమ్యూనిష్టుగానే మరణించాడు.

నారాయణాచార్యులు: ఒకసారి వివాహం అయిన స్త్రీని అభిమానించి

ఆమె ఆరోగ్యాన్ని కుదుటపరచి వివాహం చేసుకున్నాడు. వివాహం తర్వాత కూడా ఆమెను చదువుకోనివ్వడం, ఉద్యోగానికి ప్రోత్సాహమివ్వడం, సమానస్థాయి ఇవ్వడం, పార్టీ వర్కర్‌గా రాత్రింబవళ్ళు పని చేయడం - మొదలైన వాటిని చూసినప్పుడు ఇతనిని నిజమైన కమ్యూనిస్టుగా భావించవచ్చు.

<u>బండా సైకిల్ జోగయ్య</u>: స్వాతంత్ర్య సమరయోధుడు. జాతీయోద్యమం లోను, కాంగ్రెస్ ఉద్యమం లోను వచ్చిన మంచి-చెడు పరిణామాలకు సాక్షీభూతుడుగా ఉంటూ పేదలపట్ల సానుభూతి చూపిస్తూ, అధికారం, అవినీతి, అక్రమాలకు ఆలవాలమైన కాంగ్రెస్ పాలనను ఏవగించుకుంటాడు.

<u>చంద్రవదన</u>: అమ్మయ్య భార్య. వేశ్యా కుటుంబంలో పుట్టి వారికథలు చెప్పుకొంటూ, అమ్మయ్యపట్ల ఆకర్షితురాలై అతనిపట్ల అనురాగంతో ఉంపుడుకత్తె జీవితాన్నుండి విముక్తి పొందిన పాత్ర. భర్తతో పాటుగా కమ్యూనిస్టు పార్టీ అభిమానిగా మారి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనిస్తుంది.

<u>పార్వతి</u>: తెలియని వయస్సులోనే పెళ్ళి జరిగినా, భర్త చనిపోవటంతో మళ్ళీ చదువుపై దృష్టి కేంద్రీకరించి, బి.ఏ పాసయి టీచర్‌గా పనిచేస్తుంది.

తనను అభిమానించిన నారాయణాచార్యులను పెళ్ళి చేసుకొంటుంది. కమ్యూనిష్టులైన అమ్మయ్య, చంద్రవదన, నారాయణాచార్యుల సాహచర్యంలో తాను కూడా కమ్యూనిష్టుగా మారి సంఘ సంస్కరణలను ప్రోత్సహిస్తూ తాను కూడా అందులో పాల్గొంటుంది. చివరకు గుండసుల చేతిలో 'రేప్' కు గురియై మరణిస్తుంది.

మిగతా పాత్రలు:

బలహీనురాలయిన స్త్రీ పాత్రలో కామేశ్వరి, ధనకాంక్షకు అనసూయమ్మ, స్త్రీలపై అత్యాచారాలకు ప్రతీక గవండ్ల సుబ్బమ్మ. దు:ఖం అందరికీ ఉంటుంది. కాని ఆ దు:ఖాలలో తేడా ఉంటుంది. కామేశ్వరి దు:ఖం ఆమె కల్పించుకున్నది. గొడుగులోళ్ళ సైదమ్మ, గవండ్ల సుబ్బమ్మలది సమాజం కల్పించినది. డబ్బుల కోసం ఎగబడ్డది అనసూయమ్మ. కాల్పనిక ప్రణయంలో మునిగిపోయింది కామేశ్వరి. డబ్బు ముందు నీలం ఎందుకు కొరగాకుండా పోతుంది కొందరి విషయంలో. భర్తను జాగ్రత్తగా కాపాడుకొమ్మని చెప్పిన ఆండ్రీతో, మీ అల్లుడనే నన్ను అదుపులో పెట్టుకొమ్మని చెప్పిన పాత్ర కనకమహాలక్ష్మి. ఇది డబ్బున్న పొగరుబోతు తనం. ఇన్ని రకాల పాత్రలలో సమాజాన్ని చూపించడంలో సఫలీకృతుడయ్యాడు చిరంజీవి

స్వాతంత్ర్యానంతరం దేశంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పుల గురించి రచయిత ఎంతో శ్రమతో అనేక తేదీలతో సహా ఎన్నో వివరాలు సేకరించాడు. రాజకీయ పరిణామాలు, దానివలన వచ్చిన ఆర్థిక, సాంఘిక పరిణామాలు కార్యకారణ సంబంధమైన దృష్టితో, మార్క్సిస్టు దృష్టితో విశ్లేషించారు. పుంఖానుపుంఖాలుగా ఉదంతాలు, కథలు, పిట్ట కథలతో మూడున్నర దశాబ్దాల "సామాజిక చిత్రణా పత్రం" రచన కొనసాగుతుంది. పాత్రలు, సన్నివేశాలు కథాకథనాన్ని నడిపించేకంటే రచయితే మనకు అన్నీ చెప్పుకుంటూ ముందుకు సాగుతారు. రచయిత ముందుగానే పేర్కొన్నట్లు ఇందులోని ఏ ఒక్క అంశమైన తీసుకొని ఒక నవల రాయవచ్చు. అందుకే ఈ పుస్తకం అనేక నవలల సమాహారంగా, వరుసక్రమంలో చరిత్ర పరిణామాల చిత్రణగా కనిపిస్తుంది. గణాంకవేత్త, జర్నలిస్టు, కథా రచయిత, చరిత్రకారుడు అన్నీ తానే అయి రచయిత అడుగడుగునా దర్శనమిస్తాడు. అందుచే కథాశిల్పం కంటే విషయ సేకరణ, పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తుంది. నిరుద్యోగ సమస్య, రిజర్వేషన్ల సమస్య, కులాంతర వివాహాలు, ప్రేమ, భూమికై పోరాటం

చేతివృత్తుల వారి తపన, కార్మికుల సమ్మె, రాజకీయ కుట్రలు, రాజకీయ పార్టీల పతనోత్థానాలు మొదలైన అనేకానేక విషయాలను రచయిత ఇందులో స్పృశించారు.

అదే సమయంలో అనేక విశిష్టమైన పాత్రలను, కంట తడిపెట్టించే అనేక జీవిత సన్నివేశాలను రచయిత మనకు సాక్షాత్కరింపచేయటంలో కృతకృత్యులయ్యారు. లోకనాథం-సరస్వతుల విషాద ప్రణయం; వ్యభిచార గృహాలకు అమ్మివేయబడిన గవళ్ళ సుబ్బులు-రైలులోంచి దూకి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన; పార్వతి మొదటి భర్త వ్యసనాల పాలై కుష్ఠురోగిగా చివరిలో రాసిన మరణ లేఖ; జెండా సైకిల్ యోగయ్య కాంగ్రెస్ మీటింగ్‌లోను, పోలీస్ స్టేషన్‌లోను పొందిన అవమానాలు; పురోహితుడు సుబ్బన్న శాస్త్రులు-రైతు పరమన్నల హృదయపూర్వక మైత్రి; ఎమ్మెల్యే రంగారావు తన భార్యను రాజకీయ ప్రయోజనాల కోసం ఇతరుల వద్దకు పంపడానికి వెనుదీయని నైతిక పతనావస్థ; ఆపదలో ఉన్న ఆడపిల్లను రక్షించబోయి యోగయ్య కుమారుడు వెంకటు ప్రాణాలు కోల్పోయిన ఉదంతం; యానాది ఆడపడుచు సైదమ్మను తల్లిదండ్రులే వ్యభిచార గృహానికి

అమ్ముకున్న ఉదంతం; ఉపాధ్యాయుని, కార్మిక నాయకుని భార్య అయిన పార్వతి రేప్-హత్య; ఇలా అనేక సంఘటనలు పాఠకుల్ని కదిలించి వేస్తాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ పేదవాన్ని మరింత పేదవానిగా, ధనవంతున్ని మరింత ధనవంతునిగా మార్చి, మానవ సమాజాన్ని అభివృద్ధి పథంలో పయనించనీయకుండ అడ్డగిస్తుంది. కాబట్టి ఈ వ్యవస్థపైననే సంఘటిత పోరాటం జరపాల్సి ఉందనే సందేశం మనకు ఈ నవలలో వినిపిస్తుంది.

## గ్రామీణ రాజకీయాలు - ఎక్కడికీ ప్రస్థానం?

భారతదేశానికి పట్టుకొమ్మలు గ్రామసీమలు. భారతదేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం. దేశంలో 80 శాతం గ్రామాలే. రైతులు, వ్యవసాయ కూలీలు మొదలైన వారందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవించేవారే. అందుకోసమే ఏ పార్టీ నాయకులైన గ్రామీణాభివృద్ధి ప్రధాన కర్తవ్యంగా వారివారి ఎన్నికల ప్రణాళికలలో ప్రకటించకమానరు. పచ్చని పైరు పంటలకు నిలవాలమైన గ్రామసీమలు ఈనాడు స్వార్థపూరిత రాజకీయముఠా కలహాలలో భగ్గుమంటున్నాయి. కుల తత్వాలు, వర్గ వైషమ్యాలు - బుస కొడుతూ గ్రామీణ వాతావరణాన్ని విషమయం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో 'మంచుకలపూడి' గ్రామాన్ని కార్యరంగంగా తీసుకొని గ్రామీణ రాజకీయాలు ఎంతటి వక్రమార్గం పట్టాయో, గ్రామస్థుల జీవితాలను ఏ విధంగా అతలాకుతలం చేస్తున్నాయో చక్కగా వివరించాడు రచయిత చిరంజీవి.

ఈ నవలలో ప్రధానంగా చర్చించిన సమస్యలు:

1. కాంగ్రెస్ - కమ్యూనిస్టు పార్టీల మధ్య వైషమ్యాలు
2. కుల తత్వాలు - కుల విద్వేషాలు

3. వర్గ వైషమ్యాలు

4. స్త్రీ సమస్యలు

కాంగ్రెస్ పార్టీ జాతీయోద్యమ కాలంలోను, స్వాతంత్ర్య పోరాట కాలంలోను నిజాయితీతో పనిచేసినా, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ పదవీ కాంక్షలకు నిలయమైంది. సరి పూర్తిగా ప్రజాస్వామ్యం ముసుగులో పెట్టుబడిదారి విధానానికి వత్తాసు పలికే పార్టీగా రూపొందిందని అంటాడు రచయిత. ఇందుకు గొప్ప ఉదాహరణ: ఈ నవలలోని రామబ్రహ్మం, అంజయ్య, భద్రయ్య మొదలైన పాత్రలు.

నవల ప్రారంభంలో మోహనరావు కథానాయకుడిలా కనిపిస్తాడు. మంచుకలపూడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ స్థిరపడి ఉన్న సమయంలో, ఆ గ్రామంలో కమ్యూనిష్టులను తలయెత్తనీయకుండా జరిగిన ఘర్షణలలో మోహనరావు సహనం, కోటిగాడిని రక్షించడంలో మోహనరావు ప్రదర్శించిన త్యాగం - ఇవన్నీ అతన్ని కథానాయకుడిగా చూపిస్తాయి. కానీ ఈ ప్రధాన ఘట్టాల తర్వాత కథానాయకుడిగా మోహనరావు సాధించింది పెద్దగా కనపడదు. ఒక వ్యక్తిని ప్రత్యేకించి కథానాయకుడిగా నిలిపి అతని చుట్టూ కథ అల్లడం చూరించేవి

అభిమతం కాకపోవచ్చు. 'బోలో స్వతంత్ర భారత్ కి జై' నవలలో కూడా కథానాయకుడంటూ ఎవరు లేరు. ఈయన నవల్లో సమాజమే కథానాయకుడు, విలన్ అన్నీ. కోటిగాడి లాంటి బడుగు జీవుల్ని తాగుబోతులుగా మారుస్తూ పెత్తందార్లు వాళ్ళను ఎన్ని విధాలుగా ఉపయోగించుకుంటారో ఈ నవల చూపిస్తుంది. మొదట్లో కమ్యూనిష్టు పార్టీని గ్రామంలో పాదుకోనివ్వకుండా చేయడానికి ఉపయోగించుకున్నారు. తర్వాత అతని ప్రాణాలు కాపాడిన మోహనరావు మీదనే దొంగకేసు పెట్టుమన్నారు. అయితే ఒప్పుకోలేదు. మారటం ఒక విశేషం. కమ్యూనిష్టు పార్టీ సామాన్య ప్రజలలో కొంత సంచలనం సృష్టించిందని చెప్పడానికి రచయిత ఈ పాత్రను వాడుకున్నాడు.

ఏసుదాసు లాంటివాళ్ళు అటు ఇటుగాని కమ్యూనిష్టులు. అవసరం కోసం కమ్యూనిష్టుగా మారి దానిలో స్థిరంగా నిలబడగలిగే ధైర్యం లేని అసమర్థుడు. కేవలం నాగేంద్రమ్మను పెండ్లి చేసుకోవటానికే కమ్యూనిష్టయిన ఏసుదాసు థెరిస తన జీవితంలోంచి వెళ్ళిపోగానే తాను కూడా కమ్యూనిష్టు పార్టీ నుంచి వెళ్ళిపోయాడు.

దుర్గాప్రసాదరావు లాంటి వాళ్ళు కమ్యూనిష్టు పార్టీకి పట్టిన చీడపురుగులు. వారి వల్లనే రెండు పార్టీల మధ్య రాజకీయాల పేరుతో రెండు కులాలు తమ తమ కులతత్వాలతో పరస్పరం కలహించుకొని పల్నాటి యుద్ధానికి, బొబ్బిలి యుద్ధానికి తీసిపోని రీతిలో గ్రామాన్ని స్మశానంగా మార్చి పెట్టాయి.

ప్రత్యేక వ్యక్తుల స్వభావాలను ఈ రచయిత గొప్పగా చిత్రించారు. ఉదాహరణకు నాగయ్యగారు కమ్యూనిష్టు పార్టీ వాడు కాకపోయినా, మోహనరావును ఆదరించి తర్వాత కమ్యూనిష్టు పార్టీ అభిమానిగా మారిపోతాడు. భద్రయ్య మోహనరావును అభిమానించినా, తన వేదాంతపు ధోరణి మారలేదు. దేశానికి ఇలాంటి వేదాంతం చెప్పేవారివల్లనే నిజమైన ప్రమాదం ఉందని అంటాడు రచయిత చిరంజీవి.

## ఇతివృత్తం :

'మంచికలపూడి' ఓ మోస్తారు గ్రామం. ఆ గ్రామంలో తర్ధా కాలం నాటికే కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం చెలాయిస్తుంది. అలాంటి గ్రామంలో కమ్యూనిష్టు పార్టీని ప్రారంభించడానికి మోహనరావు వస్తాడు. తమ ఆధిపత్యంలోని ఈ గ్రామంలో కమ్యూనిష్టు పార్టీని ప్రారంభించనీయకూడదనీ కాంగ్రెస్

నాయకులైన రామబ్రహ్మం, భద్రయ్యలు ప్లాను వేస్తారు. కమ్యూనిష్టు పార్టీ జరిపే బహిరంగసభను విఘ్నం చేయడానికి సూటలు పిల్లల నాయకుడైన లోకం నారాయణ రావును, తాగుబోతు కోటిగాడిని ఉసిగొల్పుతారు. కమ్యూనిష్టులు నిర్వహించే సభలో రాళ్లు వేసి అల్లరిపాలు చేయాలని అవసరమైతే కమ్యూనిష్టు నాయకుడిని కొట్టడానికైనా వెనుకాడకూడదని అనుకుంటారు. కాని అనుకోని విధంగా సభ విజయవంతమవుతుంది. అంతకుముందు సభలో జరిగిన అల్లరిలో కోటిగాడికి దెబ్బలు తగులుతాయి. ఎవరైతే వాడికి తాగించి అల్లరి పెట్టడానికి ఉసిగొల్పారోవారెవరూ పట్టించుకోని సమయంలో మోహనరావు వాడిని రక్షించి ఇంటికి చేరుస్తాడు. కోటిగాడి పెండ్లాం మోహనరావును గుర్తించక, దొంగలు దొంగలు అని అరవడంతో చుట్టుపక్కల ఇండ్ల వారు వచ్చి మోహనరావును గుర్తించక, గుర్తించినా వదలకుండా కొడ్తారు. ఈ సంఘటనలో ఆగ్రామంలో కమ్మ కులం కాంగ్రెస్ వైపు, తెలగలు (కాపులు) కమ్యూనిష్టు పార్టీ వైపు మొగ్గు చూపుతారు. కోటిగాడు, నారాయణ రావులు కూడా కమ్యూనిష్టులుగా మారుతారు. మిగతా చిల్లర కులాలు కమ్యూనిష్టు పార్టీ అంటే అభిమానిస్తారు గాని బహిరంగంగా మద్దతు ఇవ్వరు. దెబ్బలు తగిలిన మోహనరావును కాపు

నాయకుడైన నాగయ్య ఆయన ఇంట్లో ఉంచుకొని సపర్యలు చేస్తాడు. ఆ సమయంలోనే నాగయ్య అల్లుడు దుర్గాప్రసాదరావు ఆ ఇంటికి వస్తాడు. ఆయన వదిన మాణిక్యాంబ, మోహనరావుకు చేస్తున్న సపర్యలు చూసి భరించలేక కమ్యూనిష్టు పార్టీపైన విరోధం లేకపోయినా వ్యక్తిగతమైన విరోధంలో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతాడు. నాగయ్య పెద్ద కూతురైన మాణిక్యాంబ చిన్న తనంలోనే భర్తను పోగొట్టుకొని తండ్రి చెంతనే ఉంటుంది. ఒకరోజు ఒక బలహీనక్షణంలో దుర్గాప్రసాదరావుకు లొంగిపోయినా, తర్వాత తన తప్పు తెలుసుకొని దుర్గాప్రసాదరావుకు ఎదురుతిరుగుతుంది. ఆ తర్వాత కమ్యూనిష్టు పార్టీ కార్యకర్తగా మారి పార్టీకి సేవ చేస్తుంది. ఇది చూసి ఓర్వలేని దుర్గాప్రసాదరావు ఎలాగైనాసరే! మోహనరావుని, కమ్యూనిష్టు పార్టీని ఊళ్ళో ఉండనివ్వకుండా చేయడానికి ప్రయత్నిస్తాడు. ఆ సందర్భంలో రామబ్రహ్మంలో వచ్చిన స్వార్థపూరితమైన గొడవలో తమ పాలేరు రాములుతో కలిసి రామబ్రహ్మంను హత్య చేస్తాడు. ఈ హత్యను కమ్యూనిష్టుల పైకి నెట్టుతారు కాంగ్రెస్ నాయకులు. దుర్గాప్రసాదరావు జైలు నుంచి వచ్చిన తర్వాత కమ్యూనిష్టుగా మారి గ్రామంలో ఆ పార్టీకి ప్రధాన కార్యదర్శి అవుతాడు. కులతత్వంలో ఒక కులంవారిని ఇంకో

కులం పైకి ఉసిగొల్పుతాడు. చివరకు గ్రామం కులాలవారీగా విడిపోయి యుద్ధానికి సిద్ధమవుతుంది. ఆ యుద్ధంలో సామాన్యులైన నారాయణరావు, వెంకట సుబ్బయ్య, మాలక్ష్మి, భూమయ్యలు హతమారిపోవటంలో కథ ముగుస్తుంది.

<u>విశ్లేషణ:</u> రచయిత ఏ ఒకటి పార్టీనీ సమర్థించినట్లు కనిపించలేదు ఇందులో. ఉదాహరణకు కాంగ్రెస్‌లో రామబ్రహ్మం, అంకయ్యలాంటి వాళ్ళ దురాగతాలు - కమ్యూనిష్టు పార్టీలో దుర్గాప్రసాదరావు లాంటి వాళ్ళ దుష్కృత్యలను విమర్శిస్తాడు. ఈ పార్టీ స్వచ్ఛమైనది, ఆ పార్టీ చెడ్డది అని కూడ ఎక్కడా చెప్పలేదు.

వ్యక్తిగతం + నిబద్ధత ఈ రెండింటిని మోహనరావులో చూపించాడు రచయిత. కమ్యూనిష్టు అయినా గాంధీ సిద్ధాంతాన్ని ఆచరిస్తాడు. అలాంటివాడు దుర్గాప్రసాదరావును పార్టీలోకి రానివ్వకుండ నిరోధించలేకపోయాడు. మాణిక్యాంబ లాగా ఎదురించలేకపోయాడు.

దుర్గాప్రసాదరావు లాంటి వ్యక్తులు ఏ పార్టీలో ఉన్నా ఒకటే. ఎంత గొప్ప పార్టీనైనా వాళ్ళు భ్రష్టు పట్టించగలరు. అతడికి కావలసింది డబ్బు, స్త్రీలు, పదవి. కేవలం మాణిక్యాంబ మీద వ్యామోహంతో

మాలక్ష్మంటు మోహనరావు మీద మనసు పడిందేమోనన్న అనుమానంతో ఎక్కడలేని వ్యూహాలు పన్ని కాంగ్రెస్ పార్టీలోని రామబ్రహ్మం సహాయంతో మోహనరావు నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీని రూపుమాపాలను-కున్నాడు. 'అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న' అన్నట్టు రామబ్రహ్మం దుర్గాప్రసాదరావు కంటే రెండాకులు ఎక్కువ చదివి, దుర్గాప్రసాదరావు డబ్బు వాడుకొని అతని పేరు సోదిలోకి రాకుండా వ్యూహం పన్నాడు. దాంతో రెచ్చిపోయిన దుర్గాప్రసాదరావు రాముల్ని జీసిగాల్ని రామబ్రహ్మాన్ని హత్య చేయిస్తాడు. చివరకు పోలీసులకు దొరికిపోతాడు. కాంగ్రెస్ నాయకులు, కొంతమంది కమ్యూనిస్టు కార్యకర్తలపైన హత్యానేరం మోపి అరెస్ట్ చేయిస్తారు. ఆ హత్యానేరం నుండి కమ్యూనిస్టు కార్యకర్తలను తప్పించడానికి మోహనరావు ఒక కథ అల్లుతాడు.

“ కుక్క కాటుకు చెప్పు దెబ్బ అని మాలక్ష్మిని బలాత్కరించి ఎత్తుకుపోయిన కమ్మ దొరలు ఆమెను చెరబట్టి అప్పటికీ కసితీరక ప్రాణాలతో వదిలేస్తే ఆమె పరువు పోతుందని భావించి బావిలో తోసి చంపారని కేసు పెడితే, వాళ్ళు అన్యాయంగా ఆమెపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవచ్చు, వాళ్ళదీ అన్యాయమే, మనదీ అన్యాయమే.

వాళ్ళవి దొంగ సాక్ష్యాలే ; మనవి దొంగ సాక్ష్యాలే" <పు-157> అని మాలక్ష్మితో అంటాడు. ఇలా స్వార్థపూరిత రాజకీయాలు హత్యా రాజకీయాలుగా మారాయి.

వాస్తవానికి మాలక్ష్మి, ఆమె భర్త రాములు కూడా చెప్పుమని పోలీసులు కొట్టిన దెబ్బలకు ఓర్చుకోలేక, అవమానం భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. అటువంటి మాలక్ష్మి ఆత్మహత్యను కూడా స్వార్థపూరిత రాజకీయాలకు ఉపయోగించుకున్నారని విమర్శిస్తాడు రచయిత.

ఎన్నికలు వచ్చాయి. గ్రామాల్ని రణరంగంగా మార్చాయి. పల్లెలో ఉన్న 'ఓటర్ల కోసం' అందరూ ఎగబడ్డారు. ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలనే ప్రజలను రాజకీయపార్టీలు డబ్బు, సారా, పలుకుబడి ఎరచూపి ఓట్లు వేయించుకుంటున్నారు. ఉదా:-

" రేపు లేదా ఎల్లుండే ఎన్నికలు. డబ్బు సంచులతో, అట్టహాసం మధ్య పర్తిత్వాన పల్లెను కొనివేశారు కాంగ్రెసులు. మాటలా? ఓటుకు పన్నెండు రూపాయలు! వారం రోజుల కూలీ..... పన్నెండు రూపాయల కూలికి దొడ్డికి రామన్నారు గ్రామంలోని నౌకరులు. ఓటు రేటు పెరిగింది. తెల్లవారితే

ఎన్నికలనగా ఓటు ముక్క విలువ నూట పరహార్ల కట్నానికి పెరిగింది. వాళ్ళకు నూట పరహార్లిస్తూ మాకెందుకివ్వరని ఆ రాత్రే దొడ్లలో కాపురం పెట్టిన పల్లెజనం బేరానికి దిగి ఎన్నికలకు అర్ధ నూట పరహార్లకు తమ ఓటు బరువును కొట్టి వేసుకున్నారు." (పు. 208-209) అంటూ రచయిత నేటి రాజకీయాలు, రాజకీయ నాయకులు ఎలాంటి పద్ధతులు ఉపయోగిస్తూ ఎన్నికలలో గెలుస్తున్నారో వివరిస్తూ, వాళ్ళు ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేస్తున్నారని విమర్శిస్తాడు.

కమ్యూనిష్టు పార్టీ కార్యకర్త అయినా నారాయణరావు మీద దెబ్బ తీయడం కోసం అతని పొలాన్ని కౌలు చేస్తున్న కమ్మకులం వాడైన చినవెంకట సుబ్బయ్య చేత ఆ పొలాన్ని బీడుగా పెట్టించే ప్రయత్నం చేస్తారు కాంగ్రెస్ పార్టీకి చెందిన పెత్తందార్లు. కానీ చినవెంకటసుబ్బయ్య ఒప్పుకోడు. అయినా కులం పేరు చెప్పి దెబ్బగొడుతారు

" కమ్మకుల వ్యతిరేకులైన తల్లి బిడ్డలను వంచటానికి ఇది తప్ప మార్గం లేదని నూరిపోశారు. ఏమైనా సరే, ఇందుకు నిలబడకపోతే గ్రామంలో నీకు మంచినీళ్ళు పుట్టవని వెంకటసుబ్బయ్యను బెదిరించారు. చుట్టూ కమ్మ పొలాలున్నాయి. నీ చేనుకు నీరెక్కకుండా చేస్తామనీ,

నీ బండి నైటునుంచి తోలుకుపోతావనీ, భయపెట్టారు. ఈ పనికి నిలబడితే కమ్మవాళ్ళ మొత్తం నీకండగా నిలుస్తుందని అభయమిచ్చారు. <పు. 211> దీనిలో చినవెంకటసుబ్బయ్య ఒప్పుకుంటాడు. తన పదవులను నిలుపుకోవడం కోసం దేనానికి అండ కూడ లేకుండా చేయడానికి ఈ పెత్తందార్లు వెనకాడరు అని అంటాడు రచయిత. అయితే బంగారం లాంటి పొలం బీడు పడుతూంటే చూస్తూ నారాయణరావు ఎలా ఊరుకోగలడు. కయ్యానికి దిగాడు. అది పొలాలకు సంబంధించిన కలహంగా కాక కులాలకు సంబంధించిన కలహంగా మారి, పార్టీల మధ్య కలహంగా పైకి ముసుగు వేసుకుంది. మొదటినుంచి తమలో తామే కలహించుకొని తమను తామే తెగనరుకోవడం తెలుగువారికి అలవాటయ్యింది. ఇప్పుడు అలాంటి వాతావరణమే ఉంది ఆ గ్రామంలో. రెండు పార్టీల మధ్య జరిగిన ఈ గొడవలో గ్రామానికి గ్రామమే పీనుగుల పెంటగా మారింది. ఉభయ పార్టీలలోని పెత్తందార్లు, పెద్దలు క్షేమంగానే ఉన్నారు. అయితే ఈ మారణహోమంలో చనిపోయినవాళ్ళు అటు ఇటుకానీ మధ్యతరగతి వాళ్ళు, గ్రామికవర్గంలోని వాళ్ళు మాత్రమే. వాళ్ళు నారాయణరావు, చినవెంకటసుబ్బయ్య, భూమయ్య, రాములు , మాలక్ష్మి, రామబ్రహ్మం.

దుర్గాప్రసాదరావు, నాగయ్య, అంజయ్య, భద్రయ్య, మోహనరావు, మాణిక్యాంబ - మొదలైన నాయకులు సురక్షితంగానే ఉన్నారు. జనమేజయుని సర్పయాగం నాటి కాలం నుంచి జరుగుతున్నది ఇదే. అటు జనమేజయుడు, ఇటు తక్షకుడు క్షేమంగానే ఉన్నారు. మధ్యలో ఎటుకానీ చిన్నపాములు మాత్రమే నాశనం అయ్యాయి.

రచయిత ఈ నవలలో, కులతత్వం, వర్గతత్వం గ్రామాలలో ఎలా పెరిగి పెద్దదవుతుందో వివరించాడు. ఇందుకు ఉదాహరణగా మాణిక్యాంబ - మాలక్ష్మిల సంభాషణను పేర్కొనవచ్చు.

గత మూడు రోజుల నుండి పనిలోకి రాని రాములు విషయం కనుక్కొందామని మాణిక్యాంబ మాలక్ష్మి ఇంటికి వస్తుంది.

"ఏమకాట! మా కొంపలకెప్పుడూ రానిదానివి....... చాల కష్టం వేసింది మాణిక్యానికి. నిజమే, ఎప్పుడయినా మాలక్ష్మిని చూడ-టానికి వచ్చిందా? మాలక్ష్మి గూడా తన కులంలో పుట్టిందే; ఏమైనా స్నేహ సంబంధాలున్నాయా? లేవు. కారణం? మాలక్ష్మి పేద కుటుంబంలో పుట్టింది. తన మొగుడు మన ఇంట్లో ఊడిగం చేస్తుంటే మనమెలా వీరి యింటికొళ్ళు చుట్టరికాలు కలుపుతాం? స్నేహ హస్తాలు చాచి..." (పు.15)

అని మాణిక్యాంబ తలపంచుకుంటుంది. కులం ఒకటే అయినా ఆర్థికంగా ఒకే అంతస్థులో లేకపోవడం అనేది మాణిక్యాంబ-మాలక్ష్మిల స్నేహబంధానికి అడ్డువస్తుంది. మనుషులకు కావలసింది ఆస్తి అంతస్తులు కావు - కావలసింది ఆత్మీయ సంబంధాలు అని చెప్తాడు రచయిత.

కమ్యూనిస్టు పార్టీలో కూడా కులతత్వం ఎలా పాకిపోయింది వివరిస్తాడు రచయిత. నాగేంద్రమ్మ వాళ్ళది కమ్యూనిస్టు కుటుంబం. నాగేంద్రమ్మ, ఏసుదాసు ప్రేమించుకుంటారు. ఏసుదాసు తన కులం వాడు కాదని నాగేంద్రమ్మ తండ్రి ఈ ప్రేమజంటను విడదీయడానికి ప్రయత్నిస్తాడు. కాని అప్పటికే కడుపుతో ఉండటంతో విధిలేని పరిస్థితుల్లో వీరి పెళ్ళికి ఒప్పుకుంటాడు. ఒక మాలవాడికి తన కూతురినియ్యటం అతనికిష్టం లేకపోయినా, పైకి మాత్రం కులాల ప్రసక్తి బయట పొక్కనీయ లేదు. కమ్యూనిస్టు పార్టీలో కులతత్వాలు లేవని చెప్పినా, వాళ్ళలో కూడా లోలోపల కులతత్వం ఉంది అంటాడు రచయిత.

చిరంజీవి రచనల్లో ప్రత్యేకించి చెప్పుకోదగింది కమ్యూనిస్టు పార్టీ సహాయ సహకారాలతో వికాసం పొందిన స్త్రీ పాత్రలు. కథల్లో

మొదటి నుంచి చివరివరకు ప్రత్యేకమైన కార్యమేదీ సాధించక పోయినా, పూసలలో దారంలాగా వచ్చిన పాత్ర మాణిక్యం. మొదట వితంతువుగా మరిది అత్యాచారానికి ఎదురు తిరగలేని బేలగా పరిచయమైన ఈ పాత్ర కమ్యూనిష్టు పార్టీలో సాన్నిహిత్యం పెరిగాక, ఆ పార్టీ కార్యకలాపాలలో కీలక పాత్ర వహించటమే గాక ధైర్యంగా మోహనరావును పెళ్ళి చేసుకుంది. నాగేంద్రమ్మ ఏసుదాసుతో సంబంధమప్పుడు ధైర్యంగా బయటకు వచ్చి తనకు నచ్చిన వాడితో స్థిరపడింది.

కోటిగాడు, నాగయ్య, భద్రయ్య పాత్రలు గ్రామీణ వాతావరణంలోని కీలక వ్యక్తులు. ఈ మూడు పాత్రలు నవల ప్రారంభంలో ఎలా ఉన్నాయో ముగింపులోను అలాగే ఉన్నాయి. కోటిగాడు మళ్ళీ తాగుబోతయ్యాడు. భద్రయ్య తన ఇనప్పెట్టె బలం పెంచుకుంటూ వేదాంతపు వాక్యాలు వల్లిస్తూనే ఉన్నాడు. నాగయ్య తన చుట్టూ ఏం జరుగుతుందో పూర్తిగా అవగాహన చేసుకోలేక గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు. అందుబాటులో ఉన్న ఆడవాళ్ళపైన అత్యాచారాలకు వెనుదీయని దుర్గాప్రసాదరావు, అతని భార్య పండంటి బిడ్డను కన్నది. ఏ విధంగానూ గ్రామాన్ని మార్చలేని మోహనరావు మాణిక్యాంబను పెళ్ళి చేసుకొని ఆమె

సహకారంతో మరోసారి ప్రయత్నిద్దామని అనుకుంటున్నాడేమో? అయితే అన్యాయంగా బలైపోయిన మాలక్ష్మి, యశోదమ్మ, రాములు, నారాయణ రావు, చిన వెంకట సుబ్బయ్య మొదలైన వారి జీవితాలకు జవాబు దారు ఎవరు? పార్టీలు వస్తున్నాయి, పోతున్నాయి. సిద్ధాంతాలు వస్తున్నాయి, పోతున్నాయి. కానీ ఏమైంది? గ్రామాలలో పరిస్థితులు అలాగే ఉన్నాయి. వ్యక్తులు మారలేదు. వారి ప్రవర్తనలు మారలేదు. స్త్రీల పరిస్థితి అలాగే ఉంది. కులతత్వాలు పోలేదు. దళితుల అణచివేత నశించిపోలేదు. స్త్రీ అభ్యుదయంలో మార్పు రాలేదు. ఎన్నికల్లో డబ్బు, మోసాలు, కిడ్నాపులు పెరుగుతున్నాయి. గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు- జరగటం లేదు. అభ్యుదయం ఎప్పుడు వస్తుంది? ఎక్కడికి వెళ్తుంది ఈ ప్రజ? ఇదే ప్రశ్న అడుగుతున్నాడు రచయిత, 'ఎక్కడికీ ప్రస్థానం?' అనే ప్రశ్నలో.

## గ్రామీణ సమిష్టి కుటుంబం - 'అనంతయాత్ర':-

నవలా సాహిత్యంలో 'అనంత యాత్ర' మానవ సంబంధాలకు ఒక ఉదాహరణ. ఈ నవలలో మనకు కన్పించేది తెలుగు దేశంలోని ఒకానొక పల్లెటూరు. అక్కడి గ్రామీణ వాతావరణం - అక్కడి రైతు కుటుంబాల జీవన పరిస్థితులు - వారి కష్టాలు, దుఃఖాలు, ఆశలు, నిరాశలు, నమ్మకాలు, ప్రేమలు, మమకారాలు, ఆప్యాయతలు, అనురాగాలను రచయిత మనకు కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు. నవల మొత్తం సన్నకారు రైతుల చుట్టూ తిరుగుతుంది. పల్లెవాళ్ళకి గ్రామీణ వాతావరణం అంటే షావుకార్లు, రైతులు - గొడవలు. కానీ ఇందులో ఒక సన్నకారు రైతుకుటుంబాన్ని మాత్రమే చిత్రించాడు రచయిత. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకులు, కోడళ్ళు, మనవలు, మనవరాళ్ళు - వీరి మధ్య అనురాగాలు ద్వేషాలు, ఈర్ష్యలు మొదలైన అన్నింటి చుట్టూ అల్లుకొంటుంది నవల ఇతి వృత్తం.

ఇతివృత్తం: 1933 లో వచ్చిన పెద్ద గాలి వానతో ఈ నవల ప్రారంభ మవుతుంది. ఆనాడు- అంత పెద్ద గాలి వానలో, మిన్నూ మన్నూ, ఏకమై ఏడు రోజులు పాటు కురిసిన ఆ గాలివాన లో, ఏడో రోజున, నర్సరావుపేట దగ్గర 'గుడిపాడు' అనే గ్రామంలో వెంకటరెడ్డి, చంద్రమ్మ దంపతులకు ఇద్దరు బిడ్డల తర్వాత మూడో కాన్పుగా కోటిరెడ్డి పుట్టుకతో కథ ప్రారంభ-మవుతుంది. ఆ గాలివానలో నిండు చూలాలైన చంద్రమ్మకు కప్పుకోటానికి దుప్పటి కూడా లేనటువంటి పేద సంసారం వారిది. వెంకటరెడ్డి సామాన్య రైతు. గెలుసు, కష్టాలు పండించి వాటిని అమ్మి ఆ ఆదాయంతో జీవించే రైతు. అలాంటి సాధారణ కుటుంబంలో, విద్యావిహీనమైన సంసారంలో పుట్టిన కోటిరెడ్డి జీవిత చిత్రీకరణమే ఈ 'అనంతయాత్ర.'

అన్న ప్రాసనం నాడు పుస్తకం, బంగారం, పాలు, కత్తి, పాయసం ముందు పెడితే అందులో రామశాస్త్రిగారి పంచాంగం కట్టనే తాకుతాడు కోటిరెడ్డి. ఆనాడే చెప్పాడు రామశాస్త్రి కోటన్న చదువు కొంటాడని, కళాకారుడౌతాడని.

కోటప్పకొండకు వెళ్ళి కోటిరెడ్డికి పుట్టిన వెంట్రుకలు తీయిస్తారు. ఆ తర్వాత కృష్ణయ్య పంతులు గారి 'ఎయిడెడ్' స్కూల్లో చేర్పిస్తారు. కోటిరెడ్డికి చదువు బాగా వస్తుంది. క్లాసులో తనే ఫస్ట్. బ్రాహ్మణ వంశంలో పుట్టిన కృష్ణయ్యగారి కొడుకు వెంకటేశ్వర్లు తో పోటీపడుతాడు, సమానుడవుతాడు. కృష్ణయ్య పంతులుగారి సలహా మీద కొడుకును పై చదువులకు పట్నం పంపించడానికి వెంకటరెడ్డి నిర్ణయించుకుంటాడు. కోటిరెడ్డి ఎక్కిన, తెనాలి వెళ్ళే బస్సు కదలటంతో నవల ముగుస్తుంది.

విశ్లేషణ: నవలలోని కథ ఇంతే. అంటే కోటిరెడ్డి బాల్య కథతో ఈ నవల ముగుస్తుంది. అయితే కోటిరెడ్డి బాల్యంలోని వివిధ ఘట్టాల చిత్రీకరణ ద్వారా *పల్లె ప్రజల జీవన విధానాన్ని సహజంగా, రమ్యంగా చిత్రించాడు రచయిత చిరంజీవి.

/ ఆర్థిక సంబంధాలు మానవ జీవితంలో ఏ రకంగా ప్రాధాన్యం వహిస్తుందో నిరూపిస్తుంది — రామన్న, అక్కమ్మల సంసారం. రామన్న, కోటిరెడ్డి తండ్రైన వెంకటరెడ్డికి

అన్న. అతని భార్య అక్కమ్మ. రామున్నకు పొలం, మెరక, ఎద్దులు బండ్లు ఉన్నాయి. కొన్ని భార్య తరుపున వచ్చినవి. అయితే వెంకటరెడ్డి కుటుంబం పై ప్రేమ అభిమానాలు ఉన్నాకానీ భార్య అక్కమ్మ తిడుతుందేమోనన్న భయంతో తమ్ముడి కుటుంబంతో సంబంధాలు పెట్టుకోలేదు. అయితే వెంకటరెడ్డి పెద్దకొడుకు పిచ్చిరెడ్డికి తన భార్య తమ్ముడి కూతురు నిచ్చి పెళ్ళి చేసి, తన ఇంట్లో ఉంచుకొని, ఆస్తి నంతటిని పిచ్చిరెడ్డి పేర రాద్దామని అనుకుంటాడు. కానీ భార్య ఏమంటుందోనన్న భయంతో తనకు తానుగా ఆ విషయం కదపడు. ఈ విషయం తోడి పిచ్చన్నతో మాట్లాడుతాడు.

“ ఏం లేదే మన పెద్దోళ్ళే పెంపుడు చేసుకుందామని.

ఎవరిని? పిచ్చిరెడ్డినా?

ఆ. అదేమో తమ్ముడి కూతుర్ని తెచ్చి ఇంట్లో పెట్టుకుంది. మనమేమైనా కాదని పోయిందా? మన కెవరు లేరా? అన్నాడు రామన్న.

ఇద్దరినే పెట్టి పెంచుకుంటావురా?

దాన్నేవరు పెంచుకున్నారే? . . . నేను ఒప్పుకోవద్దూ?

ఒప్పుకోకపోతే తెచ్చి ఇంట్లో ఎందుకు పెట్టుకున్నావురా!

నే పెట్టుకున్నానా! దానంతటదే పిలిపించి పెట్టుకున్నదే.

పెట్టుకొన్నదే అనుకో, ఇప్పుడెక్కడికి పోద్దీ? ఇక్కడినించి పెంచి

ముడి పెట్టేస్తాం. ఆస్తి ఎక్కడికి పోద్ది? మనదే అవుతుందిగదే!

. . . ఇంతకీ వాడు ఒప్పుకోవాలి గదంటరా! తాళిబొట్టుని

పెంపుడు కియ్యరా పెద్దాడా, ఆలాచేస్తానే అన్నాడు పిచ్చన్న. .

. . . . ఏంకటన్నకే నువ్వు చెప్పు. ఏవరాటుంటే వాడు కాదనడు.

అయినా మన ఆస్తి మనకొక్కుండా పోతుంటే నువ్వు చూస్తా

ఊరుకొంటావంటే[22] (పు.32-33) అని రామన్న పిచ్చన్నతో

అంటాడు. ఈ రకంగా మనసులో తన తమ్ముని కుటుంబం

పై ప్రేమ ఉన్నా, భార్యకు ఎదిని పైకి చెప్పుకోలేని వాళ్ళ

రైతు కుటుంబాలలో ఎందరో. ఇలాంటి చాలా

సంఘటనల్ని చాలా చక్కగా చిత్రించాడు రచయిత.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ పంటలను

అమ్మరు. తాము సంవత్సరకాలమంతా తినడానికి కావలసిన

ధాన్యము ఇంచుకొని మిగతాది మారకం చేసుకొంటారు. తమకు ఏమి కావాలో వాటిని తీసుకొని వారికి వారు పండించిన పంట ఇచ్చేవారు. ఆనాటి పంటలు రాగులు, వరిగలు, ఉల్లి, మిరపకాయలు, వరి ధాన్యం ఉండేది. వరి పంట చాలా తక్కువగా వచ్చేది. వారు గ్రామంలో చాలమంది ఒక పూట మాత్రమే వరి అన్నం తింటారు. వారికి వరి అన్నం అపురూపం. మెట్ట పంటలు ఎక్కువ. ప్రత్తి అమ్మటం - కొనటం - ధాన్యానికి అమ్మటం మొదలైనవి ఆనాటి ప్రజల జీవన విధానం. వారికి వ్యవసాయమే ప్రధాన వృత్తి. అందరూ శ్రమించి పని చేస్తారు. ఒక వృద్ధులు, చిన్న పిల్లలు తప్ప.

రచయిత పల్లెటూళ్ళో వర్షం పడిన తర్వాత ఉండే వాతావరణాన్ని గొప్పగా చిత్రించాడు.

“ తెల్లగా వెండి రజనులా రాలుతున్న తొలకరి వానకు తమ కురులు విప్పి తేనె పాటలు పాడాయి భూములు. పింఛం విప్పి నాట్యం చేసింది నెమలి. పిట్టలు ఆహ్లాదకరంగా ముక్కులు రాసుకుంటూ కువ కువ లాడాయి. పశువులు

చెంగున చేస్తూ మోర పైకెత్తి ఆకాశగంగను పిలుస్తున్నట్టు 'అంబా' అని దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తున్నాయి. జవసత్వాలు చిక్కిన చెట్లు కొత్త నెత్తురు పట్టినట్లు సన్నగా స్వరాల పాట నాలా-పిస్తున్నాయి. ఇక ఎండిన చెరువులలో, బురద పూసుకొని కాలం గడుపుతున్న కప్పల బెక బెకలకు రాగ తాళాదులే లేవు (పు. 70)

రచయిత గ్రామీణ ప్రజల్లో ఉండే నమ్మకాలు, మొక్కుబళ్ళు, ఆస్తికోదయాలు, భక్తి ప్రపత్తులు, మూఢ నమ్మకాలను కూడా అద్భుతంగా చిత్రించారు. మచ్చుకకు ఒక ఉదాహరణ చూడండి.

“ఇరవై నాలుగు గంటలూ దైవ సన్నిధిలో గుడి గంటల మధ్య కాపురం చేస్తున్న భర్త, ఒక నాడు చెప్పకుండా వెళ్ళిపోవడం తో పోతులమ్మకు ఘానకమయింది. క్రతువం రోజులవరకు ఆ గుడికి నా, మంగళ్ళో ఉత్తరాదిన పెడుతున్న పోతులమ్మకు కల్లకొచ్చేదంటే అందరూ ఆశ్చర్యపోయారు. ఆ పూర్వతంలో సుబ్బరాయుడొచ్చి, పోతులమ్మ భర్తను తానే తీసుకు పోయినట్లూ, పరమ భాగవతోత్త-ముడైన భక్తుని నిరసించిన కొప్పర పాండు గ్రామం మూడు

మాసాలలో పొరుగా మున్నదని, నిమ్మకాయ కొరికి నెత్తురు కురిపించాడు. యావత్తు గ్రామం తల్లడిల్లి పోయింది. పెద్ద కాపు నెత్తీనోరు కొట్టుకుంటూ సుబ్బారాయుడి కాళ్ళ మీద పడ్డాడు. "తండ్రీ! ఏమి కావాలో కోరుకో మా పిల్లలనైనా నీకు బలియిస్తాం" అని గ్రామం హాహాకారాలు చేసింది. సుబ్బారాయుడు అప్పటికే శాంతించిన వాడై ఏమన్నాడూ — ఓరీ నా కోపం తీరిందిరా! లచ్చిగాడి ఇంటిచేలో ఒక బొడ్రాయి వేయించండిరా, వారా వారం నా భక్తుడూ వాళ్ళ తెచ్చి ఏటి నది ఒడ్డున పండిన నైవేద్యాలు పెట్టండిరా! దినమూ నే పారాధన చేయండిరా, పొండిరా! (పు.- 35) ఇలా గ్రామీణ వాతావరణాలలో మూఢభక్తుల గురించి, మూఢాచారాల గురించి విపులంగా చర్చిస్తాడు రచయిత ఈ నవలలో

గ్రామీణ సాధారణ జన జీవన విధానంలో

ఆడవాళ్ళకు ఘోషాలు ఉండవు. కులాల పట్టింపు ఉండదు. వావి వరసలతో పిలుచుకుంటారు. కుల గోత్రాలు వేరైనా గ్రామంలోని జనమంతా ఒక్కటి పొడి పేర్లతో

పిలుచుకొంక, ఏదో వారి వరసలు కల్పించుకుంటారు. కరణం యజ్ఞేశ్వరావు గారిని యజ్ఞన్న వరామని, యజ్ఞన్న బ్బాయా అని వయో భేదాలను బట్టి పిలుస్తుంటారు. మాదిగ వెంకట్లో కూడా తాకనివ్వక పోయినా వెంకన్నా, వెంకన్న బాబాయి, వెంకన్న తాతనీ గౌరవంగా పిలుస్తారు. ఈ పద్ధతి గాక తండ్రి పేరు తాత పేరు కలిపి పిలిచే పద్ధతి ఒకటుంది. నారయ్య గారి కోటయ్య, చలమన్న గారి సుబ్బన్న అని, ఒక పేరు గల వాళ్ళు ఇద్దరు ముగ్గురుంటే, తెలవడం కోసం అలా పిలుసుకుంటారు. ఇది గాక వేషాన్ని బట్టి కూడా పేర్లు పెడ్తారు. పొడుగ్గా బక్క పల్చగా ఉండే కోటయ్యను ఈసు కోటయ్యనో, ఈసు కోటి గాడనీ, ఈసినాడనీ పిలుస్తారు. కుల గోత్రాలు చెప్పే రెడ్డి, నాయుడు, శాస్త్రి, శర్మలనే తోకలు కూడా నిషిద్ధం. అంతా అయ్యాలు, అన్నలు మాత్రమే. ఇంకా పండుగలకు పబ్బాలకు ఒకరి ఇళ్ళకు మరొకరు వెళ్ళడం జరుగుతుంది. అనురాగాలు, ఆప్యాయతలు వెల్లి విరుస్తుంటాయి ఆపల్లె జనంలో.

రచయిత కోటిరెడ్డికి బాలసారె, అన్నప్రాసన జరిగిన విధానాన్ని చెప్తూ అక్కడి వాతావరణాన్ని అద్భుతంగా చిత్రించాడు.

కోటిరెడ్డికి బాలసారె, అన్నప్రాసన రెండు ఒక్కసారే చెయ్యాలనుకుంటారు వెంకటరెడ్డి, చంద్రమ్మ దంపతులు. చుట్టాలనందరినీ ఆహ్వానించి, అన్నప్రాసన చేయడానికి రామశాస్త్రులు గారిని తీసుకొచ్చారు. శాస్త్రులు గారు కోటిరెడ్డికి అన్నప్రాసన చెయ్యడానికి అందరినీ తొందర పెడుతున్నారు.

"కాంతాతి, కాంతాతి, నిలబడే ఏమయుం కాదా నేను. ఏమోయ్ పిచ్చన్నా! పిల్లవాడికి మేన మామవున్నాడా? చెప్పవోయ్. వసుసుత్తావేం? ఉంటే వాణ్ణేటుం రమ్మనూ. . . .

. . . . ఓ కొంచోవోయ్ పిచ్చన్నా! ఈయనేవరన్నావే? పిల్లవాడి మేనమామ అన్నావు కదూ? ఏ ప్రాణోయ్ మనదీ కుంకలనుంటూ! చెరబుటున్నావే? పుల్లారెడ్డా? ఎంత భాగ్యుడయితే అక్కడ మనకూ, ఇంకేం పెద్ద కాళ్ళ వెనక్క మాటు, ఏమోయ్ పిచ్చన్నా! నేను మరచిపోతే నువ్వన్నా జ్ఞాపకం చేయొద్దటోయ్. కత్తెరోయ్.

..... ప్రాణం మాటపోనంటే... మరి పట్టుకు రావేమే
గట్టి మొహమా! కొండ కొండ ఇటూ పట్టుకు రావే. ఊఁ
ఇప్పుడున్నా ఉన్నట్టేనా! ఒక్కమాటు నన్ను చూడనివ్వండి.
సరస్వతికి పుస్తకం, లక్ష్మీ కటాక్షానికి ఉంగరం, దానకర్ణానికి భూరంటి,
శౌర్యానికి కత్తి, నారీమణి యశానికి పాన్నం కూడా... ఓఁ అన్నీ
సక్రమంగా ఉన్నట్టే- ... అమ్మా చంద్రమ్మ! నీ చిన్న
కొడుక్కి పాఠం పెట్టాను నేనూ? అన్నను కదూ కొడుకన్నా.
ఒరే కొడుకన్నా! దోగాడుతూ ఇటు నా దగ్గరికి రారా. వదలవే
వాణ్ణి చంద్రమ్మా! వదులా ఊఁ రారా! నీ తాతను రావేనూ
రారా కొడుకన్నా- అదే అదే అట్లా పకపకమని నవ్వుతూ రావేరా
రారా నా తండ్రీ! ఒరే నాతండ్రి! నీకు నా పంచాంగం కట్టే
కావలసి వచ్చేనటరా. నువ్వు నావాడివిరా కొడుకన్నా! శెభాష్...
ఒరే వెంకటరెడ్డి! నా కొడుకు సరస్వతీ పుత్రుడురా! ఏ మొరింకు
పిచ్చన్నా! బృహస్పతి వంటి మనవణ్ణి కన్నయోగ్యుడు నువ్వొ.
వీడు నావాడురా. సరస్వతీ పుత్రుడురా! రారా నాన్న!
నన్ను కూడా ఒక ముద్దు పెట్టుకోనివ్వవే! సరస్వతీ కళ

ఉట్టి పడుతోందిరా మొహాన. వాడికి చదువు చెప్పించండిరా.
వృద్ధిలోకొస్తాడురా వీడూ... ఓరే పిల్లనాన్నా! నీ చోటి అబ్బాయిలో
కంటె మేనల్లుడికి తెలిస్తుంటే సజ్జన గుండు ప్రాణం పెట్టురా.
అబ్బా! అంటేయిమకురా! నలుసంత నాలుకెక్కు రాయరా. ఓరి
నాయనో(ఓ) ఎంత అందంగా చప్పరిస్తున్నాడురా వాణ్ణి, చూడండిరా
వాడి కళ్ళన్నీ నా కవితే కట్టుమాడనే ప్రశ్నలురా, వీడు
కళాకారుడురా. వీడికి విద్యాబుద్ధులు నేర్పించండిరా వీడికీ.
విఘ్నేశ్వరుడవుతాడురా వీడూ. నా మాటకు తిరుగులేదురా
(పు 67 – 69) అని దండకం చదువుతూనే పంచాంగం కట్ట
చంకలో పెట్టుకొని తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు రామశాస్త్రి

కోటిరెడ్డి పెరిగి పెద్దవాడవుతాడు. వాడిని చూసినవాళ్ళకి
ఉబలాటం ఎక్కువ వెంకటరెడ్డికి. ఎక్కువవుతుంది. ఒక రోజు మంచి
ముహూర్తం చూసి కృష్ణయ్య పంతులుగారి 'ఎలిమెంట్' స్కూల్లో
చేర్పిస్తాడు. కోటిరెడ్డికి తాత పిచ్చిరెడ్డి రోజులో ప్రార్థన,
సాయంత్రం అన్నపై ఎక్కించుకొని స్కూలుకు తీసుకుపోతాడు.
కోటిరెడ్డి రోజు రోజుకి పెద్దవాడవుతున్నాడు. వెంకటరెడ్డి

పెద్దకొడుకు పిచ్చిరెడ్డిని వెంకటరెడ్డి అన్న రామన్న దత్తత తీసుకుంటాడు. ఇప్పుడు రెండు కుటుంబాలు కలసి మెలసి ఉంటున్నాయి. కొన్ని రోజుల తరువాత కోటప్పకొండ జాతర వచ్చింది. గ్రామాలలో ఎక్కడైనా ఒక జాతర వచ్చిందంటే అది ఆ చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలన్నింటికీ పండగే. కోటప్పకొండ తిరునాళ్ళకి ఆ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తారు. ప్రజలు తమతో పాటుగా ప్రభలు తీసుకొస్తారు. ఈ ప్రభలను తీసుకెళ్ళడంలో ప్రజలు ఒకరికొకరు పోటీపడతారు. ఇలాంటి సందర్భాల్లో గ్రామాలకు గ్రామాలకు గొడవ జరుగుతుంది. కోటప్పకొండ తిరునాళ్ళను, ప్రభల పోటీలను, చెక్కభజనలను రచయిత కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

గ్రామాలలో వీధి బడులు, అందులోని మాష్టర్లు ఆకాలం నాటి చదువులు – మాష్టర్ల శిక్షలు మొదలైనవన్నీ అద్భుతంగా రాసారు చిరంజీవి.

గ్రామాలలో (*) కులతత్వాలు చిన్న వయస్సులో నుంచి ఎలా ప్రబలి పోతున్నాయో రంగమ్మ-కోటిరెడ్డి ఉదంతం ద్వారా

వివరిస్తాడు రచయిత. రంగమ్మ- కోటిరెడ్డి క్లాస్ మేట్స్. కృష్ణయ్య పంతులు విలిపేట్ సర్కిల్లో దసరా వేడుకుల సందర్భంగా రాధాకృష్ణుల నాట్యం వేయాలనుకుంటారు. ఆ రాధాకృష్ణుల వేషాలకు రంగమ్మ- వెంకటరెడ్డిలు ఎన్నికవుతారు. నాట్య ప్రదర్శన జరుగుతుంది. రంగమ్మ కోటిరెడ్డిలు రాధాకృష్ణుల వేషాల్లో అద్భుతంగా తన్మయమై నాట్యం చేస్తుంటారు. ఇంతలో.

“ఆపండి; ఆపండి. ఘోరం. . .

ఇంత మంది జనంలో కాపువాళ్ళ పిల్లనైతే శూద్ర పోడు కాళ్ళు పట్టించుకోటమా? ఏమయ్యారు కమ్మలంతా? ఏందిరా ఒక్కొక్కి మాట్లాడరూ? కాపునోళ్ళ నోట కాళ్ళు పట్టించుకొని బతకటానికే నంటారా సూరాత్మా నిలబడ్డారు? ఏడేడు జన్మాలకి నరకవాసం తప్పదంటారా శూద్రవాళ్ళకి? ఇంక సూర్తే నిలబడ్డారేం- -రా![౩౨] (పు-147) అంటూ కోటిగాడు బినాభిన్న లాక్కుంటూ స్టేజి పైకి వచ్చి కోటిరెడ్డిని లాగి తన్నాడు. తర్వాత ఒకరి వెనక ఒకరు ఇలా చిన్న పిల్లాడిని కూడా చూడకుండా కొట్టారు. కొట్టిన వాళ్ళంతా శూద్రులే. మరి శూద్రులై శూద్రుల మీద దాన్ని ఎందుకు కొట్టారంటే

దానికి మూలం బ్రాహ్మణుడైన అద్వైతం గారు. కృష్ణయ్య పంతులు దసర వేడుకలను ఇంత అద్భుతంగా జరిపిస్తుండటంతో కన్నుకుట్టి త్రాగుబోతైన కోటిగాడిని ప్రేరేపించి రెచ్చగొట్టి ఈ పని చేయించాడు. ఈ దుర్ఘటన అందరి మీదకంటే కోటిరెడ్డిపై ఎక్కువ ప్రభావాన్ని చూపింది. అప్పటి వరకు కులం అంటే ఏమిటో తెలియని కోటిరెడ్డి, రంగమ్మ బ్రాహ్మణ వర్గంలో పుట్టిన కారణం వల్లనే తనకీ పరాభవం జరిగినట్లు భావించాడు. నేరమంతా రంగమ్మ దేనని ఆ అమ్మాయితో మాట్లాడటం కూడా మానేశాడు. చివరకు స్కూలు ఎగ్గొట్టాడు.

ఈ రకంగా అభం శుభం తెలియని పసిహృదయులైన పిల్లలకు కులం గురించి చెప్పి రెచ్చగొట్టి చిన్నతనం నుంచే కుల విద్వేషాలను పెంచుతున్న పెద్దలను రచయిత తీవ్రంగా విమర్శిస్తాడు ఈ నవలలో.

స్కూల్లో కోటిరెడ్డి, బ్రాహ్మణుడైన కృష్ణయ్య పంతులు కొడుకు వెంకటేశ్వర్లుతో సమానంగా పోటీపడి చదివి అతని కంటే ఫస్ట్ వస్తాడు. వెంకటేశ్వర్లు ఈ విషయంపై తండ్రితో

గొడవ పెట్టారు. చదువుకోటానికి కులం అడ్డంకి కాదు. ఎవరూ ఒకే
కులమే చదవటానికి పుట్టలేదు. నేను పై కులంవాడిని, నాకన్నా
కులస్థుడు గొప్పవాడవుతున్నాడనే బాధ నేనే వాడికంటే ఎక్కువన్న
గర్వం కూడదు. ఈ విషయాన్ని తెలివిగలవాడైన కృష్ణయ్య
పంతులు, కొడుకు వెంకటేశ్వర్లు, శూద్రకులస్థుడైన కోటిరెడ్డి
తనను గెలుస్తున్నాడని విగంతా చేసినందుకు బాధపడ్తూ
"నన్ను గెలుస్తాడా వాడు" అని తండ్రితో అన్నప్పుడు
కృష్ణయ్య పంతులు చేత ఈ విధంగా రచయిత చెప్పిస్తాడు.

"అదిగో ఈ మాటంటే, నీకెంత గర్వమయితే
తప్పకుండా గెలుస్తాడు... గర్వం కూడదు నాయనా! గర్వం
వినాశ హేతువు. అయినా నా తొందర పాటుకు నేనిప్పుడు
బాధ పడుతున్నాను. సాటివానికి చెప్పినట్లు, నీతో మనసు
విప్పి ఎందుకు మాట్లాడానా అని నేనిప్పుడు చింతిస్తున్నాను.
ఈ విషయం వదిలెయ్యి... కోటన్న నీకంటే తెలివిగలవాడు,
గొప్పవాడు. నిరక్షరాస్యుల ఇంటపుట్టి, బుద్ధిహీనులతో పెరిగి,
మన మాటలను వింటూ నీతో పోటీ వస్తున్నాడంటే నిజంగా

వాడే గొప్పవాడు. వాడే వృద్ధిలోకి వస్తాడు." (పు - 184).
రచయిత నవలలో చెప్పదలుచుకున్న నిజం ఇదేనేమో!
ఈ మాటలు ఒక బ్రాహ్మణుడి నోట ఒక దళిత విద్యార్థిని
ఉద్దేశించి వచ్చినవి. దళితులు, అగ్రవర్ణాల వారిపై పోరాటం
సల్పటం అన్ని నవలల్లో సహజంగా కనిపించే సంఘటన.
ఈ నవలలో కుల తత్వాలను చూపిస్తూనే కుల తత్వాలకు
అతీతంగా ఎదిగే మానవత్వాన్ని చూపించారు రచయిత.

కృష్ణయ్య పంతులు గారి బడిలో చదువు
పూర్తవుతుంది. పై చదువుల కోసం కృష్ణయ్య పంతులుగారు
తన కొడుకును నరసరావుపేట పంపిస్తున్నానని, కోటిరెడ్డి-
ని కూడా పంపించమని వెంకటరెడ్డితో అంటాడు, కానీ
తనకంత స్థోమత లేదని భావించి ఏమీ చెప్పలేక ఇంటికి
వెళ్ళాడు వెంకటరెడ్డి. తర్వాత కొన్ని రోజులకు తన
కొడుకును కూడా పై చదువులకు తెనాలికి పంపిస్తున్నాన-
ని కృష్ణయ్య పంతులుతో చెప్తాడు, వెంకటరెడ్డి. కోటిరెడ్డి
పై చదువుల కోసం తెనాలి బస్సు ఎక్కడంతో ఈ నవల

ముగుస్తుంది.

కోటిరెడ్డి జననంతో ప్రారంభమైన ఈ నవల అతడి ఎలిమెంటరీ స్కూలు చదువుల పూర్తి చేసుకునే వరకు ఈ నవల కథా కాలం. కోటిరెడ్డితో పాటుగా అతని అక్కను, అన్నను కూడా మనకు చూపిస్తాడు రచయిత ఈ నవలలో.

రైతు కుటుంబాల్లో ఆడపిల్లలకు జరిగే గారాబం మనకు లచ్చుమమ్మ పాత్ర ద్వారా కనిపిస్తుంది. ఈ పాత్ర వేగాలపల్లి లోని * జ్యోతి పాత్రను గుర్తుకు తెస్తుంది.

రచయిత చిరంజీవి గారికి స్త్రీలపై సానుభూతి ఉన్నట్టు తోస్తుంది. ఇంచుమించుగా ప్రతి నవలలోనూ ఆయన సానుభూతిని దోచుకున్న పతిత స్త్రీ పాత్ర ఒకటి మనకు కనిపిస్తుంది. ఈ నవలలో మాణిక్యమ్మ పాత్ర అలాంటిదే. భర్త సుబ్బయ్య మరణించడంతో మాణిక్యం ఏకాకి అవుతుంది. అత్త మామలు ఏదో కొంత మనోవర్తి ఇస్తామని చెప్పి పుట్టింటికి పంపేస్తారు. పెట్టె చేత పట్టుకొని పుట్టినే

గుడిపాడు వస్తుంది. వచ్చి ఖాళీగా ఉండలేక గుడిపాడులో చిల్లరకొట్టు ఒకటి పెట్టింది. దాంతో ఆ గ్రామంలోని సోగ్గాళ్ళం- తా మాణిక్యంకు పరిచయమయ్యారు. వాళ్ళలో ఒకడైన ఊసుకోటిగాడు మాణిక్యంపై కన్ను వేసాడు. కొన్ని రోజుల తర్వాత కోటిగాడు మాణిక్యం బెజవాడ వెళ్ళి కాపురం పెట్టారు. కొన్ని రోజులు సక్రమంగానే కలిసి ఉన్నారు. ఒకరోజు చెప్పా పెట్టకుండా కోటిగాడు గుడిపాడు వచ్చేసాడు. దిక్కులేనిది అయ్యింది మాణిక్యం. ఇప్పుడు మాణిక్యం ఎక్కడున్నదో, ఏం చేస్తున్నదో అనుకునుకున్న వాళ్ళు లేరు. అవును. ఎవరికోసం? ఎవరెలా పోతే ఎవరికేం పడుతుంది.? పాపం మాణిక్యం జీవితాన్ని పారేసుకుంటున్నది! అంటూ రచయిత ఈ పాత్ర పై సానుభూతి చూపిస్తాడు.

పాత్ర పరిశీలన:-

వార్ధక్యంపై బడినా, చేతనయిన పనిచేస్తా మని తన హృదయంలో కలుపుకొని బ్రతికే వెంకటరెడ్డి తండ్రి పిచ్చన్న గత తరానికి ప్రతినిధి. కష్టపడి పనిచేద్దామని

కొడుకును నన్నా చదివించి గొప్పవాడిని చేద్దామన్న ఆశావాది వెంకటరెడ్డి. భార్యకు దాసిపై వ్యక్తిత్వం కోల్పోయినా తన వారిపై ప్రేమను విడువని వ్యక్తి వెంకటరెడ్డి అన్న రామన్న. ఒకో కుటుంబంలో చీలికలు సృష్టించే స్త్రీలకు ప్రతినిధి అతని భార్య అక్కమ్మ. బలాందూరాగా తిరిగే పల్లెటూరి రంగేలీ రాయుడు కోటేగాడు. వెంకయ్య పంతులు అసలైన తెలుగు పంతులు ఎలా చెప్పకూడ పోవాలంటే ఎవర్ని? అయితే అన్ని పాత్రలు మనకు ప్రతి రోజూ పల్లెటూళ్లో కన్పించే పాత్రలే ఇవే కాదు, వారి ఆలోచనలు, ఆచారాలు, ప్రేమలు చివరికి ద్వేషాలు, కొట్లాటలు అన్నీ పల్లెటూరి ప్రజా జీవితానికి చాలా దగ్గరగా ఉండి నవల చదువుతున్నంతసేపు మనకు తెలిసిన వాతావరణంలో మనకు తెలిసిన మనుష్యుల మధ్య వున్నట్టు అనుభూతిని పొందుతాం.

ఈ నవలను సమీక్షిస్తూ శ్రీ కప్పగంతుల మల్లికార్జున రావు. " అయితే ఈ నవల అంతా చదివాక ఏదో అసంతృప్తి కలుగుతుంది. అనంత యాత్ర ఇంకా

మొదటి దశ లోనే ఉందేమో అనిపిస్తుంది. యాత్ర ఇంకా మొదటి మైలు దగ్గరే ఆగిపోయింది. ఇంకా సాగాలి, అనంత యాత్ర సాగాలి. అనంత యాత్ర అసంపూర్ణంగా మిగిలి పోకూడదు (1) అని అన్నారు.

కాని ఆయన అభిప్రాయాలతో నేను ఏకీభవించ లేకపోతున్నాను. ఈ అనంత యాత్ర ఒక దశనుండి ప్రగతి పథంలో సాగిపోవడం మాత్రమే కాదు జీవితాల్లోనూ, బలహీనతల్లోనూ ఉండిపోయే మానవుడు పరిపూర్ణ మానవత్వాన్ని అందుకోవటానికి చేసే తొలి అడుగు ఈ అనంతయాత్ర. పేరులోనే (అనంత యాత్ర) ఈ యాత్ర అంతం కాలేదు, కాదు అని రచయిత చెప్తున్నారు కదా!

ప్రాథమిక విద్యాభ్యాసం వరకే పల్లెటూరు. ఎంతమంది వ్యక్తులున్నా ఎన్ని విభిన్న మనస్తత్వాలున్నా, ఈర్ష్యా ద్వేషాలు, మనస్పర్థలు ఉన్నా అవిభక్త సమిష్టి కుటుంబంగా ఉండే గ్రామీణ వాతావరణం నచ్చేరాని జ్ఞానంతో కూడిన బాల్యం. వదలి కౌమార ప్రారంభంలో పై చదువుల కోసం.

(1) కేప్స గంటుల మల్లికార్జున రావు - 'ఉత్తమమైన తెలుగు నవల అనంత యాత్ర' -

కోటిరెడ్డి పట్నవాసం లోకి ప్రయాణం ప్రారంభించటం
తో ఈ నవల ముగుస్తుంది. కానీ ఇది అనంత యాత్రకు
ప్రస్థానం మాత్రమే. మానసికంగాను శారీరకంగాను అనంత యాత్ర
పథంపై కోటిరెడ్డి సాగి పోతాడు.

చిరంజీవి నవలలన్నింటిలో స్త్రీల పాత్రలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. సాంప్రదాయ బద్ధమైన పాతివ్రత్యం సగటు కాల్పనిక శృంగారం మొదలైనవి వారి స్త్రీ పాత్రల-లో కనిపించవు.

సమాజంలో ఎన్నెన్ని మార్పులు ఎలా వచ్చిన స్త్రీల విషయంలో మాత్రం సంపూర్ణమైన విముక్తి ఈ నాటి వరకు రానేలేదు. సంప్రదాయంలో పుట్టి సాంప్రదాయపు సంకెళ్లలో బిగుసుకొని ఊపిరాడక వెలుగు కానరాక 'ఉక్కిరి బిక్కిరవుతు మార్క్సిస్టు సిద్ధాంతాల కాంతిలో తమను తాము చక్కదిద్దుకునే స్త్రీ పాత్రలు వీరి నవలల్లో కథానాయికలు.

'ముళ్ళ గులాబి, చీకటి మనుషులు' - ఈ రెండు నవలలు అన్యాయంగా బలై పోయిన స్త్రీల జీవితాలను చిత్రించే నవలలు.

## ముళ్ళ గులాబి:-

**ఇతివృత్తం:** సుబ్బులు పుట్టగానే తల్లిని కోల్పోయి తండ్రి ఎవరో తెలియకుండానే అమ్మమ్మ తాతయ్యల దగ్గర పెరుగుతుంది. సుబ్బులు తాతయ్య కోర్టులు గుమస్తాగిరి చేస్తూ సంసారాన్ని లాక్కొస్తాడు. సుబ్బులు స్కూల్లో చేరి క్లాసు కంతటికీ ఫస్టు వస్తుంది. సుబ్బులు అమ్మమ్మ చనిపోవడంతో సుబ్బులు చదువుకు స్వస్తి చెప్పాల్సి వస్తుంది. కొన్ని రోజులు తర్వాత తాతయ్య కూడా చనిపోతాడు. ఇప్పుడు సుబ్బులు ఒంటరిదవుతుంది. నా అనే వాళ్ళు ఎవరూ లేరు. తండ్రి ఎవరో తెలియదు. తన తాతా చనిపోతూ చెప్పిన రహస్యాన్ని మననం చేసుకొంటూ తన కుటుంబం ఇలా కావడానికి కారణమైన పురుషజాతిని ద్వేషిస్తుంది. ఇందుకు మొదటి వ్యక్తిగా కౌన్సిలర్ శ్రీని ఎన్నుకుంటుంది. అయితే ఏ జాతి-ని నాశనం చేయాలని శపథం పూనిందో ఆ జాతిలోని వ్యక్తికే శారీరకంగా లొంగిపోయి అతనికి ఉంపుడుకత్తెగా మారి మొదటి తప్పు చేసింది. కౌన్సిలర్ శ్రీని అడ్డుగా పెట్టుకొని

ముక్కలుగా ఆగిపోయిన తన చదువుని కొనసాగిస్తుంది. మెట్రిక్యులేషన్
పూర్తి చేసి ఇంటర్మీడియట్‌లో చేరుతుంది. ఇంటర్మీడియట్‌లో
సుబ్బులుకు సుజాత పరిచయమవుతుంది. ఈ పరిచయం గాఢ
స్నేహంగా మారి, సుజాత తండ్రి సూర్యప్రకాశరావు గారి
మెప్పును కూడా పొందింది, ఆ ఇంటిలో ఒక సభ్యురాలిగా
మసులుకుంటుంది. ఈలోపు కౌన్సిలర్ (శ్రీ) భార్య అత్తడిని
విడిచిపెట్టి పుట్టింటికి వెళ్తుంది. తాను అనుకున్నది సాధించాను
అని ఒక సందర్భంలో అనుకున్న సుబ్బులు ఆ వెంటనే జారిపడి
భార్యను బ్రతిమలాడి తీసుకొచ్చుకో అని ప్రాధేయ పడుతుంది.
కౌన్సిలర్ (శ్రీ) వేరామ వచ్చి బలవంతంగా అల్లున్ని లాక్కెడుతాడు.
సుబ్బుల్ని ఆ ఇంటి నుంచి బయటికి పంపిస్తాడు. తనను ఒక
కూతురిలాగా భావించిన సుజాత తండ్రి సూర్యప్రకాశరావుగారి
దగ్గరకు వెళ్ళలేక తినడానికి తిండిలేక రైల్వే స్టేషన్ చేరుకుంటుంది.
అక్కడ తన ఆకలి తీర్చిన అరటిపండ్లు బండివాడి ఆకలి తను
తీర్చి రైలెక్కి మద్రాసు చేరుకుంటుంది. మద్రాసులో ఫోటోగ్రాఫర్
తో పరిచయం అవుతుంది. ఆ ఫోటోగ్రాఫర్

సాన్నిహిత్యంలో సుబ్బులు సుబ్బలక్ష్మిగా మారుతుంది. తనను సినీ హీరోయిన్ గా చేస్తానన్న ఫోటోగ్రాఫర్ మాటలకు తలవొగ్గి అతను చెప్పినట్లు రకరకాల యాంగిల్స్ లో ఫోటోలకి ఫోజులిస్తుంది. నటన నేర్చుకుంటుంది. ఒక రోజు తన పత్రికలో ఉన్న ఒక వ్యక్తిని చూసి తనకు తన తాత చెప్పిన విషయం గుర్తుకి వస్తుంది. అతని తనకు అన్నగారి అన్నగా గుర్తుపడుతుంది. ఈ విషయం ఫోటోగ్రాఫర్ కి చెప్పగా అతను ఆ అన్నగారి అన్నను బ్లాక్ మెయిల్ చేసి సుబ్బులు కథ అంత చెప్పి పెళ్లి చేస్తున్నానని పది వేలు రూపాయిలు తీసుకుంటాడు. ఒకరోజు ఆ అన్నగారి అన్న వచ్చి నాకు పెళ్లి అయ్యిందని ఫోటోగ్రాఫర్ చెప్పాడని చీర రవికె ఇచ్చి 10 వేలు కూడా ఇచ్చానని చెప్తాడు. సుబ్బులు ఫోటోగ్రాఫర్ ని ఈ విషయం అడుగుతుంది. అతడు డొంకతిరుగుడుగా సమాధానం చెప్పడంతో కత్తితో అతనిని కసిదీరా పొడిచి పారిపోతుంది. దీనితో తొలిసారిగా హంతకురాలవుతుంది సుబ్బులు. తిరుపతికి వెళ్తోన్న ఒక గుంపుతో కలిసి పోతుంది. అక్కడ విధివశాన పరిస్థితిలో తన ఆకలిని తీర్చిన స్వామికి

లొంగిపోతుంది. ఆ స్వామితో మరో స్వామి కలవడంతో అక్కడి
నుండి పారిపోయి రైలెక్కుతుంది. మధ్యలో టికెట్ లేని కారణంగా
టికెట్ కలెక్టర్ ఒక రైల్వే స్టేషన్ లో దింపగా ఆ స్టేషన్ మాస్టర్
సానుభూతితో అతనింటికే వెళ్తుంది. మాస్టర్ గారి ఇంట్లో ఒక
సభ్యురాలిగా చేరిపోయి అందరికీ తలలో నాలుకలా మెలుగుతుంది.
స్టేషన్ మాస్టర్ గారు సుబ్బుల్ని ఒప్పించి పెళ్ళి చేసే ప్రయత్నంలో
ఉండగా పోలీసులు వచ్చి శాంతంగారి భర్తని హత్య చేసినందుకు
అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తారు. సుబ్బులికి జైలుశిక్ష
పడుతుంది. జైలు శిక్ష కాలం పూర్తైన తరువాత తన చిన్ననాటి
స్నేహితురాలు సుశాంతను కలుసుకుందామని వెళితే అక్కడ
భంగపడ్తుంది. అక్కడ నుండి సరాసరి అలివేలు కంపెనీకి వెళ్తుంది.
అక్కడ చంద్రకాంతగా మారుతుంది. అక్కడ నుండి తనను
కావాలనుకున్న కాంతయ్యకు వెయ్యి రూపాయలకు అమ్ముడు
పోతుంది. కాంతయ్య తనతో పాటే తన ఊరికి తీసుకుపోతాడు.
అక్కడ తన మీద మనసు పడిన మసాలవాడితో కూడి ఒక
పిల్లను కంటుంది. సుబ్బులు పిల్లకు జన్మనిచ్చిన వెంటనే వాళ్ళు

వచ్చిన పని అయిపోయిందంటు కాంతయ్య భార్య, మేనమామ వాడు కలిసి సుబ్బుల్ని బయటికి పంపించి వేస్తారు. వారి వంశాన్ని నిలబెట్టినందుకు వెయ్యి రూపాయలు ఇవ్వబోతారు. మొదట్లో పిల్లల్ని కంటుంది. ఈ సుబ్బు మాట మా వద్దనే ఉంచుకొని ఇంకా పిల్లల్ని పెట్టించండి. నాకే చిల్లి గవ్వ అవసరం లేదని ఎక్కడికో వెళ్తుంది. అప్పటి నుండి తిరిగి తిరిగి పిచ్చిదానిగా తయారయి చివరి ఆకలికి బలవుతుంది. ఆ ఆకలి తీర్చుతున్నవాడు ఎవరో కాదు ఆమె తండ్రే. ఒకనాడు తాను యవ్వనంలో ఉన్నప్పుడు తనను చూచి మోహపడి తన వద్దకు వచ్చిన రమణయ్యను చూచి చెంపకాయ పెట్టిన సుబ్బులు ఇన్ని రోజుల తర్వాత అనుకోకుండా మద్రాసు వెళుతూ ఒక రైల్వే స్టేషన్లో దిగిన రమణయ్యను చూసి తాను ఆనాడు చేసిన పనికి క్షమాపణ చెప్తూ తన జీవిత గాథను అంతా చెప్పి తను మాయమవటంతో ఈ నవల ముగుస్తుంది.

విశ్లేషణ : ఇది ఫార్ములా నవల కాదు. నవలా సాహిత్యం లోని విభిన్న విభాగాల లో ఏ విభాగానికి లక్ష్య

లక్షణా సమన్వితంగా సరిపోయే ఇతివృత్తం కాదు. ఇది స్త్రీ స్వతంత్ర నవల అని చెప్పడానికి కూడా వీలులేదు. సాధారణ ప్రేమ కథ కూడా కాదు. కాల్పనికమైన వ్యాఖ్యానాలు లేనిది. స్త్రీ వాద దృక్పథంలో రాసాడని చెప్పడానికి కూడా వీల్లేదు. ఈ నవలలో రచయిత సుబ్బులు పాత్రపైన సానుభూతి చూపిస్తున్నా పూర్తిగా సమర్థిస్తున్నట్లు కనపడదు. అయినా స్త్రీ వాద దృక్పథంలోంచి చూసినప్పుడు సుబ్బులుది ఓటమి అవుతుంది కానీ తిరుగుబాటు కాదు.

స్పష్టంగా కనబడక పోయినా సుబ్బులులో చలం స్త్రీ పాత్రల పోలికలు కనిపిస్తాయి.

స్త్రీ పురుషుడి అహంకారానికి గాని దౌర్జన్యానికి గాని లొంగిపోయి అతడికి బానిస కావటం లేదు. ఆమె లోని ఆత్మ ప్రవృత్తి కారణంగానే ఆమె అతనికి, అతడు సమర్థిస్తున్న వ్యవస్థకే బానిస అయిపోతుంది అని అంటాడు చలం.

ఈ నవలలోని సుబ్బులు ఎంతో అందమైనదే,

తెలివైనదీ, వివేకవంతురాలు, గాయని. అయినా ఎక్కడికక్కడా జీవితంలో భంగపడుతూనే వచ్చింది. ఎందుకు? స్థూలంగా చూసినప్పుడు నా అనేవారు లేని ఆమె దౌర్భాగ్యపు స్థితే ఆమె దురవస్థకు కారణం అనిపిస్తుంది. కాని జాగ్రత్తగా ఆలోచిస్తే ఆమెలోని నిజాయితీ, ప్రేమ, స్నేహశీలత, శత్రువునైనా అభిమానించగలిగే నిమలా హృదయం, ఇవన్నీ ఆమె భంగపాటుకు కారణాలు అని అర్థమవుతుంది.

కౌన్సిలర్ శ్రీని ఆహ్వానించినప్పుడు అతని కుటుంబాన్నంతా సర్వనాశనం చేయాలనే ధ్యేయం ఆమె మనసులో ఉంది. ఆమె గట్టిగా తలుచుకుంటే ఆపని అవలీలగా చేసుండేది. కాని తనకు తెలియకుండానే అతన్ని నిజంగా ప్రేమించింది. పశువులా జీవించడం చేతకాని మనిషి ఆమె. అతని భార్య పుట్టింటికి వెళ్ళినప్పుడు ఆనందించడానికి వారంగా తిరిగి తీసుకురమ్మని ప్రతిమాలింది. అప్పటి వారివి ఇంటి మీదికొచ్చినప్పుడు అతడికి ధైర్యాన్ని చెబుతూ కాపాడింది. చివరకు అతడు ఆమెకు బహుమానంగా

వచ్చిన ఉంగరంతో సహా పరారీ అయి పోయాడు. అతడి భార్య లేని సమయంలో నేరుగా అతనింటికే వెళ్ళి ఉంటే? అతని మోహం ఇంటి మీది కొచ్చినప్పుడు అతడికి పిరికితనం చూసి అతడిలో లాభం లేదనుకొని అతని మోహానికి అతన్ని అప్పగించేసి అందినంత వరకు చక్క బెట్టుకొని వెళ్ళిపోయి మరో ఆశ్రయం చూసుకొని ఉంటే?

ఈ పనులేమి ఆమె చెయ్యలేక పోయింది. చెయ్యకుండా అడ్డుపడింది ఏ సంస్కారం చావని మనస్సు. ఆమె మనసున్న మనిషి కావడమే ఆమె మొదటి భంగపాటుకు నాంది.

మనుష్యుల్లో అన్ని రకాల వాళ్ళుంటారు. ఉత్తములు, ఖలనాయకులు, స్వార్థపరులు, ఎందరో. ఈ విషయాన్ని రచయిత విస్మరించలేదు. సుబ్బులు జీవితంలో తారసపడిన వారంతా దుర్మార్గులే కారు, మంచి మనసున్న వారు కూడా ఉన్నారు. వాళ్ళు సూర్యప్రకాశరావు, స్టేషన్ మాస్టర్. వారిని ఆమె చేయి చాపి ఎప్పుడు ఏమీ అడుగలేక పోయింది.

అలాంటి ఉత్తముల స్నేహమే తనకు మహద్భాగ్యం అనుకుంది. ఎందుకంటే మిగిలినవన్నీ ఎక్కడైనా, ఎప్పుడైనా లభ్యమవుతాయని ఆమె అనుభవపూర్వకంగా తెలుసుకుంది. అపురూపమైన, నిస్వార్థమైన స్నేహం లభించటం చాల అరుదు. అలాంటి 'అమూల్యమైన' అనురాగాన్ని, మమకారాన్ని ఆమె చిన్న చిన్న అవసరాలకు వాడుకోవ-టానికి ఇష్టపడలేదు. ఈ పెద్దమనిషి తనమే ఆమె భంగపాటుకు ప్రధానమైన కారణం.

తరువాత ఆమె జీవితం గాడి పాటుకు ఎక్కి పోతున్నప్పుడు మద్రాసులోని ఫోటోగ్రాఫర్ తో పరిచయం కలిగింది. తనను ఆపదలో ఆదుకొన్నాడన్న విశ్వాసంతో మాత్రమే ఆమె తన ఫోటోలు రకరకాల భంగిమల్లో తీయించుకోటానికి ఇష్టపడుతుంది. చివరికతన్ని చంపింది కూడా పగతోనూ, ద్వేషంతోను కాదు. తనకు అన్నగాని అన్న మీద మమకారంతో. తనను బాహాటంగా చెల్లెలుగా అంగీకరించలేని అన్న మీద ప్రేమతో ఆమె తన

ప్రియుడి కాని ప్రియుడ్ని పొడిచి చంపివేసింది. పెళ్ళి కాని పెళ్ళికి అన్న అని చెప్పుకోలేని అన్న పట్టుచీర రవిక తీసుకొచ్చాడు. ఆ కొద్దిపాటి అభిమానమే ఆమెని కరిగించి వేసింది. ఆ అన్నకు అన్యాయం జరగకూడదని, అతనిని బ్లాక్ మెయిల్ చేస్తున్న ఫోటోగ్రాఫర్‌ని చంపేసింది. అంటే ఆమె భావనలో ఏ రకంగా నిర్ణయించుకున్న, ఆచరణలో మాత్రం ఎప్పటికప్పుడు ఆవేశంలోని మమకారం, ఆర్ద్ర స్వభావం జయిస్తున్నాయని స్పష్టపడుతుంది. ఫోటోగ్రాఫర్ చెప్పినట్లు విని ఫోటోలు తీయించుకున్నది కూడా డబ్బుమీద ఆశతో కాదు - అతడు తనని నడిరోడ్డు మీద బస్సులో అవమానం నుంచి కాపాడాడు, ఆ నిస్వార్థంతో మాత్రమే.

చిత్రం. నిజాయితీ కారణంగానే బజారు మనిషిగా మారి పోయింది. విశ్వాసంతోనే హంతకురాలయింది. ఆర్ద్ర స్వభావంతోనే మళ్ళీ బజారు పాలయింది ఆమె ప్రేమకు. ఈ సారి తిరుపతిలో ఎలాగో చివరకు ఏడుకొండల

వెంకటేశ్వరుని కొండపైన మరో సారామె జీకి శారీరకంగా లొంగి పోయింది కూడా అతడు తిండిపెట్టి ప్రాణాలు నిలిపాడన్న విశ్వాసంతోనే. కాని ఒక మృగానికి మరో మృగం తోడయ్యేసరికే వాటి బారినుంచి తప్పించుకొని స్టేషన్ మాష్టర్ గారి చల్లటి నీడకు చేరుకుంది.

స్టేషన్ మాష్టరు ఇంట్లో ఆమె అబద్ధాలాడుతూ సునాయాసంగా జీవితం గడుపగలిగి ఉండేది. కాని సహృదయుల ముందు అబద్ధాలాడలేని ఆమె నైతిక విలువలే ఆమెను మళ్లీ పతనం వైపు మళ్లించాయి.

స్టేషన్ మాష్టర్ గారి ఇంట్లో అందర్నీ,ఆమె నిష్కల్మత్వం అభిమానింప జేసింది. వారికిని అవమానాల-పాలు చేయడం ఇష్టం లేకనే పోలీసులకు వెంటనే లొంగి పోయింది. కోర్టుకు వచ్చాకనే తాను హంతకురాలిని కానని దహాయించింది. ఇదే పనిని స్టేషన్ మాష్టర్ గారి ఇంట్లోనే చేస్తే అల్లరయ్యి నల్గురూ గుయిసూండి వారి కుటుంబం అప్రతిష్ఠ పాలవుతుంది. అలా అల్లరి

కాకుండా ఉండడానికే నేరం ఒప్పేసుకుంది. కోర్టులో ఆమె ఒప్పుకోక పోతే సాక్ష్యం చెప్పడానికి అన్నగారిని అన్న రాజశేఖరం-ని పిలిపిస్తామన్నారు పోలీసులు. అతడిని మళ్ళీ కోర్టు కెక్కటం ఇష్టం లేక నేరం ఒప్పేసుకొని శిక్షను అనుభవించింది.

ఇక్కడ ఈ సందర్భంలో ఆమెను బంధించింది రక్త సంబంధం కాదు, ధన వ్యామోహం అంతకన్నా కాదు. ఒకనాడు తనకు పెళ్ళి జరుగుతుందనే భ్రమతో పట్టు చీర, రవికె తనకు కానుకగా తెచ్చిన ఆ అన్నగారి ఆర్ద్ర హృదయం పట్ల మనసులో నిండిన కృతజ్ఞతా భావం మాత్రమే.

చిట్ట చివరకు ఆమె కాంతయ్యను ప్రేమించలేదు, కేవలం జాలి పడింది. యశోదమ్మ పై ఈర్ష్య లేదు, సానుభూతి మాత్రమే. ఆ దశలో కూతురు పుట్టింది. ఆ కూతురు మీసాల పండి కూతురా? కాంతయ్య కూతురా? ప్రకృతిలో స్త్రీకి, పురుషునికి ఇక్కడే భేదం.

ఎవరికీ తండ్రి ఎవరైనా తమ కడుపున పుట్టిన బిడ్డ అంటే ప్రేమకి పంచప్రాణాలు. తండ్రి తనే అని రూఢి అయి నప్పుడు తప్ప మగవాడు ఆ శిశువుపై ప్రేమ చూపించలేడు. సుబ్బులు తల్లి ప్రేమకు, తండ్రి ప్రేమకు నోచుకోక పోవడానికి, సుబ్బులు కూతురు కాంతమ్మ వారసురాలిగా చలామణి కాగలగటానికి ఇదే కారణం. కూతురు పుట్టాక సుబ్బుల్ని వదిలించుకోవటానికి యశోదమ్మ ప్రయత్నించినప్పుడు ఆమె ఇచ్చిన డబ్బు కూడా తీసుకోకుండా తన కన్న బిడ్డను కూడా ఆమెకే వదిలివేసి మళ్ళీ నరకం లాంటి లోకంలోకి ప్రశ్నార్థకంగా వచ్చేసింది సుబ్బులు. తలుచుకుంటే ఆమె అప్పుడైనా కాంతమ్మకి అన్ని విషయాలు చెప్పగలిగి ఉండేది. మోసాల వాడికి, యశోదమ్మకి తగిన శిక్ష జరిగేలా చేయగలిగి ఉండేది. కాని ఆ ప్రయత్నాలు ఏవీ ఆమె చెయ్యలేదు. *ఆమెకు ఎవరి మీద కోపం, కక్ష లేదు. చేతనైనంత వరకూ తన చుట్టూ ఉన్న వారికి సానుభూతిని, స్నేహాన్ని, ప్రేమను, పంచి ఇవ్వటం

మాత్రమే ఆమెకు తెలుసు. పగని, ద్వేషాన్ని పెంచుకోవాలని అనుకున్న ఆమెకు సాధ్యం కాలేదు. అందుకే స్వార్థంతో కుట్రలతో, ధన వ్యామోహాలతో నిండిన ఈ లోకంలో ఆమె అందరిలా బ్రతుకలేక పోయింది. చివరకు కన్న తండ్రికే ఆహుతై పోయింది.

ఈ నవలలో సుబ్బులు జీవితం భగ్నం కావటానికి ఆమె దారిద్ర్యం, ఒంటరితనం కేవలం నేపథ్యం మాత్రమే. ఆమెలోని మంచి తనమే ఆమె సౌహార్ద్రమే. ఆమెలోని నిజాయితీ తనే, ఆమెను బలి తీసుకుంది. అందుకే ఈ పాత్రపోషణా చలంగారి దృక్పథానికే దగ్గరగా ఉంది.

ఈ నవలకు ముళ్ళ గులాబి అని పేరు పెట్టడం లోనే ప్రతీక స్పష్టమౌతుంది. ఇక్కడ చిత్రించిన సమాజం సౌందర్యం, సౌకుమార్యం, పరిమళం లాంటి ఆర్ద్ర మనః ప్రవృత్తి ఉండటం వల్లనే గులాబి. ముళ్ళ మధ్య చిక్కుకొని వాడిపోవలసి వచ్చింది అనే భావం కన్పిస్తుంది ఈ నవలలో.

సుబ్బులు పాత్ర ప్రారంభం నుంచే రాచబాటు

మీద లేదు. మళ్ళీ దారిలా, గులాబి లాంటి పుష్పాలు పరిమళం లాంటిది తన మానవత్వాన్ని వదులుకోకుండా చూస్తూ ఉన్న ముళ్ళకే ఆహుతైంది.

## చీమ మనుషులు:

1978 మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన ఒక సంఘటనను ఆధారంగా తీసుకొని రచయిత యథాతథంగా ఈ నవలను చిత్రించారు. అయితే ఈ నవలను ముద్రించడానికి ఏ ఒక్క పత్రిక ముందుకు రాలేదు. చివరకు జ్యోతి పత్రిక అచ్చు వేసింది. ఆ తరువాత రాయగఢ నుండి వెలువడే 'ధరణు' దీన్ని ఒరియా భాషలోకి అనువదించి ప్రచురించింది.

జంట నగరాలను, సభ్య సమాజాన్ని కుదిపి వేసిన ఈ సంఘటనకు చక్కని కళా రూపాన్నిచ్చారు రచయిత చిరంజీవి గారు.

ఈ శీర్షికను గమనిస్తే రావి శాస్త్రి గారి 'పిపీలికం' శీర్షికను గుర్తు చేస్తుంది. చీమ అల్పమైన

ప్రాణి. దానిని సులభంగా కాలి కింద నలిపి వేయవచ్చు, కానీ బలవంతమైన సర్పం సైతం చలి చీమలన్నీ ఏకమై కరిచి నప్పుడు తన విషంతో సహా కళేబరంగా మారి పోవలసిందే దాన్నే నిరూపిస్తుంది "చీమ మనుషులు" నవల.

**ఇతివృత్తం:** వెంకటలక్ష్మి, భర్త రాములుతో కలిసి పండుగకి పట్నం వచ్చింది. పట్నంలో రాములు తల్లి, తండ్రులు ఉంటారు. రాములు పల్లెటూళ్లో ఉంటాడు. ఒకరోజు రాత్రి భార్యభర్తలు కలిసి రెండో ఆట సినిమాకు వెళ్తారు. సినిమా అయిన తర్వాత రిక్షా మాట్లాడుకొని వస్తుంటే రాములు-కు కడుపులో తిప్పినట్లయి ఒక కాలువ ప్రక్కన రిక్షా ఆపి వెళ్తాడు. ఆ సమయంలో బీటు పోలీసులు వచ్చి రిక్షాలో కూర్చున్న వెంకటలక్ష్మిని చూసి అనుమానమొచ్చి రిక్షాలో పోలీస్ స్టేషన్‌కు లాక్కెళ్తారు. స్టేషన్‌లో వెంకటలక్ష్మిని ఎస్సైతో సహా నల్గురు పోలీసులు దారుణంగా మానభంగం చేయడమే గాక వ్యభిచారిణి క్రింద కేసు బుక్ చేస్తారు.

మరుసటి రోజు తెల్లవారి వెంకటలక్ష్మి అత్తవాళ్ళు ఉంటున్న
స్లమ్ ఏరియాకు వచ్చి భర్త రాములు ను పట్టుకెళ్తారు. తనను
మానభంగం చేసిన విషయం ఆమె రాములుకి చెప్పగానే
రాములు ఆవేశంతో పోలీసుల్ని తిడ్తాడు. దాంతో
పోలీస్ స్టేషన్ లోని పోలీసులు, యస్సై తో కలిసి రాముల్ని
లాకప్ లో వేసి లాఠీలతో వీర విహారం చేస్తారు. రాములును
వెంకటలక్ష్మి ని కేసునుండి తప్పించడానికి 300 రూపాయలు
అడుగుతారు. ఇంటికెళ్ళి బలవంతంగా డబ్బులు తీసుకొచ్చి
మళ్ళీ రాములును కొడ్తారు. దాంతో రాములు పోలీస్
స్టేషన్ లోనే మరణిస్తాడు. ఈ విషయం పట్టణమంతా తెలుస్తుంది.
ఈ సంఘటనలో కోపోద్రిక్తులైన ప్రజలు స్టేషన్ పై దాడి
చేస్తారు. కేసు కోర్టుకు వెళ్తుంది. కోర్టులో వెంకటలక్ష్మి
తనను మానభంగం చేసిన నల్గురు పోలీసుల్ని గుర్తు పడుతుంది.
ఆమెను వ్యభిచారిణిగా నిరూపించడానికి దొంగ సాక్ష్యాలను
ప్రవేశపెడ్తారు పోలీసులు. చివరకు వేలిముద్రల ఆధారాలు
కోర్టును తారుమారు చేస్తారు. అయితే న్యాయస్థానం

వెంకటలక్ష్మి వైపే మొగ్గు చూపి పోలీసులకు శిక్ష విధించడంతో కథ ముగుస్తుంది.

<u>విశ్లేషణ :</u> ఈ నవలని స్త్రీవాద, దళితవాద దృక్పథం లోంచి చూడవలసిన అవకాశం ఉంది. ఇందులో మూడు ప్రశ్నలున్నాయి.

1. స్త్రీ ఒంటరిగా కనిపిస్తే అత్యాచారం చేయడమేనా?

2. ఆ స్త్రీకి సంబంధించిన బంధువర్గం, ధనికులు, పలుకుబడి గలవారు కాకపోవటం చేతనే అత్యాచారం చేసినంతే చాలక కుటుంబాన్ని కూడా కష్టాల పాలు చేయటమా?

3. మన రాజ్యాంగ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ పనిచేస్తున్న విధానాలు ఎలాంటివి?

రచయిత రచన చేసిన కాలం నాటికి స్త్రీవాదం ఒక ఉద్యమంగా రూపుదిద్దుకోలేదు. స్త్రీ స్వేచ్ఛ అస్తిత్వ వివాదాలు మాత్రమే వినిపిస్తున్నాయి. అయితే స్త్రీ పట్ల మగవాడి అత్యాచారాలు అహల్య సంక్రందనంటికే ప్రాచీన కాలానివి. వాటి ప్రతిఘటన

కొత్తగా వచ్చిన జాగృతి. ఈ రచనలో కనిపించినట్లు సమాజమంత ఒక్కటై ఈ అత్యాచారాన్ని నిరసించటం, ఇలాంటి అత్యాచారం చేసిన వాడిని శిక్షపడేలా చూడటం. ఇది ఆధునిక చైతన్యానికి నిదర్శనం.

కాంకి బట్టలు వేసుకున్నంత మాత్రాన ఏంచేసినా చెల్లిపోతుంది అని అనుకోవటం పోలీసు వ్యవస్థలో బాగా కనిపిస్తుంది. ఈ వ్యవస్థలోని లోపాలను గురజాడ కాలంనుంచి ఈనాటి రాచకొండ విశ్వనాథ శాస్త్రి, చిరంజీవి మొదలైన వారి వరకూ అందరూ దుయ్యబడుతూనే ఉన్నారు. దొంగ సాక్ష్యాలు, అబద్ధపు కేసులు, మామూళ్ళ వంటివి పోలీసు వ్యవస్థలోని చీడ పురుగులు.

ఒంటరిగా కనిపించిన వెంకటలక్ష్మిని పోలీసులు బంధించి, మానభంగం చేసారు. అన్నా అని నోరారా పిలిచినా, పట్టించుకోకుండా మానభంగం చేసిన ఆధునిక సైంధవులు వీరు. ఈ సన్నివేశాన్ని చిరంజీవి హృదయం ద్రవించే విధంగా చిత్రించారు.

" ఎవడే ఆ రాముడు? నా మిండగాడా

బాబూ!

నాకు తెలుసు. వాడు నీ తార్పుడుగాడు. నిన్నెక్కడో

వచ్చి నాలుగు డబ్బులు తెచ్చుకుంటున్నాడు. డబ్బులు వాడి

దగ్గరే ఉన్నాయా లేక నీకిచ్చాడా? అంటూ బొడ్లో చేయి

వేశాడు.

చీరనలా ఒడిసి పట్టుకుంటాడని ఆతల్లికి తెలియలేదు

గింజుకుంటున్నది.

తీసెయ్యి చీర!

అన్నా!

నువ్వెక్కడి చెల్లెలివే నాకు! తీసెయ్యమంటు.

మర్యాదగా నువ్వు తీస్తావా లేక నన్నే ఒలిచేయమంటావా?

చీరకుచ్చిళ్ళైనా గుంజినే గుంజాడు రాక్షసుడు. వాటినలా

పట్టుకొని వెంటనే గొంతు మొత్తుకుంది వెంకటలక్ష్మి, బిట్టున

విలపిస్తూ.

మేఘాళ్ళ కాలంలో ఒక్కరున్నా ఉన్నాడు. అప్పటికే

చీర పట్టు విడువలేదు వెంకటలక్ష్మి.

'ఈసారి నామీద చెయ్యేశావంటే నిన్ను కరిచి చంపుతా!'

నన్నే చంపుతావా నువ్వు! ఇలా అరిస్తే నిజంగానే నిన్ను చంపేస్తాను' అంటూ కూర్చుంటూనే మళ్ళీ రొమ్ముల మీద బలంగా గుద్దాడు కర్కోటకుడు.

వెల్లకిలా పడింది వెంకటలక్ష్మి

చీర ఒలిచేసాడు.

కామం కక్కుతున్న అతని చేతివేళ్ళు వెంకటలక్ష్మి రవిక బొత్తాలను వెతుకుతున్నాయి.

లేవడానికి విఫలప్రయత్నం చేసింది వెంకటలక్ష్మి ఎత్తిన తలను చెళ్ళుకొట్టాడు ఆ పాపాత్ముడు.

రవికను కూడా లాగేశాడు. రెండు చేతులనూ అడ్డు పెట్టుకుంది లక్ష్మమ్మ తల్లి. పొగ తాగుతున్న సిగరెట్టుతో కసిగా ఆ రెండు చేతుల మీద కాల్చాడు

చేతులు విడి పోయాయి.

ఒత్తిడికి తట్టుకోలేని సిగరెట్టు తల విరిచేసు కాని ఆరి పోయింది.

అంతే ఇక చలనం లేదు. చైతన్యం లేదు. ప్రాణం లేదు. ఒక్క గడ్డ కట్టుకున్న కాయం మాత్రమే. స్వైర విహారం చేసింది. రాక్షస రతీలీల పొంగి విరిగింది(పు.17-18). అంటూ రచయిత వెంకటలక్ష్మిపై జరిగిన అత్యాచారాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించారు. ఈ సంఘటన చదివిన వారికి కంట నీరు తెప్పిస్తుంది. అన్నా అని పిలిచినా పట్టించుకోని ఈ పోలీసులు సమాజంలో చేస్తున్న దురాగతాలు ఎన్నో. ఒక్క వ్యక్తే కాదు. వెంకటలక్ష్మి పై ఇంకా ముగ్గురు పోలీసులు కూడా దారుణంగా మానభంగం చేశారు. ఇంత జరిగింది చాలక వేశ్యగా ముద్ర వేసి కేసు పెట్టారంటూ రచయిత పోలీసు వ్యవస్థపై తీవ్రంగా విరుచుకు పడ్డాడు.

వెంకటలక్ష్మిని, ఆమె భర్త రాములన్న పోలీస్ స్టేషన నుంచి విడిపించటానికే, అన్యాయంగా బనాయించిన కేసును ఉపసంహరించటానికే మూడు వందలు అడుగుతారు.

“మా పోలీసోళ్ళు మూడు వందల రూపాయలు

ద్రుగుతున్నారు. ఆ వయాంబు వంధలిస్తే వెనక్కి వదలి పెడుతారంట. ఇద్దాం - ఇస్తాం బాబూ! మొదటికి నట్టే మూడొం-టు యిస్తాం. నా మొగుణ్ణి నాకు లేకుండ చేయొద్దు....

'ఒప్పుకున్నట్లేనా'? అన్నాడు పోలీసు.

అట్లనన్నట్లు తల వూపింది వెంకటలక్ష్మి.

'తే ఇక నీ గదిలోకే పోయి నువ్వు కూర్చో పోమ్మ ఇస్తున్నాను. ఇక నుండట నీ మొగుడి ఒంటిమీద ఈగవాలినా వాలదు పో'" (పు - 47)

ఈ రకంగా పోలీసు వ్యవస్థ ప్రజలను జలగల్లా పీడించుకు తింటుంది. లంచం ఇస్తే కేసు మాఫీ. లేకపోతే లాఠీలతో వీర విహారం. అయితే అందరూ పోలీసులు ఇలాగే లేరు. అందులో కొందరైనా మంచివాళ్ళు ఉన్నారు. కాములు-ను చంపిన పోలీసుస్టేషన్ పై ప్రజలు ముకుమ్మడిగా దాడి చేసి స్టేషన్ని నామరూపాలు లేకుండా చేస్తారు. ఆ సందర్భంలో వెంకటలక్ష్మిని పోలీస్ కమీషనర్ పరామర్శిస్తా —

"అయ్యో! నేనెంత తప్పు పని చేశాను.
రాత్రి ఊర్చాటిలో వున్నా సబిన్స్పెక్టరెక్కడని జనం
పోలీస్ స్టేషన్ మీద పడ్డప్పుడు, వాడికి సివిల్‌డ్రెస్సు
తొడిగి దొడ్డిగుమ్మం నుంచి ఎందుకు పంపించాను?...

అమ్మా! నీకు న్యాయం జరుగుతుంది. ఒక్క
ప్రభుత్వమే కాదు, ప్రజలంతా నీ పక్షానే ఉన్నారు. ఒక
స్త్రీ అత్యాచారానికి బలయ్యిందంటే సహించలేక పోవడం
ఆజాతి సజీవంగా ఉన్నదనడానికి గుర్తు. ఆరోగ్యకరమైన
చైతన్య లక్షణం. నీకోసం ఆరుగురు వ్యక్తులు తమ అమూల్య
మైన ప్రాణాలర్పించారు తల్లీ! అన్నిటికంటే విలువైనది
అభిమానమని తెలుసుకుంటున్నారు జనం. నిర్భయంగా
ఉండు వారంతా వస్తారు." (పే 77 - 78) పోలీసులలో
చెడ్డ వాళ్ళే కాదు, మంచి వాళ్ళు కూడా ఉన్నారని ఈ పాత్ర
ద్వారా మనకు నిరూపిస్తాడు రచయిత. తన మాటలనే
పోలీస్ కమిషనర్ ద్వారా చెప్పిస్తాడు.

ఇందులో ఇంకో ప్రశ్న:

అత్యాచారానికి గురైన స్త్రీ వ్యభిచారిణి అని వాదించటం. వేశ్య అనే అనుకుందాం. వేశ్య అయినంతమాత్రాన ఆమెపై అత్యాచారం చేసే హక్కు పోలీసులకు గాని, వేరొ ఎవరికైన ఈ వ్యవస్థలో ఉంటుందా? వేశ్య అయినా తన ఇష్టమైతేనే తన శరీరం అమ్ముకుంటుంది. లేకపోతే లేదు. ఆమెను తన శరీరం అమ్ముకోమని నిర్బంధించే అధికారం ఎవరికీ లేదు. ఇక్కడా రచయిత రచనా శిల్పం పాకాన పడింది.

వెంకటలక్ష్మి అమాయకత్వం, ఆమె పోలీస్ స్టేషన్లో అనుభవించిన క్షోభ, రాములపై పోలీసులు చేసిన దారుణమైన హింసాకాండ, దానికి ఫలితమైన రాములు హత్య కరుణారసం తెప్పిస్తుంది.

నవల చదివిన తర్వాత కేవలం పోలీసులు వారు మాత్రమే అభాగ్యులను, అమాయకులను దోచుకోవడం లేదు.— అనిపిస్తుంది. ఒక వర్గమంతా మరొక వర్గం మీదపడి పీక్కుతిన్నట్లు అనిపిస్తుంది.

ఫోరెన్సిక్ ప్రొఫెసర్ రిపోర్టు తారుమారు చెయ్యటం ఇందుకు ఒక ఉదాహరణ.

మొదట గాయం అని వ్రాసినచోట, అది ఎబ్రషన్ గా మార్చబడింది. ఈ మార్పు ఎవరైనా ఊహించుకున్నారా? దాన్ని మళ్ళీ పరిమార్చి చిన్న ఎబ్రేషన్ మచ్చగా చేశారు. అలాగే రాములుకు సంబంధించిన రిపోర్టు మొదట రాసిన నోట్స్ ప్రకారం దెబ్బల వల్ల మరణించినట్లుగా ఉంటే, దాన్ని మార్చి సహజ మరణంగా చూపారు. ఇంకా చిత్రమైన విషయమేమిటంటే హిస్టోపాథలాజికల్ పరీక్ష పేరుతో తీసిన రాములు గుండెకాయ ఫోటో అసలు రాములుదే కాదు. ఎప్పటిదో, ఎవరిదో పాత కాలం నాటి ఫోటో స్లైడ్ తెచ్చి రాములుకు సంబంధించిన పోస్టుమార్టం నంబరు టైపు చేసి దానికి అంటించి పెట్టారు. న్యాయమూర్తులకు అనుమానం వచ్చి భూతద్దంవేసి చూస్తే పాత నంబరు బయటపడింది. ఇదేమని అడగగా ఎవరూ సమాధానం చెప్పరు. అన్నింటికీ బాధ్యత వహించవలసిన

ఫోరెన్సిక్ ప్రొఫెసర్ ఇదంతా క్రింది తరగతి ఉద్యోగుల పని అయి ఉండాలని అంటాడు. ఈ రకంగా మేధావుల కోవకు చెందిన వారే ఈ రకంగా చేస్తున్నారంటాడు రచయిత. ఈ ఫోరెన్సిక్ ప్రొఫెసర్ బండారం బయట పెడుతుంది గైనకాలజీ లో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేస్తున్న అమ్మాయి - డాక్టర్ సుశీల. ఆమె ఒకరోజు కోర్టుకు వచ్చి ఉన్న నిజం చెప్పింది.

“ఆరోజు డిక్టేషన్ నేను తీసుకున్నాను కాగితమూ పెన్సిల్ కూడా ప్రొఫెసర్ గారే ఇచ్చారు. తన జేబులోంచి తీసి నోట్సు రాసిన తర్వాత, ఆ నోట్సు, కాగితమూ, పెన్సిలూ రెండూ తీసుకొని మళ్ళీ జేబులో పెట్టుకొని వెళ్ళిపోయారు. మరి పెన్సిల్ తో ఎందుకు రాయమన్నారో నాకు తెలియదు. సామాన్యంగా మేము పెన్నులే వాడతాం”(పు-119)అని చెప్పడంతో ప్రొఫెసర్ బండారం బయటపడింది.

అయితే అన్ని వర్గాల్లోనూ అన్ని రకాల మనుషులుంటారు. రిక్షా వాడు క్రింది వర్గంలోని వాడే అయినా పోలీసుల తరుపున దొంగ సాక్ష్యం చెప్పడానికి వస్తాడు.

బహుశ పోలీసులకు భయపడి కావచ్చు. రూయిత్, హెడ్ కానిస్టేబుల్ సాక్ష్యం సరిగ్గా చెప్పలేదని కోర్టు ఆవరణలోనే రక్తం వాన్ని కొట్టినట్లుగా చూపిస్తారు. అంటే ఆధునిక జాలికూడా లేకుండా అలవోకే, దళిత బహుజనులు పోలీసుల తరుపునే దొంగ సాక్ష్యం చెప్తారు. బహుశః వారి శక్తుల బలవంతం వల్ల కావచ్చు. స్త్రీపై జరిగే అత్యా-చారాలు అనేక రకాలు.

సమాజమంతా ఇలాగే ఉంటే మానవజాతి ఏనాడో అంతరించిపోయేది. మేధావి వర్గాలలో ఒక-రెండు విప్లవరూపం చైతన్యవంతంగా జాతిని ప్రబోధిస్తానే ఉంటుంది. ఆ గొంతే జీవిస్తుంది కూడా. వినయశీలరెడ్డి ఇందుకు ఉదాహరణ. ధర్మం, న్యాయం లోకంలో ఇంకా నశించలేదనే దానిని రౌడి డాక్టర్, సిపాయిల తల లాయర్ (వెంకటలక్ష్మి తరుఫున వాదించిన లాయర్) ఉదాహరణ.

ఉబ్బులతో న్యాయం కొంటున్నారు.

ఆలాంటిదే ఇక్కడ జరిగింది. కానీ వినయశీల రెడ్డి లాంటి వాళ్ళు గట్టిగా నిలబడి సాక్ష్యం ఇవ్వడం వల్లన కోర్టు వారు నిజాన్ని ఒప్పుకోక తప్పలేదు.

లాయర్లకు డబ్బే ప్రధానం. *కోర్టుల్లో న్యాయం అన్యాయంగానూ, అన్యాయం న్యాయంగాను తీర్పు ఇస్తున్నారు. చిరంజీవి కూడా అన్యాయం ఇక్కడ ఎలా జరిగిందో చూపించారు. చివరకు ప్రజలు, మేధావులు, వినయశీల రెడ్డి లాంటి ధీరుల మూలంగా న్యాయం జరిగింది కాని నిజంగా కళ్ళులేని న్యాయస్థానం అన్యాయాన్ని న్యాయంగా భావించి తీర్పిచ్చేదేమో. *కోర్టులో జరిగే అన్యాయం గురించి గురజాడ అప్పారావు కన్యాశుల్కంలో హాస్యంగా చెబితే, రా.వి.శాస్త్రి కరుణారస భరితంగా చూపించాడు. ఒక యథార్థ సంఘటన వాస్తవ దృష్టితో వివరించారు ఈ నవలా రచయిత చిరంజీవి. చివరకు వినయశీల రెడ్డి "ఎక్కడ స్త్రీలు పూజింప బడుతారో, అక్కడ దేవతలు విహరిస్తారు.

ఈ లోకాన్ని వాస యోగ్యం చేయండి. దేవతలు నడయాడే నందన వనంగా మార్చండి." (పు-127) ఈ మాటలు చిన్న చిన్న వాక్యాలను పెద్ద పెద్ద అక్షరాలలో అచ్చు వేయించి, దేశమంతటా పంచటంతో కథ ముగుస్తుంది.

ఈ నవల్లో చెప్పుకోదగింది వాతావరణ చిత్రణ. మొదట పోలీస్ స్టేషన్ వాతావరణం, తర్వాత పల్లెకారుల్లోని కోనయ్య నాంచారమ్మలుండే స్లమ్ ప్రాంతంలో వ్యసనాలు, హాస్పిటల్, కోర్టుల వాతావరణం అన్నీ ఎంతో సమర్థవంతంగా సాగి పాఠకులను మానసికంగా ఆయా రంగాల్లోకి తీసుకుపోతాయి.

రచయిత చీమల గుంపుతో పోల్చి ఈ కథను చెప్పటంలో ఉద్దేశ్యం వారే చెప్పుకున్నట్లూ యదార్థ సంఘట-నను మరుగు పరచటం కాదు. బహుశ చీమలు మొదలైన కీటకాలు కూడా ఒక క్రమ పద్ధతిలో ధర్మబద్ధమైన సాంఘిక జీవితాన్ని గడుపుతుంటే మనుషులు మాత్రం ఏమాత్రం ఔచిత్యం లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారని కావచ్చు.

# నాటక రచయిత గా

# చిరంజీవి

భారతదేశంలో రూపక ప్రదర్శనం భరతుని (క్రీ.పూ. 2వ శతాబ్దం) కాలం నుంచే నాటక ప్రక్రియగా విలసిల్లుతున్నట్లుగా సాక్ష్యాధారాలున్నాయి. "భరతుడు 'నాట్యశాస్త్రం'లో ప్రధానంగా మార్గ నాట్యాన్ని గురించే చర్చించాడు. దేశీయ ప్రక్రియల ప్రసక్తి తీసుకరాక పోలేదు. భరతుడి నాటికి దృశ్య శ్రవ్య కళలన్నీ ఒకే కళగా ఉండేవి"(1). "లలిత కళల సమాహార రూపం నాటకం. చిత్ర లేఖనం, శిల్పం, సంగీతం, నాట్యం, కవిత్వం అన్ని కళల సమ్మేళనమే నాటకం"(2) అని గంగప్ప గారు అన్నారు. క్రమంగా ఈ కళలు విడిపోయాయి. ఏ కళకు ఆ కళ స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకుంది. అంతకు పూర్వం దృశ్య శ్రవ్య రూపాల్లో ఉన్న నాటకం, కావ్య ప్రక్రియలో

---

(1) పింగళి లక్ష్మీకాంతం - సాహిత్య శిల్ప సమీక్ష - పు. 273

(2) ఎస్. గంగప్ప - 'తెలుగు నాటక సాహిత్యం' (వ్యా). తెలుగునాటకం-

భాగంగా కూడా మారింది. 'కావ్యేషు నాటకం రమ్యం' అనే వాక్యం నాటకం కావ్య ప్రక్రియలో ఒక ప్రధాన భాగంగా పరిగణించిందని చెప్పక చెప్తోంది. సంస్కృతంలో ప్రాచీనకాలం నుంచి అన్ని ప్రక్రియలకు చెందిన నాటకాలు, అంటే భాణం, ప్రహసనం, వీథి-వంటివి ఎన్నో ఉన్నాయి. అయితే తెలుగుకి సంబంధించిన శిష్ట సాహిత్యంలో నన్నయ కాలం నుంచే నాటకాలు ఉన్నట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. అయితే విమర్శకుల చేత క్షీణయుగంగా నిరసించబడిన నాయక రాజుల కాలంలోనే యక్షగానాల వంటి దేశీయ నాటక ప్రక్రియలు గొప్పస్థితిని అందుకున్నాయి.

## పాశ్చాత్య నాటక రంగం

ఆధునిక కాలంలో యూరప్‌లో భావ వికాసానికి అత్యధికంగా దోహదం చేసిన గ్రీకులు ప్రాచీన కాలం నుంచి నాటక రంగంతో అవినాభావ సంబంధం కలిగి ఉన్నారు. 'Aristotle' గ్రంథాలను చూస్తే ప్రాచీన గ్రీకు నాటక రంగం గురించిన వివరాలు తెలుస్తాయి.

'Athens' నగరంలో 'Dionysis' అనే దేవతకు జరిగే ఉత్సవాల్లో, ఆ ఉత్సవాలకు సంబంధించిన కర్మకాండలో భాగంగా దేవతల కథల్ని 'రూపకాలు' గా ప్రదర్శించేవారు.

" 'Dytheramb' - అనే రూపక ప్రక్రియ నుంచి విషాదాంతాలు, సుఖాంతాలు, వ్యంగ్య నాటకాలూ మొదలైనవి ఆవిర్భవించాయి"(1) గ్రీస్ కీ రోమ్ కీ సాంస్కృతికంగా ఎన్నో పోలికలున్నాయి. క్రీ.శ. ఆరవ శతాబ్దంలో రోమను సామ్రాజ్యం పతనమైంది. ఆ నాటి నుంచి పదమూడవ శతాబ్దం దాకా 'పాశ్చాత్య నాటక రంగ చరిత్ర' ను విమర్శకులు 'అంధకార యుగం'గా పరిగణిస్తారు.

" అంధకార యుగం తర్వాతి కాలాన్ని 'మధ్య యుగాలు'గా వ్యవహరిస్తారు. పాశ్చాత్య దేశాల్లో ఈ కాలంలో నాటక రంగంలో ఎన్నో ప్రక్రియలు అవతరించాయి. ప్రార్థనా సంబంధి రూపకాలు అద్భుత రూపకాలు, దివ్యలీలా రూపకాలు, నీతిబోధక రూపకాలు

---

(1) వనం మధుసూదన్ - తెలుగు ఏకాంకిక వికాసం - పు. 1-19

నటులే ప్రధానంగా రచయితలుగా ఉండే రూపకాలు- వంటి ప్రక్రియలు ప్రధానమైనవి. 16, 17 శతాబ్దాలకి Interludes, Folk plays, Drolls - వంటివి వచ్చాయి."[1]

## తెలుగు నాటక రంగం

19 వ శతాబ్దపు చివరి రోజుల నాటికి, భారత దేశంలో స్థిరపడిన బ్రిటిష్ పరిపాలన ప్రభావం తెలుగు సాహిత్య రంగంలో కనిపించడం ప్రారంభమైంది. ఒక ప్రక్క ఇంగ్లీషు నాటకాల అనువాదాలు, అనుసరణాలు కూడా ప్రారంభమయ్యాయి. సంప్రదాయిక నాటకాల మధ్యలో అకస్మాత్తుగా ఆధునిక తెలుగు నాటకం 'కన్యాశుల్కం' సంప్రదాయ భిన్నతని సంతరించుకొని వెలువడింది. క్రమంగా ఇంగ్లీషు నాటక రంగంలోని పరిణామాల ప్రభావాలు తెలుగు నాటక రంగంలోని పరిణామాలకి కారణమవసాగాయి.

---

(1) వనం మధుసూదన్ - తెలుగు ఏకాంకిక వికాసం - పు.1-19

"There is no second opinion about the fact that the development of Telugu drama as such is undoubtedly due to English Influence"① — అని తెలుగు నాటక రంగాభివృద్ధిని గురించి జి.యస్. రెడ్డిగారు పేర్కొన్నారు.

20వ శతాబ్దపు తొలి రోజుల నాటికి అనేక చారిత్రక కారణాల వల్ల, వివిధ కళల్తో పాటు నాటక కళలో కూడా 'ప్రయోగ వాదం' ఊపునందుకుంది." 1929 లో స్థాపించిన 'ఆంధ్ర నాటక కళా పరిషత్తు' అంతకు ముందు ఆపివేసిన నాటక పోటీలను 1946 నుంచి పునః ప్రారంభించింది. 1943 లో 'ఆంధ్ర విశ్వకళా పరిషత్తు' నూతన ప్రయోగాలను చేయపూనుకొంది. 1945 లో 'ప్రజానాట్యమండలి' ఆవిర్భవించింది.
అఖిల భారత స్థాయిలో భారత కమ్యూనిస్ట్ పార్టీకి సాంస్కృతిక సాహిత్య రంగాల్లో అనుబంధ సంస్థగా అభ్యుదయ రచయితల సంఘం,

---

① G.N. Reddy - The Influence of English on Telugu literature. p. 128

IPTA (Indian peoples theatre and Arts) ఉన్నాయి. 1943-1963 మధ్య ఆంధ్రా యూనివర్శిటీ ప్రయోగాత్మక నాటక రంగం, విశ్వవిద్యాలయ నాటక సమాజపు సహకారంతో తెలుగు నాటక చరిత్రలో తీవ్ర సంచలనాన్ని కలిగించింది. 1942-1961 మధ్య జరిగిన ఆంధ్రాభ్యుదయోత్సవాల విద్యార్థులలోనూ, అధ్యాపకులలోనూ కొత్త ప్రయోగాలకు సంబంధించిన విమర్శ చైతన్యాన్ని కల్గించాయి."(1)

క్రమంగా స్వాతంత్ర్యోదయం నాటికి తెలుగు నాటక రంగంలో కూడా నూతన శకం ఆరంభమైంది. కవులు, పండితులే గాక వివిధ రంగాల్లో ప్రముఖులైన సాహితీ ప్రియులు రాయడం ప్రారంభించారు. పద్యనాటకాల స్థానంలో గద్యనాటకాలు, పౌరాణిక, చారిత్రక నాటకాలకు బదులుగా సాంఘిక నాటకాలు, సాంప్రదాయిక నాటకాలకు బదులుగా ప్రయోగాత్మక నాటకాలు

---

1) మూర్తి వేణుగోపాల స్వామి - తెలుగు నాటక రంగం (వ్యా) మహతి - పు: 208

చోటు చేసుకున్నాయి. 6, 7 అంకాలు గల సుదీర్ఘ నాటకాలకు బదులుగా 3 అంకాలు గల నాటకాలు, ఏకాంకికలు రాయనారంభించారు. ఏకాంకిక, నాటిక ఒకదానికొకటి పర్యాయ పదాలే. నాటికా వాఙ్మయంలో భిన్న కాలాల్లో ప్రహసనం, రూపకం, ఏకాంకిక, నాటిక – ఇలా రకరకాల పేర్లున్నప్పటికీ ఇవన్నీ దాదాపు ఒకే ప్రక్రియకు సంబంధించిన రూపాంతరాలు. శ్రీనాథుడి రచనగా ప్రసిద్ధమైన క్రీడాభిరామం భారతీయుల మొట్టమొదటి నాటిక(1) నాటకంలో కథ విస్తృతంగా ఉండి, కాల పరిమితి రెండు నుంచి మూడు గంటలుంటుంది. పరిమిత ఇతివృత్తం నాటికలో ఉంటుంది. అర గంట నుంచి ఒకటిన్నర గంట వరకూ కాలపరిమితి ఉంటుంది. తీరికా, ఓపికా లేని ఎలక్ట్రానిక్ యుగపు ఆధునిక మానవుని కోసం స్వల్ప వ్యవధిలో వినోదం కలిగించటానికి నాటిక అవతరించింది.

---

(1) కొలకలూరి ఇనాక్ – తెలుగు నాటిక–(వ్యా) సాహిత్య దర్శిని. పు. 35.

"కథతో పాటు సన్నివేశం, నిర్వహణ, పాత్రలు, వాతావరణం పరిమితమై ఉంటాయి. నాటికకు ఆకస్మికారంభం వుండి ఆద్యంతమూ ఉత్కంఠత పోషింపబడుతుంది. ముగింపు ఊహింపరానిదిగా ఉండి ఆనందం కలిగిస్తుంది" (1)

ఏ సాహిత్య ప్రక్రియ అయినా సమాజాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తుంది. ఆ ప్రక్రియ సుదీర్ఘమైంది కాకుండా పరిమిత పరిధిలో ఉండి స్వల్ప వ్యవధిలో ముగిస్తే మరింత శక్తివంతం అవుతుంది.

కొలకలూరి ఇనాక్ నాటికా వాఙ్మయాన్ని ఈ కింది విధంగా విభజించారు.

1. కవితా నాటిక
2. పౌరాణిక నాటిక
3. చారిత్రక నాటిక
4. శ్రవ్య నాటిక

---

కొలకలూరి ఇనాక్ - తెలుగు నాటిక (వ్యా) సాహిత్యదర్శిని. పు. 30.

5. హాస్య నాటిక
6. సాంఘిక నాటిక
7. అపరాధ పరిశోధన నాటిక
8. అనువాద నాటిక
9. ప్రచార నాటిక
10. రాజకీయ నాటిక
11. విషాదాంత నాటిక
12. బాల నాటిక
13. స్త్రీ నాటిక
14. నృత్య నాటిక
15. వర్గ పోరాట నాటిక
16. సాంసారిక నాటిక.

" ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో మునిగినప్పుడు భారత దేశం స్వతంత్రమౌతున్నప్పుడు తెలుగు సాహిత్యంలో వాస్తవికతా దృక్పథం ప్రారంభమౌతున్నప్పుడు రెండవ ప్రపంచయుద్ధం

ప్రపంచం మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా పడుతూ ఉన్నప్పుడు పుట్టిన తెలుగు నాటిక సమకాలీక వాతావరణం పెట్టుబడిగా పొందింది. నాటి నుంచి క్రమక్రమంగా పెరిగిన తెలుగు నాటిక భిన్న వృత్తాలు పొందింది. విభిన్నంగా రచయితలమయింది. విశేషంగా ప్రయుక్తమయింది.[1]

ఈ విధంగా 20వ శతాబ్దపు ఆరంభం నుండి రకరకాల నాటికలొచ్చినప్పటికీ సాంఘిక నాటకాలు, నాటికలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వస్తువులో వచ్చిన గొప్ప మార్పులే ఇందుకు కారణం. రాను రాను సమకాలీన సంఘటనలను, సామాన్య మానవుని సాదక బాధకాల్ని చిత్రించిన నాటికలు సమాజంలో నిలదొక్కుకోనారంభించాయి.

"సమాజ స్వరూప స్వభావాల్ని క్వాచిత్కంగా కాక, సంపూర్ణంగా దృష్టిలో పెట్టుకొన్న రచయిత రచన

---

(1) కొలకలూరి ఇనాక్ - తెలుగు నాటిక-(వ్యా) సాహిత్యదర్శిని - పు.45

సామాజిక చింతనా చైతన్యాన్ని పుణికి పుచ్చుకొంటుంది.

నాటక మిప్పుడు కాకిళ పూవు అందం ధోరణిలోగాక, సమకాలీన జన సంఘర్షణలకు, సమస్యలకు, వైరుధ్యాలకు, దైన్యాలకు, నైచ్యాలకు జీవన భాష్యంగా నిలుస్తుంది. వాస్తవికతలకు సమాజంలోని అన్ని అంగాల సమన్వయానికీ ఫోకస్ చేసే మార్గ నిర్దేశంగా ఉండిపోతుంది. సామాజిక స్పృహ, మానవతా భావం రెంటికి రచయిత మనసు ఆశ్రయ భూమి. కాగలిగినప్పుడు సత్యావిష్కరణకు దారులేర్పడతై"(1) అని అంటారు కె.వి. రమణ.

ప్రయోగ వాదం అనేది సాహిత్యకళలోని అన్ని ప్రక్రియల్లోకి ప్రవేశించింది. నాటక రంగం అన్నప్పుడు నాటకం, నాటిక, ఏకాంకిక వంటి అన్నింటిని సమిష్టిగా ప్రవహింపచేయవలసి ఉంటుంది. రకరకాల ఇజాలు నాటకరంగాన్ని ప్రభావితం చేసాయి

---

రమణ. కె.వి. - నాటక రచన కొత్త ప్రయోగాలు (వ్యా) సమాలోచనం. పు. 281.

అవి

1. కాల్పనిక వాదం  Romanticism
2. వాస్తవిక వాదం  Realism
3. స్వభావ వాదం  Naturalism
4. ప్రతీక వాదం  Symbolism.
5. వ్యక్తీకరణ వాదం  Expressionism
6. అస్తిత్వ వాదం  Existentialism
7. అధివాస్తవిక వాదం  Surrealism
8. రంగస్థల వాదం  Theatrialism.
9. వాన్ గార్డ్ భావవాదం  Van-guardism
10. భవిష్య వాదం  Futurism.

పై ఇజాలతో తెలుగు నాటక రంగం ప్రభావితం అయి ఎన్నో నాటకాలు, నాటికలు వచ్చాయి.

మన జీవితాన్ని మనమే చూస్తున్నామా! అనే భ్రమలో ఉలిక్కి పడేట్లుగా గురజాడ 'కన్యాశుల్కం'

అప్పటి సమాజ పరిస్థితులకు కళ్ళకు కట్టినట్లు మన ముందు పెడుతుంది. సంఘ సంస్కరణ అనే ప్రయోజనాన్ని ఆశించి 'వరవిక్రయం' 'రంగూన్ రౌడి' 'మధుసేవ' 'కాలేజీ గరల్' మొదలైన నాటకాలొచ్చాయి.

1930 నుంచి జాతీయం లోని విజాతి వర్గ సమస్యకు సన్నిహితమైన రూపకల్పనం మొదలైంది. అవి బళ్ళారి రాఘవ 'సరిపడని సంగతులు', పి.వి.రాజమన్నార్ 'అప్పైవరిది'. ఈ కాలం లోనే వ్యవస్థనెత్తి చూపే నాటకాలు కూడా వచ్చాయి. ఉదాహరణకు 'కులం లేని పిల్ల' ను చెప్పవచ్చు. పారిశ్రామికీకరణం వలన, ఆర్థిక మాంద్యం వలన మానవ విశ్వాసాల్లో వచ్చిన మార్పుల ప్రభావంతో 1940-50 లలో కొన్ని నాటకాలొచ్చాయి. ఉదా : కొండముది గోపాలరాయశర్మ 'ఎదురీత'. స్వాతంత్ర్య సంగ్రామం మధ్య తరగతి వారి బాధామయ బతుకుల్ని నాటక రంగం చిత్రించింది. ఉదా: కొప్పరపాటి గంగాధర రావు - 'నిజరూపాలు', రావికొండల రావు 'నాటకిళ్ళ చావిడి'. 1965 నుంచి యూరోపియన్

థియేటర్ ప్రభావం తెలుగు నాటక రంగంలో ప్రవేశించింది.
ఇబ్సన్ ప్రభావంతో రకరకాల నాటకాలొచ్చాయి. ఆ సమయంలోనే
వాస్తవ వాద ముద్రతో 'ఎన్.జి.వో', 'పల్లెపడుచు' మొదలైన
నాటకాలొచ్చాయి. స్వభావ వాద ముద్రతో 'మాభూమి', 'ముందడుగు'
'అన్నపూర్ణ' మొదలైన నాటకాలు అవతరించాయి.
ప్రతీక వాద ముద్రతో 'భయం', 'ఇది నాటకం కాదు',
'కంటూడే నీడలు' వెలువడ్డాయి.
వ్యక్తీకరణ వాద ముద్రతో 'సిద్ధార్థ', 'అసురసంధ్య' వచ్చాయి.
అస్తిత్వ వాద ప్రభావంతో 'ఆత్మవంచన' 'తమసోమా జ్యోతిర్గమయా'
మొదలైన నాటకాలొచ్చాయి.
అబ్సర్డిజం ప్రభావంతో 'సమాధానం కావాలి',
'ముందు తరాల మనిషి' మొదలైనవి వచ్చాయి.
సర్రియలిజం ప్రభావంతో 'జీవన మృత్యు', 'స్మృతి' వచ్చాయి.
థియేట్రికలిజమ్‌కి దేశిరాజు హనుమంతరావు ప్రయోగాల్ని
పెయిర్ హాల్ట్ ప్రయోగానికి ఎ.ఆర్. కృష్ణ 'మాలపల్లి' జీవనాటకాన్ని

ఎపిక్ థియేటర్ కి యండమూరి వీరేంద్రనాథ్ 'రుద్రవీణ'ని చక్కని ఉదాహరణలుగా తీసుకోవచ్చు.(1) ఇంత వరకూ తెలుగు నాటక రంగంలో ప్రవేశించిన ప్రయోగవాద తీరుల్ని వివరించాను.

రేడియో నాటక రచయితగా అనన్య ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కె. చిరంజీవి నాటక రచయితగా కూడా గొప్ప పేరు సంపాదించుకున్నారు. ఆధునిక నాటక రచయితలందరి లాగే కె. చిరంజీవి కూడా ప్రయోగశీలి. అయితే మిగతా రచయితలకు చిరంజీవికి ఈ విషయంలో స్పష్టమైన తేడా ఉంది. చిరంజీవి చేసిన ప్రయోగాలు కేవలం ప్రయోగం కోసం కాదు. వాటికి సామాజిక ప్రయోజనం ఉండి తీరుతుంది. క్షీణ దశలో ఉన్న నాటక కళను ప్రజలకు చేరువ చేయటం వరకే ఆయన ప్రయోగం పరిమితం. ఈయన రచనల్లో అస్పష్టత గానీ, అర్థరహితమైన పద ప్రయోగం కానీ

---

(1) పి. శివలక్ష్మి - 'శ్రీశ్రీ రేడియో నాటికలు - ప్రయోగవాద ధోరణులు' - ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం (అ.ప్ర.). హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం - పు. 51-52.

ఎక్కడా కనిపించదు. మాటల వాడకంలో ఆయన పొదుపరి. చిన్న చిన్న మాటల్లో సహితం అనల్పార్థాలను ప్రకటించటానికి ఆయన చేసిన ప్రయత్నం ప్రతి నాటకంలోనూ కనిపిస్తుంది. సుదీర్ఘమైన సంభాషణలు ఉన్నా వాటిని వాచాలతగా తీసివేయలేం. ఎందుకంటే అవి గంభీర భావ సముద్రాలు. ఆయా రసాలను పండించటం, గాఢంగా హృదయానికి హత్తుకునేలా చేయడం వాటి ప్రయోజనం.

చిరంజీవి ఎనిమిది నాటకాలు రాశాడు. వాటన్నింటిని కలిపి 'ఆటబొమ్మలు' నాటక సంకలనంగా తీసుకొచ్చాడు. ఆట పుట్టినప్పుడే పాట పుట్టింది. పాట పదాన్ని పునీతం చేసింది. ఆటకు, పదానికి పరమార్థాన్ని నిర్దేశించేది నాటక మనడంలో సందేహం లేదు. ఆట ద్వారా మనిషి తాను నిర్వర్తించాల్సిన ధర్మాన్ని తెలియ చెప్పుతాడనే పరమసత్యానికి సూచనగా 'ఆటబొమ్మలు' అనే పేరు ఈ సంకలనానికి పెట్టడం లోనే రచయిత తాత్వికత మనకు అర్థమవుతుంది.

ఈ సంకలనంలో ఎనిమిది నాటకాలున్నాయి. ఈ నాటకాలన్నీ ఒకే కోవకు చెందినవి కావు. ఒకే కాలానికి చెందినవి కూడా కాదు. అన్ని కాలాలకు వర్తించే సామాన్య వృత్తాంతాలు కూడా కొన్ని నాటకాల్లో ఉన్నాయి. వస్తువు ఎన్నుకోవడంలోనూ, ప్రదర్శన శిల్పంలోనూ కూడా విభిన్న ప్రయోగాలు చేసాను. అవి.

1. నీలి దీపాలు
2. సోనార్ బంగ్లా
3. పొలిట్రిక్స్
4. మహా నిష్క్రమణం
5. నర్తన బాల
6. దేవుడెరుగని నిజం
7. ఇక్కడ పెళ్లి చేయబడును.
8. ప్రేమ పక్షులు.

## నీలి దీపాలు :

స్వాతంత్ర్యం వచ్చి చాలా సంవత్సరాలు గడిచినా భూస్వామ్య సమస్య సమస్యగానే మిగిలిపోయింది. భూస్వామ్య ఆగడాల సామాజిక వాతావరణాన్ని 'నీలిదీపాలు' నాటకంలో కళాత్మకంగా వివరించాడు రచయిత.

ఇతివృత్తం : ఒక గ్రామంలోని భూస్వామి రాయుడయ్య తనకు అప్పు చెల్లించలేని కర్రెంకడిని వెట్టిచాకిరి చేయించుకోడానికి నిర్ణయించుకోవడంతో నాటకం ప్రారంభమవుతుంది. కర్రెంకడు ఎప్పుడో తీసుకున్న పది వరహాలు చెల్లించుకోలేని స్థితిలో రాయుడయ్యకు తనకు తానుగా బానిసగా అమ్ముడుపోతాడు. ఆ ఊరిలోని పల్లెజనాన్ని మాలమాదిగలుగా విభజించి పాలించుచున్న రాయుడయ్య దౌష్ట్యానికి అంతంలేదు. తన కొడుకు, సూరప్ప భార్యపై అత్యాచారయత్నం చేస్తే అలా చేయడం మాకు చెల్లుతుందని ప్రకటించటమే గాకుండా తన కొడుకు చేయి కొరికి తప్పించుకున్న నేరానికి గాను సూరప్ప భార్యకు వెయ్యి రూపాయల

జరిపినా విధిస్తాడు. జరిమానా కట్టని యెడల సూరప్ప
భార్యను బయటకు లాగి పదిమందిలో బజార్లో మాన భంగం
చేయిస్తానంటాడు దుర్మార్గుడైన భూస్వామి, రాయుడయ్య.
రాయుడయ్య లాంటి దుర్మార్గుడి నుండి పల్లె జనాన్ని రక్షించడానికి
వీరదాసు ఆ ఊరిలోకి వస్తాడు. ఒకప్పుడు వీరదాసు కుటుంబం
కూడా రాయుడయ్య బాధలు భరించలేక ఊరినే విడిచి పెట్టి
వెళ్ళిపోయింది. రాయుడయ్యకు వ్యతిరేకంగా ఆ ఊరి జనాన్ని
కూడదీసుకుని రాయుడయ్యపై పోరాటం ప్రకటిస్తాడు. స్కూల్
ప్రారంభించి పల్లె జనానికి విద్య నేర్పుతాడు. బంజరు భూములను
ఆక్రమించుకొని పంటలు సాగు చేయిస్తాడు. వీటన్నింటిని చూసి
భరించలేని రాయుడయ్య కోటకు వచ్చిన పంటను నాశనం చేయిస్తాడు.
అయినా లొంగిరాలేదు పల్లె జనం. వీరదాసుకు తోడుగా
అగ్రవర్ణం వారైన కోదండం కాపు, అగ్రహారం పంతులు, బక్కయ్యలు
పల్లె జనానికి అండగా నిలబడ్డారు. అస్పృశ్య వర్ణం వాడైనా,
వీరదాసును తమ నాయకునిగా ఆమోదిస్తారు. వారు కూడా

రాయుడయ్య దుర్మార్గాలకు బలైన వారే. చివరకు బంజరు భూములను (ప్ర)భుత్వం పల్లెజనానికి పంచడానికి ఒప్పుకుంటుంది. ఈ సంబరాలలో ఉన్న పల్లెజనాన్ని సంప్రదింపుల కోసమని రాయుడయ్య ఇంటికి పిలిచి, వీరదాసును రాయుడయ్య వర్గమంతా కలిసి చంపడంతో నాటకం ముగుస్తుంది.

విశ్లేషణ: హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి అప్పు తీర్చడం కోసం తనను తాను నడిబజారులో అమ్ముకున్నాడంటే పౌరాణిక అభూత కల్పన అనుకుంటున్నాం. నిలబెట్టి వడ్డీ వసూలు చేసే నక్షత్రకుడు నాటి నాటకం నుంచే తెలుగు సాహిత్యంలో ప్రవేశించాడు. అంటే అప్పటికే వడ్డీ వ్యాపారుల దౌర్జన్యం ఎలా ఉండేదో ఊహించవచ్చు.

చిత్రం! రాజులు మారారు, పరాయి పాలన వచ్చింది. స్వాతంత్ర్యం తెచ్చుకున్నాం. ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుకున్నాం. అయినా వడ్డీ వ్యాపారులు అప్పులిచ్చి వడ్డీలు కట్టలేక తనను తాము బానిసలుగా అమ్ముకునే

కర్ఫ్యూరంతడి లాంటి వాళ్ళు చరిత్రలో ఇంకా సమసిపోలేదు.

ఈ నాటకాన్ని గురించి రచయిత చిరంజీవి "ఇది ఒక జాతి కథ ఒక జాతి జనుల జీవనగాథ"(1) అని చెప్పుకోవడం ఎంతో సమంజసంగా ఉంది. ఒక గ్రామంలోనో, ఒక ప్రాంతంలోనో కాదు భారతదేశంలోని ఏ గ్రామంలోనైనా ఇంచుమించుగా ఇవే పరిస్థితులున్నాయి. రచయిత చిరంజీవి ఈ రచనకు ప్రేరణనిచ్చిన ఆంగ్లంలోని ఒక కథను వివరించాడు "ఎప్పుడో చిన్నతనాన ఒక పుస్తకం చదివాను ఆంగ్లంలో, ఆ పుస్తకం పేరుగాని, రచయిత పేరుగాని గుర్తులేవు. కథాంశం మాత్రమే అప్పటికీ, ఇప్పటికీ గుర్తున్నది. అందులో ఒక జాతి జనులుంటారు. సింహ ప్రకృతి వాళ్ళది. ఏనాటి భోజనం ఆనాడు వెదుక్కోవలసిందే. కడుపు నిండితే కాలు కింద పెట్టడం గాని, రేపటికి దాచుకోవటం గాని తెలియదు. అలాంటి అమాయకులను

---

1. చిరంజీవి - నీలిదీపాలు - పు. 9.

కంఠపుష్టి కలవారిని ప్రలోభపెట్టి ఒక వర్తకుడు వారిని అరణ్యాలలోనికో, బొగ్గు గనులలోనికో తీసుకెళ్లాడు పనికోసం. మరి కడుపు నిండితే కాలు కింద పెట్టని జాతి గదా? రేపటికి దాచుకో నెరగని జాతి కదా? అందువల్ల ఒక 'మంత్రప్రయోగం' చేసాడు వర్తకుడు. ఏమిటంటే అది: వారికొక వ్యసనాన్ని నెమ్మదిగా యెక్కించటం. సారా తెప్పించి పోయించాడు. మొదట చేదు-చేదుగా ఉందనిపించినా మందారు ఇసం ఆ తర్వాత చెప్పేదేముంది? ఆనందో బ్రహ్మ! వరసరానికి యెక్కి తాగుడు ఒక అలవాటుగా మారింది. కూలి తక్కువైనా ఇక ఆ 'మందు' కోసం పనిచేయక తప్పని స్థితి ఏర్పడింది. ఆ రోగం వచ్చింది జనానికి. ఒక పక్క వారిని అర్ధాకలితో నే ఉంచడం, మరో పక్క కూలి పేరుతో యిచ్చుకున్న డబ్బును తిరిగి సారా కొట్లలో గుంజుకోవడం (సారా వ్యాపారం కూడా ఆ తామందుదే సుమా) ఆ వర్తకునికి వెన్నతో పెట్టిన విద్య. ఇదీ క్లుప్తంగా ఆ బానిస కథ.(1) పై కథ ఎవరు రాసారో గాని

1) కె. చిరంజీవి – అవలోకనం – నాలుబాపాలు పు. 18

భారత దేశంలోని కార్మిక కర్షక వర్గమంతా ఎదుర్కొంటున్న సమస్య ఇది. బహుశః ప్రపంచమంతటా ఇంతేనేమో? త్రాగుడు లాంటి దుర్వ్యసనము లేకపోతే బలాఢ్యులైన కర్షక కార్మిక వర్గమంతా బడా భూస్వాములకు బానిసలయ్యేవారా? ఈ నాటకంలోని ముత్తడు, హనుమంతు లాగా తమ వారికి తామే వినాశం తల పెట్టేవారా? తమని ఉద్ధరించే నాయకుల్ని తామే నరికి ముక్కలు చేసేవారా? ఈ సారా దుర్వ్యసనమే గ్రామీణ జనులలోని కోటి జనం పాలిటి మహమ్మారి. ఆ జీవితాలకు తప్పలేని ఘోరశాపం.

ఈ నాటకంపై 'మాలపల్లి' ప్రభావం ఉందని రచయిత చెప్పుకొన్నారు. ఈ నాటకం చదివిన ఏ విమర్శకుడికైనా ఈ విషయం స్ఫురిస్తుంది. మొదలి నాగభూషణశర్మ కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "నిజానికి 'నీలిదీపాలు'లోని కథ ఉన్నవ వారి 'మాలపల్లి' కాలం నాటి నుంచీ అందరి హృదయాలను కలచి వేస్తున్నది.

ఈ సమస్యను వస్తువుగా స్వీకరించారు - చిలంజి వి. చౌదరయ్యను
ప్రతిరూపం రాయుడయ్య. ఆశ్రిత జగ్గడు వీరదాసు.
ఈ నాటి సాంఘిక వ్యవస్థలో ప్రస్ఫుటంగా కనిపించే రెండు
వ్యతిరేక శక్తులకు వీరిద్దరూ ప్రతీకలు.(1) కోటి మానవుల్ని
బానిసలనుగా చేసి కలకాలం వారిని బానిసలుగానే ఉంచివేసే
ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతినిధి అయిన రాయుడయ్య సమకాలీన
నవలా, నాటక సాహిత్యాలలో మనకు తరచూ ఎదురవుతూనే
ఉండే వ్యక్తి. ఈ ఫ్యూడల్ వ్యవస్థకు ఎదురు నిలిచిన మానవతా
మూర్తిగా వీరదాసు కూడా ఒక విధంగా పరిచితుడే. అయితే
వీరదాసులో ఉన్నవి వారి రామదాసు, వెంకటదాసు, సింగదాసుల
మేలు కలయికనే కానవస్తుంది. ఈ మేళవింపు ద్వారా పీడిత వర్గాల
బానిసత్వానికి వారి ఆర్థిక అసమానత్వం ఎంత కారణమో, వారి
అజ్ఞానం అంతే కారణమని గుర్తించి, వారి పునరుద్ధరణకు

---

1. మొదలి నాగభూషణ శర్మ - ప్రస్తావన - నీలిదీపాలు. పు. iii

అన్ని ప్రాంతాల నుంచి పాటలు చేసిన వ్యక్తిగా మనముందు సాక్షాత్కరిస్తాడు శివదాసు.

రేడియోలో ప్రసారమైన 'బీళ్లు తిరగబడుతున్నాయి' నాటకాన్ని కొంత సంస్కరించి ఈ 'నీలిదీపాలు' రాసినట్లుగా రచయిత చెప్పుకున్నాడు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఎన్. ఆర్. నంది "పది వరహాలు జాగిర్దార్ దగ్గర అప్పుచేసి తీర్చలేక పోయిన దళితుల్ని బానిసగా చేసుకుని, ప్రజల్ని పందులకంటే హీనాతి హీనంగా చంపి పారేస్తున్న ఫ్యూడల్ రాక్షసుడి గురించి సర్కారు ప్రాంతాల వారికి అంతగా తెలియదు. అలాంటి క్రూరకృత్యాలు అక్కడ ఇప్పటికీ జరుగుతూ ఉండబట్టే అక్కడి ప్రజలు తిరగబడుతున్నారు. ఈ తిరుగుబాటుని 'లా అండ్ ఆర్డర్' అంటూ అణచివేస్తూ ఉంటే కేంద్రం మాత్రం దీన్ని పేదలూ, ధనికుల మధ్య జరుగుతున్న సమరంగానే అంటోంది. ఈ మధ్యలో చస్తున్నది అమాయకులు. అలాంటి నాటకాన్ని 1976 లో 'బీళ్లు తిరగబడుతున్నాయి' అనే శీర్షికన

ఆకాశవాణి ప్రసారం చేసి ఎందరి మన్ననల్నో అందుకుంది.
అదే శ్రవ్య నాటకాన్ని ఇప్పుడు 'నీలిదీపాలు' దృశ్య నాటకంగా
చాలా చక్కగా మలిచారు[1] - రచయిత, అని ప్రశంసించారు.
అయితే ఈ 'నీలిదీపాలు'లో కొత్తగా చేరిన పాత్ర అద్భుతం. హరిజనులకు
గురువుగా నిలబడ్డ ఇతడు రాయుడికి కుడి భుజమైన
తరళానికి స్వయానా మామ కావడం చెప్పుకోదగ్గ విశేషం.

దోపిడీ వ్యవస్థలోని ఎన్నో కోణాలను
ఈ నాటకంలో చూపాడు రచయిత. అందులో ఒకటి
నిస్సహాయులైన హరిజన కార్మిక వర్గాలపై జరుగుతోన్న దోపిడి.
దీనికి ఉదాహరణగా శర్రింకడు బానిసగా మారడం:

రాయుడయ్య తన దగ్గర ఎప్పుడో తీసుకున్న
పదివరహాలకు గాను బాకీ కింద శర్రింకడు కొడుకు బొజ్జోణ్ని
తనకు బానిసగా చేయమంటాడు. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న

---

1) N.R. నంది - నాటకం 'చిరంజీవి' - పుస్తక సమీక్ష - ఆంధ్రప్రభ వారపత్రిక

బొజ్జడ్ని బానిసగా పంపించలేక తానే బానిసగా మారడానికి నిశ్చయించుకుంటాడు వెర్రెంకడు. ఒక చాప కొనుక్కొని తాను తాను చచ్చినట్లు భావించుకొని రాయుడయ్యకు అప్పచెప్పుతూ భార్యను కోరుతాడు. నిజ జీవితంలో ఒక మనిషి చనిపోతే కర్మకాండలు ఏ విధంగా జరుపుతారో ఆ విధంగానే వెర్రెంకడి కర్మకాండలు జరుపుతారు. చచ్చిన వెర్రెంకడిని తిరిగి బ్రతికించమని పల్లె ప్రజలు వేడుకుంటారు. కనికరించిన భూస్వామి రాయుడయ్య వెర్రెంకడికి కొత్తగా రామాయణం అని పేరు పెట్టి లేపుతాడు. ఆరోజు నుంచి రామాయణం అనేవాడని తనకు బానిసగా మారినవాడని, తనకు పుట్టినవాడని, ఇకనుంచి వెర్రెంకడిని మరచిపోవాలని వెర్రెంకడి భార్యకూ, కొడుక్కీ చెప్తాడు. వెర్రెంకడికి కూడా ఇకనుండి భార్యా,బిడ్డలు, తల్లీ తండ్రీ ఎవరూ లేరని ఉన్నది కేవలం ఒక తానేనని చెప్తాడు. తాను ఏపని చేయమన్నా చేయాలని. మనిషివి, పశువ్వి, పనిముట్టువి అని చెప్తూ ఆనాటి నుంచి వెర్రెంకడిని రామాయణంగామార్చుకొని తనకు బానిసగా చేసుకుంటాడు.

ఈ విధంగా గ్రామంలోని ప్రజలందర్నీ తన చెప్పుచేతల్లోకి తీసుకుంటాడు రాయుడయ్య. ఒక బలవంతమైన జాతి ఇంకొక బలహీనమైన జాతిని తనకు బానిసలుగా ఎలా మార్చుకుంటుంది అనేది కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు రచయిత. ఎదురు తిరగలేని సామాన్య జనాన్ని తమకు ఇష్టమొచ్చినట్టు వాడుకొంటూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు భూస్వాములు. ఒక రకంగా ఈ సంఘటననే నాటకం మొత్తానికి హైలైట్. నాటకం ప్రారంభంలోనే దీనిని వాడుకుని రచయిత ఆ నాటకానికి ఒక గొప్ప మలుపు నిచ్చాడు. ఈ విషయాన్ని మొదటి నాగభూషణాన్ని ఈ మొదటి రంగంలో ప్రవేశపెట్టిన "కర్రెంకడిని సావచెప్పుడు" యీ నాటకీయాంశాలన్నింటిలోను బలమైనదని నా విశ్వాసం. అది బానిసలను చేయడానికి భూస్వాములు జరిపించే తంతు. దాన్ని నాటక సన్నివేశంలో భాగంగా వాడుకొని నాటక ప్రారంభానికి ఎంతో ఎంతో బలిని కూర్చుకున్నారు రచయిత. ఇటువంటి "రిచువల్"ని వాడిన వారిలో తెలుగు నాటకంలో చిరంజీవిగారు బహుశః

మొట్టమొదటి రచయిత కావచ్చు"(1) అని అంటారు.

"దీని మొదటి రంగం లోని 'చావు' సీను తెలుగు నాటకరంగం మునుపెన్నడూ ఎరుగనిది"(2) అని అంటాడు చైతన్య ప్రసాద్.

రెండవ అంకం 'వైద్యుడొచ్చాడు'లో 'యెంకి'పై అత్యాచార యత్నం, దౌర్జన్యం చేయడమే గాక ఎదురు జరిమానా వేసి యెంకి మొగుడు సూరప్పను కట్టేసి కొట్టడం చేస్తుంది రాయుడయ్య వర్గం. సూరప్ప భార్య యెంకిని రాయుడయ్య కొడుకు అత్యాచారం చేయబోతాడు. ఆ సందర్భంలో అతని చేయిని కొరికి తప్పించుకొని వచ్చి భర్తకు చెపుతుంది. ఆవేశం ఆపుకోలేని సూరప్ప పట్టా కత్తితో రాయుడయ్య కొడుకుని నరకటానికి వెళతాడు. అతడు దొరకక పోవడంతో రాయుడయ్య వంశవృక్షాన్ని కట్టెచెక్కలుగా చేసి వస్తాడు. ఇది తెలుసుకున్న రాయుడయ్య

---

(1) మొదలి నాగభూషణ శర్మ – ప్రస్తావన – నీలిదీపాలు. పు. V

(2) చైతన్య ప్రసాద్ – 'కదిలించే నాటకాలు' – (సమీక్ష) ఆదివారం ఉదయం (7-6-92) 4 వపేజీ

తన వర్గాన్నంతా తీసుకొని సూరప్ప ఇంటికి వస్తాడు. తన కొడుకు అత్యాచారం చేయబోవడం అనేది నేరం కాదని అది తమ హక్కని చెప్తూ తన కొడుకు చేయి కొరికి వచ్చినందుకు గాను యెంకిని బయటికి లాగి పదిమందిలో బజారులో మానభంగం చేయిస్తానంటాడు దుర్మార్గుడైన రాయుడయ్య. ఎదురు తిరిగిన సూరప్పను చెట్టుకు కట్టేసి కొడతాడు. యెంకి కోసం ఇల్లంతా గాలిస్తారు కాని దొరకదు. చివరకు చేయి కొరికిన నేరానికి మూడు వందలూ, చెట్టును నరికినందుకు వెయ్యిన్నూటపదహార్లు జరిమాన వేస్తాడు. అది కూడ కట్టలేకపోతే మీ గుడిసెలకు నిప్పు పెట్టిస్తానంటూ బెదిరించి వెళతాడు. ఇంతటి బరువైన సన్నివేశంలో కూడ చిన్న నాటకీయ చమత్కృతిలో హాస్యం తెప్పించారు రచయిత. యెంకిని వెతకటానికి వెళ్ళిన హనుమంతు మంచం కింద యెంకి ఉందనుకొని గబాలున మంచం కిందికి చేయిపెట్టి బయటకు లాగుతాడు యెంకికి బదులుగా చిన్నపిల్ల బయటకు వస్తుంది. ఈ సన్నివేశం

ఒక రకంగా రాయుడి వర్గాన్ని వెక్కిరించినట్లుగా ఉంది.
అంతేగాక ఇది ప్రదర్శన కోసం రాయబడ్డ నాటకం గనక
యెంకిని బయటకు తీసుకువస్తే ఆ వర్గాల జరిగే
దురాగతాలు ప్రదర్శించటం చాలా కష్టం. ఈ రకంగా
నాటక శిల్పాన్ని పోషిస్తూ రాయుడి వర్గానికి మెత్తటి చెప్పుతో
కొట్టినట్టు బుద్ధి చెప్పాడు రచయిత.

రెండవ కోణం : దోపిడి జరిగేది కేవలం కులాల ప్రాతిపదిక
మీద మాత్రమే కాదు. ఉన్నవారంతా ఒక కులం, లేనివారంతా
ఒక కులం. కోదండం కాపు మీద, చిన్నరైతు బక్కయ్య మీద,
అద్వైతం పంతులు మీద జరిగిన దురాగతాలు ఇందుకు నిదర్శనం.
పెద్దరైతు అయిన కోదండం పల్లెజనంపై జరుగుతున్న అన్యాయాన్ని
ఎదిరిస్తాడు. వాళ్ళు బంజరు భూములను ఆక్రమించుకున్నప్పుడు
మొదట తానే నాగలి కట్టి ఎడ్లు ఇచ్చి వారి పోరాటానికి మద్దతు
పలుకుతాడు. ఇది భరించలేని రాయుడయ్య కోదండం కాపుని
చంపిస్తాడు. బక్కయ్య రైతు కూడా పేద ప్రజల పక్షాన నిలబడతాడు.

అతడు కూడా రాయుడయ్య దౌర్జన్యానికి ఒకప్పుడు బలయినవాడే. ఇక అద్వైతం పంతులు భూమి మొత్తం లాక్కొని ఊరి నుండి వెళ్ళగొట్టాడు. చివరకు అతను మారు వేషంలో ఆ ఊరి లోకి రావలసి వచ్చింది. ఈ ముగ్గురూ కూడ కింది వర్గం లోని వీరదాసు నాయకత్వాన్ని ఆమోదించారు.

పేదలనే గాక కరణం లాంటి ఉద్యోగస్తులను కూడా నయభయాల బెదిరించి రాయుడు వర్గం తమకు వత్తాసుగా మలచుకోవడం కూడా ఈ నాటకంలో చూపించాడు రచయిత. వీరదాసు నాయకత్వంలో బంజరు భూములను కోర్టు ద్వారా గెలుచుకుంటారు పల్లె ప్రజలు. దీనికి సంప్రదింపుల కోసం పిలిచి వీరదాసును చంపాలని ప్లాను వేస్తాడు రాయుడయ్య. ఆ సందర్భంలో కరణం నిస్సహాయ స్థితిని కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తాడు.

"రాయుడయ్య ఏదో చెబుతున్నాడు రహస్యంగా గుడ్లు వెళ్ళబెట్టి వింటున్నాడు కరణప్పంతులు. అతను చెబుతుంటే

పంతులు మొహం లోని రంగులు గబగబా మారిపోతున్నాయి. చెప్పడం అయ్యాక, దూకుడుగా లోపలి వైపుకు వెళ్ళాడు రాయుడయ్య. తలపట్టుకుని పడక కుర్చీలో కూలబడ్డాడు కరణం పంతులు...... కరణం గారు కూచో లేకుండా లేచి వెళ్ళి పోలేకుండా అవస్థ పడుతున్నాడు. ఒక నిర్ణయానికొచ్చి వెళ్ళి పోదామని బయటకు జారుకోబోతుండగా, హనుమంతు వచ్చి రెక్క పట్టుకుని నిలిపి తిరిగి పడక కుర్చీలో కూలేశాడు" (పు. 54) అని అంటూ కరణం మనసులోని అయిష్టత, అతడి నిస్సహాయతను రచయిత చక్కగా చూపించాడు.

వీరదాసు పాటకాల ప్రారంభించటం, అందరినీ సమావేశ పరచటం మొదలైనవన్నీ తెలంగాణా పోరాట కాలం నాటి 'సంఘాన్ని' గుర్తుకు తెస్తాయి. అయితే రచయిత సాయుధ పోరాటాన్ని చూపే ప్రయత్నం చేయటం లేదని స్పష్టం అవుతుంది. అందుకే ముగింపులో వీరదాసు ఘోరంగా హత్య చేయబడినా రాయుడయ్య వర్గంపైన కార్తిక, తర్వాత

వర్గం యొక్క ప్రతీకారాన్ని సమగ్రంగా చిత్రించలేదు. ఈ విషయాన్నే వివరిస్తూ మొదలి నాగభూషణశర్మ "జరుగుతున్న నాటకం చూస్తే రాయుడయ్యలు కొనసాగేలాగే ఉంది. వీరదాసుల మరణాలు కొనసాగుతూనే ఉంటాయనిపిస్తుంది. నా కనిపించింది ఇంత పటిష్టమైన నాటకానికి ఇది కాదేమో ముగింపు అని. ఆ ముగింపును రచయిత ఎందుకు స్పష్టంగా సూచించలేదు అన్న నా ఆలోచనకు నాటకంలో సమాధానం దొరకడం లేదు"(1) అని అంటాడు. అయితే రచయిత స్వయంగా చెప్పుకున్నట్లు 'మాలపల్లి' లో సంగదాసు మరణించినా సాధించిన జాగృతిలాగా ఈ నాటకంలో కూడా వీరదాసు తాను మరణించినా పల్లె ప్రజలలో సాధించిన జాగృతి ప్రధానాంశం కావచ్చు.

ఈ నాటకంలోని నాటకీయ శిల్పం కూడా ఉన్నత ప్రమాణాల్లో ఉంది. కర్రెంకన్ని చావు ఘట్టంలో చిన్నపిల్లాడైన

---

(1) మొదలి నాగభూషణశర్మ - ప్రస్తావన - నీలిదీపాలు. పు. VI

బోజోడి నోటి నుంచి వచ్చిన "మా అయ్య సావలే" (పు. 4) "సావలే. బాకీ నే గడలా" (పు. 5) అన్న ఈ మాటలు అతని తెలుగు బాటుని తెలియచేస్తున్నాయి. బోజోడి చేత ఈ మాటలు అనిపించడంలో భావి తరాల ఈ వ్యవస్థకు ఎదురు తిరుగుతారని సూచిస్తున్నాడు రచయిత.

సూరప్ప పట్టా కత్తిని మారు ఉన్నట్లుగా చెప్పటం నిస్సహాయమైన అతడి రోషాన్ని చూపటం. ఆ ఘట్టం కూడా గ్రామస్థులలో అధిక భాగం ఒక్కటిగా రావటం గమనించదగిన విశేషం. గ్రామస్థులంతా ఒక్కటైనా- అందరి మనసుల జరుగుతున్నది అన్యాయం అని చెప్తోన్నా- ఎవ్వరూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు వీరదాసు వచ్చి ధైర్యంగా ఎదిరించటం, అతడు ఎదిరించగానే మిగిలిన వారికి కొంచెం ధైర్యం రావటం మరో చక్కని మలుపు. కొడవటిగంటి కుటుంబరావు (బకాసురుని కథ) కాళీపట్నం రామారావు (భయం) మొదలైన కథకులందరూ పెట్టుబడిదారుడి

లేదా భూస్వామి బలమంతా కార్మికునిలోని భయం మీదనే ఆధారపడి ఉన్నదని వ్యాఖ్యానించారు. నిజానికి పీడితుల్లోని భయమే పీడకుని బలం. ధైర్యంగా ఎదురు తిరిగినప్పుడు పీడకుడు ఎంతటి వాడైన ఎంతో కొంత తగ్గక తప్పదు.

ఆదిమ సమాజంలో శ్రమ అందరిదీ - ఫలితం అందరిదీ.

భూస్వామ్య సమాజంలో శ్రమ ఎక్కువ మందిది- ఫలితం కొందరిది. ఆ సమాజంలో శ్రామికుడు కనీసం మనిషిగా కూడా గుర్తించ బడడు. అతడు బానిస: రోమన్ సమాజంలో బానిసల మీద యజమానులకు హతమార్చే హక్కు కూడా ఉండేది. బానిసలు యజమాని ఆస్తి మాత్రమే. ఆ సమాజం బానిసలకు ప్రాణమున్నదని సహితం గుర్తించలేదు. ధనస్వామ్యంలో యజమాన్యం డబ్బుది. శ్రామికుడు తన శ్రమను అమ్ముకుంటాడు. శ్రమకు ధర కట్టటం ధనస్వామి ఇష్టానిష్టాల మీద ఆధారపడి ఉంటుంది. సమాజవాదంలో శ్రమ ఫలితం సమాజపరం అవుతాయి. 'నీ శ్రమను సమాజానికి అర్పించు నీ అవసరాలు కూడా

సమాజం తీరుస్తుంది. అంటుంది సమాజ వాదం. మనిషి పుట్టినప్పటి నుంచీ తన శ్రమ ఫలితం దక్కించుకోటానికి నిరంతరం పోరాటం సాగిస్తూనే ఉన్నాడు. ఆ శ్రమ ఫలితం దక్కే దాకా పోరాటాలు జరుగుతూనే ఉంటాయి.

ఈ నాటకం బుర్రకథతో ప్రారంభం కావటం మధ్య మధ్యలో బుర్రకథ ద్వారా ఇచ్చే వ్యాఖ్యానాలు నాటకానికి అర్థోపక్షేపకం లాగా (ప్రదర్శించటానికి వీలుకాని విషయాలను సంభాషణల ద్వారా సూచించటం) ఉపయోగించటమే గాక కథా కాలం భూతకాలానికి, వర్తమాన కాలానికి కూడా చెందినదన్నట్లు సూచిస్తుంది.

ఈ నాటకంలో వాడుకున్న బుర్రకథ ద్వారా ఒక alienation రచనలో సాధించాడని చెప్పవచ్చు. ఎందుకంటే వ్యాఖ్యానాన్ని సూత్రధారుడిలో కాక బుర్రకథ ద్వారా చెప్పించడం వలన ప్రేక్షకులు తాము చూస్తున్నది నాటకం అని తెలుసుకుంటారు. అందులోని మంచి చెడ్డలు చర్చించుకుంటారు. ప్రేక్షకుడు

తాదాత్మ్యత చెందకుండా మధ్య మధ్యన బుర్రకథ ద్వారా ప్రేక్షకుల దృష్టిని మళ్ళిస్తాడు రచయిత. ఈ ప్రయోగం జర్మనీకి చెందిన బెర్టోల్ట్ బ్రెహ్ట్ నాటకరంగ ప్రభావంతో రాయబడింది. అని చెప్పుకోవచ్చు. "బెర్టోల్ట్ బ్రెహ్ట్' మార్క్సిస్ట్ సిద్ధాంతాలను నాటకరంగం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప నాటక ప్రయోక్త. ఆయన నాటక రంగ విధానం. మూడురకాలు. Historification, alianation, Epic"(1) ఎలియనేషన్ ద్వారా ప్రేక్షకుల తాదాత్మ్యత చెందరని పేర్కొంటాడాయన. తాదాత్మ్యత చెందకుండుంటే ప్రేక్షకులు నాటకం యొక్క మంచి చెడులు గురించి ఆలోచించరు అని అంటాడు సరిగ్గా 'బ్రెహ్ట్' ఏ ప్రయోగం చేసాడో చిరంజీవి కూడా అదే ప్రయోగాన్ని ప్రయోగించి సఫలీకృతుడయ్యాడు. తాని మొదలి నాగభూషణశర్మ ఈ నాటకానికి ప్రస్తావన రాస్తూ

---

(1) జయప్రభ - నాలుగోగోడ - తెలుగులో ఆధునిక నాటకం - పు. 255.

ఇది బాంధవ్యాల చెడగొట్టదు సరికదా మరింత బాంధవ్యాలను కలిగిస్తుంది అని అంటాడు. జయప్రభ[1] కూడా వర్ణిగారి అభిప్రాయాన్ని బలపరుస్తుంది. ఇందులోని alienation బ్రెష్ట్ సిద్ధాంతానికి అనుగుణంగా ఉన్నట్లు కనిపిస్తుంది గాని అది కాదు. ఇందులో వ్యక్తులు బాంధవ్యాల చెందడానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటారు.

రచయిత స్వయంగా చెప్పుకున్నట్లు పాత్రలన్నీ గ్రామీణ జీవితంలో కానవచ్చే వ్యక్తులే. ఇందులోని పాత్రలన్నీ మర్యాద వాచకాలని ఉపయోగించవు. 'దొరా! కానియ్యమంటావా కార్యం' అని అంటాయే గాని 'ఇక కానివ్వమంటారా?' అని అనవు. అలాగే హనుమంతు రాయుడయ్య దగ్గర అగ్గిపెట్టె తీసుకుని చుట్ట ముట్టించుకోవటం ఇది కూడా మర్యాదలకు సంబంధించిన విషయమే. నాగరికతా వాసనలు తగలని ప్రజలకు ఇందులో

---

(1) జయప్రభ — నాలుగో గోడ - తెలుగులో ఆధునిక నాటకం, పు 258

దోషమున్నట్లు అనిపించదు. రాయుడయ్య గూడా మరి ఆ బొబ్బిలి లాంటి వాడేగదా? డబ్బు గడించి వర్గాధిక్యాలను మూల్యం సాధించాడు. అయితే అప్పన్న సలహాలనుగాని, హనుమంతు సలహాలనుగాని తీసుకోవడంలో వెనుకాడడు. ఈ కాపిటలిస్టు సమాజంలోని plutocrat లాగా ఇంత long face పెట్టుకొని ఉండడు రాయుడయ్య - చొరవ, చనువు ఇస్తాడు. మిగతా జనం కూడా వాళ్ళ వాళ్ళ సంబంధాలను బట్టి చనువు ఏర్పరచుకుంటారు. ఈ విషయం హనుమంతు, అప్పన్న పాత్రల్లో గమనించవచ్చు. కరణప్పంతులు బ్రాహ్మణ కులానికి చెందినవాడైనా రాయుడయ్యను బావా! బావా! అని సంబోధించడం ఫ్యూడల్ వ్యవస్థ లక్షణం. దాదాపు అన్ని కులాలవారూ అందరినీ ఏదో వరసలు పెట్టి పిలుచుకుంటూ ఉంటారు. ఈ నాటకంలో వాడుకున్న భాష ఒంగోలు ప్రాంతానికి చెందినది.

జ్వలించే నాయకుని నుండే దుర్గుల్ల

చేతులలో ముక్కలుగా పగిలినా నశించిపోక ఈనాటికి సజీవ జ్యోతులుగా ప్రకాశిస్తున్నాయి. అభాగ్యులకు ఆశోపానములుగా ప్రగతి మార్గాన్వేషకులకు గమ్యాన్ని నిర్దేశిస్తూ ఆరకున్న వెలుగులున్నాయి. అవే 'నీలి దీపాలు'.

'నీలి దీపాలు' అనే పేరెందుకు? దీపం ఎర్రగా ఉంటుంది కాని నీలంగా ఉంటుందా? దీపం మన జీవితాలలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. "చీకట్లను పారద్రోలి వెలుగును ప్రసాదించే దీపం శుభ సూచకం. పవిత్రతకు చిహ్నం. జ్ఞానానికి ప్రతీక. మనలోని ఆత్మ స్వయం ప్రకాశం కలిగిన జ్యోతిగా వేదాంతాలలో చెప్పబడింది. అందుకే 'ఆత్మజ్యోతి' అంటారు. దారి తెలియనివారికి 'మార్గజ్యోతిగా', ప్రాణంతో సమానమైన వారికి 'జీవనజ్యోతిగా', విజ్ఞానం కోరేవారికి 'జ్ఞానజ్యోతిగా', నిరాశలో కొట్టుమిట్టాడే వారికి ఆశాజ్యోతిగా విరాజిల్లేది దీపమే."[1] నంటూ విప్లవ వీరుని చితాభస్మంలా ఈ దీపం నీలి రంగులో ఉంటుందని రచయిత సమాధానం.

[1] చిరంజీవి - అవతారిక - నీలిదీపాలు. పు. xvii

## సోనార్ బంగ్లా :

ఇది చారిత్రక నాటకం. దీనిలో చారిత్రక నేపథ్యం ఉంది. 1948 లో అఖండ భారతం రెండుగా చీలింది. అన్నదమ్ములగా కలిసి మెలిసి బ్రిటిష్ వారిపై తిరగబడి, అదే బ్రిటిష్ వారు పన్నిన వలలో చిక్కుకుని ప్రత్యేక దేశం కావాలి అని పోరాడి 1948 లో జిన్నా నాయకత్వంలో 'పాకిస్తాన్' ను ఏర్పరచుకున్నారు. ఎప్పుడైతే జిన్నా సాహెబ్ ఢాకా యూనివర్శిటీలో ఉపన్యాసం ఇస్తూ 'బెంగాలీ' భాషను కాలరాస్తాను అన్నాడో ఆనాడె (1948 మార్చి) బంగ్లా పోరాట ఉద్యమం ఆరంభమైంది. భాషా సమస్యతో ప్రారంభమైన ఈ పోరాటం 1952 నాటికి మరింత విస్తృతమై సార్వభౌమాధికారాన్ని, స్వయంప్రతిపత్తిని కోరింది. 1961 లో పఠాన్‌లు, 1962 లో బెలూచీలు తూర్పు బెంగాలీయులతో కలిసి అన్నదమ్ముల్లా పోరాడారు. అంతవరకూ ప్రజాస్వామ్యం కోసం, స్వపరిపాలన కోసం మాత్రమే సాగిన ఈ పోరాటం 1970 మార్చి 25 న ముజిబుర్ రహ్మాన్ నాయకత్వంలో మాతృభూమి విముక్తికోసం సాయుధ పోరాటంగా మారింది. 1971 లో పశ్చిమ పాకిస్తాన్ లోని ముష్కరులు తూర్పు పాకిస్తాన్ లోని బంగ్లా ముస్లిములు

చిత్రవధలు, మానభంగాలు, హత్యలు చేస్తూ దాదాపు లక్షమంది మేధావులను, సామాన్య జనాలను పొట్టన పెట్టుకున్నారు. చివరకు భారత దేశం కలుగజేసుకొని బంగ్లా విముక్తి పోరాటానికి మద్దతు తెలిపి పాకిస్తాన్ తో యుద్ధం చేసి ప్రత్యేక బంగ్లాదేశ్ ఏర్పడటానికి సహాయం చేసింది. ఈ నేపథ్యంలో దేశభక్తి, మానవత్వం, త్యాగనిరతి ప్రబోధించే వస్తువును ఇతివృత్తంగా ఎన్నుకొని ఈ నాటకం రాసాడు రచయిత చిరంజీవి.

<u>ఇతివృత్తం:</u> అది 1971 ఏప్రిల్ 17వ తేది. బంగ్లా చరిత్రలోనే సువర్ణాక్షరాలలో లిఖించబడిన రోజు. ఆ రోజు బంగ్లాదేశ్ సంపూర్ణ స్వతంత్ర రాజ్యంగా ప్రకటించబడుతోంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రొఫెసర్ వకాలానా కుటుంబ సభ్యులతో కలిసి నమాజు చేస్తాడు. అప్పటికి ముక్తివాహిని సైన్యాలు ఢాకాను ఇంకా విముక్తం చేయలేదు. పశ్చిమ పాకిస్తాన్ కసాయి సైనికులు ఇంకా ఢాకాను విడిచి వెళ్ళలేదు. బంగ్లా స్వతంత్ర పోరాటానికి మద్దతు తెలిపిన మేధావులను ఒక్కొక్కరినే హతమారుస్తుంది, కసాయిసైన్యం. అకస్మాత్తుగా ప్రొఫెసర్ వకాలానా ఇంటిమీద పడ్డారు,

పాకిస్తాని సైనికులు మరియు మేజర్ అక్రంఖాన్. పాకిస్తాన్ కు అనుకూలంగా ఉంటావని ఖురాన్ మీద ప్రమాణం చేయమంటారు. అక్రంఖాన్ ప్రొఫెసర్ వహాలానాను. వహాలానా ఒప్పుకోడు, ఎదురు తిరుగుతాడు. పాకిస్తాని కసాయిసైన్యం చేతిలో జాఅల్లి కుటుంబం పడ్డకష్టాలను ఏకరువు పెడ్తాడు. జాఅల్లి 1948 లో ఉపఖండం భారత్, పాకిస్తాన్లుగా విడిపోయిన సంవత్సరంలో జరిగిన మతకలహాలలో భర్తను పోగొట్టుకొని పాకిస్తాన్ వెళుతుంది. అక్కడ తిరిగి తిరిగి ఎవరూ ఆశ్రయం ఇవ్వని పరిస్థితులలో ప్రొఫెసర్ వహాలానా ఆశ్రయం ఇస్తాడు. 1958 లో ఢాకాలో జరిగిన ప్రజా ఉద్యమాన్ని అణచటానికి సైన్యం వస్తుంది. ఢాకాలోని ఇంటింటిని సోదా చేసి విప్లవకారుల్ని వెతుకుతుంది. ఆ సమయంలోనే జాఅల్లి ఇంటిలోకి చొరబడింది సైన్యం. జాఅల్లి కూతురు హసీనాను తల్లి, అన్న ముందే దారుణంగా మానభంగం చేసి, ఇదేమని అడిగినందుకు తల్లి జాఅల్లి నాలుక కోస్తారు. హసీనాను మిలిటరీ క్యాంపుల వెంట తిప్పుతూ గర్భం చేసి వదిలిపెట్టారు. ఇప్పుడు హసీనా పిచ్చిదై తిరుగుతోంది. దీనికంతటికి కారణం మీరు కాదా! మాదేశం కాదా!

అని ప్రశ్నిస్తాడు, షాలానా అక్రంఖాన్‌ని. అనవో ఎదిరించటంలో షాలానాను కాల్చిచంపుతాడు అక్రంఖాన్. అయితే అక్కడ ఉన్న జీ అల్లి కొడుకు 'రజా' అక్రంఖాన్ ను చంపేస్తాడు. షాలానా మరణంతో ఢాకా ప్రజలలో ఆవేశం పొంగి కసాయి సైన్యాలను వెంటబడి తరమటంతో నాటకం ముగుస్తుంది.

## విశ్లేషణ :

ప్రపంచాన్ని, దేశాన్ని కదిలించిన ప్రముఖ సంఘటనలను సాహిత్యానికి వస్తువుగా గ్రహించటం బాధ్యత గుర్తించిన రచయితలు చేసేపని. ఈ రకమైన రచన కత్తి మీద సాములాంటిది. ఒక వంక చరిత్రకు కట్టుబడి ఉండాలి మరొక వంక సజీవ పాత్రపోషణ చేయాలి. చారిత్రక సత్యాలకు కట్టుబడి ఉంటూనే సార్వకాలికతను సాధించాలి. ఇంత క్లిష్టమైన కార్యాన్ని ఈ నాటకంలో సాధించాడు రచయిత చిరంజీవి. సోనార్ బంగ్లా ఉదంతం ఆంధ్ర ప్రాంతానికి కూడా వర్తిస్తుంది. సరిగ్గా ఇలాంటి సంఘటనలే తెలంగాణా సాయుధ పోరాట కాలంలోనూ ఆంధ్ర, తెలంగాణా వేర్పాటు ఉద్యమ కాలంలోనూ జరిగాయి. ఆ ఉద్యమాలలో దారుణ

మారణ కాండకు, పాశవిక పైశాచిక కృత్యాలుకు మతం కారణం కాదు. అధికార దాహం, ధన దాహం, పదవీకాంక్ష ప్రధాన కారణాలు. 'సోనార్ బంగ్లా' లోని ఇతివృత్తం తెలంగాణా సాయుధ పోరాట కాలంలోనూ కనిపిస్తుంది. మనుష్యుల్లో చెలరేగే దానవత్వాన్ని ధైర్యంతో ఎదురు నిలిచి పోరాడే మానవతా మూర్తుల్ని చక్కగా చిత్రించాడు రచయిత. ఏ కాలంలోనైనా, ఏ యుగంలోనైనా మానవత్వానికే విజయం. హసీనా కథల వంటివి, బీ అమ్మ కథల వంటివి ఆ రోజుల్లో పత్రికల్లో వచ్చాయి. వాటిని చక్కగా వినియోగించుకున్నాడు రచయిత. హసీనా కథ కళ్ళల్లో నీళ్ళు తెప్పిస్తుంది.

'సోనార్ బంగ్లా' నాటకంలోని పాత్రలన్నీ ప్రతీకాత్మకాలే. వాస్తవిక దృక్పథంతో సంఘర్షణాత్మక ప్రవృత్తితో మలచబడ్డ పాత్రలు. అవి బహుముఖ వికసన పాత్రలు. ఈ నాటకంలోని ప్రధాన పాత్రలైన మౌలానా, బీ అమ్మ ఒకరికొకరు ఏమీ కారు కేవలం మానవతా దృక్పథంతో మౌలానా బీ అమ్మకి ఆమె సంతానానికీ ఆశ్రయం ఇచ్చాడు. ఈ నాటకంలో ఇంకా మిగిలిన పాత్రలు మౌలానా కొడుకులు ఇస్లాం అక్బర్, బీ అమ్మ సంతానం హసీనా, రజాల

మతం పేరుతో మానవులలో చెలరేగిన దానవత్వానికి బలైపోయింది తా అక్క కుటుంబం. మొదట భారత్ - పాకిస్తాన్ విభజన సందర్భంలో భర్తను పోగొట్టుకుంది తర్వాత పాకిస్తాన్‌లో చెలరేగిన దారుణ సంక్షోభంలో మరింత నష్టపోయింది అక్కడ తన కూతురిని పాకిస్తాన్ కసాయి సైన్యం తన ముందరనే అతి కిరాతకంగా మానభంగం చేసినా భరించింది ఇదేమని అడిగిన పాపానికి నాలుక తెగ్గోయించుకుంది. అక్కడ అందరూ ఒకే మతస్థుల అయితేనేమి అధికార దాహాన్ని, ఒకే మతస్థులమనే భావం ఒక్కటిగా బంధించలేకపోయింది. ఒకే మతస్థులలోనే అధికారులు వారి సైనికులు వారి పైశాచిక కృత్యాలు ఒక వర్గంగా, ఈ వర్గాన్ని ఎదిరించి నిలిచే విప్లవకారులు వేరొక వర్గంగా విడిపోయారు. ఒక మహమ్మదీయుడు మరొక మహమ్మదీయ వనితను అతి దారుణంగా మానభంగం చేయడానికి మతం అడ్డురాలేదు. మనిషిలోని పశువుకి మతం ఒక వంక మాత్రమే గాని నిజానికి మతం కోసం అకృత్యాలు చేసే మానవుడు ఎవడు? బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో ఏ అపరాధం చేయని

విజ్ఞాన వేత్తలు ఎందరో బలయ్యారు. అధికార మదాంధకారానికి తలవంచని ఎందరో ప్రొఫెసర్లు దారుణ పైశాచికంగా నరకబడ్డారు. ఈ నాటకంలోని అక్రంఖాన్ (సార్థక నామధేయం- ప్రతీకాత్మకం) బంగ్లా విముక్తి పోరాట సమయంలో పాకిస్తాన్ సైనికులలో చెలరేగిన పచ్చి పైశాచికత్వానికి ప్రతీకాత్మక రూపకల్పన. ఈ పాత్ర తెలంగాణ సాయుధ పోరాట కాలంలో తెలంగాణా పల్లె ప్రజలపై పడి దారుణ మారణ కాండను సృష్టించి ఆస్తులను కొల్లగొట్టి పాశవికంగా ఎన్నో మానభంగాలు చేసిన రజాకారుల నాయకుడు 'ఖాసిం రజ్వీ'ని గుర్తు చేస్తుంది. అతడు తనను ఎదిరించిన ఎన్నో వేల మంది ప్రజలను అతి దారుణంగా నరికి చంపాడు. ఈ నాటకంలో కూడా అక్రంఖాన్ బంగ్లా విముక్తి పోరాటంలో పాల్గొన్న ఎందరో నాయకులను. వారిని ప్రోత్సహించిన మేధావులను, ప్రొఫెసర్లను నరికి చంపాడు. ఆ పోరాటాన్ని సమర్థించిన ప్రొఫెసర్ కమాలా హాసను కూడా బంగ్లా దేశానికి విముక్తి లభించిన రోజునే కాల్చి చంపాడు. తాను ఒక వ్యక్తి చనిపోయినంత మాత్రాన ఉద్యమం ఆగిపోతుందని అనుకోవడం వారి భ్రమ. 'ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు. ఒక నెత్తుటి బొట్టు

లోన ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లీ అని ఇక్బాల్ పాత్రచేత పలికిస్తాడు రచయిత. ఈ నాటకం లో సహితం ఒక దేశభక్తుని మరణంలో ఉద్యమం ఆగిపోదని మరింతగా ప్రజ్వరిల్లుతుందని సూచించాడు రచయిత చిరంజీవి.

ఈ నాటకం బంగ్లా విముక్తి ఉద్యమాన్ని ప్రేరణగా తీసుకొని రాసినా, ఈ నాటి అనేక విముక్తి పోరాట, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడుతున్న దేశాల సామాజిక వాస్తవికతకు అద్దం పడుతుంది. మానవ విలువల కోసం, శ్రేయస్సు కోసం పాటు పడుతున్న ప్రతి దేశం, జాతి పోరాటానికి ప్రతీక ఈ నాటకం.

## పొలిట్రిక్స్ :

'పొలిట్రిక్స్' - రాజకీయ వ్యంగ్య వ్యాఖ్యానాల సంధించిన విలక్షణ నాటక ప్రయోగం. ఇది రంగస్థలం మీద ప్రయోగించడానికి రాసినదైనా వీధి నాటికగా కూడా ప్రదర్శించవచ్చు. నేటి రాజకీయాలకు చెందిన ఈ ఆధునిక వీధి నాటికను ప్రజా నాట్యమండలి హైదరాబాద్ నగరశాఖ దేశిరాజు హనుమంతరావు దర్శకత్వంలో ప్రదర్శించింది. వాడవాడలా వీధి వీధినా తిరిగి దాదాపు నూటయాభై ప్రదర్శనలిచ్చారు.

ఇతివృత్తం : ఒక ఊరిలో భారతమ్మ అనే ఇల్లాలు బావి (నూతిలో) లో పడింది. ఆ ఇల్లాలిని బయటకు తీయడానికి గ్రామస్థుల ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నాన్ని అడ్డుకుంటాడు, ఆ ఊరి గూండా. బావిలో పడిన భారతమ్మను బయటకు తీయడానికి ఖర్చు అవుతుందని అసలు కాదని మరెవడైనా ఆమెను తీయడానికి ప్రయత్నిస్తే చంపుతానని బెదిరిస్తాడు. ఆ ఖర్చును భరించడానికి సిద్ధపడిన గ్రామస్థులను అలాగే ఉండమని చెప్పి భారతమ్మను బావి నుండి తీయడానికి ఎంత ఖర్చు అవుతుందో అనపై పెత్తనం

చెలాయించే రాజకీయ నాయకులను అడగటానికి వెళ్తాడు కూడా. ఆ సమయంలోనే అటుగా వచ్చిన ఒక రాజకీయ నాయకుడు భారతమ్మను బావిలో నుండి బయటకు తీయడానికి పదేళ్ళు పడుతుంది, అలాగే దేశంలోని నిరుద్యోగం, పేదరికం, అరాచకం చివరకి ప్రజానీకాన్ని కూడా రూపుమాపడానికి పదేళ్ళు పడుతుందని చెప్పి భారతమ్మను బావినుండి బయటకు తీయకుండానే వచ్చిన దారినే వెళ్తాడు. అతడటు వెళ్ళగానే ప్రతిపక్షనాయకుడైన మరో రాజకీయ నాయకుడు వస్తాడు. బావిలో పడిన భారతమ్మను పైకి తీసే ప్రయత్నం చేయకుండానే చనిపోయిందని భావించుకొని సంతాపంగా రెండు నిముషాలు మౌనం పాటించి వెళ్తాడు. బావిలో పడిన భారతమ్మను పైకి తీస్తానంటున్న ఒక యువకుడిని ఎవరూ ఆ బావి దగ్గరకే రానీయరు. ఇంకొక నాయకుడు వస్తాడు. బావి దగ్గరకు వచ్చి భారతమ్మను బావిలోనుండి బయటకు తీసినట్లు అభినయించి, ఆ అభినయంలోనే ప్రజలకు కూడా వాగ్దానాలు చేసి వెళ్తాడు. చివరకు భారతమ్మను రక్షించటానికి ధైర్యంతో ముందుకు వచ్చిన యువకుడికి గ్రామస్థుల తోడ్పాటు అందించటంలో కథ ముగుస్తుంది.

విశ్లేషణ : ప్రయోగాత్మకమైన నాటకం యిది. నటులు అనుకరించిన పద్ధతిలోనే నటించడం. తమ పాత్ర పూర్తికాగానే నిష్క్రమించడం ప్రయోక్తతో సహా రంగస్థలం మీదికి రావడం మధ్య మధ్య ప్రయోక్త వ్యాఖ్యానం చేయడం, మొదలగునవి ప్రయోగాత్మకంగా ఉన్నాయి. నటులు, ప్రేక్షకులు ఒకటే కావడం ఇందులో కనిపిస్తుంది. ప్రేక్షకులు కూడా నాటకంలో పూర్తిగా తాదాత్మ్యం చెందకుండా ఇది నాటకం చూస్తున్నాం అని ప్రేక్షకులకు తెలిసే లాగున ప్రయోక్త వ్యాఖ్యానం బాగుంది. ఈ పొలిటిక్స్ నాటకం నేటి వర్తమాన రాజకీయాలకు కార్టూన్ లాంటిది. పాత్రలన్నీ ప్రతీకాత్మకాలే. ఏకోన్ముఖ వికసన పాత్రలు. వర్తమాన సమాజంలో (దీనమాల) భారతమ్మ నాశిలో పడింది. అంటే భారతదేశం అధోగతిలో పడింది. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ప్రజలు పూర్తిగా అణగదొక్కబడుతున్నారు దేశ ఆర్థిక పరిస్థితి రాను రాను దిగజారిపోతుంది. ధరలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం పెరుగుతుంది, పేదరికం విలయ తాండవం చేస్తుంది. వీటన్నింటి నుంచి దేశాన్ని రక్షించే వారు పాలకులు. కాని నేటి రాజకీయ నాయకులు

ఆగలేదు, అధికారదాహానికి అలవాటుపడి ప్రజలను పూర్తిగా మరిచిపోయారు, మరిచిపోతున్నారు. తమను ఓట్లేసి గెలిపించిన ప్రజలకు అబద్ధాల వాగ్దానాలు చేసి ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి మభ్యపెడుతున్నారు నేటి రాజకీయ నాయకులు. ఈ విషయాన్ని రచయిత వ్యంగ్యంగా చిత్రించాడు. ప్రజానాయకుడెవరైనా దేవమాతను రక్షించడానికి ప్రయత్నించినా వారిని కూడా రాజకీయ నాయకులు తమ అధికారంతో, గూండాలతో అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ దేశాన్ని ఒకవైపున కుటిల రాజకీయ నాయకులు, మరోవైపున టెర్రరిస్టులు, ఇంకోవైపున మతోన్మాదులు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. వీరి నుండి భారతమాతను రక్షించేవారెవరో లేరా అని ప్రశ్నిస్తున్నాడు రచయిత. ఒకవేళ రక్షించడానికి ప్రయత్నించినా ఆ ప్రయత్నానికి రాజకీయనాయకులు ఎలా అడ్డుపడుతున్నారో కళ్ళకు కట్టినట్టు చూపించాడు రచయిత. ఇది ఒక డాక్యుమెంటరీగా సాగిన నాటకం. ఇతివృత్తం బలమైంది, చాలాగొప్పది. ప్రయోగం కూడా కొత్తది. ప్రతికాలానికి సార్థక్యం ఉంది. ప్రయోక్త వ్యాఖ్యానానికి ఇందులో ప్రాధాన్యం.

ఈ నాటకం ఈనాటి మనదేశ రాజకీయ
సామాజిక పరిస్థితిని కళ్ళకుగట్టినట్లుగా చూపిస్తుంది.
బావిలో పడిన భారతమ్మను భారతదేశానికి సింబాలిక్ గా
తీసుకొని ఈనాటి భారతమాత ఎంత ప్రమాదకర పరిస్థితులలో
ఉందో చూపిస్తూ బావిలో పడిన ఆ అమ్మను ఎవరు
రక్షిస్తారు? గూండాలా? రాజకీయనాయకులా? పైరవీకారులా?
మతగురువులా? వారి మనస్తత్వాన్ని పాత్రల ద్వారా చూపించి
చివరకు చైతన్యయుతమైన వర్గం దేశాన్ని రక్షించకుండా
ఎన్ని అడ్డంకులో కూడా వివరిస్తుంది నాటకం.

## మహానిష్క్రమణం :

'మహానిష్క్రమణం' రచయిత చిరంజీవి రాసిన రేడియో నాటకం. 1991 లో రాయబడింది. కుటుంబ వ్యవస్థను సమర్థించటం ఈ నాటక ప్రయోజనం. ఈ నాటక రచనా సంవిధానం ప్రత్యేకమైనది. ప్రాచీన ఆధునిక నాటక రీతులను సమపాళ్ళలో మేళవించి రమ్యంగా చిత్రించిన సజీవ రూపకమిది. రంగస్థల ప్రదర్శన కోసం రాసిన ఈ నాటకం మొదట రేడియోలో శ్రీమతి శారదా శ్రీనివాసన్ నిర్వహణలో హైదరాబాద్ కేంద్రం నుంచి 22-12-91 న ప్రసారమై ఎన్నో మెప్పుల్ని ఆర్జించి ఆలిండియా రేడియోకు 1991 వ సంవత్సరానికి జాతీయస్థాయి శ్రవ్య నాటక పోటీలలో బహుమతి సాధించి పెట్టింది.

**ఇతివృత్తం :** తపోనిష్ఠాగరిష్ఠుడైన మహాముని కుమారిలుడు భర్తృహరి మహారాజుకు ఒక దివ్యఫలాన్ని బహుకరిస్తాడు. అది జీవఫలం సూర్యభగవానుని ప్రసాదం. దానిని సేవించిన వారు జరామరణాలు లేకుండా చిరంజీవులవుతారంట

సుఖ సంతోషాలతో చిరకాలం జీవిస్తారు. అటువంటి 'జీవఫలం'ను మహారాజు తన ప్రేమకు గుర్తుగా మహారాణి అనంగసేనకు బహూకరిస్తాడు. అనంగసేన ఆ జీవఫలాన్ని తన ప్రియుడైన పల్లకి మోసే బోయి 'సింహసారి'కి బహూకరిస్తుంది. సింహసారి దానిని తన ప్రేయసి 'పూలమాలిక'కు కానుకగా యిస్తాడు. పూలమాలిక ఆ జీవఫలాన్ని తను గాఢంగా ప్రేమించే వసుబంధునికి ప్రేమగా అర్పితం చేసుకుంటుంది. వసుబంధుడు దానిని తీసుకుపోయి నర్తకి 'రసమంజరి'కి ఇస్తాడు. రసమంజరి ఆ జీవఫలాన్ని తన ప్రియుడైన భర్తృహరి మహారాజుకు ప్రేమకానుకగా బహూకరిస్తుంది. ఇలా ఆ జీవఫలం తిరిగి మహారాజుకే చేరుతుంది. ఆ జీవఫలం నీకు ఎవరిచ్చారో చెప్పమని రసమంజరిని బలవంతం చేస్తాడు మహారాజు భర్తృహరి. నువ్వు చెప్పకపోయినా నేను ఊహించగలను ఈ పాడు లోక వృత్తాన్ని నేనర్థం చేసుకోగలను అని అంటూ ఆ జీవఫలాన్ని నేలకేసి బద్దలు కొట్టాడు. చివరకు మహారాజు భౌతిక ధర్మంను వదిలి ధార్మిక జీవితంను స్వీకరించడంతో నాటకం ముగుస్తుంది.

**విశ్లేషణ :** 'మహానిష్క్రమణం' వస్తువు ప్రాచీనమైనది. అందువల్ల నాంది, ప్రస్తావనాది సంప్రదాయ నాటక లక్షణాలతో అది మొదలై క్రమంగా ఆధునిక రూపం సంతరించుకుంటుంది. నాటకంలో సందర్భానుగుణంగా ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్యాలలోని శ్లోకాలనూ, పద్యాలనూ ఉపయోగించుకోవడంలో రక్తి కట్టింది."(1) అని ఈ నాటకాన్ని సమీక్షిస్తూ చైతన్యప్రసాద్ రాశాడు.

జీవఫలం ద్వారా రచయిత చెప్పదలుచుకున్నది ఏమిటంటే ధార్మికత మానవసంబంధాలలో ప్రధానమైన జీవధార. అది లోపించినప్పుడు ఏ జీవఫలం కూడా మానవ సంబంధాలను మాధుర్యం చేయలేదు. రాజు స్త్రీలోలుడు. కాబట్టే అతని పట్టమహిషి అనంతసేన తన ప్రణయానికి ఒక ఆధారాన్ని కల్పించుకుంది. ఆ ఆర్ద్రత అది అంచెలంచెలుగా కొనసాగుతుంది. భౌతికమైన సుఖాలు అవసరాలు కాల్పనికమైన, భావగతమైన రెండు పోలికలుగా పోలి మనకు కనిపిస్తున్నాయి ఇందులో.

---

(1) చైతన్యప్రసాద్ - సమీక్ష - కదిలించే నాటకాలు - ఆటబొమ్మలు - ఆదివారం - ఉదయం

ఉదాహరణకు - మహారాణి అనంతసేనకు మహారాజు భరతవర్మపై ప్రేమ లేదు. మహారాజుకు చాలా మంది భార్యలుంటారు. అందులో రాణి ఒకతె, అంతేకాని రాజుకు రాణొక్కతే భార్య కాదుగా కాని ఆ విషయాన్ని బయట పెట్టలేదు. చివరకు తన పల్లకీ మోసే బోయి సింహసారిని ప్రేమించింది, కాదు కామించింది. ఆ విషయాన్ని కూడా గోప్యంగా ఉంచింది. ఎందుకంటే భౌతిక సుఖాలకు భంగం కలుగుతుంది కాబట్టి.

అలాగే సింహసారికి అనంతసేనపై ప్రేమలేదు తనకూ భౌతికావసరాల కోసమే బయటపడలేదు.

పుష్పమాలికకు సింహసారిపై ప్రేమ లేకపోయినా భౌతిక సుఖాల కోసం అతడి ప్రేమను తిరస్కరించలేదు. అలాగే వసుబంధుడు కూడా. రాజనర్తకికి మహారాజు పట్ల నిజంగానే ప్రేమ ఉందా? లేదా రాజు సమకూర్చే భౌతికావసరాలకోసమే ప్రేమను నటించిందా?

< కాల్పనిక ప్రణయం, విశృంఖల ప్రణయం వ్యవస్థాగతమైన ధార్మిక దాంపత్యం - ఈ మూడు మూడు శాఖలుగా

మానవ సంస్కృతి ప్రారంభమైన నాటి నుండి ఉన్నాయి.

ఈ నాటకంలో కాల్పనిక ప్రణయం భౌతికావసరాల ముందు ఓడిపోయినట్లు కనిపిస్తుంది. అందుచేత భౌతికావసరాలను మించి ప్రకాశించేది ధార్మిక ప్రణయమే. అందుకే రాజు భౌతిక జీవితం వదిలి ధార్మిక జీవితాన్ని స్వీకరించినట్లు రాసాడు రచయిత.

"పరస్త్రీ గమ్యం నుంచి నివృత్తి కలగటానికి, గమ్యాగమ్యాలను అవగతం చేయటానికి స్థిర నిబంధన హేతువైన వివాహ వ్యవస్థను అథవా లోక వ్యవస్థను సుదృఢం చేయడానికే ఈ నాటకం" (పు. 238) అని రచయిత నాటకం చివర రాసుకున్నాడు.

ఈ నాటకం ఒక ఫాంటసీ. అద్భుత కల్పన. చారిత్రక నేపథ్యం కాని, పౌరాణిక నేపథ్యంగాని లేదు. ఇందులోని పాత్రలన్నీ కల్పితాలే. ఏ పాత్రలోనూ స్థిరత్వం లేదు. సంఘర్షణ కనిపించదు. మానవత్వం లేదు. ప్రేమ ఉందని అంటారు గాని చాంచల్య రహితమైన, నిర్మలమైన ప్రేమ కాదు.

బహుశః స్త్రీ పురుష మనః ప్రవృత్తులు ఇలా ఉండటం వివాహ వ్యవస్థకి, మానవ సమాజానికి కూడా శ్రేయస్కరం కాదని రచయిత అభిప్రాయం అయి ఉండవచ్చు. మొత్తం మీద జీవ ఫలాన్ని ఎవరికి వారే తాను చిరంజీవిగా ఉండాలనుకుంటే దానికి మారుగా ప్రతి ఒక్కరూ ప్రేమాస్పదులైన మరొకరికి అర్పించుకోవటం ఇందులోని విశేషం. మనిషిలోని తనని అన్వేషణా తీరుని చిత్రించే నాటకం ఇది. ప్రతి మనిషి ఏదో కావాలని అన్వేషిస్తుంటాడు. ఒక దశలో అది ప్రేమ అని భ్రమ పడతాడు. నిజానికి మనిషి ఒంటరి. అతనికి నిజమైన శాంతి తనలోకి తాను చూసుకున్నప్పుడే కలుగుతుంది. మరొకరి నుండి ఈ శాంతి ఏ మనిషికీ ఎప్పుడూ దొరకదు. ఈ జీవిత సత్యాన్ని వ్యంగ్యంగా చిత్రించే నాటకం ఇది.

## నర్తనశాల :

ఇతివృత్తం: రాధ తండ్రి ఒకరోజు మూర్తిని తీసుకొచ్చి రాధకు పరిచయం చేస్తాడు. మూర్తి, రాధల పరిచయం క్రమంగా స్నేహంగా మారుతుంది. తాను రచించిన ఒక నాటకంలో రాధకు కథానాయిక పాత్రనిస్తాడు మూర్తి. మూర్తి మిత్రుడు మురళి. మురళి, మూర్తి రాసిన పాటలను రేడియోలో పాడుతుంటాడు. మురళి పరోక్షంగానే రాధకు అతని గురించి అన్ని వివరాలు చెప్తాడు మూర్తి. ఏడుకొండలు రాధకు మేనత్త కొడుకు-బావ. రాధ తండ్రి మాస్టారు ఉద్యోగం నుండి రిటైర్ అయి ప్రైవేటు క్లాసులు చెప్పుకుంటాడు. ఒకరోజు మూర్తి మురళిని తీసుకొని రాధ ఇంటికి వస్తాడు. అక్కడ మూర్తి రాసిన ఒక పాటను మురళి పాడటంతో రాధ మనసు పూర్తిగా మురళి వైపు మొగ్గుచూపుతుంది. ఈ విషయం తెలియని మూర్తి రాధను ప్రేమిస్తాడు. అయితే ఏడుకొండలు కూడా రాధను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమిస్తాడు. ఆమెకోసం సర్వం సమర్పించుకోడానికి కూడా సిద్ధపడతాడు. ఈ లోపున ఏడుకొండలు తల్లి నుంచి మాస్టారుకి ఉత్తరం వస్తుంది. అందులో ఏడుకొండలకి

వెంటనే రాధను ఇచ్చి పెళ్ళి చేయాలని అలా జరగని యెడల తనకు ఇవ్వాల్సిన బాకీని అణా పైసలతో సహా చెల్లించమని సారాంశం ఉంటుంది. అయితే రాధ మురళిని ప్రేమించడంతో ఏడుకొండలుతో పెళ్ళికి నిరాకరిస్తుంది. తన్ను ప్రేమిస్తున్నానని చెప్పిన మూర్తిని తిరస్కరిస్తుంది. మురళిని ప్రేమిస్తున్నానని చెప్తుంది. రాధ తనను ప్రేమించిన విషయం తెలియని మురళి ఇంకొక అమ్మాయితో పెళ్ళి సంబంధం కుదుర్చుకోవానికి ప్రయత్నిస్తాడు. ఈ విషయం తెలియడంతో రాధ ఆత్మహత్యకు పాల్పడి ఒళ్ళు కాల్చుకొని కళ్ళు పోగొట్టుకుంటుంది. రాధ ఆత్మహత్య ప్రయత్నానికి కారణం తానే అని అనుకున్న మురళి పెద్దలు కుదిర్చిన పెళ్ళిని రద్దు చేసుకొని రాధను పెళ్ళి చేసుకుంటానంటాడు. అయితే రాధ తిరస్కరిస్తుంది. దీంతో నిరాశుడైన మురళి ఆత్మహత్య చేసుకుంటాడు. మురళి ఆత్మహత్య చేసుకోవడంతో పిచ్చివాడైపోతాడు మూర్తి. ఆ సమయంలో గాలివాన రావడం పిడుగు పడిన ధ్వని రావటంతో పక్కను కూలిపడిపోతున్న రాధని ఏడుకొండలు చేతుల్లోకి తీసుకోవడంతో నాటకం ముగుస్తుంది.

<u>విశ్లేషణ</u> : కాల్పనిక ప్రేమ, త్యాగాలతో కూడిన నాటకం ఇది. ఈ నాటకంలో చిరంజీవి రాసిన 'మహానిష్క్రమణం'[1] ఛాయలు కనిపిస్తున్నాయి. పరస్పరం ప్రేమను అందుకోలేక అసంతృప్తితో, అశాంతితో రోదిపోయిన హృదయాల చిత్రీకరణే ఈ నాటకం. మహానిష్క్రమణంలో రాజు-రాణిని ప్రేమిస్తే, రాణి-తన పల్లకి మోసే బోయీని ప్రేమిస్తే, బోయీ-పూలమాలికను ప్రేమిస్తే పూలమాలిక-వసుబంధుడిని (కవిని) ప్రేమిస్తే కవి-నర్తకి (శశిరంజని)ని ప్రేమిస్తే నర్తకి రాజుని ప్రేమిస్తుంది. చివరకి ప్రేమ రాజు మహానిష్క్రమణానికి దారితీసింది.

ఈ నాటకంలో కూడా ఏడుకొండలు రాధను ప్రేమిస్తే, రాధ-మురళిని ప్రేమిస్తుంది. మూర్తి-రాధను ప్రేమిస్తాడు. ఇలా ఒకరి ప్రేమను మరొకరు అర్థం చేసుకోకుండా ఎవరికి వారు ఏక పక్ష ప్రణయంగా నిలిచిపోతుంది. నాటకంలో మురళి మూర్తి మనసుని అర్థం చేసుకుని త్యాగం చేస్తాడా లేక

---

(1) కే. చిరంజీవి - ఆటబొమ్మలు - మహానిష్క్రమణం.

మురళికి రాధ మీద ఏ విధమైన ప్రత్యేక అభిమానం లేకన్నా-
ఆ విషయం స్పష్టంగా లేదు.

నాటకం లో నాటకం ఉండటం ఈ అంతర్నాటకంలో నాటకం లోని పాత్రల జీవితాలకు సంబంధం ఉండటం ఈ నాటకం లోని ఒక విచిత్ర ప్రయోగం.

ఈ నాటకం లో మూర్తి నోట పలికించిన

" మురళీ! తల్లి లేని పిల్లల్నెప్పుడైనా చూసావా? మొలకింద గుడ్డ కట్టుకొని పశువుల్లాగా బండ్లు నీడ్చే వయో వృద్ధుల్నెప్పుడూ నీ కళ్ళ బడలేదా? వజ వజ లాడుతున్న చలిలో కప్పుకునేందుకింత చింకి పాతయినా లేక ఆకులా అల్లాడిపోయే వృద్ధమాతల్నెప్పుడూ నీ కళ్ళనిపించలేదా? జానెడు పొట్టకోసం ప్రాణాలకంటే ఎక్కువైన మానాభిమానాలను నాల్గుగాల కమ్ముకోవడం నీకు తెలుసా? చెత్త కుండీల వద్ద ఎంగిలాకుల కోసం కుక్కలతో, కాకులతో కాట్లాడే మనుష్యుల్నెరుగుదువా నువ్వు? నవ్వను, మనిషిని మనిషి రక్షా అని ఒక మెత్తల బండిని సృష్టించి లాగుతున్న ఈ బానిస సమాజంలో నేను నవ్వను మేడిపండులా

పైకి మెరుస్తూ లోపల లొటలొటలాడిపోతున్న ఈ నాగరికతల భ్రష్ట పటల మర్మస్థానాల వరకు నేను నవ్వను. ఎక్కడో ఏ అశ్రువు రాలినా, కన్నీటి చుక్కలు చిందినా నేను నవ్వలేనురా మురళీ! నేను నవ్వలేను" (పు. 105) అనే మాటలు 'తిలక్' ఆర్తగీతం లోని

" ఒక్క నిరుపేద వున్నంతవరకు ఒక మలినాశ్రు
బిందు వొరిగినంత వరకు,
ఒక్క పసి ఊపిరి కవిలినంత వరకు,
ఒక్క కుష్ఠ స్తన్య సన్నిధిని క్షుధార్త తొప్పు పసిపాప
ఉన్నంత వరకు,
ఒక తల్లి నీరవాక్రోశ రవమ్ము విన్నంతవరకు,
ఒక క్షత దుఃఖిత
హృదయ మూలగిల్లనంత వరకు,
నాకు శాంతి కలగదింక నేస్తం, నేను నిర్విణ్ణుడైనాను,
ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేను"① అనే

---

① దేవరకొండ బాలగంగాధర తిలక్ - 'అమృతం కురిసిన రాత్రి' - ఆర్తగీతం-

మాటలను స్ఫురింప చేస్తున్నాయి. ఈ నాటకానికి అభిప్రాయం రాస్తూ స్థానం నరసింహారావు

"ఈ నాటకానికి హృదయం 'ప్రేమ' ఈ ప్రేమ నాల్గు విధాల మనస్తత్వపు పాత్రద్వారా ఈ నాటకంలో వాడబడింది. అందులో మనస్సుల సంఘర్షణ పోరిపిడిలో మరింతగా బడలి వాడి పోతుంది. చివరకు వాటి అవ్యక్త విహారంలో వారికే యెదురు తిరిగిన వాడిగల కత్తి అవుతుంది. ఈ కత్తికి రెండు వైపులా పదునుంటుందనీ, దాని వాడకంలో సరసంగా విచక్షణగా ఉండాలని, అది లేకుంటే ఆ ప్రేమికుల కంఠాల్నే ఒకొక్కప్పుడు తెగ్గోసుకు పోతుందని ఇందలి పాత్రల ద్వారా నిరూపించారు రచయిత."① అని స్థానం నరసింహారావు ఈ నాటకానికి తన అభిప్రాయం వెలిబుచ్చారు.

వర్తన బాల అన్వేషణ ప్రధానంగా సాగిన నాటకం. ఇక్కడ కళకోసం, కళా కళ్యాం కోసం అన్వేషణ.

---

① స్థానం నరసింహారావు - వర్తనబాల - 'అందని పిలుపు'. పదవ స్థానం వారి అభిప్రాయం

అమాయకుల సౌందర్యాన్ని ఆరాధిస్తే, సౌందర్యం నాయకుణ్ణి ప్రేమిస్తే, కవి కళను అభిమానిస్తే ఈ అన్వేషణాలన్నింటి మధ్య జీవిత పరమార్థం ఏమిటో అర్థం కాక తల్లడిల్లి చివరికి మానవత్వానికి ఆధారమైన నిస్వార్థం, మమతనే నమ్ముకున్న స్త్రీ జీవితం చుట్టూ అల్లుకొన్న నాటకం ఇది. ఈ నాటకం లోని ప్రేమలు - త్యాగాలు - ఆత్మహత్యయత్నాలు అన్నీ కాల్పనిక శాఖకు చెందినవి. అయితే ప్రేమ యొక్క ఔచిత్యాన్ని ప్రేమను సక్రమమైన మార్గంలో అన్వయించుకోకుండా కలిగే దుష్ఫలితాన్ని చూపిస్తాడు రచయిత. మురళి తనను రాధ ప్రేమిస్తుందని తెలుసుకోక ఆమెకు మనస్తాపాన్ని కల్పించి ఆమె గుడ్డితనానికి కారణమైతే. గుడ్డితనానికి జాలిపడి దయార్ద్ర హృదయం వల్ల పెళ్ళి చేసుకోవడం ప్రేమ అనిపించదు. అని మురళిని తిరస్కరించటం అనేది మురళి మరణానికి కారణమౌతుంది. అందుకే మూర్తి పాత్రద్వారా ప్రేమ గుడ్డిది, ప్రేమ పిచ్చిది, ప్రేమ మృత్యువు అని చెప్పించడం

కళ్ళకు కడి పెట్టిస్తుంది. ఆలోచింపచేస్తుంది.

మొదట ఈ నాటకం పేరు పరిష్కృతి అర్థాల 'అందని పిలుపు'గా రూపాంతరం చెంది స్థానం నరసింహారావు ఆధ్వర్యంలో ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా రేడియోలో ప్రసారమైంది. అయితే ఈ నాటకం పాత్రధారుల వాచికాభినయం మీదనే ఆధారపడి ప్రసారం కావటం వలన, ఆ భావాలను రంగస్థలం మీదికెక్కించడంలో తగినంత శ్రద్ధ తీసుకొని అందులో కొన్ని మార్పులు, చేర్పులు చేసి 'నర్తనశాల' అనే పేరుతో రంగస్థల నాటకం రాసాడు. ఈ నాటకంలోని పాటలను దాశరథి రంగాచార్య, వెల్లట్ల వెంకటేశ్వర్లు రచించారు. దీనిని 1965 డిసెంబరు 11న M.V. సత్యనారాయణ దర్శకత్వంలో రవీంద్ర భారతిలో ప్రదర్శించారు.

## దేవుడెరుగని నిజం :

ఇతివృత్తం:- సుబ్బరాజు, కృష్ణబాబు ప్రాణస్నేహితులు.
సుబ్బరాజు ఒక భూస్వామి కొడుకు. పట్నంలో ఒక ఇల్లు తక్కువ ధరలో దొరకడంతో దానికి డబ్బు కట్టడానికి పట్నం వచ్చి పోలీస్ ఇన్స్పెక్టరయిన కృష్ణబాబు ఇంటిలో ఆ రాత్రికి మకాం పెడ్తాడు. సుబ్బరాజుతో పాటు అతని బావమరిది రమణమూర్తి కూడా పట్నం వస్తాడు. అయితే సెకండ్ షో సినిమాకని బయటకు వెళ్తాడు. కృష్ణబాబు, సుబ్బరాజు ఇద్దరూ కలిసి మందు తాగుతూ మాట్లాడుకుంటుంటారు. అప్రయత్నంగా కృష్ణబాబు సుబ్బరాజు దగ్గరున్న డబ్బు ప్రస్తావన తెచ్చి నేను నిన్ను చంపి డబ్బు తీసుకుంటే ఏమి చేస్తావని ప్రశ్నిస్తాడు. లేదా ఎవరైనా దొంగలు వచ్చి మనల్ని కట్టిపడేసి డబ్బు తీసుకెళ్తారేమో అని అనుమానం వ్యక్తం చేస్తాడు. నిజంగానే ముగ్గురు దొంగలు వచ్చి వాళ్లిద్దరిని కట్టిపడేసి డబ్బు తీసుకెళ్తారు. మిత్రుల మధ్య మనస్పర్థలు వస్తాయి, సుబ్బరాజు, కృష్ణబాబుని నిందిస్తాడు. నా ప్లాను ప్రకారమే ఆ దొంగలు వచ్చి డబ్బు తీసుకెళ్లారు కాబట్టి ఆ పని నామే చేయించావని అంటాడు. దాంతో కోపం వచ్చిన

కృష్ణబాబు ఆన రివాల్వర్ తో సుబ్బరాజుని కాల్చి పారిపోతాడు. కొంచెం సేపటికి సుబ్బరాజు బావమరిది రమణామూర్తి వస్తాడు. విషయమంతా గ్రహిస్తాడు. సుబ్బరాజుని ఆట్టే లేపుతాడు. నేను చావలేదా? నన్ను కృష్ణబాబు రివాల్వర్ తో కాల్చాడేమో అని సందేహపడతాడు. దొంగతనం జరిగిందని డబ్బు దొంగలు తీసుకెళ్ళారని చెప్తాడు. నేను ముందే అనుకున్నాను, ఇలాంటి దేదో జరుగుతుందని అందుకని కృష్ణబాబు రివాల్వర్ లోని నిజమైన తూటాలు తీసేసి ఉత్తకాయల తూటాలు పెట్టి, సినిమాకు పోయానని రమణామూర్తి చెప్తాడు దాంతో సుబ్బరాజు అనుమానం రమణామూర్తి మీదికి వెళ్తుంది. డబ్బును నీవే దొంగిలించావంటూ, రమణామూర్తి గొంతు పిసికి చంపేయటంతో నాటకం ముగుస్తుంది.

<u>విశ్లేషణ:</u> ఇది ప్రయోగాత్మకమైన నాటకం. ధనస్వామ్య యుగంలో డబ్బుకు మించిన విలువ లేదు అని చెప్తాడు రచయిత ఈ నాటకం ద్వారా. డబ్బు వల్లనే మిత్రుల మధ్య ఆర్థిక ఆలోచన ఏర్పడ్డం అది అనర్థాలకు దారితీయడం, మరణాలకు కారణమవడం చూపిస్తాడు.

"మనం ధనస్వామ్యంలో ఉన్నాం అంటే డబ్బే ప్రధానమైన పాడు వ్యవస్థ. ఈ సామాజిక వ్యవస్థలో డబ్బు ఎంత పాపిష్టి పని చేయిస్తుందో, ఆ పాపిష్టి డబ్బు కోసం ఎవడెవడు ఎలాంటి గడ్డి తింటాడో, ఎవడికీ ఆ పైనున్న భగవంతుడికి కూడా తెలియదు. స్నేహం లేదు, చుట్టరికం లేదు. ఆత్మ లేదు, పరమాత్మ లేదు అన్నిటిని డబ్బు కోసం చంపెయ్యడమే" ([illegible]) అని రచయిత చెప్తుంటాడు. ఈ నాటకంలో సరిగ్గా పై విధంగానే జరిగింది. సుబ్బరాజు డబ్బు చూడగానే అతని ప్రాణస్నేహితుడైన కృష్ణబాబు స్నేహాన్ని మరచిపోయి, ఆ డబ్బును ఎలా కాజెయ్యాలని ప్లాను వేస్తుంటాడు. చివరకు డబ్బు దొంగిలించబడింది. నిజంగానే ఆ దొంగతనంలో కృష్ణబాబుకి సంబంధం లేదా? లేక అతనే ప్లాను వేసి దొంగతనం చేయించాడా అన్నది ఈ నాటకంలో స్పష్టం కాదు. అలాగే సుబ్బరాజుతో పాటు ఉన్న అతని బావమరిది రమణమూర్తి ఆ రోజు నిజంగానే సెకండ్ షో సినిమాకు వెళ్లాడా? లేక బావ దగ్గరున్న డబ్బును దొంగిలించటానికి ప్లాను వేసి ఇంకో ఇద్దరితో కలిసి దొంగతనం చేయడానికి

కృష్ణబాబు ఇంటికి వచ్చాడా? కాకపోతే అతను సినిమాకు వెళ్తూ వెళ్తూ కృష్ణబాబు రివాల్వర్ లాంటి ఫోటోలు ఎందుకు తీసినట్టు? కారణమడిగితే ఇలాంటిదేదో జరుగుతుందన్న అనుమానం లానే (కృష్ణబాబుపై) ఫోటోలు తీసాను అంటాడు. కృష్ణబాబు కూడా సుబ్బరాజుతో అంటాడు. ఈ దొంగల్ని మా బావమరిది కూడా ఉన్నాడు. మూడో దొంగ ఎత్తు, లావు అచ్చం మా బావమరిది లాగానే కనిపిస్తున్నాడు — లేకుంటే ఇద్దరు దొంగలు మాట్లాడినా, ఆ మూడో దొంగ ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నిస్తాడు. ఈ రకంగా డబ్బు ముందు బంధుత్వం, స్నేహం పనికి రాకుండా పోతుందని రచయిత ఆవేదన వ్యక్తం చేస్తాడు. ప్రాణ స్నేహితులు కూడా డబ్బుకోసం ఒకరినొకరు చంపుకోవటానికి ప్రయత్నిస్తారు. డబ్బు కళ్ళ పడగానే ఎలాంటి మనుష్యుల్లోనైనా అంతకు ముందున్న ఆలోచనలు పోయి పరమ దుర్మార్గపు ఆలోచనలు వస్తాయి. అన్ని విలువల కంటే డబ్బు విలువ పెరిగిపోయిందీ లోకంలో అంటాడు రచయిత.

## ఇక్కడ పెళ్ళి చేయబడును :

'ఇక్కడ పెళ్ళి చేయబడును' వ్యంగ్య హాస్య నాటిక- విడాకులు అవసరమా? కాదా? అనేది ఆనాటి సమాజంలో వివాదాస్పద సమస్య. కొందరు స్త్రీ వాదులు విడాకులు "అమలులోకి రావలసిందే" అని ప్రతిపాదిస్తోంటే సమన్వయ వాదులనేకులు వివాహ వ్యవస్థ సమాజానికవసరమని చిన్నచిన్న తగవులాటలకి భార్యాభర్తలు విడాకుల దాకా పోనవసరం లేదని భావించారు. ఈ నాటికలో చిరంజీవి అతిచిన్న తగవుకు విడాకుల దాకా వెళ్ళిన భార్యాభర్తలు ఎంత సునాయాసంగా కలిసి పోయారో హాస్యరసాత్మకంగా చూపించారు.

**ఇతివృత్తం :** కొత్తగా పెళ్ళి చేసుకున్న భార్యాభర్తలిద్దరు ఒక రోజు షికారు కోసం బయలుదేరతారు. రోడ్డుమీద నడిచి వెళ్తున్న సమయంలో అమ్మాయి కాలుచెప్పు తెగుతుంది. చెప్పు రిపేరు కోసం దగ్గరలో ఉన్న చెప్పుల షాపుకు వెళతారు. అక్కడ కొత్త చెప్పులు కొనిస్తానని అబ్బాయినారు, లేదు పాత చెప్పునే రిపేరు చేయించుకుంటానని అమ్మాయినారు.

పట్టుపట్టడంలో ఇద్దరూ మాటామాటా అనుకుంటారు. పంతానికి పోయి ఒకరికొకరు రెండోసారి పెళ్ళి చేసుకోకపోతే చూడు అనేదాక వచ్చి విడిపోతారు. ఆ ఊరిలో ఉన్న మహిళా సమాజం వారి ఆఫీసుకు ఒకరికి తెలియకుండా మరొకరు వచ్చి పెళ్ళి చేసుకోవాలని ఉందని ఎటువంటి అమ్మాయినైనా సరే పెళ్ళి చేసుకుంటానని అబ్బాయిగారు, ఎటువంటి అబ్బాయినైనా సరే పెళ్ళి చేసుకుంటానని అమ్మాయిగారు చెప్పి పెళ్ళి చేయడం కోసం ఫీజు కింద డబ్బులు కడతారు. ఆ ఆఫీసులో వీరిద్దరి వాలకం చూసి ఆఫీసు వారు పిచ్చి డాక్టరును పిలిపిస్తారు. చివరకు వీరిద్దరూ భార్యాభర్తలని తెలిసి సర్దిచెప్పి ఇంటికి పంపడంతో నాటకం ముగుస్తుంది.

విశ్లేషణ: ఇది పూర్తిగా హాస్య నాటిక. నాటకమంతా హాస్యంతో కూడిన సంభాషణలు ఉన్నాయి. పురుష పాత్రకు అంతమ్మ అని స్త్రీలింగం పేరు పెట్టడం. పిచ్చిడాక్టరుకి ఊత పదాన్ని కల్పించడం, మహిళా సమాజం ప్రెసిడెంట్ ప్రతిసారి ఛీ ఛీ ఛీ ఛీ అని కూలబడి పోవడం — మొదలైనవన్నీ

హాస్యం తెప్పిస్తాయి. ఈ నాటకం ద్వారా భార్యాభర్తల మధ్య పోట్లాటలు నీటి మీద గీతల వంటివని - రచయిత చెప్పదలచుకొన్నట్లున్నాడు. ఇందులో భార్యాభర్తల మధ్య అపార్థాలను సరిదిద్దే ప్రయత్నం కనబడుతుంది. అయితే ఈ దంపతుల మధ్య వచ్చిన పోట్లాటలో గాంభీర్యత లేదు. ఈ పోట్లాట సహితం హాస్యాన్ని సృష్టించే ప్రయత్నంలో ఒక భాగంగా కనిపిస్తుంది. మొత్తం మీద దంపతులు మళ్ళీ పెళ్ళి చేసుకోవడంతో నాటిక సుఖాంతమైంది.

ఈ నాటకంలో వాస్తవ జీవిత సమస్యలేవి చర్చకు రాలేదు. ఆద్యంతం హాస్యరసపోషణ దృష్టిలో ఉంచుకొని ప్రతి సన్నివేశాన్ని తేలికగానే అంటే జీవిత సాఫల్యం జోలికి పోకుండా కేవలం వినోదం కలిగించేలా నిర్వహించాడు రచయిత. ప్రదర్శించినప్పుడు ఖులాసా కాలక్షేపం కలిగించే నాటకం ఇది.

ఈ నాటకం హిందీలోకి అనువదించబడి రేడియో నాటికగా రూపాంతరం చెంది ఆకాశవాణి జాతీయ కార్యక్రమాల్లో ప్రసారమైంది.

# ప్రేమ పక్షులు :

**ఇతివృత్తం:** వైకుంఠం, కైలాసం, నారాయణ ముగ్గురు బ్రహ్మచారులు. వైకుంఠం, కైలాసం ఒకే గదిలో ఉంటారు. నారాయణ వేరే గదిలో ఉంటాడు. వైకుంఠం, కైలాసం ప్రేమ, ప్రేమ అంటూ అమ్మాయిల వెంట పడ్తారు. ఏ అమ్మాయి కూడా వీరిని ప్రేమించదు. ఒక సందర్భంలో నారాయణ వాళ్ళకు 'ప్రేమ్ జీ'ని పరిచయం చేస్తాడు. ప్రేమ్ జీ అమ్మాయిలను ఎలా ప్రేమించాలో, ఎలా ప్రేమిస్తే అమ్మాయిలు వాళ్ళను ప్రేమిస్తారో అనే దానిపై పెద్ద ఉపన్యాసం ఇచ్చి వాళ్ళు ప్రేమించటానికి 'మాయ' అనే అమ్మాయిని పరిచయం చేస్తాడు. అయితే మాయను వాళ్ళిద్దరిలో ఎవరు ప్రేమించాలో అన్న విషయంలో గొడవపడి ఒకరినొకరు కొట్టుకుంటారు. అయితే 'మాయ' మాయ కాదని నారాయణే వాళ్ళిద్దరికీ బుద్ధి చెప్పటానికి రామోజీ అనే నటుడిని 'ప్రేమ్ జీ'గా పరిచయం చేసి వాళ్ళిద్దరికీ బుద్ధి చెప్పించటానికి నాటకం ఆడాడని తెలుసుకొని తమ తప్పు తెలుసుకొని వైకుంఠం, కైలాసం చెంపలు వాయించుకోవడంతో నాటకం ముగుస్తుంది.

<u>విశ్లేషణ:</u> చదువు సంధ్యలు లేక, ఉద్యోగాలు దొరక్క తగిన వ్యాపకం లేక ప్రేమ ప్రేమ అంటూ తిరిగే ఔట్‌సైడ్ రోమియోలకి తగిన గుణపాఠం చెప్పటం వస్తువుగా ప్రేమపక్షులు నాటకం రచించాడు చిరంజీవి. హాస్యరసాత్మకంగా రాసిన ఈ నాటకంలో గాఢత్వం లేదు. హాస్యాన్ని సృష్టించడానికి సంభాషణల్లో ప్రయత్నాలు జరిగాయి. వైకుంఠం - కైలాసం సంభాషణల్లో, ప్రేమ్‌జీ - కైలాసం - వైకుంఠం సంభాషణల్లో, మాయ - వైకుంఠం - కైలాసం సంభాషణల ద్వారా మనను రచయిత కడుపుబ్బ నవ్విస్తాడు. వైకుంఠం, కైలాసంల ప్రేమ కోసం తపించి పోవడం, వారికి బుద్ధి చెప్పటానికి నారాయణ ప్రేమ్‌జీని పరిచయం చేయడం, ప్రేమ్‌జీ వాళ్ళకు ప్రేమను గురించి ఉపన్యాసం ఇవ్వడం, మాయను పరిచయం చేయడం & మాయ వాళ్ళిద్దరిని ఆటపట్టించటం లాంటి సంఘటనల ద్వారా హాస్యాన్ని సృష్టిస్తూనే అంతర్లీనంగా నేటి యువతరంలో ప్రేమపట్ల ఉన్న అభిప్రాయాన్ని, చులకనను ఆక్షేపిస్తాడు. 'ప్రేమ' అనేది హృదయానికి సంబంధించింది గాని శరీరంతో

వచ్చేది, పాపమంటే పోయేది కాదు (పు.172) అని రామోజీ పాత్ర ద్వారా చెప్పిస్తాడు. ఇందులోని ప్రేమజీ పాత్రను గురజాడ 'కన్యాశుల్కం' నాటకంలోని గిరీశం పాత్రలాగా తీర్చిదిద్దటానికి ప్రయత్నం చేసాడు. కాని కుదరలేదు. గిరీశం లాగానే చుట్టతాగటం, ఇంగ్లీషులో మాట్లాడ్డం, సందర్భానికి సంబంధం లేని విషయాలు చెప్పడం, ఉపన్యాసాలు ఇవ్వడం ప్రఖ్యాతి వహించిన రచయితల పేర్లు చెప్పి వారి రచనల్లోని కొటేషన్లు చెప్పడం లాంటి విషయాల్లో ప్రేమజీ గిరీశం పాత్రను అనుకరించడానికి ప్రయత్నిస్తాడు. ఇవన్నీ కూడా హాస్యాన్ని సృష్టించే ప్రయత్నంలో ఒక భాగం. రచయిత ఈ నాటకానికి రెండు రకాలుగా ముగింపునిస్తూ బ్రాడ్ సైడ్ రోమియోల్లాంటి కైలాసం, వైకుంఠం లకు బుద్ధి చెప్పించే ప్రయత్నం చేసాడు

ముగింపులో

1. మాయ పాత్రలో నిజంగానే స్త్రీని ప్రవేశపెట్టడం. ఆమెను ప్రేమించడానికి పోటీలు పడి కైలాసం, వైకుంఠం

కొట్టుకోవడం.

2. నారాయణనే 'మాయ' వేషంలో ముసుగు కప్పి వీళ్ళకు పరిచయం చేయడం. ఆమెను ఎవరు ప్రేమించాలి అనే విషయంలో వీళ్ళిద్దరూ అనుకుంటుంటే నారాయణ అన 'మాయ' వేషం అలంకరించుకొని వీళ్ళ మధ్యకు రావడం.

మొదటి దానిలో ఒక స్త్రీని ప్రేమించడంలో వీరిద్దరూ సుందోపసుందుల్లాగా పరస్పరం కలహించుకోవటం రెండవ దానిలో ద్రౌపది వేషంలో వచ్చిన భీముడిలాగా నారాయణ ఆడ వేషంలో వచ్చి వీరిద్దరికి బుద్ధి చెప్పటం కనిపిస్తుంది.

ఎందరో రామోజీలు మరెందరో నారాయణలు ఎన్ని విధాలుగా బుద్ధి చెప్పినా ఇలాంటి రోడ్ సైడ్ రోమియోల బాధ అమ్మాయిలకు తప్పటం లేదు. సందేశం ఇస్తూనే మంచి కాలక్షేపం కలిగించే నాటకం ఇది.

# రేడియో నాటక రచయితగా

## చిరంజీవి

కావ్యాలను ప్రాచీనాలంకారికులు దృశ్య శ్రవ్య కావ్యాలుగా విభజించారు. ఆ రోజులలో అక్షరాస్యత తక్కువ కావడం, పురాణ కర్తలు, లేక విద్వాంసులు, గుడులలో లేక సత్రంలలో కావ్యాన్ని పఠిస్తూంటే సాహిత్యంలో ఆసక్తి ఉన్నవారంతా విని ఆనందించేవారు. ఆ రకంగా చంపూ కావ్యాలకు, పురాణాలకు శ్రవ్య కావ్యాలని పేరు వచ్చింది. రూపకాదులు, నటీనటులు నటించగా చూసి ఆనందించేవి కాబట్టి రూపక భేదాలన్నింటిని దృశ్యకావ్యాలంటారు.

దృశ్యకావ్యాలలో అంటే రూపక భేదాలలో ఒక విభాగంగా వచ్చిన రేడియో నాటిక నూటికి నూరుపాళ్ళు శ్రవ్య నాటిక. అత్యాధునిక రూపక విభాగ ప్రయోగం. రేడియో (ఆకాశవాణి) కనిపెట్టిన తర్వాతనే ఈ ప్రక్రియ ప్రచారంలోకి వచ్చింది. ఆధునిక తెలుగు సాహిత్యంలోని దాదాపు అన్ని ప్రక్రియలపై ఆంగ్లప్రభావం ఉన్నట్లే తెలుగు రేడియో నాటిక కూడా ఆంగ్ల రేడియో నాటిక ప్రభావంతోనే ఆవిర్భవించి వికసించింది. రేడియో నాటిక విషయంలో అక్షరాస్యతతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు విని ఆనందిస్తారు.

రేడియో నాటికను రూపక విభాగాలలో ఒకటిగా

భావించవచ్చునేమోకానీ లక్షణాలలో దృశ్య నాటికలకు అంటే ఈనాటి ఏకాంకికలకు రేడియో నాటికలకు చాలా భేదాలున్నాయి. రేడియో నాటిక పూర్తిగా ధ్వనిని ఆశ్రయించుకున్న ప్రక్రియ. దీనికి ప్రత్యేక లక్షణాలను ఆంధ్రాంగ్ల సాహిత్యకారులు ఏర్పరిచారు. ప్రస్తుతం రేడియో నాటిక పుట్టు పూర్వోత్తరాలను సక్షిప్తంగా వివరించడానికి ప్రయత్నిస్తాను.

అంధకార యుగం తర్వాత కాలాన్ని 'మధ్యయుగాలుగా' వ్యవహరిస్తారు. పాశ్చాత్య దేశాల్లో ఈ కాలంలో వచ్చిన నాటకరంగంలో ఎన్నో ప్రక్రియలు అవతరించాయి. ప్రార్థనా సంబంధి రూపకాలు, దివ్య లీలా రూపకాలు, నీతి బోధక రూపకాలు, నటులే ప్రధానంగా రచయితలుగా ఉండే రూపకాలు - వంటి ప్రక్రియలు ప్రధానమైనవి. 16, 17 శతాబ్దాల నాటికి Interludes, Folk plays, Drolls వంటివి వచ్చాయి.

పాశ్చాత్య నాటకరంగం గురించి చెప్పేటప్పుడు Shakespeare ను తప్పక గుర్తు చేసుకోవాలి. 16వ శతాబ్దానికి చెందిన Shakespeare ప్రపంచనాటక చరిత్రనే జీవజ్వాలల మైన

కొంతులలో నింపాడు. Shakespeare కాలం నాటికి ఏకాంకిక (One Act Play) చెప్పుకోదగినంత అభివృద్ధి చెందలేదు. పాశ్చాత్యులకు ముడిసరుకు లాంటి ఏకాంకికలు ఏవి అని చెప్పాలంటే, గ్రీకు సాహిత్యంలోని Aeschylus (525-456 B.C) రాసిన 'Agamemnon', Sophocles (496-406 B.C) రాసిన 'Antigone' ప్రధానమైనవి. వీటినే మొట్టమొదటి ఏకాంకికలుగా నాటక విమర్శకులు భావిస్తున్నారు.

ఏకాంకిక ఆవిర్భావానికి ప్రధాన కారణం ప్రేక్షకులకు విసుగు లేకుండా మనోల్లాసం కలిగించడం. "1903 అక్టోబర్‌లో, London, Westend Theatre లో Louis N. Parker రచించిన 'The Monkeys paw' అనే ఏకాంకిక ప్రేక్షకులకెంతగానో నచ్చి, తర్వాత నాటకాలు చూడడం మానివేశారట! జనవ్యవహారంలో ఉన్న హాస్యోక్తుల్ని, పిట్టకథల్ని ఆధారంగా చేసుకొని, రెండు అంకాలకు మధ్య ఉండే విరామ సమయంలో రచించి, ప్రదర్శించేవారు. ఈ రకమైన ఏకాంకికలకు సెట్టింగులవసరముండేది కాదు. అలంకరణాలు కూడా అవసరమయ్యేది కాదు. తెర ముందే

స్వల్ప వ్యవధిలో ప్రదర్శించి నటులు నిష్క్రమించేవారు.[1]

<u>పాశ్చాత్య రేడియో నాటిక</u> - <u>ఆవిర్భావ వికాసాలు</u>:

ఒక కొత్త ప్రసార సాధనమైన రేడియో నాటిక రచన ప్రాథమిక సూత్రాల్ని అర్థం చేసుకునేందుకు యూరప్ రచయితలకు కొంత కాలం పట్టింది. 'మాట్లాడు! నేనిన్ను చూడాలి' (Speak so that I can see you) అనేది రేడియో నాటికలపై రాసిన ఒక జర్మన్ పుస్తకం శీర్షిక. దీనికున్న స్వేచ్ఛను వారు గుర్తించారు. గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తుని అవసరాన్ని బట్టి ఎలా అంటే అలా ప్రసారం చేయవచ్చు.

"Richard Hughes రాసిన 'Danger' అను నాటిక మొదటిసారిగా 15 నిముషాల వ్యవధిలో B.B.C నుంచి ప్రసారమైంది. అప్పటి నుంచి ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్కాండినేవియా, నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఐర్లాండ్ దేశాల నుండి తరచూ రేడియో నాటికలు ప్రసారం కాసాగాయి. అయితే రేడియో కోసం ప్రత్యేకంగా నాటికలు రాసి, ప్రసారానికనువుగా మార్చేందుకు కొంత

---

(1) చంద్రగుప్త విద్యాలంకార్, ఆర్. శాంత కుమారి } 'హిందీ ఏకాంకికలు' - పు. vii

సమయం పట్టేది. రేడియో కార్యక్రమ నిర్వాహకులు రేడియో నాటక ప్రత్యేక కళారూపంగా ఆవిర్భవించిన తొలి రోజుల్లో అప్పటి సాహిత్యంలోని కావ్యాల్ని, కథల్ని రేడియో నాటకలుగా మలిచేవారు. కానీ సాహిత్యం లోని భాష, దృశ్యాలు- రేడియోలో, నాటక రూపంలో పేలవంగా ఉండేవి. దీనిలో సంప్రదాయ నాటకాలకు దగ్గరగా రేడియో నాటికల్ని రూపొందించడం ప్రారంభించారు.[1]

B.B.C. లో ప్రసారమైన తొలినాటిక William Shakespeare రాసిన 'Twelth Night'. అయితే ఇది ఆయన రాసిన నాటకానికి రేడియో నాటకీకరణ మాత్రమే. అయితే "రేడియో నాటకమంటే ఇదే అని అనదగిన 'White Chatean' నాటకం వచ్చింది. Reigenald Berkely రచించిన ఈ నాటకాన్ని ప్రపంచంలోని తొలి రేడియో నాటకంగా పేర్కొనవచ్చు."[2] క్రమేణా రేడియో నాటిక సాంకేతికాభివృద్ధి సాధించింది. ధ్వని ప్రధానమైన ఆర్కెస్ట్రా, కోరస్, నేపథ్యంలో సంగీతం మొదలైన హంగులేర్పడ్డాయి. వీటన్నింటితో 'The first Kalidoscope'[3] ప్రసారమైంది. దీనిలో మనిషి జీవితాన్ని

① The Reader Encyl paedia of world drama లోని Radio and Television drama in Europe వ్యాసానికి నా స్వేచ్ఛానువాదం

② 3. చిరంజీవి - ప్రసారిక - జీవితమే నాటకరంగం - పు. iv

సాహిత్యకారులతో పాటు సంగీతకారులు కూడా వ్యాఖ్యానించడం వల్ల రేడియోకి అనుగుణంగా మలచే అవకాశం లభించింది.

## తెలుగు రేడియో నాటికావిర్భావం:

తెలుగులో మొదటి రేడియో నాటకం(1) 1938 జూన్‌లో ప్రసారమైంది. అంతకు ముందే జోళ్లలో ప్రచురించబడిన 'ముద్దుకృష్ణ' రచించిన 'అనార్కలి' అది. "శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణ, వింజమూరి నరసింహారావు, ముద్దుకృష్ణ రచనల ఆధారంగా ఆచంట జానకి రామ్ గారు ఈ సంగీత ప్రధాన నాటకాన్ని తయారు చేశారు..... దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఈ నాటకంలో సలీం పాత్రను పోషించడం విశేషం(2)" అని కె. చిరంజీవి చెప్పారు. ఆ నాటినుండి రేడియో నాటికలు మంచి ప్రాచుర్యంలోకి వచ్చాయి. "రేడియో నాటికలు వ్రాస్తున్నవారు ఈనాడు అసంఖ్యాకంగా ఉన్నారు. నాటకాలు, నాటికలు వ్రాసినవారు మాత్రమే కాక, నవలలు, కథలు వ్రాసినవారు కూడా రేడియో నాటికలు వ్రాస్తూనే ఉన్నారు. వారిలో చాలామందికి 'రేడియో నాటకం' అన్నది ఒక ప్రత్యేకమైన 'మీడియం' అని, దాని శిల్పం వేరని కూడా తెలియదు.

(1) ఆలిండియా మద్రాసు కేంద్రం నుండి ప్రసారమైంది.

(2) కె. చిరంజీవి - ప్రసారిత - 'జీవితమే నాటకరంగం' - పు. iv

రేడియో మాధ్యమంలో చక్కని నాటికలు వ్రాయగలిగిన కొద్దిమందిలో గోరా శాస్త్రి ముఖ్యుడు. ఆయన రాసిన దాదాపు పదిహేను నాటికలు తెలుగు శ్రవ్యనాటికా సాహిత్యానికి మకుటాయమానాలు. "శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, ప్రయాగ కోదండరామశాస్త్రి, అమరేంద్ర మొదలైనవారు చక్కని రేడియో నాటికలు వ్రాశారు. రేడియోలో హాస్య ప్రధానమైన నాటకాలు వ్రాయడంలో ప్రఖ్యాతులు మునిమాణిక్యం, నండూరి సుబ్బారావు మొదలైనవారు"(1) గోరాశాస్త్రి నాటికల్లో వాస్తవ జీవిత చిత్రణతో పాటు సున్నితమైన హాస్యం కూడా సమ్మిశ్రితమవుతుంది. 'కొడవటిగంటి కుటుంబరావు' రచనల్లో సమాజాభ్యుదయ కాంక్ష స్పష్టంగా కనిపిస్తుంది.

రేడియో నాటిక కొత్తగా మొదలైన తర్వాత ప్రముఖ రచయితల దృష్టిని ఆకట్టుకుంది. విశ్వనాధ సత్యనారాయణ, బుచ్చిబాబు దేవులపల్లి కృష్ణశాస్త్రి, పిలకా గణపతిశాస్త్రి, కొడవగంటి కుటుంబరావు, గోపీచంద్, పాలగుమ్మి పద్మరాజు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి, కె. చిరంజీవి వంటి మొదలైన ప్రముఖ రచయితలు

(1) మొదలి నాగభూషణ శర్మ - పాతిక సంవత్సరాల తెలుగు నాటకం - (వ్యా) మహతి - పు. 189

చక్కని రేడియో నాటికలను శ్రోతలకందించారు. ఈ తరానికి చెందిన యండమూరి వీరేంద్రనాథ్, ఆదివిష్ణు వంటి రచయితలు కూడా రేడియో నాటక కర్తలే.

ఈ కాలంలో వచ్చిన రేడియో నాటకాలను 'అమరేంద్ర' నాలుగు తరగతులుగా వర్గీకరించారు. అవి.[1]

1. పౌరాణిక నాటకాలు.
2. చారిత్రక నాటకాలు
3. సాంఘిక నాటకాలు.
4. ఊహా చిత్రాలు.

<u>పౌరాణిక</u> <u>నాటకాలు</u>: పౌరాణిక నాటకాలు శ్రోతలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. భారత, భాగవతాది కావ్యాలతో శ్రోతలకు ఎక్కువ పరిచయం ఉండడమే ఇందుకు కారణం. తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు', చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతుల వారి 'గయోపాఖ్యానం' వంటివి రేడియోకి అనుగుణంగా నాటకీకరించి ప్రసారం చేసారు.

---

(1) అమరేంద్ర - రేడియో నాటికలు-(వ్యా) భారతి - 1952 మే - సంచిక-5-పు. 391-394

<u>చారిత్రక</u> <u>నాటకాలు</u>: భారతదేశ చరిత్ర, ఆంధ్రదేశ చరిత్రలలో ఎన్నో రసవత్తరమైన ఘట్టాలున్నాయి. మల్లంపల్లి సోమశేఖర శర్మ, వింజమూరి శివరామారావు, పి. యస్. ఆర్. అప్పారావు, ఆ.వి. సుబ్రహ్మణ్యం వంటి ప్రముఖులు చారిత్రక నాటకాలు రాశారు. ఇలా రాసిన నాటకాలు ఎక్కడో మారుమూల జరిగినవి కాక, అశోకుడి కాలంలో, శ్రీకృష్ణదేవరాయల కాలంలో జరిగిన (జరిగినట్లుగా భావించబడే) సంఘటనల మీద ఆధారపడ్డవే, అందరికీ తెలిసినవి కావడం వల్ల శ్రోతలను అలరించేవి.

<u>సాంఘిక</u> <u>నాటకాలు</u>: చదువుకున్న శ్రోతలను బాగా కదిలించి, సామాజికస్పృహ కలిగేలా చేసే శక్తి రేడియో నాటకాలకి ఉందని గ్రహించిన కొడవటిగంటి కుటుంబరావు, పాలగుమ్మి పద్మరాజు, కె. చిరంజీవి ప్రభృతులు సాంఘిక నాటకాలను ఎక్కువగా రాశారు.

<u>ఊహా చిత్రాలు</u>: ఊహాచిత్రాలు అద్భుతమైన శక్తితో భావలోకాల్లో శ్రోతల్ని విహరింపజేసాయి. బుచ్చిబాబు - 'రాజమార్గం', కౌండిన్య - 'నీడలేని మనిషి', శ్రీశ్రీ - 'అనంతర యాత్ర' ఆరుద్ర - 'అడిగింది ఒక తల్లి' మొదలైనవి శ్రోతలను ఆకట్టుకున్నాయి. ముని మాణిక్యం వారి హాస్య రచనలు ఆయన కథల్లానే

రేడియో శ్రోతల్ని గిలిగింతలు పెట్టాయి.

ప్రసిద్ధ రేడియో నాటక రచయితలు, విమర్శకులు అయిన ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, గొల్లపూడి మారుతిరావులు చెప్పిన వివరాలు రేడియో నాటకం పట్ల చక్కని అవగాహన కల్గిస్తాయి.

"....... పరిధిలో చిన్నవైనా - స్కిట్లు, చెణుకులు, ప్రత్యేక ప్రయోజనం కలవి. ఇవి పూర్తిగా సమకాలీన సమస్యల మీద వ్యంగ్యప్రధానంగా, హాస్యప్రధానంగా, కొస మెరుపుతో చాకుల్లాగా వాడిగా ఉంటాయి. ఇవి కేవలం ఇద్దరు పాత్రల మధ్య సంభాషణలాగ నడిచిపోవు. మూడు, నాలుగు పాత్రలు, ఒక చిన్న సన్నివేశం, సమస్య, కొస మెరుపు - మొత్తం టపాకాయ బిగింపుతో ఉంటుంది. పెద్ద నాటకాల కంటే ఇటువంటి అల్పవ్యవధి శ్రవ్య నాటికల రచన, నిర్వాహణ కూడ కష్టమే"(1) - అని అంటారు ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ. ఈ వాక్యాలు పరిధి తక్కువగా ఉండే శ్రవ్య నాటికల రచనలో పాటించవలసిన పద్ధతుల్ని వివరిస్తాయి.

---

(1) ఇంద్రగంటి శ్రీకాంత శర్మ - శ్రవ్యనాటిక - (వ్యా) ఆలోచన - పు.121

"రేడియో నాటిక కేవలం శ్రవణేంద్రియానికి appeal చేస్తూ రస సిద్ధిని కలిగించగలగాలి. శ్రోతల ఆలోచనకు - imagination కు అవకాశం ఇవ్వాలి. ఇందుకు రచయితకు ఉన్న ఆలంబన ఒక్కటే- కేవలం భాష. ఇది చాల జటిలమైన ప్రక్రియ. పదునైన కత్తిమీద సాము. అయితే రంగస్థల నాటకానికి ఉన్న సౌలభ్యం దీనికి లేకపోవచ్చుగాని, దీనికి ఉన్న range రంగస్థల నాటకానికి రాదు. సహారా ఎడారిలో, బకింగ్ హామ్ పాలెస్‌లో, పూరిగుడిసెలో, ఊరి పొలిమేరలో, విమానంలో, ప్రేయసి మనస్సులో, కథానాయకుడి మెదడులో కథని నడపవచ్చు. మనస్సు చేయగలిగినంత పరుగు, వేగం యిందులో చూడవచ్చు. ఇంత Flexibility దృశ్య నాటికకు రాదు. విచిత్రంగా దృశ్య నాటకాల విసుగు కలిగించే Melodrama యిక్కడ బాగా రాణిస్తుంది. రంగస్థల నాటకాలకు ఎదురు తిరిగే Dialogue Play రేడియో నాటికకు ప్రాణం."(1) - గొల్లపూడి మారుతీరావు రాసిన ఈ వాక్యాలు శ్రవ్యనాటకాల ప్రయోగంలోగల పరిధుల్ని వివరించి వాటి విస్తృతిని వెల్లడిస్తున్నాయి.

---

(1) గొల్లపూడి మారుతీరావు - దృశ్య శ్రవ్య నాటికలు-(వ్యా) మహతి - పు.219

## రేడియోనాటకం - ప్రయోగవాదం:

'రేడియో నాటకం' అనేది రంగస్థల నాటకానికి పోటీగా సవాలుగా తయారైన ఒక స్వతంత్రమైన ప్రక్రియ. రేడియో, నాటక కళను విస్తృతానేకంగా ప్రభావితం చేసింది. పూర్వం రంగస్థలం మీద ప్రదర్శించే అవకాశం ఉన్న కావ్యాలను 'దృశ్యకావ్యాలని', చదివి వినిపించాల్సిన కావ్యాలను 'శ్రవ్యకావ్యాలని' అనేవారు. రేడియో నాటకం అన్నివిధాలా పూర్తిగా శ్రవ్యనాటకం - అంటే చదివి వినిపించే నాటకం కాదు. రంగస్థలం మీద నాటకాన్ని ప్రదర్శించినట్లుగానే ఇక్కడ కూడా అన్ని హంగులతో ప్రదర్శించడం జరుగుతుంది. ఆయా పాత్రలను నిర్వహించే నటులు తమ పాత్రలను రంగస్థల నాటకంలోలాగే పోషిస్తారు. అయితే వారు కంటికి కనపడరు. వాళ్ళ నటన శ్రోతలకు వినిపిస్తుంది. కనుక ఇది కనిపించే ప్రదర్శన కాదు, కేవలం వినిపించే ప్రదర్శన. ఒక రంగస్థల నాటకం జరుగుతుండగా, రంగస్థలం వైపుకి చూడకుండా జరుగుతున్నదంతా వింటున్నట్లుగా ఉంటుంది. అందుకే దీనిని Blind man's Theatre అంటారు.

"కనిపించదు గనక వినిపించే ప్రతి చిన్న శబ్దానికి తన ఊహ

పోహాలలో రంగులద్దుకుంటాడు శ్రోత. మరో విధంగా చెప్పాలంటే, చూడలేడు గనుక రూపకల్పన చేసుకుంటాడు; నాటకంలో ధ్వనించే ప్రతి దాన్నిన్నీ"(1)- అని అంటాడు చిరంజీవి. రేడియోలో, రంగస్థలం మీద ఉత్పత్తి చేయడానికి వీలులేని ఎన్నో శబ్దాలను ఆధునికమైన టెక్నాలజీ సహాయంతో ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. Voice Control ద్వారా, Musical effects ద్వారా శ్రోత మనస్సుల మీద ఎన్నో ప్రభావాలు సృష్టించవచ్చు. దీనివల్ల రేడియో నాటకానికి అనంతమైన కాల్పనిక శక్తి ఏర్పడుతుంది." ఊహించ గలగాలే గాని ఎంత ఎత్తులకైనా ఎగుర వచ్చు, ఎంత లోతులకైనా దిగవచ్చు. క్షణాల మీద అంగారక గ్రహంలోకి ప్రయాణించవచ్చు, అలాగే ఆ మరుక్షణాన అంగారకం నుంచి పాతాళంలోని కప్ప కడుపులోకి ప్రవేశించవచ్చు. గర్భస్థ శిశువుతో మాట్లాడించవచ్చు. ఊపిరి పోయబడ్డ శిశువుతో వేన వేల సంవత్సరాలుగా దాగిన రహస్యాన్ని కక్కించవచ్చు"(2). చిరంజీవి గారే అన్నట్లు "శ్రోత ఊహాలకు

---

(1) కె. చిరంజీవి - ప్రసారిక - జీవితమే నాటక రంగం - పు - xi

(2) - Ibid ________ - పు. ix

పొరలు విప్పుతుంది రేడియో నాటకం.① గొంతుక రేడియో నాటకానికి చాలా ప్రధానం. మానవుల కంఠస్వరం మూడు విధాలుగా ఉంటుంది. అవి

1. Base Tone
2. Basi Tone
3. Supra Tone

"ఈ మూడు విధాలైన కంఠస్వరాలు కూడా తిరిగి ప్రతిది మంద్రము, మధ్యమము, అధికము అని మూడు విధాలుగా ఉండి, మొత్తం తొమ్మిది రకాల కంఠస్వరాలు ఉంటాయి. ఏ పాత్రకు, ఏ రకం కంఠస్వరం సరిపోతుందో ఎంచుకోవడంలో ప్రయోక్త నేర్పరితనం బహిర్గతమవుతుంది".② రేడియో నాటకంలోని గొంతుకలో ఈ విశాల విశ్వ సర్వస్వమంతా నిక్షిప్తమై ఉంది అంటాడు కె. చిరంజీవి. ఆయనే

"..... Since the 'flashing eye', 'wrathful mien', and the like, ~~are~~ hidden, the tonal colours must paint the yellow of jealousy, the vermilions of vo the sombre greys of sadness, and the joyous riot of

① కె. చిరంజీవి - ప్రసారిక - జీవితమే నాటకరంగం - పు. xii

② పి. శశికలక్ష్మి - 'శ్రీశ్రీ రేడియో నాటకాలు - ప్రయోగ వాద ధోరణులు' - ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం. (అ.ప్ర.గ్రం.). తెలుగు శాఖ హైదరాబాదు విశ్వవిద్యాలయం - పు. 54

bright splashes of gaiety. The voice colours must create the atmosphere, in order that the listener make create the necessary mental pictures which provide the boundaries of the action of the play. VOICE IS AN ORCHESTRA, It ranges high up, or is as low as the lion's tone, and at every intermediate point it has some peculiar quality. It has in it the mother's whisper and the father's command. It has warning and alarm, It has sweetness. It glitters, though it is not seen, with all its sparkling fancies." ①

అని అంటాడు చిరంజీవి. రేడియో నాటకంలో శబ్దాన్ని, గాయకుని, సంగీతాన్ని – ఉపయోగించి కావలసిన స్వాభావిక వాతావరణాన్ని సులభంగా సృష్టించవచ్చు. రంగస్థలం మీద చూపించలేని భావనాత్మకమైన 'Fantasy' లు గొప్పగా ఉంటాయి రేడియోలు; ఈ నాటకానికి ఉన్న కల్పనాకరణ శక్తి ( Fantasticating power)

---

① కె. చిరంజీవి – ప్రసారిత – జీవితమే నాటక రంగం – పు. xiii

వల్లనే ప్రయోగ వాదానికి స్టేజి నాటకం కంటే ఎక్కువగా అనుకూలిస్తుంది. ఈ విషయాన్ని బలపరుస్తూ రేడియో నాటక ప్రయోక్తగా పేరు పొందిన కె. చిరంజీవి యిలా అంటున్నాడు.

" ఊహలకు, ఎన్ని రెక్కలైనా మొలిపించగలిగింది రేడియో నాటక రచన! అందువల్లనే ఈ మీడియంలో impressionistic Drama లేదా Non-realistic forms మరింతగా రాణిస్తాయి".(1)

<u>రేడియో నాటక లక్షణాలు- రచనా పద్ధతులు - నిర్మాణ పద్ధతులు:</u>

బాలాంత్రపు రజనీకాంతరావు(2), మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి(3), గొల్లపూడి మారుతీరావు(4), ఇంద్రగంటి శ్రీకాంత శర్మ(5), పి.వి. రాజమన్నార్(6),

---

(1) కె. చిరంజీవి - ప్రస్తావిక - జీవితమే నాటకరంగం - పు. ix-x

(2) బాలాంత్రపు రజనీకాంతరావు - 'రజనీ గేయనాటికలు' - (వ్యా) విశ్వవేణి - పు. xviii

(3) మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - 'రేడియోనాటికలు' - (వ్యా) ఆంధ్రనాటకరంగ చరిత్ర - పు. 15

(4) గొల్లపూడి మారుతీరావు - 'దృశ్య శ్రవ్య నాటికలు' - (వ్యా) మహతి - పు. 219

(5) ఇంద్రగంటి శ్రీకాంత శర్మ - 'శ్రవ్య నాటకం' - (వ్యా) ఆలోచన - పు. 117-131

(6) పి.వి. రాజమన్నార్ - 'రేడియో నాటకములు' - (వ్యా) భారతి - 1948 జనవరి సంచిక - పు. 89.

నార్ల వెంకటేశ్వరరావు(1), సుబ్రహ్మణ్య శాస్త్రి(2), దివాకర్ల వెంకటావధాని(3), భమిడిపాటి కామేశ్వరరావు(4), నాగేంద్రరావు(5), రాఘవాచార్యులు(6), లక్ష్మీకాంత కవి గారు(7), మొదలి నాగభూషణ శర్మ(8), ఎస్. ఆర్. చందూర్(9), కె. చిరంజీవి(10), ఆర్. అనంతపద్మనాభరావు(11), అమరేంద్ర(12) – మొదలైన వారు రేడియో నాటకాల గురించి తమ విలువైన అభిప్రాయాలను వెల్లడిస్తూ వ్యాసాలు రాశారు. వీరందరూ తమ తమ వ్యాసాల్లో ఏదో ఒక అంశాన్ని (రచన, నిర్మాణం, లక్షణాలు) స్పృశిస్తూ రాశారు. పైగా దాదాపు అందరూ ఒకే లక్షణాలను చెప్పారు.

## రేడియో నాటక రచన – లక్షణాలు:(13)

ధ్వని ప్రసార సాధనం రేడియో. రేడియో శక్తి అంతా ధ్వనిలోనే. ఒక మంచి నాటక ప్రసారమైందంటే ఒక మంచి రేడియో సెట్టు ఉందన్నమాట. మంచి రచయితకు తనతో సంబంధం ఉన్న

---

1, 2, 3, 4, 5, 6, 7 వీరందరూ – 'రేడియో నాటకములు' (వ్యా) భారతి - 1948 జనవరి సంచికలో ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం నుంచి, రేడియో నాటక లక్షణాల గురించి చర్చించారు.

(8) మొదలి నాగభూషణ శర్మ – 'పాతిక సంవత్సరాల తెలుగు నాటకం' (వ్యా) మహతి - పు. 189

(9) యస్. ఆర్. చందూర్ – 'రేడియో నాటకం' – (వ్యా) భాష – పు. 58-72

(10) కె. చిరంజీవి – ప్రస్తావన – జీవితమే నాటకరంగం – పు. iv – xiv

(11) ఆర్. అనంత పద్మనాభరావు – 'రేడియో నాటికలు - ఒక విశ్లేషణ' (వ్యా) ఆంధ్రప్రభ - 24-1-88

(12) అమరేంద్ర – రేడియో నాటకలు - (వ్యా) భారతి – మే 29, 1952 – పు. 39

(13) Louis MacNiece – 'Christopher Columbus' – అనే గ్రంథంలోని పీఠికలో చెప్పిన

పదాలతోటే రచన చేస్తాడు. కాని రేడియో నాటక రచయిత నటుల నోటి నుంచి వచ్చే పదాలగురించి ఆలోచించవలసి ఉంటుంది. మాట్లాడబడే పదాలకు లొంగిపోవడం రేడియో నాటక రచయితలకు తప్పనిసరి. కాని దీనివల్ల లాభాలు, నష్టాలు ఉన్నాయి. రేడియో నాటక రచయిత రాసిన వాక్యం విలువను ఆ వాక్యం ఉచ్ఛరించే కంఠం పెంచుతుంది. ఒకే వాక్యం రాసి దానిని పలు రకాలుగా ఉచ్ఛరించి, పలు ప్రయోజనాలు సాధించవచ్చు. రేడియో రచయిత ముఖ్యంగా సరళత్వాన్ని, శబ్దాల సాధించే ప్రయోజనాల్ని గుర్తుపెట్టుకోవాలి. రేడియో రచయిత పరిమితులకు తగ్గట్టే గాక, తన శ్రోతలకు తగ్గట్లు కూడా పరిమితమై రాయవలసి ఉంటుంది. ఎక్కువ మందిని ఆకర్షించేటట్లుగా రేడియో రచయిత రాయాలి. శ్రోతలకు అర్థం కాకుండా, వారి ప్రమాణాలకు సరిపోకుండా, వారిని బాగా ఇబ్బంది పెట్టే రచనలవల్ల ఫలితం ఉండదు. సభ్యతనీ, ప్రజాదరణనీ దృష్టిలో ఉంచుకొని రాయాలి.

## రేడియో నాటక నిర్మాణం :

రేడియో స్క్రిప్టు నిర్మాణ ప్రధానమై ఉండాలి. తేలికైన పదాలతో జాగ్రత్తగా రచన చేయవలసి ఉంటుంది. దృశ్యాల ఎంపికలో సమగ్రత

ఉండాలి. వాస్తవాన్ని నాటకీకరణ చేసి సమర్పించాలి. సమయం తక్కువ కాబట్టి ప్రతి మాట పొదుపుగా వాడాలి. శ్రోతలకు వినడం ద్వారా పరిస్థితి స్ఫురించాలి. నేపథ్యాలు, ఫ్లాష్ బ్లాక్‌లు అవసరమైనంతవరకే వాడుతూ శ్రోత జ్ఞాపకాలను దెబ్బతీయకుండా సృష్టించాలి. నాటకం కొనసాగుతుండగా దృశ్యాలు, సంఘటనలు, కాలం మారుతున్నట్లు శ్రోతకు స్పష్టంగా తెలియాలి. సంగీతం, రికార్డు చేసిన ధ్వనులతో అనేక రకాల దృశ్యాలను ఏర్పరచవచ్చు. రకరకాల కోరస్‌లు సృష్టించవచ్చు.

## రేడియో రచన – నిర్మాణ కౌశల్యం:

రేడియో నాటకను తయారు చేయడానికి కొంత సృజనాత్మక కళాహృదయం అవసరం. అంతేకాక రేడియో రచయిత ఒక ఖచ్చితమైన కొలమానంతో రాయాలి. ప్రతి లింకు గట్టిగా ఉండాలి. పేలవమైన ముగింపు ఉండకూడదు. శ్రోతలను తెలివిగా వశపరచుకోవడమే కాక వారిలో ఆసక్తి నిలిచేలాగ చేయగలగాలి. నాటకం మొత్తం మీద ఎంత బాగున్నా మధ్యలో రెండు మూడు నిమిషాలు 'బోరు'గా అనిపిస్తే శ్రోత రేడియో కట్టేసే ప్రమాదం ఉంది. అందువల్ల జాగ్రత్తగా ఉండాలి.

## కథ - ప్రాధాన్యత:

రేడియో నాటికకు కథ విశాలంగా, వైవిధ్యంగా, నాటకీయంగా ఉండాలి. కథా సారాంశం, పాత్రలు అనువైనవిగా ఉండాలి. బాహ్య సన్నివేశాలకు వాస్తవ దృశ్యానుకరణకు రేడియో సరైన సాధనం. అయితే కథాంశం మరింత విస్తృతమై, జీవితం కన్నా సరళమై, కొంత మేరకు శిల్పంగా మలచబడిన రేడియో నాటక ప్రయోగాలు విజయం సాధించగలవు.

## రేడియో నిర్వాహణ:

రచయితకు స్టూడియో గురించి క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. ఉన్న మైక్రో ఫోన్లతో, కంట్రోల్ పానెల్తో, గ్రామఫోన్లతో ఏ ఫలితాలు సాధించగలదో తెలుసుకోవాలి. చాలామంది బ్రాడ్ కాస్టింగ్ ప్రముఖుల రేడియో స్క్రిప్ట్ కేవలం ముడిసరుకేనని, ప్రసారమైన తర్వాత దానికి పూర్తి రూపం వస్తుందని అంటారు. కాని ఇది సరియైన వ్యాఖ్య కాదు. నిజానికి ఒక మంచి స్క్రిప్ట్ ఉంటే, నిర్వాహణ ఎలా ఉన్నా, మంచి ఫలితాలొస్తాయి.

## కంఠాలు (Voices):

రేడియో నటుల కంఠాలపై చాలా విమర్శలున్నాయి. రేడియో

నటుడు రంగస్థలంపై వలె కనిపించడు. కనుక పూర్తిగా తన కంఠం పైననే ఆధారపడాలి. తన కంఠం ద్వారానే ప్రత్యేక పాత్రగా గుర్తించబడాలి. శ్రోత ఇంట్లోనే నటుడు రేడియో నుంచి రంగస్థలాన్ని సృష్టించాలి. రేడియో నాటక రచయిత తలచుకుంటే నటుడి పాత్రను సులభం చేయవచ్చు. వైవిధ్యం గల స్వరానికి తగినవైన సంభాషణాలు రాయవచ్చు.

## సహజ ధ్వనులు:

'ఎఫెక్ట్'లు అంటే వాస్తవాన్ని ప్రతిబింబించే వాతావరణానికవసరమైన సహజధ్వనులు. ఇవి రెండు రకాలు. ఒకటి గ్రామఫోన్ రికార్డులు, రెండు స్టూడియోలో అప్పటికప్పుడు పలికించే ధ్వనులు. వాతావరణాన్ని శ్రోత మనస్సుకు గోచరించే విధంగా పలికించే ధ్వనులేగాక వైవిధ్యానికో, పొదుపుకోసం పలికించే ధ్వనులు కూడా ఉంటాయి. ఆవులు 'అంబా' అని అరచినపుడు వినిపించే ధ్వనులను బట్టి శ్రోత అదొక పశువుల శాల అని అర్థం చేసుకుంటాడు. కొన్ని కొన్ని సార్లు సహజమైన ధ్వనులను రికార్డు చేసే బదులు సంగీత వాయిద్యాల ద్వారా ధ్వనులను

సృజించడం మంచిది. తుఫాన్, పిడుగు, వాన మొదలైన దృశ్యాలను సంగీత వాయిద్యాల ద్వారా సృజించవచ్చు. రచయితలు కేవలం సహజ ధ్వనులతోనే గాక పదాల ద్వారా కూడా దృశ్యాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించగలగాలి. రచయిత ఔచిత్యమైన, తన కథకు బలం చేకూర్చే సహజ ధ్వనులనే కోరాలి.

సంగీతం (Music)

నేత్రానందాన్ని కలిగించలేని లోపాన్ని భర్తీ చేసేందుకు ఉద్వేగమైన వాతావరణం కోసం మనఃస్థితి మార్పును చిత్రించడం కోసం సంగీతాన్ని వాడుకుంటారు. డైలాగుల కన్నా సంగీతం త్వరగా అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతుంది. రేడియోలో సంభాషణలకు పూర్వం, మధ్య నేపథ్యంగా సంగీతాన్ని ఉపయోగిస్తారు.

వాస్తవ సన్నివేశాల్లో నేపథ్య సంగీతం వాడరాదు. కొన్నిచోట్ల తప్పనిసరిగా వాడాలి. ఉదాహరణకు ప్రేమికులు డాన్స్ చేస్తున్నప్పుడు నేపథ్య సంగీతం అవసరం. నాటక ప్రయోజనానికి తోడ్పడే విధంగా సంగీతం ఉండాలి కాని అదే ప్రధాన పాత్ర వహించి నాటకను సంగీత కచేరిలా మార్చకూడదు.

ఇంతవరకు రేడియో నాటక పుట్టు పూర్వోత్తరాలు, లక్షణాలు, రచన, నిర్మాణ, నిర్వహణ పద్ధతుల్ని వివరించాను. శ్రీ కె. చిరంజీవి రేడియో నాటక రచయితగా, ప్రయోక్తగా, నటుడిగా ప్రసిద్ధిచెందినవారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలోనే ఉద్యోగం చేసారు. శ్రీ చిరంజీవి రచించిన నాటికలలో చాలా భాగం జాతీయ నాటకాలుగా పలు ఇతర భాషలలోకి అనువదింపబడ్డాయి. జాతీయ స్థాయిలో జరిగే ఆకాశవాణి వార్షిక పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు. శ్రీ చిరంజీవి రాశి కంటే వాసికి ప్రాధాన్యం ఇచ్చిన వ్యక్తిత్వం ఆయనది. ఆయన 8 రేడియో నాటకాలు రాసారు. 'జీవితమే నాటకరంగం', 'మూడు జాతీయ నాటకాలు' పేరున నాటక సంకలనాలుగా వెలువడ్డాయి. అవి.

1. వంశాంకురం
2. వేళ్ళు విరగబడుతున్నాయి.
3. శాంతి సమరం.
4. శ్రీకృష్ణ శిరోభారం
5. కాక్కా లోకో
6. ఆకలి మందు.
7. కాల యంత్రం
8. ఊళ్ళోళ్ళు మేలుకుంటున్నారు.

<u>వంశాంకురం</u>: ఈ నాటిక ఒక దిన పత్రికలో వచ్చిన చిన్న వార్తను ఆధారం చేసుకొని రాసినది. 'శాన్‌ఫ్రాన్సిస్కో క్రానికల్' పత్రికలో 1975 ఏప్రిల్ 18న ఒక వర్గీకృత ప్రకటన వెలువడింది. ఆ ప్రకటన ప్రపంచానికొక వింత వార్తయింది. ఇంతకు ఆ ప్రకటన ఇలా ఉంది.

" Childless husband with infetile wife wants Test-tube baby. English of North Western European background. Indicate fee and age. All answers Confidential. ఇంత మాత్రమే. ఈ వార్త నన్నెంతగానో ఆకట్టుకుంది. మనస్సును పట్టుకొని, వదలకుండా ఆలోచింపజేసి నన్ను నాటికను రాయించింది"[1] — అని రచయిత తన పుస్తకానికి రాసుకున్న అభివాదనలో తెలిపాడు. ఈ నాటిక రేడియోలో 1975 అక్టోబరు ౨౦ తేదీన ప్రసారమైంది.

రేడియో నాటికలో ధ్వని ప్రాధాన్యం చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ 'వంశాంకురం' నాటికలో ధ్వని సూచనలు <u>అతి తక్కువ ఇచ్చారు</u> రచయిత. Opening music, Spot music

---

① డా. చిరంజీవి - 'అభివాదనం' - రేడియో నాటికలు - పు. 23-24

Bridge music, Closing music మొదలైన సూచనలు తప్ప ధ్వనికి సంబంధించిన వివరాలు లేవు. నాటిక ప్రారంభంలో మాత్రం నగర వాతావరణాన్ని సూచించే ధ్వనులు సూచించారు. ఇది అప్పటికి మొత్తం మీద చదువుతున్నప్పుడు దృశ్య నాటకం లాగ తోస్తుంది తప్ప, శ్రవ్య నాటకంలాగా అనిపించదు. దృశ్య నాటకం-శ్రవ్య నాటకంలో ఉండే భేదాలు ఈ నాటికలో స్పష్టం కాలేదు. ఈ ఒక్క నాటికలోనే కాదు, తెలుగులో వచ్చిన రేడియో నాటకాలన్నింటిలోనూ ధ్వనికి సంబంధించిన సంపూర్ణమైన వివరణ ఉండదు. ఉదాహరణకు ఈ నాటికలోని ధర్మారావు మనస్సులోని సంఘర్షణను, పేపరు కుర్రవాడి మనస్సులోని ఆర్తిని, పావని మనస్సులో కృత్రిమ గర్భధారణ పట్ల చెలరేగిన ఇష్టాయిష్టాల బాటకు సంకల్ప వికల్పాలను, సుందరమ్మ మనస్సులోని క్షోభను, కృత్రిమ గర్భధారణకు సిద్ధపడ్డ యువతుల విభిన్న మనస్తత్వాల ద్వారా వ్యక్తమైన హాస్యాన్ని సంగీతాత్మకమైన విభిన్న ధ్వనుల ద్వారా సూచించవలసి ఉంటుంది. బహుశా ఈ నాటిక రేడియోలో ప్రసారమైనప్పుడు ఏ విధంగానైనా సూచించి ఉండవచ్చు.

ఈ నాటిక క్యాసెట్ సంపాదించి వింటే తప్ప ఈ నాటికపైన 'Music and Sounds' ప్రభావాన్ని విశ్లేషించి చెప్పడం సాధ్యం కాదు. కాని ఆ క్యాసెట్ నాకు లభ్యం కాలేదు. అందుచేత ఈ అధ్యాయంలో Music and Sounds ప్రభావాన్ని వదలి కేవలం ఇతివృత్త పరంగా నాటకీయ దృష్టిలో వివరించడం ధ్యేయంగా పెట్టుకున్నాను.

ఇతివృత్తం:

ధర్మారావు సుందరమ్మలు దంపతులు. సుందరమ్మకు సంతాన అవకాశాలు లేదని డాక్టర్లు నిర్ణయిస్తారు. అయితే ధర్మారావు తనకు 'వంశాంకురం' కావాలనీ అది పితృ ఋణ విముక్తికి హేతువవుతుందని అతని దృఢ విశ్వాసం. దీనిలో డాక్టర్ జేమ్సు దంపతులను కలుసుకుంటారు. వారు వైజ్ఞానిక పరిశోధన ఫలితంగా వచ్చిన కృత్రిమ బీజ వ్యాప్తికి ఒక అజ్ఞాత స్త్రీని క్షేత్రంగా సంపాదించి తద్వారా పుత్ర ప్రాప్తిని పొందవచ్చు అని చెప్తారు. దాంతో పత్రికలో ప్రకటన ఇస్తారు. పత్రికలో వచ్చిన ఈ ప్రకటన చూసి దీక్షా చార్యులు తన భార్య పావనిని సంతాన దానం కోసం ఒప్పిస్తాడు.

కూడా పావనికి అకస్మాత్తుగా ధర్మారావు కనిపిస్తాడు. అతడు ఒకప్పుడు తనను ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన వ్యక్తి. ఆనాడు తన వంశంలో High Fertility లేదని పెళ్ళి చేసుకోవడానికి తిరస్కరించిన వ్యక్తికే యిప్పుడు తాను సంతాన దానం చేయవలసి రావడంతో పావనికి జీవితంపై విరక్తి పుడుతుంది. ఇష్టం లేని పర పురుష వీర్య ధారణం వల్ల జీవితంపై జుగుప్సా భావం కలిగి బలవన్మరణానికి దారి తీసింది. పుట్టిన యిద్దరు ఆడ శిశువులను ధర్మారావు స్వీకరించటానికి నిరాకరించడంతో వాళ్ళు అనాథ బాలికల జాబితాలో చేరుతారు. చివరకు దేశికాచార్యులు తన పిల్లలతో పాటుగా పావనికి ధర్మారావు వల్ల కల్గిన శిశువులను అనాథ అయిన పేపర్ కుర్రాడిని కూడా దగ్గరకు తీసుకోవడంతో నాటిక ముగుస్తుంది.

<u>విశ్లేషణ</u>: ఈ నాటికలో అధునాతనమైన వస్తువుతో అతి సనాతన ధర్మాన్ని వ్యాఖ్యానించాడు రచయిత. ఈ 'వంశాంకురం' నాటికలో Test Tube Baby ల పుట్టుక నేపథ్యంలో గొప్ప మానవతా భావాన్ని రూపు కట్టించాడు. ఈ నాటికలో పేర్లన్నీ ప్రతీకాత్మకాలు. ధర్మారావు

సాంప్రదాయక ధార్మికతకు, పావని - ఉచ్ఛమైన పవిత్రతకు, దేశికాచార్యులు - సాంప్రదాయానికి అతీతమైన మానవతా ధర్మానికీ, శ్రీమన్ దంపతులు - ఆధునిక విజ్ఞానానికి, సుందరమ్మ - సాధారణ స్త్రీత్వానికి ప్రతీకలు.

ఈ నాటికలో ధర్మాధర్మాల సంఘర్షణ, పాతివ్రత్యం అంటే ఏమిటి? అనే ప్రశ్న, మొదలైన సున్నిత విషయాలను చర్చించారు రచయిత. దేశికాచార్యులు పావనికి సంతాన దానం కోసం నచ్చచెప్తూ -

" దేశికాచార్యులు: ..... నాకిందులో దోషమేమీ కనిపించడం లేదు. 'కామన' అనేది లేనప్పుడు స్త్రీ, పురుష శరీరాలు రెండూ కలుసుకున్నా అందులో దోషం లేదన్నారు. వ్యభిచారం క్రిందకు రానేరాదన్నారు పెద్దలు ...... ఉదాహరణకు ఒక స్త్రీ బలాత్కరించ-బడుతుంది. ఆ బలాత్కారంలో ఆమె తప్పు గాని, ఆమె ఇష్టానిష్టాల ప్రసక్తిగాని ఏమీ లేదు. కేవలం బలాత్కారం. అలాంటి స్త్రీని ఏం చెయ్యాలి? భర్త వదిలేయాలా? ఇందులో ఆమె చేసిన నేరం ఏమిటి? చెయ్యని నేరానికి ఆమెను శిక్షించడం ఏమి న్యాయం? ....... ఇలాంటి స్త్రీని సహాయం వదిలేయనక్కర లేదని

'రజసా శుద్ధ్యతే నారీ' బహిష్టులు శుద్ధురాలైన ఆడవాళ్ళ స్వీకరించ-
వచ్చునని పెద్దలు చెప్పారు. మరి యిక్కడ- ప్రత్యేకించి ఈ కేసులో-
ఒకరినొకరు చూసుకోవడంగాని, ముఖాముఖి మాట్లాడుకోవడంగాని,
శరీరాల కలయికగాని లేదు. నియోగమనలో బిడ్డను కని యివ్వడం.
కేవలం సంతాన దానం. పూర్వం ఈ నియోగమన కోసం ఏం
చేసేవారో తెలుసా?

పావని: ఏం చేసేవారు?

దీక్షాచార్యులు: అప్పుడంతా ధర్మ సంతానమని వుండేది. జాతి
పెంచుకోవలసిన అవసరం అప్పుడైతే, తుంచుకోవలసిన అవసరం ఇప్పుడూ
తగలబడింది, ఈ కలియుగంలో. ✓ ఆడదానికి సంతాన యోగ్యత
లేకపోతే మగవాడు ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకొని స్వజాతిని
అభివృద్ధి పరచుకునేవాడు. అలాగే మగవాడికి సంతాన యోగం లేనప్పుడు,
ధర్మ సంతానం కోసం, నియోగమునగా ఒక ఆచారం జరిగేది. అంటే
భర్త అంగీకారంతో పరపురుషుని వల్లనైనా సంతానాన్ని పొందవచ్చునన్నమాట.
అప్పట్లో యిది తప్పు కాదోయ్. కారణమేమిటంటే అప్పటి సామాజిక
అవసరం జనం సమృద్ధిగా కావాలప్పుడు.

పావని: ..... ఆడదానికి సంతాన యోగ్యత లేనప్పుడు మగవాడు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడు. పిల్లల్ని కంటున్నాడు. అలాగా మగవాడు అయోగ్యుడైనప్పుడు ఆడది మళ్ళీ పెళ్ళి చేసుకొని పిల్లల్ని ఎందుకు కనకూడదు? ఇలాంటి నరకప్రాయమైన ధర్మ వ్యాపారానికంటే .....

దేశికాచార్యులు: కరెక్ట్. కాని మగమహారాజులంగీకరించరు. మాతృస్వామికం వెనకబెట్టి పితృస్వామికం పైనొక్కారాజులు. అధికృతుల మగవాడికే. 'క్షేత్రం' కంటే 'బీజం' ప్రధానమని చెప్పారు. ఈ రెండింటి కంటే ముఖ్యమైనది స్థితి. ఈ స్థితి అంటూ ఒకటి ఉన్నదన్న విషయమే గమనించరు మూర్ఖులు. అందువల్లనే - అంటే ఈ స్థితిని గమనించక పోవడం వల్లనే - ద్వాపర యుగంలో అంబిక అంబాలికలకు ధృతరాష్ట్రుడనే గుడ్డివాడు, పాండురాజు అనే పాండురోగి పుట్టారు; ధర్మ సంతానంకి. బీజ సంధానం చేసింది మాత్రం గొప్పవాడే. నాలుగు వేదాల్ని కూర్చి చేసి ఎప్పుడూ తన వెంట చెప్పుకునే మహర్షి వ్యాసుడు" (పు-83) అని రచయిత దేశికాచార్యుల పాత్రలో చెప్పిస్తాడు.

మాతృ స్వామ్యం నుంచి పితృస్వామ్యానికి సామాజిక వ్యవస్థ పరిణమించాక- స్వంత ఆస్తి ఏర్పడ్డాక- తమ ఆస్తులను తమకు జన్మించిన వారే అనుభవించాలి అనే ఆరాటం పాతివ్రత్య సిద్ధాంతానికి మూలమైంది. వంశాంకురం కావాలనే తపనకు అదే మూలం.

ధర్మారావు సాధారణ సంప్రదాయిక ధోరణిలో వంశాంకురాన్ని కోరి, పావనికి దూరమై చిత్రంగా వంశాంకురం కోసమే పావనిని రెండవసారి కలుసుకున్నాడు.

పావని స్త్రీ సహజంగా ధర్మారావును ప్రేమించినా, ఆమెలో కరడుగట్టిన పాతకాలపు సంప్రదాయిక భావాలను ఏవగించుకొని దేశికాచార్యులను వివాహం చేసుకొని త్రికరణ శుద్ధిగా అతనికి ఇల్లాలైంది. భర్త నచ్చచెప్పిన కేవలం ధర్మదృష్టితో మరి ఎవరి వంశాన్ని నిలపడానికి, తల్లి కావడానికి త్యాగశీలగా నిలబడింది. కానీ తాను జన్మనివ్వబోతున్నది కుళ్ళిపోయి కరడుగట్టిన ఛాందస భావాలతో నిండిన ధర్మారావు సంతానానికి అని తెలియగానే తనకు తాను అసహ్యించుకొని జన్మనే వదిలేసుకుంది. ఒకప్పుడు హృదయంగా ధర్మారావును ప్రేమించినా ఇప్పుడు ఆమె మనస్సులో ధర్మారావుకు ఎలాంటి స్థానం లేదని ఈ రకంగా చెప్తున్నాడు రచయిత.

పాపని ప్రసవించింది ఆడపిల్లల్ని కావడంతో ధర్మారావు తండ్రికి వంశాయురాల్లుగా పనికి రాలేదు. ఇది పితృస్వామ్య సమాజంలోని మరొక విప్లవ కోణం. 'ఈ సందర్భంలోనే సుందరయ్యను గర్భవతిగా చూపించాడు రచయిత. మొత్తం మీద క్షేత్రమా? బీజమా? ఏది ప్రధానం? వంశాంకురం లేకపోతే ఎలా అనే ప్రశ్నలకంటే విశ్వమానవ ప్రేమతో అనాథలందర్నీ తనవారిగా భావించడాన్ని ఉత్తమమని వ్యాఖ్యానిస్తాడు రచయిత. క్షేత్రం కంటే, బీజం కంటే స్థితి ప్రధానమని నాటికలో రెండు మూడు చోట్ల వ్యాఖ్యానించారు.

"కడుపున పుట్టిన బిడ్డల్ని ప్రేమిస్తున్నాం మనం, ప్రేమించ గలుగుతున్నాం; అదయినా అంతంత మాత్రంగా. కాని ఈ తోటమాలి రామయ్య చెట్టునో, పుట్టనో, యెవరికో పుట్టిన మీరు మనవ కూతుర్ని సువిశాల హృదయంతో పరిపూర్ణంగా ప్రేమిస్తున్నాడు. ప్రేమకు స్థానం కడుపు కాదు బాబూ! ఉదరకోశం కాదు. హృదయం! ప్రేమించేది హృదయం గాని కడుపు కాదు. 'కడుపు చించుకుంటేనే ప్రేమ కలుగుతుందన్నది భ్రమ...... కడుపున పుట్టిన బిడ్డలు ఎంతమంది తమ తల్లిదండ్రుల్ని హత్యా చేయలేదు?.... అలాగే ఎందరు

తల్లిదండ్రులు తమ బిడ్డల్ని చిత్రవధ చేయుతారు?... క్షేత్రము, బీజము రెండూ ప్రధానమైనవే గాని — అత్యంత ప్రధానమైనది స్థితి. వాతావరణం పరిసరాలు, పరిస్థితులు ప్రాబల్యం వల్లనే మనిషి పెరుగుతాడు....... ఈ తోటమాలి రామయ్య తండ్రిని చూసైనా మనం నేర్చుకుందాం. పెరుగుదాం. గొప్ప గొప్ప వంశాలను, నూతనమైన, రంగు రంగుల అందమైన వంగడాలను సృష్టిస్తాం(ము) అని దేశికాచార్యుల పాత్రలో వ్యాఖ్యానింప చేస్తాడు. ఆ స్థితి సాధించిన దేశికాచార్యులు పావని ధర్మారావు వల్ల కలిగిన ధర్మ సంతానమైన కమలలతో పాటు పేపర్ కుర్రవాడిని కూడా తన సంతానంగా స్వీకరించగలిగాడు. ఇక్కడ వంశాంకురం ప్రశ్న లేనే లేదు. స్వంత ఆస్తి అనేది ఉన్నప్పుడే వంశాంకురాన్ని గురించిన ప్రత్యేకమైన ఆరాటం.. ఇది ఈ ఇతివృత్తంలోని గొప్పతనం.

డైలాగులు, రేడియో నాటికకు తగినట్లుగా, క్లుప్తంగా, పదునుగా ఉన్నాయి. సుదీర్ఘమైన ఉపన్యాసాలు లేవు. పాత్రల స్వరూప స్వభావాలు రేఖామాత్రంగా సంభాషణల ద్వారానే శ్రోతలకు లేదా పాఠకులకు ప్రత్యక్షమవుతాయి.

శైలి మొత్తం మీద సూటిగా, సరళంగా పండిత పామరులకు సులభగ్రాహ్యంగా సాగింది. నాటిక మొత్తం మీద పావని మరణించే సన్నివేశం పరమ గంభీరమైన హృదయాలను కూడ కదిలించివేసే కరుణ రసాత్మకమైన సన్నివేశం. కృత్రిమ గర్భధారణకు సిద్ధమవుతూ రాసిన రాసిన ఉత్తరాలలో కొద్దిగా హాస్యం తొంగి చూస్తుంది. జేమ్స్, మిసెస్ జేమ్స్ సంభాషణల్లో ఆధునిక భార్యాభర్తల మధ్య ఉండే ఈర్ష్యను అలవోకగా చూపారు. దీనికి గాఢత లేదు. నాటిక సూటిగా ధ్యేయం వైపు సాగుతూ అనవసర విషయాలను ప్రస్తావించకుండా ముందుకు సాగుతుంది. మొత్తం మీద ఈ నాటిక ఒక వినూత్న ప్రయోగం.

## 'బీళ్ళు తిరగబడుతున్నాయి'- 'గెరిల్లా సమరం'

ఈ లోకంలో సుఖమెంత ఉందో దుఃఖమంత ఉంది. మానవత్వమెంత ఉందో రాక్షసత్వమంత ఉంది. త్యాగమెంత ఉందో స్వార్థమంత ఉంది. సంస్కృతి ఎంతగా ముందుకు నడిపిస్తుందో, ఆటవికత అంతగా అగాధాలకు లాగుతోంది.

కన్నీళ్ళకు, పేదరికానికి, బాధలకు, బానిసత్వానికి బాధ్యత ఎవరిది? ఈ బాధలన్నీ ప్రజలు తమ తమ పాపాలకు ఫలితంగానే

అనుభవిస్తున్నారా? అమాయకులను ఎన్నో రకాలుగా బాధించే వారంతా దుర్మార్గులు కారా? వారిని శిక్షించేదెవరు? మరో లోకం లోనో శిక్ష పడుతుందని, మరో జన్మలోనో పరిహారం జరుగుతుందని కన్నీళ్ళు తుడుచుకుంటూ, కాచుకొని కూర్చోవలసిందేనా? ఈ ప్రశ్నకు సమాధానం- 'చేతులు తిరగబడుతున్నాయి', 'శాంతి సమరం' నాటకాలు అని చెప్తున్నారు రచయిత చిరంజీవి.

ఇతివృత్తం:

'చేతులు తిరగబడుతున్నాయి': అది ఆంధ్ర దేశం లోని ఒక మారుమూల పల్లె. ఆ పల్లెలో భూస్వామి రాయుడయ్య అక్కడి ప్రజలను పీడించుకు తింటాడు. ప్రజలకు అవసరమైనప్పుడు పదో, పరకో ఇచ్చి మెల్ల మెల్లగా వాళ్ళ భూములను కాజేస్తాడు. మాలపల్లెలోని సూరప్ప భూమిని రాయుడయ్య చేజిక్కించుకోవడంతో నాటకం ప్రారంభం అవుతుంది. రాయుడయ్యని ఎదిరించలేని ఆ పల్లె ప్రజలు నిస్సహాయ స్థితిలో, అది తమ కర్మ అని భావించుకుంటారు. ఆ సమయంలో ఆ పల్లెలోకి ప్రవేశిస్తాడు వీరదాసు. మాల మాదిగలను ఒకటిగా చేసి రాయుడయ్యని ఎదిరిస్తాడు. ప్రభుత్వం నుండి ఆ పల్లె ప్రజలకు బంజరు భూములను ఇప్పిస్తాడు. భూమిని

సాగు చేసుకోవడానికి ఎడ్లు, బండ్లు, నాగళ్ళు, బావులు మంజూరు చేయిస్తాడు. పల్లెప్రజలందర్ని కలుపుకొని 'జీవనవాడ' అనే గ్రామాన్ని నిర్మిస్తాడు. కొత్తగా నిర్మించుకున్న 'జీవనవాడ' కు పల్లెప్రజలందరూ కదలివెళ్ళడంతో ఈ నాటకం ముగుస్తుంది. ఈ నాటకాన్ని ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుండి 1976 ఫిబ్రవరి 19న తొలి ప్రసారం చేసారు.

<u>సాంఘిక సమరం</u>: 'జీవన వాడ' కు తరలి వెళ్ళిన ప్రజలు స్వతంత్రంగా జీవిస్తూ మామూలు జన జీవనంలో కలవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో రాయుడయ్య అల్లుడు ఆనందమూర్తి ప్రవేశిస్తాడు ఆ ఊరిలోకి. 'జీవనవాడ' ప్రజలు తమను ఎదిరించడాన్ని జీర్ణం చేసుకోలేక పోతారు ఆ ఊరు కరణం, రాయుడయ్య లు. 'జీవనవాడ'లోని ప్రజలను తిరిగి తమ చెప్పు చేతల్లోకి తీసుకోవడానికి రాయుడయ్య తన అల్లుడు ఆనందమూర్తికి సర్వాధికారాలు ఇస్తాడు. భూస్వామ్య విధానం నుండి పెట్టుబడిదారి విధానంలోకి మారుతున్న ఈ కాలంలో ఇంకా పాత పద్ధతులు చెల్లవని కొత్త పథకాన్ని ఆలోచిస్తాడు ఆనందమూర్తి. స్వాతంత్ర్య పోరాటకాలంలో బ్రిటిష్ వారు అమలు పరచిన 'విభజించి పాలించు' అన్న సూత్రాన్ని తలకెక్కించుకున్న ఆనందమూర్తి 'జీవనవాడ' లోని ప్రజలను

విభజించి పాలించాలనుకుంటాడు. 'జీవన వాడ' లోని పుల్లిగాడు, ఒకరయ్యలకు తాగించి వారి నాయకుడు వీరదాసుపై నిందలు వేయిస్తాడు. వాటిని పల్లె ప్రజలు నమ్మక పోవడంతో, వీరదాసు ప్రధాన అనుచరుడైన సూరప్ప భార్యకు, వీరదాసుకు అక్రమ సంబంధాన్ని అంటకట్టి రాములమ్మతో ప్రచారం చేయిస్తాడు. నిజం తెలిసిన పల్లె ప్రజలు ఆనందమూర్తిపై తిరగబడ్డారు. సమయం కోసం చూస్తోన్న ఆనందమూర్తి ఒకరోజు రాత్రి వీరదాసుపై విష ప్రయోగం జరిపిస్తాడు. వీరదాసు మరణిస్తాడు. మరణిస్తూ, ఈ ఉద్యమం ఆగకూడదనీ, ఒక వ్యక్తి మరణిస్తే ఉద్యమం ఆతనితోనే ఆగిపోకూడదనీ, ఉద్యమాన్ని మీ చేతుల్లోకి తీసుకొని ముందుకు నడిపించండి అన్న ఉద్బోధనతో 'గొంతు సమరం' ముగుస్తుంది. ఈ నాటకాన్ని 1976 మే 20వ తేదీన ఆల ప్రసారం చేసారు.

## విశ్లేషణ :

ఈ రెండు నాటకాలపై ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' నవల ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'మాలపల్లి' లో సామాజిక జీవితం మూడు భాగాలుగా కనిపిస్తుంది. 1. రామదాసు ఆధ్యాత్మిక విప్లవం, 2. వెంకటదాసు సాయుధ పోరాట విప్లవం 3. సంగదాసు అహింసా విప్లవం

లేదా గాంధేయ విప్లవం. 'కళ్ళు ఆరగబడుతున్నాయి' నాటకంలో పై మూడు ధోరణులు కనిపిస్తాయి. అయితే ఈ నాటకంలో సామ్యవాద విప్లవం, ఆధ్యాత్మిక విప్లవం, గాంధేయ విప్లవం వేరువేరుగా లేవు. ఈ మూడు ధోరణులు ఒకే వీరదాసులోనే ఉన్నట్టు కనిపిస్తాయి. అందుకే ఈనాటకంలో నాయకుడు వీరదాసు అని నిశ్చయంగా చెప్పుకోవచ్చు.

కథా కాలం ఆధునిక యుగంలో ఏదైనా కావచ్చు. ఆధునిక యుగం అని ఎందుకంటున్నానంటే ప్రాచీన యుగంలో లేని జాగృతి ఈ యుగంలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుందిగనక. దళితులపై అధికారుల, ధనవంతుల, పెత్తందార్ల దౌర్జన్యాలు ఈనాటివి కావు. చరిత్ర ప్రారంభం నుంచి నిరాఘాటంగా కొనసాగుతున్నవే. అయితే చరిత్ర పూర్వ యుగాలలో నిస్సహాయులై కర్మ సిద్ధాంతం మాటున దౌర్భాగ్యాన్నంతా కన్నీళ్ళతో సహించారు. ఆ కాలంలో సహితం ప్రాణాలకు తెగించి తిరుగుబాట్లు జరిపిన సందర్భాలు లేకపోలేదు. స్పార్టకస్ ఉదంతం దీనికి గొప్ప ఉదాహరణ.

అప్పుడప్పుడు స్పార్టకస్ లాంటి నాయకుల అండన అణగారిపోయిన వర్గాలు ఎదురుతిరిగినా, మొత్తం మీద కరుకు కత్తులు, మరతుపాకులు ఎందరో అమాయకులను బానిసలుగా మార్చి శ్రమ ఫలితాలను దోచుకోవటమే

లేదా గాంధేయ విప్లవం. 'తెళ్ళు తిరగబడుతున్నాయి' నాటకంలో పై మూడు ధోరణులు కనిపిస్తాయి. అయితే ఈ నాటకంలో సామ్యవాద విప్లవం, ఆధ్యాత్మిక విప్లవం, గాంధేయ విప్లవం వేరువేరుగా లేవు. ఈ మూడు ధోరణులు ఒకటే వీరదాసులోనే ఉన్నట్టు కనిపిస్తాయి. అందుకే ఈనాటకంలో నాయకుడు వీరదాసు అని నిస్సంశయంగా చెప్పుకోవచ్చు.

కథా కాలం ఆధునిక యుగంలో ఏదైనా కావచ్చు. ఆధునిక యుగం అని ఎందుకంటున్నానంటే ప్రాచీన యుగంలో లేని జాగృతి ఈ యుగంలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుందిగనక. దళితులపై అధికారుల, ధనవంతుల, పెత్తందార్ల దౌర్జన్యాలు ఈనాటివి కావు. చరిత్ర ప్రారంభం నుంచి నిరాఘాటంగా కొనసాగుతున్నవే. అయితే చరిత్ర పూర్వ యుగాలలో నిస్సహాయులై కర్మ సిద్ధాంతం మాటున దౌర్భాగ్యాన్నంతా కన్నీళ్ళతో సహించారు. ఆ కాలంలో సహితం ప్రాణాలకు తెగించి తిరుగుబాట్లు జరిపిన సందర్భాలు లేకపోలేదు. స్పార్టకస్ ఉదంతం దీనికి గొప్ప ఉదాహరణ.

అప్పుడప్పుడు స్పార్టకస్ లాంటి నాయకుల అండన, అణగారిపోయిన వర్గాలు ఎదురు తిరిగినా, మొత్తం మీద కొరుకు కత్తులు, మర తుపాకులు ఎందరో అమాయకులను బానిసలుగా మార్చి శ్రమ ఫలితాలను దోచుకోవటమే

చరిత్రగా పునరావృతమవుతూ వస్తూంది.

ఈ నాటకంలో ఒక మాలపల్లె. ఆ పల్లెలోని ప్రజలందరూ నిరుపేదలే. రెక్కాడితేగాని డొక్కాడని వాళ్ళు. చావు వచ్చిన, పెళ్ళి వచ్చిన అప్పులకు రాయుడయ్య వద్దకు పరుగెత్తక తప్పదు, తప్పని వాళ్ళు. ఆ ఊరులోని అతికొద్ది మోతుబరులు ధనబలంతో, అధికారుల అండతో ఈ అమాయకుల ప్రాణాలను తమ గుప్పెట్లో పెట్టుకొని వారి శ్రమను దోచుకుంటున్నారు. దొంగ ప్రోనోట్లు రాయించుకొని, వెట్టిచాకిరి చేయించుకుంటూన్నారు. ఇదే విషయాన్ని ఈ నాటకంలో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

"నిజమే బాప్! పనిని బట్టి గదా కూలీ. హనుమంతు గాడి కండలన్నీ కరిగిపోయాయి గనక, ఇక ఆ కండలు లేని శరీరంతో మనకేమి పనిలేదు గనక అందే ప్రొడక్షన్ ఫాల్ అవుతున్నది గనక రోజువారి కూలీ రూపాయి నుండి అర్ధ రూపాయికి, అర్ధ రూపాయి నుండి క్రమేణా పావలాకి దించవలసిందిగా రాయుడుగారికొక ఇండస్ట్రియల్ రిపోర్ట్ సబ్మిట్ చేస్తాను" <పు. 168> అని బసువులు పాత్రతో పలికిస్తాడు. శరీరంలో సత్తువ ఉన్నంతకాలం పని చేయించుకొని కండలు ఉడిగి పోగానే బయటకు విసిరేసే ఈ అన్యాయాన్ని నిలదీస్తాడు రచయిత.

యజమానుల క్రౌర్యానికి బలైపోయిన వ్యక్తులు - భూస్వాముల కామదాహానికి బలైపోయిన అతివల మాన మర్యాదలు - ఇవన్నీ దళితులకు సంబంధించిన చరిత్ర పుటలలోని అతిసాధారణమైన, మానవ జాతి సర్వ సామాన్యంగా భావించే విషయాలు. నిజానికి ఇవన్నీ చూసి సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవల్సిన పనులు.

ఈ నాటకంలో వీరదాసు చేసింది ఒక ప్రయత్నం మాత్రమే. రాయుడయ్య దౌర్జన్యానికి బలైపోయిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి మాలపల్లెలో. రాయుడయ్య దగ్గర అప్పు తీసుకోవడమే గాని అది తీరడమంటూ ఉండదు. అప్పు తీర్చలేక వెట్టికి కుదిర్చిన పసివాళ్ళపైన తల్లిదండ్రులు, బంధువులు ఆశలు వదులుకోవలసిందే. వారి ప్రాణాలే పోయినా 'అదేమని' అడిగే వాకుట ఎవరికీ లేదు.

అప్పులు - అప్పులు - అప్పులు. ఊరు విడిచి పొట్ట చేత బట్టుకొని పోదామన్నా వీలులేని అప్పులు. 'జీవనవాడ' కు తరలివెళ్తోన్న పల్లె ప్రజలతో, తన అప్పు తీర్చిన తర్వాత గాని ఊరు విడిచి కదలటానికి వీల్లేదు అంటాడు రాయుడయ్య. అప్పు తీరే మార్గం లేదు. డబ్బులు కట్టిన కొద్దీ అప్పు పెరుగుతుంటే గాని తరగదు. దొంగ ప్రోనోట్లు

మహేంద్ర జాలం అది.

నిరక్షరాస్యత - నిస్సహాయత - పరిస్థితుల పట్ల సరియైన అవగాహనలేని అజ్ఞానం ఆ పల్లె ప్రజలను బానిసత్వంలో పెరిగి బానిసత్వం లోనే మరణించేలాగ శాపగ్రస్థం చేసింది. ఆ విషయాన్నే రచయిత సూటిగా స్పష్టంగా చెప్పాడు.

"ఒక మనిషి బానిసగా పుట్టినందుకు నిందార్హుడు కాడండీ! ఆ బానిస స్వేచ్ఛా ప్రయత్నం చేయకుండా ఒప్పుకోవడమే గాక ఆ బానిసత్వాన్ని సమర్థించుకుంటూ, దానికి మెరుగులు పెడుతూ వుంటే మాత్రం అలాంటి బానిస నీచుడు, క్షుద్రుడు. మన ఆగ్రహానికి, అసహ్యానికి, ఏహ్య భావానికి అర్హుడు" (పు. 181) అంటూ అమృతరావు పాత్ర చేత అనిపిస్తాడు.

ఈ పరిస్థితుల నుండి గ్రామస్థులను బయటకు తీసుకరావటానికి ఒక ప్రయత్నం ప్రారంభించాడు వీరదాసు. తాత్కాలికంగా పరాజయం అయిన వీరదాసు గాంధేయ విప్లవ వీరుడిగా పోరాటం సాగించాడు. అతని మార్గం అహింసా, అతడి ఆయుధం విజ్ఞానం. సాటివారికి తెలియని సామాజిక రాజకీయ విశేషాలెన్నో తెలుసు. ప్రభుత్వం హరిజనులకు

బంజరు భూములు ఇస్తుందని, దానిని సాగుచేసుకోవడానికి ఋణ సహాయం కూడా అందిస్తోందని పల్లె ప్రజలకు తెలియపర్చాడు. వారి నందరినీ కూడగట్టుకొని రాయుడయ్యను ధైర్యంగా ఎదిరించి 'జీవన వాడ' ను నిర్మించాడు. ఇది 'తేళ్ళు ఆరుగుతున్నాయి' నాటకానికి ముగింపు.

'తేళ్ళు ఆరగబడుతున్నాయి' నాటకం ఒక గ్రామం పాదు కుదురుకోవడంతో సమాప్తమైతే, ఈ 'సొంత సమరం' లో 'జీవనవాడ' గ్రామ ప్రజలెలా పాతుకుపోకుండా, వేళ్ళూనకుండా, మొలకెత్తకుండా, తలెత్తకుండా 'నిర్మూలం' (అస్థిరం) గావించబడుతారో – అందుకు వ్యతిరేకంగా ఎలాంటి సమరం చేయవలసి వస్తుందో – వివరీకరించడానికి చేసిన ప్రయత్నమిది.

" రెండవ ప్రపంచ యుద్ధానంతరం దాదాపు 110 రాజ్యాలు సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుంచి విడివడి స్వతంత్ర రాజ్యాలయ్యాయి. వీటిని తృతీయ ప్రపంచ రాజ్యాలనీ, వర్ధమాన దేశాలనీ పిలుస్తున్నాం. అలా కొత్తగా పుట్టిన వర్ధమాన దేశమే, గ్రామమే – ఈ నాటకం లోని 'జీవనవాడ' " (పు.219) అని రచయిత చెప్పుకున్నాడు.

—

ఈ నాటకంలో ఆదిమ సమాజం నుంచి జరుగుతున్న పోరాటాలను చక్కగా చిత్రించాడు రచయిత. నాటక ప్రారంభంలో 'నీలదీపాలు' కథ చెప్తాడు. ఆ 'నీలదీపాలు' ఒక వీరుని గుండెలోని మిణుగురులు. ఆ వీరుడు 'కలికి'. బలవంతమైన ఒక జాతి నుండి తన జాతి వారిని రక్షించి వారికోసం తన గుండెనే పెకలించి, వెలుతురుగా నిలిపి తాను అమరుడయ్యాడు. కాని అతని పోరాటం ఇంకా సాగుతూనే ఉంది. దానినే అందుకున్నారు హరిజన వాడ జనం. ఆమె చేసిన ఒకనాటి సమ్మెను గుర్తు చేసుకున్నారు. నాగేటి మేడి చిగురించి మహావృక్షం కాగా దాని నీడన విముక్తి పోరాటం సాగించారు. జీవనవాడ ఏర్పరచుకున్నారు. దొంగ బియ్యం వద్దనుకున్నారు. శ్రమించి సంపద సృష్టిద్దామనుకున్నారు. ఈ నాటకం లోని హరిజనవాడ ఒక పల్లెకాదు - ఒక దేశంకాదు - పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న ఏ దేశం అయినా కావచ్చు.

మొదట్లో వర్గ సంఘర్షణ ప్రబలంగా చూపించిన రచయిత ముగింపులో అధికార యంత్రాంగంతో రాజీపడిపోయాడు. ఒక్కొక్క కుటుంబానికి రెండున్నర ఎకరాల చొప్పున భూమినిస్తుంది ప్రభుత్వం అని చెప్తాడు. అంతేగాక భూమిని సాగు చేసుకోవటానికి నాగళ్ళను

ఎడ్లను, ఇతర పనిముట్లను సప్లయి చేస్తుందని చెప్తాడు రచయిత. ప్రభుత్వమే దళితులకు సదుపాయాలన్నీ కల్గిస్తున్నట్లు వాటిని అందుకోవడానికి చేయి చాచటమే ఆలస్యం అన్నట్లు చూపించాడు. నిజానికి ప్రభుత్వం వారు ప్రకటించిన సదుపాయాలన్నీ నేరుగా దళితులకు అందుతున్నాయా? మధ్యలో ఉన్న రాజకీయ యంత్రాంగం ఏ విధమైన ఆటంకాలు కల్పించటం లేదా? ఒకవేళ ప్రభుత్వం నుండి తీసుకున్న ఋణాలు సకాలంలో చెల్లించ లేకపోతే ప్రభుత్వాధికారులు రాయుడయ్యలా కాకుండా, సహనంగా ప్రవర్తిస్తారా? ఇలాంటి ప్రశ్నలను పరామర్శించ లేదు రచయిత.

ఈ వెలితిని పూరిస్తుంది వాస్తవ దృక్పథంలో సాగిన 'గాంధి సమరం'. పేరులోనే రచయిత సూటిగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ధిక్కరించే ఉద్దేశ్యంలో లేడని అర్థమవుతుంది. అయితే భూస్వామ్య వర్గాలకు - దళితులకు మధ్య జరిగే పోరాటాన్ని మాత్రం నిజాయితీతో చిత్రించాడు. బ్రిటిష్ వారు నేర్పిన 'విభజించు పాలించు' సిద్ధాంతం కూడా బాబులకు తలకెక్కింది. స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వాళ్ళు అనుసరించిన ఈ సిద్ధాంతాన్ని 'జీవన వాడ' లాంటి ప్రజలపై ప్రయోగించాడు ఆనందమూర్తి. 'జీవనవాడ' ప్రజలు కరణానికి, రాయుడయ్యకి,

శ్రీనందమూర్తికి ఏ అపకారం చేయక పోయినా, తమ అధికార పంథా నుండి తప్పించుకోవడమే పెద్ద అపరాధంగా వాళ్ళు భావించారు. వాళ్ళ శ్రమను దోచుకునే అవకాశం పోయినందుకు బాధపడ్డారు. వాళ్ళ శ్రమను ప్రోగు చేసుకోకపోతే వీళ్ళ సంపదలెక్కడివి? "ఒకరి ధాన్యపు గింజ కడుపులో ప్రపంచ వైభవమంతటికీ తావుంది" (పు. 184) అని అంటాడు రచయిత. వాళ్ళు సాధించి నిర్మించుకున్న 'జీవనవాడ'ను దక్కనిస్తారా పెద్ద మనుషులు - భూస్వాములు - ధనస్వాములు. అది దక్కించుకోవడానికి సాగిన సమరమే నాంది సమరం. ఈ సమరం కొత్తగా వచ్చిన అన్ని దేశాల్లోనూ జరుగుతుంది. వలస సామ్రాజ్యవాదం మరొక రూపంలో ప్రత్యక్షం కావడం శ్రీనందరావు పాత్రలో కనిపిస్తుంది. ఎత్తులు, జిత్తులూ ఎలా మారిందో, గ్రామీణ వర్గంలోనే చీలికలు తేవడం అనేది వ్యాపార సామ్రాజ్యవాదాన్ని గుర్తుకు తెస్తాయి. జనాన్ని లోబరచుకోవడం, వారిలో చీలికలు తేవడం, పుకార్లు పుట్టించడం, రాజకీయ హత్యలు చేయించడం - ఇవన్నీ 'చిలీ', 'బంగ్లాదేశ్' లలో జరిగిన సంఘటనలను గుర్తుకు తెస్తాయి.

ఎన్ని ప్రయత్నాలు చేసినా లొంగని పల్లె ప్రజలపై రాయుడయ్య అల్లుడు కుటిల తంత్రం ప్రయోగించాడు. పుల్లిగాడు, ఒకరయ్యలు

తాగుడికి ఆశపడి తమ వారి నుండి చీలిపోయే ప్రయత్నం చేసినా, వీరదాసు వయుభయాల వారిని తమలోనే తమ వారిగా నిలిపాడు. రాములమ్మ ఆనందమూర్తి ప్రోద్బలంతోనే సూరప్ప భార్య సరస్వతికీ, వీరదాసుకు అక్రమ సంబంధం అంటకట్టి ప్రచారం చేసింది. ఆమె తప్పుడు మాటలను ఎవరూ నమ్మలేదు. ఎదురుతిరిగి ఆమెకే బుద్ధి చెప్పారు. పల్లె ప్రజలంతా ఇలా కలిసికట్టుగా ఉండటం అసంభవం కాకపోయినా కొంత కాల్పనికత ఉంది. అయితే విప్లవ వీరుల పట్ల గిరిజన గ్రామాలలో ఇలాంటి ఆరాధనా భావం కనిపిస్తుంది.

చివరకు ఆనందమూర్తి మనుషులు వీరదాసుపై విషప్రయోగం జరిపారు. సోక్రటీస్‌లాగా - ఏసుక్రీస్తులా వీరదాసు కూడా పల్లె ప్రజల కోసం ప్రాణాలు వొదిలి అందరి హృదయాలలో చిరంజీవిగా మిగిలాడు.

'మాలపల్లి' లో సంగదాసు చనిపోయినా అతడు ఆరంభించిన ఉద్యమం ఆగిపోలేదన్నట్లు, వీరదాసు చనిపోయినా అతడు ప్రారంభించిన ఉద్యమం మరింత ముందుకు సాగుతుందని ధ్వనింప చేసాడు రచయిత.

ఈ రెండు నాటకాలు మార్క్సిస్టు దృక్పథంతో రాసినవి. వర్గ సంఘర్షణ ప్రాతిపదికగా సాగిన రచన ఇది. ఇది ఒక రకంగా

రెండవ 'మాలపల్లి' అని చెప్పుకోవచ్చు. అయితే 'మాలపల్లి' లాంటి శాంతి సమరానికీ ఈ నాటకం లాంటి శాంతి సమరానికీ ప్రధానమైన భేదం ఉంది. 'మాలపల్లి' లో సంగదాసు మరణించినప్పుడు రామదాసు కర్మ అని వేదాంతాన్ని ఆశ్రయించాడు. కాని ఈ 'శాంతి సమరం' లాంటి వీరదాసు శాంతి సమరం ప్రదర్శిస్తూనే శత్రువులని కేళ్ళిస్తున్నప్పుడు ప్రతిఘటించవలసిందే అని ప్రబోధిస్తాడు.

"వాళ్ళతో మనకు వైరమూ లేదు. అంటే వాళ్ళమీద మనం యుద్ధం ప్రకటించం. వాళ్ళు ప్రకటిస్తే మాత్రం చచ్చు దద్దమ్మల్లా చేతులు ముడుచుకు కూర్చోము. మన బలాలను మనం కూడగట్టుకొని ఎదురుదెబ్బ తీస్తాం. ఇది కేవలం మన రక్షణకు మాత్రమే. స్వరక్షణ కోసం. స్వరక్షణ కోసం సాగబోతున్న ఈ సమరం 'శాంతి సమరం'! ఈ సమరం చేయకపోయామా- ఈ సమరం చేయకపోయామా - ఈ సమరానికి సన్నద్ధం కాకపోయామా- మనకు శాంతి లేదు, జీవనం లేదు, మన ఉనికికే భంగకరం" (పు.180) అని వీరదాసు తన అనుచరులతో అంటాడు.

ఇది అభ్యుదయ ప్రబోధం. మార్క్సిస్టు దృక్పథంలో వ్యక్తారాధనకు స్థానం లేదు. అందుకే ఉద్యమం ఒక వీరదాసు మీద

ఆధార పడలేరు. వీరదాసు మరణించగానే ఉద్యమం ఆగిపోలేదు. ఈ చైతన్యం అందరిలోనూ నిండి ఉందని, ఒక వ్యక్తి మరణించినా, ఆ చైతన్యం పూర్వాధికంగా ప్రజ్వరిల్లుతుందని ప్రబోధించాడు వీరదాసు.

"నిస్పృహ అనేది నశించిపోయే జాతికి సంబంధించి-నట్టిది తమ్ముడూ! మనకు పనికి రాదు. చెడుకు కారణాలు గ్రహించలేక, బయట పడే మార్గం కానక, పోరాటం చేతగాని వాళ్లకు మాత్రమే నిరాశా నిస్పృహలు కలుగుతాయి. నడిపించు తమ్ముడూ..... .....ధైర్యంగా నీ జాతి జనులను ముందుకు నడిపించు..... ఇంకొక మాట, ఇక నీపై యుద్ధం ప్రకటించే ధైర్యం వాళ్లకుండదను-కుంటాను. ఎందువల్లనో తెలుసా? మన బలం పెరుగుతున్నది. శత్రు బలం తగ్గుతున్నది. గ్రామాలు గ్రామాలు స్వతంత్రమై, స్వయం సంపన్నమై, స్వావలంబనతో తలయెత్తి నిలబడుతున్నాయి. ప్రపంచ చరిత్రే మారిపోతుంది తమ్ముడూ! ఆసియా, ఆఫ్రికా, యూరప్, దక్షిణ అమెరికా దేశాలు విముక్తమై, నూతన తరహా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించబోతున్నాయి. పొదుపుకొండ గ్రామం అలాంటి విముక్తి గ్రామమే. మనకంటే ముందు మేలుకొని నిలదొక్కుకున్న గ్రామం.

వాళ్ళ సహాయం తీసుకో. పెట్టుబడిదారీ - సోషలిస్టు వ్యవస్థల మధ్య సాగుతున్న ఈ పోరాటంలో నువ్వు వాళ్ళకండగా, వాళ్ళు నీకండగా నిలిస్తే ప్రపంచ శాంతి స్థిరపడిపోయినట్లే. ఇక యుద్ధాలు రావు, యుద్ధాలు లేవు...... ఇతర జాతులను పీడించే జాతి ఏది కలకాలం స్వతంత్రంగా మన జాలదు తమ్ముడూ! గుర్తు పెట్టుకో.... మనిషి కంటే విలువైన వస్తువేదీ ప్రపంచంలో లేదు. ఈ ప్రపంచాన్ని మానవ వాస యోగ్యం చేయి తమ్ముడూ! ముందుకు నడిపించు జయం మనదే" (పు. 183-184).

చిరంజీవి రాసిన ఈ రేడియో నాటకాల్లో నాయకుడు ఉన్నాడు. అయితే ఆ నాయకుడు మరణించడం వల్ల నాటకాలు విషాదాంతం కాలేదు. అంటే ధ్యేయం భంగపడలేదు. ఒక నాయకుడు మరణిస్తే మరెందరో నాయకులు ప్రభవిస్తారు. సామాజిక ప్రగతి ఎప్పుడూ ఒక వ్యక్తిని ఆశ్రయించుకొని ఉండదనే సత్యాన్ని నిరూపించాడు రచయిత.

## శ్రీ కృష్ణ శిరోభారం :

ఇతివృత్తం: శ్రీకృష్ణునికి శిరోభారం వచ్చింది. ఆయన శిరోభారం తగ్గించటానికి పట్టమహిషి రుక్మిణి శ్రీగంధం రాసినా, సత్యభామ కర్పూరం పట్టు వేసినా, దేశదేశాల భిషగ్వర చక్రవర్తులంతా వచ్చి ఎన్ని ప్రయత్నాలు చేసినా తగ్గలేదు. ఆ సమయంలోనే నారదుడు వస్తాడు. శ్రీకృష్ణుని శిరోభారానికి మూలం ఎక్కడో మారుమూల పల్లెలో ఉన్న ఎరుకల పిల్ల స్వేద ప్రణాతే కారణమని గ్రహిస్తాడు. అయితే శ్రీకృష్ణుని పై వారి అనుచర బంధు వర్గాలలో ఎవరికి ఎంత ప్రేమ ఉందో నిరూపించే ఒక చిన్న ఉపాయం ఆలోచించి తామర కొలనులోని నీళ్లను తీసుకొచ్చి కృష్ణుని పదాతలాలు రాస్తే శిరోవేదన తగ్గుతుం-దని, అలా ఎవరైతే చేస్తారో వారే శ్రీకృష్ణుని పై నిజమైన ప్రేమ ఉన్నవారు అని చెప్తాడు. దాంతో, శ్రీకృష్ణుని అష్ట మహిషులు, గోపాలురు, పదహారు వేలమంది గోపికలు, అనుచర బంధువర్గమంతా ప్రయత్నించి విఫలమవుతారు.

ఇక్కడ ఈ నాటకం మారి, నారదుడు శ్రీకృష్ణుని శిరమును రక్షించ వలసిన శివుని వద్దకు వెళ్ళి విషయం చెప్తాడు. శివుడు, నారదుడు కోయ, దొంతి వేషాలలో శ్రీకృష్ణుని శిరోభారానికి కారణమైన ఎరుకల పిల్ల వద్దకు వస్తారు. ఎరుకల పిల్ల స్వేదప్రశ్నాలకు మూలమైన కారణాలన్నింటిని తెలుసుకొని, వీనికంతటికీ కారణమైన దారుణ కల్మషాలు, విపరీత ధ్యానములు, నష్టమంగళులు మొదలైన వాటిని చూప-టంతో ఇటు ఎరుకల పిల్లపై ఉన్న స్వేదప్రశ్నాలు మాయమై అటు శ్రీకృష్ణుని శిరోభారం తగ్గటంతో కథ ముగుస్తుంది.

విశ్లేషణ:-

'శ్రీకృష్ణుని శిరోభారం' ప్రయోగాత్మకమైన రేడియో నాటకం. ఈ నాటకాన్ని ఆకాశవాణిలో 1976 Nov 18 న ప్రసారం చేసారు. ఇది రేడియో నాటకంగానే తప్ప దృశ్య నాటకంగా ప్రదర్శించటానికి సాధ్యం కాని నాటకం. ఈ నాటకం రక్తి కట్టడానికి 'Sound and effects' చాలా అవసరం. పౌరాణిక వాతావరణాన్ని శ్రోతల మనస్సులలో కల్పించటానికి

ఆకాశయానం ద్వారా ఏ పాత్రను రావాలనుకుంటే ఆ పాత్ర శ్రోతల మనస్సుల ముందుకు రప్పించటానికి sound effects ఎంతో అవసరం. ఇది పురాణగాథగా ప్రవర్తిస్తూ-పురాణగాథను ఆధారంగా చేసుకొని సామాజిక అంశాల్ని వ్యాఖ్యానించటం కోసం పురాణగాథను పునర్నిర్మించటం, పురాణగాథాత్మక పునర్నిర్మాణం అవుతుంది. దీనినే Mytho poesis అంటారు. Myth అనే మాటకు ప్రాచీన మానవులు చెప్పుకునే మాటలు-లేక చెప్పుకున్న కథలు అని దీని అర్థంగా భావించవచ్చు. "నిశ్చయంగా లిఖిత సంప్రదాయానికి పూర్వపు యుగాలలో రూపొందిన కథన రూపాలు మాత్రమే పురాణగాథలన్నీ"[1] ఆచార్య సి. ఆనందారామం అభిప్రాయ పడ్డారు. సాహిత్యంలో Mytho Poesis అంటే పురాణగాథాత్మక పునర్నిర్మాణం. అది నాలుగు విధాలుగా ఉంటుంది. ఆచార్య సి. ఆనందారామం వాటిని,

---

1) సి. ఆనందారామం – 'తులనాత్మక సాహిత్యం – నవలా ప్రక్రియ' – పు. 37

"(1) పౌరాణిక పురాణగాథని సాంప్రదాయికంగా తిరిగి చెప్పడం. (2) పురాణగాథాత్మక కథనం, సామాజిక కథనం రెండు దానితో పాటూ మారి మలుపుల ప్రయోగించటం (Juxture position) (3) పురాణగాథాత్మక నిర్మాణంలో ఆధునిక సామాజిక కథనం (structural parallel) (4) ఇతి వృత్తంలో ఒక కథాంశంగా పురాణగాథాత్మక విషయం ఉంటుంది కాని ఇతి వృత్తమంతా అల్లుకొని ఉండక ఒక భాగంగా మాత్రమే ఉంటుంది (Prefiguration technique)[1] అని పేర్కొన్నారు.

ఈ నాటకంలో (Juxture position)

పురాణగాథాత్మక కథనం, సామాజిక కథనం రెండు దానితో పాటూ మారి మలుపుల ప్రయోగించటం అనే శిల్పం ప్రయోగించబడింది. అంటే పురాణగాథలతో పాటు సామాజిక కథాంశం కూడా కలిసి మెలిసి కొనసాగుతుంది.

ఈ నాటకం చదువుతున్నప్పుడు శ్రీరంగం నారాయణ బాబు "రుధిర జ్యోతి" కవితా సంపుటిలోని 'కపాల మోక్షం'

---

(1) సి. ఆనందారామం - 'తులనాత్మక సాహిత్యం - నవలా ప్రక్రియ - పు. 55

కవితా ఖండిక స్ఫురిస్తుంది. అందులో భారత స్వతంత్ర సంగ్రామంలో వీరునిగా వెలిగి అమరుడైన భగత్ సింగ్- హిందూపురాణాలకు ప్రత్యేక శిల్పుని గురించి చెప్తారు. జాతీయతా దీపమంలో భగత్ సింగ్ ధ్రువతారగా వెలిగి బ్రిటిష్ వారి గుండెల్లో గుబులు పుట్టించాడు. చివరకు నేరం ఆపాదించబడి భగత్ సింగ్ ఉరితీయబడ్డప్పుడు భారతదేశం "ఇది అన్యాయం' అని ఒక్క పెట్టున ఘోషించింది. భారతీయుల దైవమైన శిల్పునికి ఈ అధర్మం కారణంగా సమాధి భంగమైంది. విగ్రహంలో అణచిన ప్రళయాన్ని క్రోధోద్వేగంతో వెలిగి బ్రహ్మకపాలం పగిలింది. బ్రహ్మకపాలం పగలడమంటే సృష్టిలో ఎవరికీ ఆహారం లంభించక పోవడం. ఇంత ఘోరమైన అన్యాయం జరుగుతుండగా ఎదిరించక సహించినందుకు విశ్వానికి విధించబడ్డ శిక్ష అది. కానీ మరణించిన తరువాత తన అన్నదమ్ములైన భారతీయుల ఆకలి చూసి సహించలేదు భగత్ సింగ్. అతని కపాలం రివ్వున ఎగిరి వచ్చి శిల్పుని భిక్షపాత్ర అయింది. భగత్ సింగ్ ప్రళయ శంకరుడు. ఈ

ప్రళయం భారత దేశాన్ని ఆక్రమించిన బ్రిటిష్ వారి అన్యాయాన్ని దహించే ప్రళయాగ్ని జ్వాల. ప్రళయం ధర్మాన్ని నాశనం చేయదు. అధర్మాన్ని నాశనం చేస్తుంది.

'కపాలమోక్షం' లో శివుడు విశ్వాత్ముడైనట్లు, 'శ్రీకృష్ణ శిరోభారం' లో సైతం శ్రీకృష్ణుడు విశ్వాత్ముడు. సమాజంలో జరిగిన దారుణమైన అన్యాయానికి, ఆయనకు శిరోభారం వచ్చింది. ఈ సందర్భంలో శ్రీశ్రీ పౌరాణిక ప్రతీ-కలను కూడా మనం చర్చ చేసుకోవాలి. చిరంజీవి పైన శ్రీశ్రీ ప్రభావం ఉన్నట్లు అనిపిస్తుంది. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితా ఖండికలన్నింటిలోనూ పాత వ్యవస్థను నాశనం చేసి కొత్త వ్యవస్థను పునర్నిర్మించుటకు ప్రళయ రుద్రుని ప్రతీకగా వాడుకున్నాడు. ఈ నాటకంలోనూ శ్రీకృష్ణుని శిరోభారానికి కారణమైన వ్యవస్థలోని అస్తవ్యస్తతను నిర్మూలించటానికి శంకరుని త్రిశూలమే కారణమైంది.

ధర్మదేవత వర్ణన – కలిపురుషుని వర్ణన – పరీక్షిత్తు వర్ణన – ఆ సందర్భంలో వాడిన పౌరాణిక ప్రౌఢ పదజాలం

మొదలైనవన్నీ పౌరాణిక వాతావరణంలోకి శ్రోతలను తీసుకు పోతాయి. 'గౌతమ మహాముని ఆశ్రమ వర్ణన— నారదుడు, వసంతకుడు, వాసంతిక, శ్రీకృష్ణుని అష్టమహిషులు పదహారు వేల మంది గోపికలు, రాధమ్మ, — మొదలైన వారి వర్ణనలతో శ్రోతలను (హిందూ పురాణాలతో పరిచయం ఉన్న శ్రోతలను) చిర పరిచయమైన ద్వారకా నగరానికి తీసుకు పోతాయి.

'శ్రీకృష్ణశిరోభారం' అనే కల్పన 'శ్రీకృష్ణతులాభారం' అనే కల్పనను తలపింప చేస్తుంది. 'శ్రీకృష్ణతులాభారం'లో రుక్మిణీ దేవి భక్తి, సత్యభామ అభిజాత్యాన్ని, అహంకారాన్ని గెలుచుంది. ఈ నాటికలో రుక్మిణీ దేవి భక్తిగాని, మధురా నగరంలోని పూర్వపు కుబ్జ ఆరాధనగాని, మరే ప్రేమగానీ శ్రీకృష్ణుని శిరోభారాన్ని తొలగించ లేక పోయాయి.

శ్రీకృష్ణుడు విశ్వాత్ముడు. సకల చరాచర విశ్వానికి ప్రతీక. విశ్వంలో జరిగే అన్యాయమే ఆయన శిరోభారానికి కారణం. ఏ మేరకు ఈ అన్యాయం? ఒక

ఎరుకల అమ్మాయికి తగిలిన దెబ్బల మూలంగా శరీరం పైన ఏర్పడిన స్ఫోటకవ్రణాలు. గొలుసు ప్రశ్నల జానపద కథలాగ ప్రశ్నలతో సమాధానాలతో వచ్చి చేదు సామాజిక సత్యం విషం కక్కుతూ బయటపడింది.

ప్ర: ఎరుకల అమ్మాయిపై స్ఫోటకవ్రణాలు ఎలా ఏర్పడ్డాయి?

జ: వాళ్ళమ్మ కొట్టింది.

ప్ర: ఎందుకు కొట్టింది?

జ: బొచ్చెలో ఉన్న అన్నం తాను తినకుండా, తల్లికి ఉంచకుండా ఎవరికో పెట్టినందుకు.

ప్ర: ఎవరికో ఎందుకు పెట్టింది. ఆ అమ్మాయికి ఆకలి లేదా?

జ:- ఆకలి లేక కాదు. ఒక ముసలిదాని ఆకలి బాధ చూడలేక.

ప్ర: ముసలిదాని ఆకలి బాధ చూడటానికి దాని కొడుకు లేడా?

జ: ఉన్నాడు. కాని వాడి పరిస్థితి మరీ హైన్యంగా ఉంది తినడానికి తిండి ఒకని దగ్గర పాలేరుగా ఉండి పశువులాగా వాడి కాడి లాగుతూ పొలం దున్నుతున్నాడు.

ప్ర! మనిషై పుట్టి పశువులా కాక ఎందుకు లాగుతున్నాడు?

జ! వాడి భూమిని కాజేసిన దారుణ పక్షి దుర్మార్గం వల్ల- అతని అనుచరులైన గోమాయువు, విపరీత జ్ఞానుడు, నష్టమంగళుడు మొదలైన వారి సార్థక నామధేయుల దుర్మార్గం వల్ల.

ప్ర! దీనికి నిష్కృతి ఏమిటి? వారందర్నీ సంహరించటమా?

జ! కాదు. స్వంత ఆస్తి అనేది లేకుండా చేయడం, శ్రమ ఫలాన్ని అందరూ అనుభవించేలా చూడటం.

ప్ర! దీనిని ఎవరు సాధించగలరు?

జ! కాల స్వరూపుడు, ప్రళయ రుద్రుడైన శివుని త్రిశూలమే.

పై విధంగా, జానపద పద్ధతి మాదిరి కోయవేషంలో ఉన్న శంకరుడు, అతని పక్కన యతివేషంలో నారదుడు ఎరుకల పిల్లతో మొదలుపెట్టి సమాజంలో జరుగుతున్న దోపిడీ విధానాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థలోని దుర్మార్గాన్ని శ్రోతలకు తెలియ చేస్తాడు రచయిత.

'శ్రీకృష్ణ తులాభారం' లో భక్తి గొప్పదని నిరూపించారు.

భక్తులను ఎవరైన కొడితే వారి ఒంటి మీది దెబ్బలు భగవంతుని ఒంటిమీద కనపడేవని పురాణేతిహాసాలు చెప్తున్నాయి. ఈ నాటకంలో ఎరుకల పిల్ల నిలబడి తల్లి చేత దెబ్బలు తిని శరీరం మీద బొబ్బలు ఎక్కితే అది శ్రీకృష్ణుని శిరోభారానికి కారణమైంది. అయితే అశుభం, శుభం తెలియని ఆ పసి పిల్ల భక్తురాలు కూడా కాదే. బహుశ: శ్రీకృష్ణుని పేరైనా ఆమె విని వుండదు. ఏ పూజలు చేసి ఉండదు. గుడి ఎలా ఉంటుందో కూడా ఆ పిల్లకు తెలియదు. పురాణాలు, దేవుళ్ళు, శాస్త్రాలు ఏమీ తెలియవు. ఆమె చేసిందల్లా తను తిన్నా తినక పోయినా ఆకలితో ఉన్న ముసలిదానికి, తన కోసం దాచియుంచిన కొద్ది పాటి అన్నం కూడా మిగల్చకుండా పెట్టడం. ఈ మానవత్వం, ఈ త్యాగనిరతి ప్రేమన్నా భక్తి అన్నా, తపస్సు అన్నా, జ్ఞానం అన్నా, గొప్పదని చెప్తున్నాడు రచయిత ఈ నాటకం ద్వారా.

పై ఇతివృత్తాన్ని తీసుకొని రచయిత శ్రీకృష్ణ శిరోభారం అనే పేరుతో తిరిగి సాహితీ రూపంగా

సృష్టించారు. ఈ కొత్త సృష్టిలో పాత చట్రం ఉంటూనే రుక్మిణి కంటె పూర్వకాలపు గొప్ప భక్తురాలని, అంతకంటె గొప్ప భక్తురాలు రాధ అని నిరూపించారు. ఒక వంక ప్రేమ, భక్తి అంటూనే కృష్ణ కథను అనుసంధించి ఉన్న బాణాసుర కథను కూడా ప్రస్తావించి శంకరుని దేశాటన రూపాన నాటకాన్ని స్ఫూర్తి సామాజిక చైతన్యంతో మలచటం చిరంజీవి నాటక నిర్మాణ నైపుణ్యానికి గొప్ప నిదర్శనం.

లోకంలో ప్రధానంగా మనదేశంలో అంతకంటె మన రాష్ట్రంలో ఎటు చూసినా ఆకలి, దరిద్రం ఎటు చూసినా అన్నార్తుల పెను ఘోషలు. ఈ ఆకలి మంటలను చల్లార్చేదెవరు? ఈ ఘోషలు అణగారేదెన్నటికి? విశ్వాత్మకమైన కృష్ణభగవానుని శిరోభారాన్ని తగ్గించగలిగేది వ్యక్తారాధనకు మూలమైన ప్రేమగాదు, భక్తి కాదు. అభాగ్యుల ఆకలి మంటలు చల్లారినప్పుడే ఆ భగవానుని శిరోవేదన ఉపశమిస్తుంది.

ఇలా చమత్కారంగా, ప్రసిద్ధమైన శ్రీకృష్ణ శిరోభారం నాటకాన్ని ఆలంబనంగా తీసుకొని ఆకలి

మంటలను చల్లార్చటమే మానవుని గొప్ప ఆదర్శమని ప్రబోధిస్తున్నాడు.

పురాణ పాత్రలు గ్రహించి వాటిని మానవీకరించటం వల్ల, సమకాలీన సామాజిక వాతావరణానికి అనుగుణంగా ఆధునీకరించటం వల్ల చిత్రమైన సౌందర్యం వస్తుంది. అంతే కాదు ఈ పురాణగాథలు సృష్టింపబడిన నాటి వ్యవస్థలో ఉన్న లోపాలను కూడా బహిర్గత పరుస్తుంది.

పౌరాణిక నాటకంలా భ్రమ కల్గిస్తూ సాగిన ఈ నాటకంలో కూడా రచయిత తన అభ్యుదయ దృక్పథాన్ని వదిలిపెట్టలేదు." సంపదను కూడబెట్టి, ధనిక నిర్ధనికములనే రెండు వర్గములను కల్పించి వాటికి శాశ్వత శత్రుత్వము నాపాదించి, లోక శాంతికి విరోధులవుతున్నారు, విచ్ఛిన్నకారులు .... సంపదను సృష్టించునది శ్రమగదా! ఆ శ్రమ శక్తిని దొంగిలించుచున్న ఈ దోపిడి దారులను - ఈ లోకకంటక శరీరంబులను - సంహరించనిదే ప్రజలకు ముక్తి లేదు; ప్రపంచానికి శాంతి లేదు" (పు.101) అని

నారదుని పాత్ర చేత పలికిస్తాడు. శ్రమ శక్తి దోపిడికి గురి కాకూడదు. సొంత ఆస్తి ఉండకూడదు. అప్పుడే మానవుడు ఆకలితో అలమటించే దారుణ దురవస్థకు దూరం అవుతాడు. ఇదే ఈ నాటకం అందించే సందేశం.

## కొక్కొరొకో:

ఇతివృత్తం: ఇందిరాగాంధీ, బ్యాంకులను జాతీయం చేయడం రాజభరణాల రద్దు, భూసంస్కరణల చట్టం, ప్రభుత్వ నిర్మాణ సంస్కరణలు, 20 సూత్రాల ఆర్థిక పథకం మొదలైన వాటిని జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతుంది. అయితే ఈ అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేని స్వార్థ పెట్టుబడిదారులు, ప్రభుత్వ యంత్రాంగంలోని అసమర్థులు, అవినీతి పరులు ఇందిరాగాంధీపై అబద్ధపు ప్రచారం చేస్తారు. ప్రజలనుండి తిరుగుబాటు లేవదీయటానికి ప్రయత్నిస్తారు. అయితే సామాన్య ప్రజలు ఎదురు తిరిగి బడా వ్యాపార వేత్తలను, అవినీతి పరులను, అసమర్థులను తరిమికొట్టడంతో కథ ముగుస్తుంది.

విశ్లేషణ:- ఈ నాటిక అత్యవసర పరిస్థితిని సమర్థిస్తూ, ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన పథకాలను పొగుడుతూ రాసింది. 1975 సెప్టెంబర్ 15వ తేదీన రేడియోలో ప్రసారమైంది. ఆ తరువాత అన్ని ప్రాంతీయ భాషలలోకి అనువదించబడి, జాతీయ నాటకంగా 'నయా సవేరా' పేరిట 1975 డిసెంబరు 25న రేడియో కేంద్రాలన్నింటా ప్రసారమైంది. ఇందులోని పాటలను కోపల్లె శివరాం రాసారు.

"ఇది శ్రామికుల పాలిట తొలికోడి కూతకు సంకేతం. కొందరు గుత్తాధిపతులు నాయకమ్మన్యులై దేశపు ఊపిరిని గుప్పిట్లో పట్టి జన జీవితాన్ని ఉక్కిరి బిక్కిరి చేయాలని ప్రయత్నించినప్పుడు వారి జిత్తులు ఎత్తులు వమ్ము అవుతాయి. సామాన్య మానవుడు మేల్కొంటాడు. అప్పటి పరిణామాల్ని గుండె కదిలేట్లు చిత్రించిన నాటకం ఇది"(1) అని ఈ నాటకం గురించి వ్యాఖ్యానిస్తాడు దాశరథి రంగాచార్య.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 29 ఏళ్ళ (రచనా

---

(1) దాశరథి రంగాచార్య - 'జీవిత' — [illegible] — పు.V

కాలానికి – 1975) గడచి పోయినా సాధించింది ఏమీ లేదని సామాన్య మానవుడు పరితపిస్తున్నాడు. స్వరాజ్యలక్ష్మి పాత్ర గొంతులో రచయిత తన సందేశాన్ని ఈ రకంగా అందిస్తారు.

① 29 సం॥ రాలు అంటే ఏమంత చెప్పుకో దగ్గ కాలం కాదని అంటూ దేశ ప్రగతికి 29 సంవత్సరాలు సమయం సరిపోదని అంటాడు రచయిత.

② దేశంలో వర్తకులు, పెట్టుబడి దారులు, నల్లబజారు వర్తకులు, మఠాధిపతులు, విప్లవకారులు ప్రభుత్వ యంత్రాంగాన్ని సక్రమంగా పని చేయనివ్వకుండా స్వలాభం కోసం అడ్డు తగులుతున్నారని అంటాడు.

"చెట్టా పట్టాలు పట్టుకొని అందరికంటె ముందు నడుస్తున్న పెద్ద మనిషి బడా పెట్టుబడిదారు, పత్రికలన్నింటినీ తన గుప్పిటలో పెట్టుకొని గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాడు. రెండో పెద్ద మనిషి మత దురహంకారి. కరడు గట్టిపోయిన రాతి గుండె ఇంతగాడిది. ఇక మూడో పెద్ద మనిషి వయస్సులో

చిన్నవాడే గాని పెద్ద బుద్ధులు నేర్చుతున్నాడు. అరాచకమే ఆన ఊపిరిగా పీల్చుతున్నాడు.... అభివృద్ధి కార్యక్రమాల పుణ్యమా అంటూ ప్రస్తుతానికి వీరు ముగ్గురు కలసారు" (పు.17) అని అంటాడు చిరంజీవి. ఈ వాక్యాల్లో ఉన్న వ్యంగ్యానికి వ్యాఖ్య అక్కరలేదు. కాని ఒక విషయం ఉంది. ఇందులో వర్గ స్వభావం చమత్కారంగా చెప్పాడు. ఇంత జనాన్ని ముగ్గురు ఏం చేస్తారు అనుకోవచ్చు. గుమిగూడిన జనంలో ఒక పామును విడిచిన చాలరూ చెదిరిపోవడానికి. ప్రాణమున్న పామే కానక్కర లేదు, రబ్బరు పామును విడిచినా జనం కకావికలై పోతారు. ఇంతకంటే మూక మనస్తత్వం ఎలా చెప్పగలం.

ప్రభుత్వ యంత్రాంగంలో సహితం అసమర్థులు, అవినీతిపరులు ప్రభుత్వ పథకాలను సరిగ్గా ఆచరణలో పెట్టడం లేదని విమర్శిస్తాడు రచయిత. సామాన్య మానవుడే - అంటే ప్రజలే తమ హక్కులకోసం తామే పోరాడాలనీ, 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం వంటివి అమల్లోకి తేవాలని ఆశిస్తాడు.

"ఈ దేశం నాది, ఈ సంపద నాది, నా కష్టం నాకు దక్కుతుందని అనుకున్నప్పుడు మనిషి - సగటు మనిషి అయినా సరే - వేయి ఏనుగుల బలంతో పని చేస్తాడన్నా! ఇక శ్రమ చేస్తాను. నా చెమట నుంచి నా

ఈ దేశానికి సిరి సంపదలను సృష్టిస్తానన్నా" (పు - 17) అని సామాన్య ప్రజల చేత అనిపిస్తాడు రచయిత. తన క్రమశు ఫలితం దక్కుతుందను కున్నప్పుడు శ్రమిస్తాడు. చేయూతనందిస్తే దేశాన్ని నందన వనం చేయగలడు.

"శ్రీమతి గాంధీ చెప్పినట్లుగా ఇది తొలి కోడి కూత మాత్రమే. ఇంకా మలికోడి, మూడుకోడి, మరోకోడి ఉంటేనే కులుకోలుపులు పాడుతున్నాయి. ఇక చీకటి రాదు. ఈ అరుణోదయ-మిక పోదు. సూర్యుణ్ణి పట్టి నిలుపుతాడు మానవుడు. ఆ సూర్యునితో సేవలు చేయించుకుంటాడు సామాన్య మానవుడు" (పు - 20) అని రచయిత మాటలతో నాటకం ముగుస్తుంది.

నిజానికి అధికార యంత్రాంగాన్ని సమర్థించటం అభ్యుదయ వాదుల మార్గం కాక పోయినా, 'ఆకాశ వాణి' అధికార యంత్రాంగం చేతుల్లోనిది కనుక శ్రీ చిరంజీవి గారు ఆకాశవాణి ఉద్యోగి కావడం వలన ఈ నాటకం రచించారేమో?

చిరంజీవి గారు ఈ నాటకం రాయడం నాకు ఆశ్చర్యమేస్తుంది.

## త్రికల మందు :

చిరంజీవి రేడియో నాటికల్లో 'త్రికలమందు' ఒక ప్రయోగాత్మకమైన నాటిక. రేడియో నాటికకు మాత్రమే పరిమితమైన కొన్ని ప్రయోగ లక్షణాలు ఇందులో ఉన్నాయి. దృశ్య నాటకాలలో వాతావరణాన్ని సూచించే తెరలతో రంగస్థలాన్ని అలంకరించినట్లు రేడియో నాటికలో ఇతివృత్తంలోని వాతావరణానికి అనుకూలమైన ధ్వనులతోనూ, సంగీతంతోను శ్రోతలపై, పాఠకులపై వాతావరణానికి అనుగుణమైన ప్రభావాన్ని కల్పించాలి. ఈ నాటికలో అటువంటి Sound effects చాలా ఉన్నాయి.

ప్రముఖ సైంటిస్ట్ రాంజోషి తయారు చేసిన 'త్రికలమందు' నగరం నడిబొడ్డున గల ఒక భవనం పై అంతస్థు నుండి ఒక యువకుడు ప్రచారం చేస్తాడు. దాంతో అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఆ సందర్భంలో ట్రాఫిక్ జామ్ గురించి, నగర వాతావరణం గురించి రచయిత ధ్వనుల ద్వారా శ్రోతలపై ప్రభావం ఏర్పడేటట్లు చేస్తాడు.

1. polish vehicles, Boots, whistles, Tear gass shells, Gun firings మొదలైన వాటిని ధ్వనుల ద్వారా శ్రోతలను ఆ

వాతావరణంలోకి తీసుకెళ్తాడు రచయిత.

2. ట్రాఫిక్ జామ్ గురించి, నగరంలో జరుగుచున్న అల్లకల్లోలం గురించి, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ మరియు కమీషనర్ ఆఫ్ పోలీస్ మధ్య జరుగుతున్న Telephone Dailing ను Music ద్వారా మరియు ధ్వనుల ద్వారా ప్రతిఫలింప చేస్తాడు.

3. రాంజోషి తయారు చేసిన 'ఆకలి మందు' యొక్క పేటెంట్ రైట్స్ కొనుగోలు చేయడానికి వస్తున్న పారిశ్రామిక వేత్తల వాహనాలు, విమానం, కార్లు మొదలైన వాటిని Sounds ద్వారా శ్రోతలను ఆ వాతావరణంలోకి తీసుకెళ్తాడు.

రేడియో నాటకం అనేది ఎలా ఉండాలి అనేదానిని రచయిత ఈ నాటకం ద్వారా స్పష్టం చేసాడు. దీర్ఘ సంభాషణలు లేకుండా, సందర్భానికి తగినట్లుగా ధ్వనులను ఉపయోగించుకోవడం, శ్రోతలను పూర్తిగా నాటిక జరుగుతున్న వాతావరణంలోకి తీసుకెళ్ళడం లాంటివి చేయడంలో రచయిత పూర్తిగా సఫలీకృతుడైనాడు. ఈ నాటిక రచనా కాలం 1955. ఈ నాటికను రేడియోలో 1964 లో ఒకసారి, 1979 మరొకసారి ఆకాశవాణి ప్రసారం చేసారు.

## ఇతివృత్తం:

డాక్టర్ రాంజోషి ఎన్నో సంవత్సరాలు కృషి చేసి మనిషికి ఆకలి వేయకుండా చేసే ఆకలిమందును కనిపెడ్తాడు. ఆ ఆకలిమందు గురించి ప్రజలకు తెలియచెప్పడానికి ప్రయోగాత్మకంగా ఒక నిరుద్యోగ యువకునికి ఆ ఆకలిమందు వేసి నగరంలోని ఒక భవనం పై అంతస్థు నుండి ప్రచారం చేయిస్తాడు. ఆ ఆకలిమందు విలువ 100 రూపాయలు. ఆ వంద రూపాయల కోసం నగరం అంతటా గొడవలు, మానభంగాలు, ధనికవర్గాలపై పేదప్రజల తిరుగుబాట్లు, లూటీలు, ఆడపిల్లల అమ్ముకోవడాలు జరుగుతాయి. నగరమంతా అల్లకల్లోలమవుతుంది. ఎక్కడ చూసినా ట్రాఫిక్ జామ్ ఏర్పడు-తుంది. మరోవైపు దేశంలోని పారిశ్రామికవేత్తలందరూ 'ఆకలిమందు' పేటెంట్స్ రైట్స్ కొందామని డాక్టర్ రాంజోషి ముందు క్యూ కడ్తారు. ఆకలిమందును ప్రపంచంలోని అన్ని దేశాలకు అందచేయడానికి ప్రపంచదేశాల ప్రతినిధుల సమావేశం జరుగుతుంది. మొదట మన దేశంలోనే పంచాలని తీర్మానం చేస్తారు. అయితే నగరంలో జరుగుతున్న ఈ గందరగోళానికి కారకుడైన రాంజోషిని అరెస్ట్ చేయడానికి వస్తారు పోలీసులు. ఒక నిరుద్యోగ యువకుడు నగరంలోని ఒక పేవ్‌మెంట్ పై పడుకొని

కల కంటున్నాడు. అటిక్ పోలీసులు వచ్చి ఆ యువకుణ్ణి తట్టి లేపడంతో కల నుండి నిజ జీవితంలోకి వస్తాడు. ఇంతవరకూ తాను ఉన్నది 'కలలోనా' అని మదనపడుతూంటే, పోలీసులు పోలీస్ స్టేషనుకు నడువు అని గదమాయించటంతో కథ ముగుస్తుంది.

## విశ్లేషణ:

ఇతివృత్త పరంగా చూసినా ఇదొక ప్రయోగమే. కథానిక శిల్పంగా అందరూ ప్రశంసించే కొసమెరుపు శిల్పం ఈ నాటికలో కనిపిస్తుంది. మొదట్లో అంతా ఒక మహా శాస్త్రజ్ఞుని ప్రయోగం లాగ అనిపించిన నాటకం చివరకు ఒక నిరుద్యోగ యువకుని కలగా ముగియడం — కలలోనూ — నిజానికి కూడా కథానాయకుణ్ణి పోలీసులు అరెస్ట్ చేయబోవడం ఈ శిల్పం లోని చమత్కారం.

సైన్సు ఎంతగా అభివృద్ధి పొందినా ప్రకృతిని పూర్తిగా జయించలేకపోతుంది. శాస్త్రం ప్రకృతిని ఒక కోణం నుండి జయిస్తే, అది మరొక కోణం నుండి విజృంభిస్తుంది. ఆకలి బాధ తట్టుకోలేని ఒక నిరుద్యోగ రచయితకు, 'అసలు ఆకలే లేకుండా పోతే' అని వచ్చిన ఊహ కలగా మారి ఈ నాటికగా రూపుదిద్దుకుంది. ఒకవేళ

ఏ శాస్త్రజ్ఞుడో ఆకలి లేకుండా మందు కనిపెట్టినా, ప్రజల సమస్యలు తీరుతాయా? ఆకలి కాకుండా కనిపెట్టిన మందును కొనుక్కోలేని, కనీస ఆర్థిక వనరులు కూడా లేని సామాన్యులెందరో కదా!

ఆకలి లేకుండా కనిపెట్టిన ఆ మందు సైతం ఏ పారిశ్రామిక వేత్తల చేతుల్లోకో పోయి మానవాళికి ఉపయోగించే బదులు మరో ఉపద్రవంగా మారిపోతుంది. రచయిత ఈ విషయాన్నే స్పష్టంగా చెప్తాడు ఈ నాటికలో. అలాగాక సైన్స్ సాధించిన ప్రతి విజయం వెనుక కొన్ని రియాక్షన్లు కూడా ఉంటాయి. వాటిని తట్టుకోవడం ఎలాగ? ఉదాహరణకు ఆకలి గాకుండా మందు వేసుకుంటే శరీర యంత్రాంగం మొద్దుబారిపోయి మనిషి పాషాణంగా మారిపోయే ప్రమాదం కూడా ఉంది. విజ్ఞాన శాస్త్ర ప్రగతివల్ల దేశంలో అన్నార్తులకు ఆహారం అందించే విధానాలు రూపొందించటానికి ప్రయత్నించాలి గాని, అసలు ఆకలే లేకుండా చేసే మందులు కనుక్కోవాలనుకోవడం మూర్ఖత్వం. దేశంలోని దారిద్ర్యం అనే పెద్ద జబ్బుకి మూలకారణం పెట్టుబడి-దారీ ఆర్థిక వ్యవస్థ. ఎవరైనా దానిని నిర్మూలించే మందు కనుక్కోవాలే తప్ప, ఆకలి నిర్మూలించే మందు కనుక్కోవడం వల్ల

ఏ ప్రయోజనం ఉండదు. ప్రజల శ్రేయస్సు లక్ష్యానికి పరిష్కారం శ్రేయం లేకుండా మందు కనిపెట్టడం కాదు. వ్యవస్థ స్వరూపాన్ని ఏ ఒకరూ శ్రేయం బాధకు గురికాకుండా ఉండేలాగ పునర్నిర్మించుకోవడం మాత్రమే. సైంటిఫిక్ ఫాంటసీ లాంటి ఈ రేడియో నాటికలో సైతం రచయిత ఆయన అభ్యుదయ దృక్పథాన్ని వదలిపెట్టలేదు.

కాల యంత్రం :

ఇతివృత్తం: కుమార్, కృష్ణవేణి తమ పెళ్ళి శుభలేఖను డాక్టర్ విన్యం గారికి ఇవ్వడానికి వస్తారు. విన్యం గారు గొప్ప సైంటిస్ట్. ప్రమాదవశాత్తు ఆయన రెండు కాళ్ళు పోగొట్టుకున్నా, నిరంతర శ్రమతో ఎలక్ట్రానిక్స్ రంగంలో గొప్ప కృషి చేసాడు. ఆయన, పెళ్ళి కార్డు ఇవ్వడానికి వచ్చిన వధూవరులకు తాను తయారుచేసిన రోబోట్ తోనే టీ, ఫలహారాలు అందజేస్తాడు. తర్వాత తాను తయారుచేసిన రకరకాల ఎలక్ట్రానిక్ యంత్రాలను చూపిస్తాడు. ఆ సందర్భంలోనే 'కాలయంత్రం' గురించి చెప్తాడు. అది భూతకాలంలోకి పొమ్మంటే భూతకాలం లోకి పోతుంది. లేదా భవిష్యత్కాలం లోకి పొమ్మంటే భవిష్యత్తులోకి పోతుంది అని వివరిస్తాడు. కుమార్ తన భవిష్యత్ తెలుసుకోవాలనుకుంటాడు.

విన్యాసం గారు ఒప్పుకుంటాడు. ఇద్దరూ కలసి 'కాల యంత్రం' లోకి వెళ్తారు. కుమార్ 2007 వ సంవత్సరంలో తాను ఎలా ఉంటాడో తెలుసుకోవాలని ఉంది అంటాడు. కాలయంత్రం 2007 సంవత్సరంలోకి ప్రవేశ పెట్టబడుతుంది. కుమార్ 2007 సంవత్సరంలో తాను ఎలాంటి స్థితిలో ఉంటానో చూసి ఆశ్చర్యపోతాడు. ప్రగతి వ్యాపారమయమైన ఆనాటి సామాజిక వ్యవస్థ చూసి ఏవగించుకొని మళ్ళీ యథాస్థితికి రావడంతో కథ ముగుస్తుంది. ఈ రేడియో నాటికను 1982 జూలై 15 తేదీన తొలి ప్రసారం చేసారు.

<u>విశ్లేషణ</u>: ఈ నాటిక ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్‌కు చెందింది. H.G. Wells రాసిన 'The Time Machine' నవలకు ఇది అనుసరణ కాదని, కేవలం దాని ప్రభావం మాత్రమే ఈ నాటికపై ఉందని రచయిత చెప్పుకున్నాడు. ఈ నాటికలో ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంత ప్రభావం కనిపిస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం, కాలంలో ముందుకే <భవిష్యత్‌లోకి> వెనకకీ <గతంలోకి> ప్రయాణించడం అనే ఊహలకి ప్రచారం వచ్చింది. ఐన్‌స్టీన్ తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించకముందే H.G. Wells 'The Time machine' అనే నవల రాసాడు. అందులో ఒక శాస్త్రజ్ఞుడు

ఒక కొత్త యంత్రాన్ని కనుక్కుంటాడు. ఆ యంత్రం లోని ఫలానా మీటలు నొక్కినప్పుడు కాలంలో ముందుకీ, వెనక్కీ ఫలానా సంవత్సరాల దగ్గరకే వెళ్ళే వీలుంటుంది. H.G. Wells దే ఇంకో గ్రంథం కూడా ఉంది. అది 'First Men in the Moon'. అందులో ఇద్దరు మనుషులు చంద్రలోకం లోకి వెళ్ళడం, ఆ లోకంలో వాళ్ళకి కల్గిన వింత అనుభవాలను ఊహించి రాసాడు. H.G. Wells 'War of the World' - అనే మరో గ్రంథంలో కూడా అంగారక గ్రహం లోని మనుష్యులకు, భూలోకం లోని మనుష్యులకు జరిగిన యుద్ధాన్ని వర్ణించాడు.

ఈ ఊహల్ని Wells తర్వాత వచ్చిన ప్రపంచం లోని చాలమంది రచయితలు వాడుకున్నారు. శ్రీశ్రీ 'చతురస్రం', 'మరో ప్రపంచం' అనే రేడియో నాటికలు కూడా H.G. Wells రాసిన 'The Time Machine' నుంచే ఊహల్ని తీసుకున్నాడు. శ్రీశ్రీ 'మరో ప్రపంచం' నాటిక 21వ శతాబ్దం లోని పరిస్థితుల్ని తెలుపుతుంది. 'చతురస్రం' కూడా 2000 సంవత్సరాల నాటి పరిస్థితులను గురించి ఊహించి రాసాడు. రచయిత చిరంజీవి కూడా ఈ 'కాలయంత్రం' నాటికను H.G. Wells 'The Time Machine'

నవలకు అనుసరణ గాకపోయినా, ఆ నవల వల్ల ప్రభావితుడై రాసాడని భావించవచ్చు.

విజ్ఞాన శాస్త్రం ఎంతగా ముందుకు వెళ్ళినా మానవత్వం లేకుండే అది సఫలం కాదు' అని చెప్తాడు రచయిత ఈ నాటికలో. మానవత్వం విక-సించనప్పుడు, సైన్స్ ఎంతగా వికసించినా ఫలితం ఉండదు. భార్య-భర్త, తల్లి-కూతురు, తమ్ముడు-అన్న, కూతురు-తండ్రి, కొడుకు-తండ్రి వీరందరి మధ్య ఉండే సంబంధాలు క్షీణించి పోతున్నాయని రచయిత ఆవేదన వ్యక్తం చేస్తాడు. 2007 సంవత్సరంలో సమాజం ఎలాంటి స్థితిలో ఉంటుందో స్పష్టంగా చూపిస్తాడు. 40 వేలకే కండ్లు అమ్ముకోవడం, Devils club, మీకు ఏదీ కావాలన్న సర్వస్వం అద్దెకు దొరుకుతుంది ఇక్కడ, Ideas are sold here మొదలైన ప్రకటనలు, కుక్కల రేసులు, భార్యాభర్తలు కలిసి జీవించినా వంట వండుకోలేక కేటరర్స్ నుంచి ఫుడ్ టిన్స్ తెప్పించుకోవడం-మొదలైనవి. 2007 సంవత్సరం నాటికి పెట్టుబడిదారి వ్యవస్థ తీవ్రరూపం దాల్చుతుందనీ, ఆ వ్యవస్థలో సర్వస్వం వ్యాపార-మయమై మానవ సంబంధాలు నశించుతాయని ఊహిస్తాడు రచయిత.

పాత్రలపేర్లను కూడా ఎలక్ట్రానిక్ పద్ధతిలో వాడుకున్నాడు. MM/V1/M, MM/V2/F, M.M/V3/M అని Machine పాత్రలతో కథను నడిపిస్తాడు రచయిత. Sound effects తో రేడియో నాటికాన్ని రక్తి కట్టించాడు చిరంజీవి.

## ఊరోళ్లు ఏమంటున్నరు :

చిరంజీవి రేడియో నాటికలలో ప్రయోగ వైవిధ్యం కంటే ఇతివృత్త వైవిధ్యమే గొప్పది. నవలల్లోను, నాటకాల్లోను, రేడియో నాటకాల్లోను - అభ్యుదయ దృక్పథం కనిపిస్తుంది. ఈ నాటిక రచనా కాలం నాటికి తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం ప్రత్యేక ఉద్యమంగా స్థిరపడలేదు. స్త్రీల విముక్తి మార్క్సిస్టు దృక్పథంలోనే ముడిపడి వుండేదే వాదం రంగనాయకమ్మ మొదలైన వారి ప్రముఖుల రచయిత్రుల నుంచి అప్పుడప్పుడే వినవస్తుంది. ఈ నాటిక ప్రధానంగా వరమ్మ పాత్ర కేంద్రంగా సాగుతుంది. వరకట్న సమస్య ప్రాధాన్యం వహిస్తుంది-అని తోచే ఈ నాటికలో స్త్రీ విముక్తి ఉద్యమం ధ్వనిస్తుంది. తెలంగాణా మాండలికంలో రాసిన ఈ నాటికను 1986 అక్టోబరు 16 వ తేదీన తొలి ప్రసారం చేసారు.

## ఇతివృత్తం :

బాలరాజు తో వరమ్మకు వివాహం జరుగుతుంది. వివాహం సమయంలోనే కట్నం విషయంలో గొడవ జరిగి పెళ్ళి పీటల నుంచి బాలరాజు లేస్తాడు. పెద్దలు సర్దుబాటు చేసి

ఎలాగోలాగ వివాహం అయిందనిపిస్తారు. అయితే బాలరాజు వరకట్నం విషయంలో వరమ్మను పెట్టే బాధలు ఆరస్తాయనుకుంటారు. కట్నం తెమ్మని వరమ్మను పుట్టింటికి పంపిస్తాడు బాలరాజు. వరమ్మ అన్న రంగయ్య ఇల్లు, భూమి అన్నీ అమ్మివేసి కట్నంతో పాటు చెల్లెను కూడా ఆరిగి అత్తవారింటికి పంపిస్తాడు. ఈలోపు బాలరాజు గ్రామ కారోబార్‌గా కొత్త అవతారం ఎత్తుతాడు. అధికారం చేతిలోకి వచ్చేసరికి భార్యపై ఇంకా కొత్త కొత్త హింసలు పెట్టడం ప్రారంభిస్తాడు. వరమ్మ దగ్గరకు చుట్టం చూపుగా వచ్చిన ఆమె చెల్లెల్ని భంగం చేయడానికి ప్రయత్నిస్తాడు. ఆన దగ్గర పనిచేసే కుర్రవాడితో వరమ్మకు అక్రమ సంబంధం అంటుకడ్తాడు. ఇన్ని రోజులు భర్త పెట్టిన బాధలు సహించినా, చెల్లెలును భంగం చేయబోవటం, పని కుర్రవాడితో అక్రమ సంబంధం అంటుకట్టడంతో ఎదురు తిరుగుతుంది వరమ్మ. దాంతో బాలరాజు ఇంకా రెచ్చిపోయి వరమ్మను బుతకటారి పంచాయితీ ఆఫీసు ముందున్న చెట్టుకు కట్టేసి కొట్టి కొట్టి వెళ్ళిపోతాడు. తెల్లవారు జామున వరమ్మ నుండి వినవస్తున్న మూలుగులు ఆ పల్లె ప్రజలను తట్టి లేపుతాయి. దాంతో ఊరు ప్రజలంతా కలిసి

బక్షేయలి నాయకత్వంలో బాలరాజుపై సామూహిక అత్యాచారాన్ని
చేస్తారు. ఊరు నుండి, సంఘం నుండి కూడ బాలరాజును వెలి
వేయుటుంతో నాటిక ముగుస్తుంది.

విశ్లేషణ :

ఈ నాటికలో మనకు మూడు అంశాలు కనిపిస్తాయి.

1. స్త్రీ విముక్తి ఒక దృక్పథం

2. పురుష జాతి నిర్మించిన వ్యవస్థ

3. ఎవరైతే పీడించబడుతున్నారో వారే ఆరగబడాల వాస్తవాలు.

కానీ ఇక్కడ ఒక దృక్పథంతో మొత్తం సమాజమే ఆరగబడినట్లు
చూపించాడు రచయిత.

వరమ్మ శాంతమూర్తి. సాత్వికురాలు. సాంప్రదాయానుసారంగా
సర్దుకుపోవాలనే వ్యక్తి. సగటు స్త్రీకి సంప్రదాయాల పేరిట మొత్తం
వ్యవస్థా స్వరూపమే ఏ రకంగా శత్రువుగా తయారయిందో
చూపిస్తుంది నాటిక.

మృగం లాగ మారిన భర్త తనను అమానుషంగా హింసిస్తుంటే
భరించలేక, సహించలేక 'ఇక నేను అతని దగ్గరకు పోను' అని పక్కన

వరమ్మను పుట్టింటివారు ఓదార్చి అండగా నిల్చి ఆమెభర్తకు కట్నంగా ఇవ్వాల్సిన డబ్బును ఆమెకే ఇచ్చి ఏదో ఒక ఉపాధి కల్పించి స్వతంత్రంగా బతకనిస్తే వరమ్మ జీవితం ఎలా ఉండేదో? కాని అలా జరుగలేదు. వరమ్మను బలవంతంగా ఎలా అత్తగారింటికి పంపించారో ఈ క్రింది సంభాషణ ద్వారా తెలుస్తుంది.

" వరమ్మ :- ఆ నింటికి ఇగ నేను బోనేబోను. నన్నెంత గోస పెట్టుకొం-కుంటున్నడు? నా ఉసురు ముట్టది? నాకేమైందని? నన్ను కలకల పెట్టుకుంట ఇంకో పెండ్లి జేసుకుంటాడు? ఆని మొకం మొద్దులల్ల పెట్ట! ......

సీతమ్మ :- ఎకుటెవ ఆకుటెవ మాట్లాడ గూడది.

రంగయ్య :- మల్ల రేపే నిన్ను నీ మొగనింటికి తోలకపోత. పెండ్లయినంక గదే నీ యిల్లు. గాడనే నీవు బతకాలె, గాడనె సావాలె.

వరమ్మ :- నేను సావ. పోనే పోను.

రంగయ్య :- పోవాలె. (గద్దించాడు) ఏమనుకున్నవ్? గీడ నిన్నెవలు సాదుతారు? నీ బిడ్డ నెవలు సాదుతారనుకున్నవ్?

వరమ్మ :- గంతేనా? పుట్టినింట దిక్కులేదు. మెట్టినింట దిక్కులేదు. గంత బరువయిన్న అందరికి " (పు.54) అని వరమ్మ ఎంత మొత్తుకున్న

ఆమె అన్న రంగయ్య తనకున్న ఒకే ఒక ఆధారమైన ఇల్లుకూడా అమ్మి కట్నం డబ్బులతో సహా వరమ్మను తన బావకు ముట్ట చెప్తాడు. భర్త యాతనలు పెడుతున్నప్పుడు పుట్టింటివారి అండ ఉండే ఆమె పరిస్థితి మరీ ఇంత శోచనీయంగా ఉండేది కాదు. కట్నం సమర్పించి అత్తగారింటికి పంపిన ఆడపిల్ల పోషణభారం తిరిగి స్వీకరించడానికి తల్లిదండ్రులు సిద్ధంగా ఉండడం లేదు. కారణం? 1. సమాజపరమైన అపఖ్యాతి, భయం. 2. పైకి సామాజికాచారాలుగా తోచే అనేక విషయాలు. వీటన్నింటి వెనుక ఆర్థిక సూత్రాలే అల్లుకొని ఉంటాయన్న విషయం రచయిత సూచించారు. స్వతంత్రంగా బతకాలనే ఆశతో పుట్టింటికి వెళ్ళినా, తిరిగి బానిసలా అత్తవారింటికి రావడానికి; స్వంత చెల్లెలుపై భర్త అత్యాచారం చేయబోతున్నా అడ్డుకోలేని నిస్సహాయ స్థితిలో ఉండటానికి ఆర్థిక పరిస్థితులే కారణం. ఉదాహరణకు ఆమెకు ఉద్యోగం ఉన్నా, పుట్టింటివారు డబ్బు పలుకుబడి గలవారైన ఆమె ఇంత దైన్యం అనుభవించవలసిన అవసరం వచ్చేది కాదు. వరమ్మ తల్లీ, అన్న రంగయ్య అందరూ వ్యవస్థకు దాసులే. వారికి వరమ్మపై ప్రేమ ఉన్నా, ఆ ప్రేమ వల్ల వరమ్మకు

ప్రయోజనం లేకుండా పోయింది. ఏదో ఒక విధంగా వ్యవస్థ బిగించిన ఉక్కు చట్రాలలా ఒదిగిపోవాలనే వారి తాపత్రయం. అందుకే ఇల్లు అమ్మి, నిలవడానికి నీడ కూడ లేకుండా చేసుకొని వరమ్మ వరకట్నం బాకీ చెల్లించారు.

అధికారం+ గూండాయిజం కలిసి పురుషాధిక్య సమాజాన్ని నిర్మించాయి. ఈ సమాజాన్ని శాసిస్తున్నాయి. ఈ నాటకంలో కూడా అదే జరిగింది. బాలరాజు దురహంకారాన్ని వరమ్మ తెచ్చిన వరకట్నం గానీ; ఇంట్లోను, కొలిమిలోనూ వరమ్మ చేస్తోన్న బండచాకిరి గాని తృప్తి పరచలేకపోయాయి. రాక్షసుడిలా చెలరేగాడు. అతని రాక్షసత్వానికి తోడు కారోబార్ పదవి, సర్పంచ్ అండదండలు అతడు మరింత రెచ్చిపోవటానికి కారణమయ్యాయి. ఇటువంటి బాలరాజుకు అధికార యంత్రాంగం దన్ను ఉంటే దురాగతాలు విచ్చలవిడిగా సాగుతాయి. వరమ్మను కన్ను పోయేలా చావదన్నడానికి, ఊళ్ళ ఆడవాళ్ళతో రకరకాల అక్రమ సంబంధాలు పెట్టుకోవడానికి, అనేక రకాలుగా డబ్బు గడించడానికి బాలరాజుకు అధికార యంత్రాంగం <అంటే సర్పంచ్> అండదండలే కారణం.

బాలరాజు లాంటి గూండాలు, తమ అధికారం నిలుపుకోవడం కోసం సర్పంచ్‌లకు, ఆ కోవలోని అధికారులకు అవసరం. ఆ అధికారుల అండదండలతో బాలరాజు లాంటి గూండాల గూండాయిజం మరింత వెర్రితలలు వేస్తుంది. ఇదొక విష వలయం. దీనినే ఈ నాటికలో రచయిత స్పష్టంగా చూపాడు.

పసిపిల్ల వరమ్మను కూడా పెళ్ళి చేసుకోవాలని ఉబలాటపడటంతో బాలరాజు దుర్మార్గం పరాకాష్ఠకు చేరి మూర్తీభవించిన గాంతం లాంటి వరమ్మను కూడ ఆరగబడేలా చేస్తుంది.

"వరమ్మ:- సెల్లెని లాలాటెల్లి కట్టాలె? కట్ట బెట్టమంటవ? (రౌద్రమూర్తిగా మారుతుంది) కడ్డర, కడ్డ. ఒక్క మా శెల్లె నెందుకు? గీ ఊర్ల ఆడోల్లందర్ని - కాదు కాదు గీ దేసంల - ప్రపంచకంల వున్న ఆడోల్లందర్ని దెచ్చి నీకు కడ్తర - కుటుబదుల్ల గాని, నీకు కట్టబెడ్త సూడు ముండ కొడుకా (అంటూ బ్రాంది సీసా తీసి విసిరింది. ఆ సీసా గోడకు తగిలి పగిలింది)" (పు. 64). భార్య నుండి ఏ మాత్రం తిరుగుబాటును సహించని బాలరాజు వరమ్మకు యాదగిరికి రంకు గట్టి వాళ్ళద్దర్ని చెట్టుకు గట్టి చావబాదాడు. ఇంతటి ఘోరాన్ని సహించలేక బుచ్చిరెడ్డి

నాయకత్వంలో ఊరు ఊరంతా తిరగబడుతుంది. పోలీసులు అధికార యంత్రాంగానికి బానిసలైతే, అయినా ప్రజానీకమంతా ఒక్కటై తిరగబడినప్పుడు ప్రజల ముందు తలవంచక తప్పదు. ఈ విషయాన్ని 'చీమ మనుషులు' నవలలోనూ, ఈ నాటికలోను నిరూపించాడు రచయిత.

ఈ నాటికలో స్పష్టంగా చెప్పకపోయినా, బక్కయ్యతి ప్రజా నాయకుడనీ, బాలరాజు దుర్మార్గాలను ఎదిరించేవాడనీ తెలుస్తుంది. చిరంజీవి రచనలన్నింటిలోనూ (నవల, నాటకం, నాటిక, కథానిక) ఇలాంటి ప్రజా నాయకుడొకరు పాఠకులకు పరిచయం అవుతాడు. ఇలాంటి ప్రజా నాయకుణ్ణి 'ఫార్ములా హీరో'గా మార్చకపోవడం రచయిత ప్రత్యేకత.

అధికారం, గూండాయిజం ఏకమై సగటు మనిషి గొంతు నొక్కేస్తున్నాయి. ఈ నాటికలోను అదే జరిగింది. బాలరాజు దురాగతాలు తెలిసినా, ఆ ఊరిలోని సగటు మనిషి సంఘర్షణకు లోనవుతున్నాడే తప్ప ఎదురు తిరగడానికి భయపడ్డాడు. పరిణామం ఒకే దశలో గుణంగా మారుతుంది. స్థితి మించినప్పుడు అది తిరుగుబాటుగా తలయెత్తుతుంది. సామాజిక కట్టుబాట్లను గౌరవించే సగటు

ప్రజలు ఒక అభాగిని బాధలు చూడలేకే ఆ కట్టుబాట్లకే ఎదురు తిరిగారు. ఇదే సామాజిక చైతన్యం. మారిటస్లు దృక్పథంలో వ్యక్తారాధనకు స్థానం లేదు. సమిష్టి చైతన్యాన్నే ఇది ప్రభోధిస్తుంది, గుర్తిస్తుంది. చిరంజీవి రచనలన్నింటిలోనూ ఒకే వ్యక్తి కథానాయకుడుగా ఉండడు. సమాజమే నాయక పాత్ర పోషిస్తుంది. ఈ నాటికలోను ఊరంతా కలిసి బాలరాజుపైన తిరగబడి అతనిని సంఘం నుంచి వెలివేయడంతో నాటిక ముగుస్తుంది.

మొత్తం మీద చూసినప్పుడు చిరంజీవి రేడియో నాటకాలకు సాహిత్యలోకంలో ఒక ప్రత్యేకస్థానం ఉంది. ఇతివృత్త పరంగాను, ప్రయోగ పరంగాను, వినోదాత్మకంగాను కూడా ఈయన రేడియో నాటక రంగంలో తన విశిష్టతను నిలుపుకున్నాడు.

# కథానిక రచయితగా

# చిరంజీవి

## ఆధునిక తెలుగు సాహిత్యంలో 'కథానిక'

ప్రక్రియ అత్యంత ప్రాచుర్యాన్ని సంతరించుకున్న సాహితీ ప్రక్రియ. భారతదేశం కథలకు కాణాచి. భారత సంస్కృతి లోనే కథ ఒక భాగంగా ఇమిడివుంది. ఆదిమానవుడు సంకేతాలను, సంజ్ఞలను విడిచి భాష నేర్చుకున్న తర్వాత కథ పుట్టింది. మానవుడు తన అనుభవాలను ఇతరులకు వివరించి చెప్పాలనే కుతూహలంతో వాస్తవానికి కల్పనను కొంత, ఆత్మప్రశంసను కొంత జోడించి చెప్పడం మొదలైంది. వ్యక్తిగత అనుభవాలే గాకుండా ఒక ప్రధాన వ్యక్తికి కొన్ని అమానుష శక్తులు జోడించి అతన్ని కథానాయకుడిగా చేసి కథ చెప్పడం అనే ప్రక్రియ వ్యాప్తిలోకి వచ్చింది.

మన ప్రాచీన సాహిత్యం లోని 'అగ్నిపురాణం' లో కథానిక లక్షణాలు కొన్ని కనిపిస్తున్నాయి.

" భయానకం సుఖపరం గర్భేచ కరుణో రస:
అద్భుతోంతే సుక్లప్తార్థా నోదాత్తా సా కథానికా"

భయానకమైనదైన, సుఖపరమైనదైన వస్తువు కావచ్చును. ఇతివృత్తంలో కరుణ రసానికి స్థానం వుండాలి. నిడివిలో క్లుప్తంగా ఉండాలి. ఇది కథానిక - అంటున్నాడు 'అగ్నిపురాణ' కర్త.

కథలు పూర్వం నుంచీ ఉన్నట్లు మనకు ఆధారాలున్నాయి. బృహత్కథ, బుద్ధదేవుని జాతక కథలు, కథా సరిత్సాగరం-ఇవన్నీ ప్రాచీన కథా సాహిత్యానికి నిదర్శనాలు. భారతంలోని ఉపాఖ్యానాలు, నీతి కథలు, కథా కావ్యాలలోని చిన్నకథలు ఇవన్నీ కథానిక రూపాలే అయినా ఆధునిక తెలుగు కథానిక నిస్సందేహంగా ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో వృద్ధి పొందింది.

## కథ - కథానిక

విషయం ప్రధానంగా ఉన్నది కథ. శిల్పం ప్రధానంగా ఉన్నది కథానిక. ఒక నిర్దిష్ట సాహిత్య ప్రక్రియగా రూపొందిన ఆధునిక వచన రచనా విశేషం కథానిక. "కథ ముడి వజ్రం. కథానిక సానబెట్టిన వజ్రం"(1). పరిమాణంలో పెద్దదీ, అర్థ

---

1. పోరంకి దక్షిణామూర్తి - 'కథానిక స్వరూప స్వభావాలు' - పే. 131

విస్తృతి కలిగింది కథ అయితే నిర్దిష్టతని, నైశిత్యాన్ని, విశిష్టతనీ, క్లుప్తతనీ కలిగింది కథానిక.

కథలో సంక్షిప్తత, కథాసూత్రం, కథనం, సన్నివేశ చిత్రీకరణ, పాత్ర చిత్రణ, పునర్విమర్శ ఈ సూత్రాలన్నీ పాటించిన మొదటి కథ గురజాడ అప్పారావు 'దిద్దుబాటు'. ఇది 'ఆంధ్రభారతి' లో 1910 ఫిబ్రవరి సంచికలో అచ్చయింది. దీనినే తెలుగులో మొదటి ఆధునిక కథానికగా చెప్పబడుతుంది.

కథానిక స్వరూప స్వభావాలను పరిశీలించిన పోరంకి దక్షిణామూర్తి కథానికను " సంక్షిప్తత, ఏకాంశ వ్యగ్రత, నిర్భరత, స్వయం సమగ్రత, సంవాద చాతుర్యం, ప్రత్యావర్తి ప్రవణత, ప్రభావాన్వితి అనే ఏడు అంగాలు కలిగి ఉండడం కథానిక లక్షణం"(1) అని పేర్కొన్నారు.

'వేట కథ - వాస్తవికత - తెనుగుదనం' గురించి చెప్తూ మధురాంతకం రాజారాం "తెలుగు కథ అనంతమైన వస్తు వైవిధ్యంలో జనానికెంత చేరువుగా వెళ్ళి, అంతగానూ పాఠకుల అభిమాన

---

(1). పోరంకి దక్షిణామూర్తి - 'కథానిక స్వరూప స్వభావాలు' - పే-176

పాత్రమైన సాహిత్య ప్రక్రియ యింకొకటి లేదనే చెప్పవచ్చు. తెలుగుజాతి జీవితానికి సంబంధించిన సమస్త రంగాలలోని మంచి చెడ్డలు, మేలు కీళ్ళు, రాగద్వేషాలు, వాళ్ళ ఉద్యమాలు, వాటికేర్పడిన ప్రతిఘటనలు, జయాపజయాలు అన్నీ కూడా కథాసాహిత్యంలో ప్రతిఫలిస్తూ వచ్చాయి. తెలుగునాటగల పల్లెసీమలను, పాటక జనుల జీవితాలను, నగరాల్ల అకటిడి జీవన సంరంభాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించి తెలుగు కథానిక చెరిగిపోని దేశీయతా ముద్ర వేసుకోగలిగింది" (1) అని అన్నారు.

బొడ్డపాటి కుటుంబరావు కథానికను నిర్వచిస్తూ

"ఒక రకమైన ఎత్తుగడ, నడక తీరు, ముగింపు, కొద్ది పాత్రలు, ఆ పాత్రలకు చక్కని పోషణ, వస్తు విన్యాస వైశిష్ట్యం, ఏదైనా ఒక జీవిత సత్యాన్ని ప్రతిపాదించడం, అన్నింటినీ మించి వస్త్వైక్యం ఉండి వినోదమో, విజ్ఞానమో, వికాసమో కలిగించగల చిన్నకథ, కథానిక" (2) అన్నారు.

విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను పరిశీలించినట్లయితే,

---

(1). మధురాంతకం రాజారాం - 'నేటి కథ - వాస్తవికత - తెలుగు కథ' - (వ్యా) - సమాలోచనం - పే 241-242

(2). బొడ్డపాటి కుటుంబరావు - తెలుగు విజ్ఞాన సర్వస్వం 6వ సంపుటం -

కథానికలలో కథ క్లుప్తంగా ఆద్యంతం ఏకోన్ముఖంగా సాగుతూ, మంచి ఇతివృత్తంలో, చక్కటి శిల్పంలో, సరళమైన భాషలో, అద్భుతమైన ముగింపుతో వున్నప్పుడే అది మంచికథగా పాఠకుల హృదయంలో చెరగని ముద్రగా నిలిచిపోతుంది. కథ, కథానికల మధ్య నిర్మాణపరమైన అంగాల దృష్ట్యా పరిశీలించినప్పుడు సూక్ష్మ భేదాలున్నప్పటికిని తెలుగులో స్థూలంగా 'కథానికను' కూడా 'కథ' అనే ప్రస్తావించడం జరుగుతుంది. 'కథ' గా ప్రస్తావించబడినా అది ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన 'కథానిక' గానే భావించాలి.

'కథానిక'లను స్వరూపానుగుణంగానూ, స్వభావానుగుణంగానూ కూడా విశ్లేషించుకోవచ్చు. స్వరూపాన్ని బట్టి ఎత్తుగడ, నడక, విషమ పరిస్థితి, లేక ముగింపు అని విభజించవచ్చు. వస్తువును రచయిత ఏ ఘట్టంలో ఎత్తుకుంటాడో అది ఎత్తుగడ. నడక ముందునుంచి వెనకకు సాగుతుందా, వెనక నుంచి ముందుకు సాగుతుందా పరిశీలించడం నడకను విమర్శించడం. కథానిక

పతాకస్థాయిలోకెళ్ళినప్పుడు ఏ విధంగా మలుపు తిరుగుతుందో ఊహించటం కష్టమైన పరిస్థితి, విషమ స్థితి. కథను ఎనుకొన్న ధ్యేయంలో ముగించడం ముగింపు. స్వభావానుగుణంగా ఇతివృత్తం, పాత్ర, సంఘర్షణ, పరమార్థం లేదా ధ్యేయం - అని నాల్గు విధాలుగా విభజించవచ్చు. రచయిత తాను ఎన్నుకొన్న వస్తువును చెప్పదలుచుకొన్న ధ్యేయానికి అభిముఖంగా చేసుకునే నిర్మాణం ఇతివృత్తం. ఇతివృత్తంలో వాతావరణ వర్ణన, సన్నివేశం, సంఘర్షణ - మొదలైనవన్నీ ఇమిడి వుంటాయి కథానికకు ప్రాణభూతమైనది పాత్రపోషణ. ఏకోన్ముఖ వికసన పాత్రల (Flat charecters) కంటే బహుముఖ వికసన పాత్రలు ⟨Round charecters⟩ ఏ సాహితీ ప్రక్రియలోనైనా రాణిస్తాయి. కథానికను పాత్రపోషణ మరింత శోభింపచేస్తుంది. ఇతివృత్తానుగుణంగా రచనలో కనిపించే వ్యక్తి జీవితం పాత్ర. సంఘర్షణ ఇతివృత్తానికి జీవాన్నిస్తుంది. ఇది రెండు పాత్రల మధ్యగాని, ఒకే పాత్ర అంతరంగంలో గాని, విధికీ- పాత్రకు మధ్యగాని ఏ విధంగానైనా ఉండవచ్చు.

ఏ సాహిత్యానికైనా పరమార్థమే ప్రాణం. కథకుని కథన శిల్పంతో ఒక్కసారిగా మనసు పొరలు విచ్చుకొని మానవ జీవిత పరమార్థం పరంజ్యోతిగా సాక్షాత్కరించి, పఠిత మనస్సు ఉద్దీప్తం చేస్తుంది. ఇదే సాహిత్యానికి పరమ ప్రయోజనమని ప్రాచీన, ఆధునిక ఆలంకారికులు అందరూ అంగీకరించారు. ఈ పరమార్థత స్పష్టీకరణమే కథానిక శిల్ప నైపుణ్యానికి గీటురాయి.

సృజనాత్మక నిర్మాణం యథార్థ సంఘటనకు ప్రతిసృష్టి. అంటే యథార్థ సంఘటనలను యథాతథంగా సాహితీకరించడం కాదు. వాటిలో అంతర్లీనంగా ఉన్న జీవిత సత్యం లేదా పరమార్థం సాక్షాత్కరించే లాగా యథార్థానికి తగిన కల్పనను జోడించి యథార్థమేనని భ్రమ కల్గించేలాగా పునః స్పష్టీకరించడం. వాస్తవిక దృక్పథం అంటే ఇదే. సాహిత్యం ఏనాడు ఉన్నదానిని ఉన్నట్లుగా చెప్పదు, చెప్పకూడదు. సృష్టికి ప్రతిసృష్టి లాంటి సాహిత్యంలో పరమార్థం సాక్షాత్కరించటానికి విధిగా కల్పన అవసరం. కల్పనతో కూడుకున్న యథార్థ సంఘటనల పునః నిర్మాణమే రచయిత ప్రతిభకు తార్కాణం.

తెలుగు కథానిక సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రచయితలు, రచయిత్రులు –

గురజాడ అప్పారావు తెలుగులో మొదటి కథానిక 'దిద్దుబాటు' తో పాటు మెటిల్డా, మీ పేరేమిటి?, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం – ఇలా కొన్ని కథానికలే రాసినా అవి దేనికవే ప్రత్యేకతని కల్గియున్నవి. తెలుగు తనాన్ని అణువణువున ఇముడ్చు-కున్న కథా రచయిత శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి. తల్లావఝుల శివశంకర శాస్త్రి, చింతా దీక్షితులు, మొక్కపాటి నరసింహారావు, చలం, మునిమాణిక్యం నరసింహారావు, విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, మల్లాది రామకృష్ణ శాస్త్రి, పిలక గణపతిశాస్త్రి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, రావూరి భరద్వాజ, సోమంచి యజ్ఞన్న శాస్త్రి, జి.వి. కృష్ణారావు, బుచ్చిబాబు, రా.వి.శాస్త్రి, చాగంటి సోమయాజులు, రాంభట్ల కృష్ణమూర్తి, శ్రీరుద్ర, కాళీపట్నం రామారావు, వాకాటి పాండురంగారావు, భూషణం, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, శీలా వీర్రాజు, ఇస్మాయిల్, బీనా దేవి,

కేతు విశ్వనాథరెడ్డి, ఆర్.ఎస్. సుదర్శనం, కొలకలూరి ఇనాక్, గొల్లపూడి మారుతీరావు, అతివిరాల విశ్వం, శంకరమంచి సత్యం, భమిడిపాటి రామగోపాలం, పులికంటి కృష్ణారెడ్డి - లాంటి మొదలైన వారెందరో ఎన్నెన్నో కథలు రచించి కథా వైవిధ్యానికి వన్నె తెచ్చారు.

రచయిత్రులలో వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ, తురగా జానకీరాణి, సి. ఆనందారామం, డి. కామేశ్వరి, మాలతీ చందూర్, కె. రామలక్ష్మి, అబ్బూరి ఛాయదేవి, ఆర్. వసుంధర, మాదిరెడ్డి సులోచన, భానుమతి రామకృష్ణ - మొదలైనవారు స్త్రీల జీవితాలను గురించి, స్త్రీ సమస్యలను గురించి కథానికలలో చర్చించారు.

కె. చిరంజీవి . నవల, నాటకం, నాటిక, రేడియో నాటకాలతో పాటు కథానికలు కూడా రాసారు. చిరంజీవి రాసిన ఏడు కథానికలు 'రెండు కన్నీటి చుక్కలు' అనే కథా సంకలనం రూపంలో వచ్చాయి. అవి-

1. పండు వెన్నెల – నిండు చీకటి
2. గాజుల యలమంద
3. మంచివాడు
4. రెండు కన్నీటి చుక్కలు
5. తేల్పుడెరగని నిజం
6. సముద్ర బలకోరుద్ధి
7. విలనుడు.

## పండు వెన్నెల – నిండు చీకటి.

ఒక వ్యక్తి మరణం ఇద్దరు వ్యక్తుల జీవితాల మీద ఎలాంటి ప్రభావాన్ని చూపించిందో రచయిత ఈ కథలో చక్కగా చూపించారు.

ఇతివృత్తం :

పి.హెచ్.డి చేస్తున్న విద్యార్థి దుర్గప్రసాదరావు రోడ్డుమీద నడుస్తూ ఒక ఇంటి పై అంతస్తు నుండి ఇటుకరాయి తలమీద పడటంతో మరణిస్తాడు. దుర్గాప్రసాదరావు, రంగనాయకి, శేషావతారం ఒకే ఇంట్లో ఉంటారు. శేషావతారం ఆ ఇంటి

ఇంటి యజమాని. కూర్చుని అన్నా అరగని తీస్తు ఉన్నవాడు. ఆ ఇంటిలో అద్దెకుండే రంగనాయకి ఉద్యోగం చేస్తూ, ఆమె తల్లి, చెల్లెళ్ళు, తమ్ముడిని పోషిస్తూ అవివాహితగా ఉంటుంది. దుర్గాప్రసాదరావు కూడా శేషావతారం ఇంటిలోనే వేరొక గది అద్దెకు తీసుకొని ఉంటాడు. అయితే దుర్గాప్రసాదరావు అకస్మాత్తుగా మరణించడంతో శేషావతారం, రంగనాయకి అంతర్మథనంలో పడిపోతారు. చివరకు ఎవరి జీవితాలను వారు వెదుకుకుంటూ ఆ ఇంటినుండి రంగనాయకి, శేషావతారం వెళ్ళిపోతారు. లోకం ఈ ముగ్గురికి కలిపి సంబంధం అంటకడ్తుంది. నిజానికి రంగనాయకి ఆమె ఆఫీసులో పనిచేసే గుమాస్తాతో లేచిపోతుంది. శేషావతారం ఎక్కడికి వెళ్ళాడో, ఏమైపోయాడో ఎవరికీ తెలియదు.

## విశ్లేషణ :

పది నిముషాల ముందు వరకు నవ్వుతూ, నవ్విస్తూ బ్రతికిన దుర్గాప్రసాదరావు రోడ్డుపై నడుస్తుండగా ఒక ఇంటిపై నుండి ఇటుకరాయి పడి మరణించాడని తెలియడంతో

రంగనాయకి, శేషావతారం ఇద్దరూ జీవితంపైనే విరక్తి చెందుతారు.

చిన్నప్పుడే తండ్రి మరణించడంతో కుటుంబ భారాన్నంతా మోస్తూ అవివాహితగానే జీవితం వెళ్ళదీస్తుంది రంగనాయకి. జీవితమంతా చెల్లెళ్ళ కోసం, తల్లి కోసం త్యాగం చేసిన రంగనాయకి క్షణికమైన జీవితం కోసం ఇంత దు:ఖాన్ని ఎందుకు సహించాల అని ఆలోచించి తనకు నచ్చినవాడితో లేచిపోయింది.

ఇంకొక వైపు శేషావతారం కూడా జీవితంపై విరక్తి పెంచుకుంటాడు. "ఎప్పుడు మరణిస్తామో తెలియని ఈ బ్రతుకు కోసం ఎందుకింత ఆరాటం? ఎందుకు పుడుతున్నామో ఎందుకు చస్తున్నామో తెలియని ఈ జీవితంపై మమకారం దేనికి? ఈ మనుషులేమిటి? మమతలేమిటి? ఎవరు ఎవరికి ఏమౌతారు? పుట్టేనాడు ఈ బంధనాలన్నింటిని మెడన వేసుకొని పుడుతున్నాడా మనిషి? లేక, పోయేనాడు ఈ మమతలన్నిటిని మూటగట్టుకు పోతున్నాడా? లేదే? ఇక తల్లేమిటి? పిల్లేమిటి? భార్యేమిటి? భర్తేమిటి? మిత్రుడెవరు? శత్రువెవరు? ఎవరు వీళ్ళంతా,

ఎక్కడనుంచి వచ్చారు ..... ఏమిటీ వంచన? ఇతరులను వంచిస్తూ, తనకై తాను ఆత్మవంచన చేసుకుంటూ బ్రతకడం దేనికి? స్వార్థాల మాయలో, సుఖాల రొంపిలో పడి, కుమ్మరి పురుగులా జీవించడం కంటే, తన సౌఖ్యాన్ని తాను కాల్చుకుంటూ ఇతరులకు వెలుగునిచ్చే కొవ్వొత్తి లాగా జీవించడం మేలు కాదా? నిర్జీవమైన, సర్వాంగ సుందరమైన ఓ కాగితం పువ్వు కంటే, పనికి మాలినదైనా జీవమున్న గడ్డి పువ్వు గొప్పది కాదా? నిర్జీవమైన అసత్యపు బ్రతుకు దేనికి? ఏమిటీ బ్రతుకు కర్థం? ఎందుకు జీవించాలి? (పు.41-42) అని శేషావతారం తనలో తానే అంతర్మథన పడతాడు.

సుఖాలలో పుట్టి సుఖాలనుభవిస్తూ సుఖాల్లోనే జీవించబోయే శేషావతారం ~~ఈ~~ జీవితమంతా మిథ్య కదా అనుకొని జీవితం నుంచే ఎటో పారిపోయాడు. సృష్టి చిత్రమైంది. మానవ మనస్తత్వం అంతకంటే చిత్రమైంది. అన్నింటికంటే చిత్రమైంది సామాజిక మనస్తత్వం. రంగనాయకి, శేషావతారానికి

దుర్గాప్రసాద రావుకి సంబంధాలు అంటకట్టి కథలల్లుకొని ఆనందించింది సమాజం. నిజానికి ఈ లోకంలో ఎవరికి ఎవరు? ఒకరికి పండు వెన్నెలైతే మరొకరికి నిండు చీకటి. ఇది సామాజిక తత్వం.

## <u>గాజుల యలమంద</u>

వికారంగా ఉండే మనుషుల పట్ల సానుభూతి చేతనో, మానవత దృక్పథంతోనో ఇతరులు చూపించే క్షణికాలపు ప్రేమ, మమకారం వారి హృదయాలను ఎలా పరవశింప చేస్తుందో తెలియచేసే కథలు సాహిత్యలోకంలో వచ్చాయి. పురాణం సుబ్రహ్మణ్య శర్మ 'నీలి', మాలతీ చందూర్ 'నీలి అబ్బున్' - మొదలైన కథానికలు ఇలాంటివే. చిరంజీవి 'గాజుల యలమంద' కూడా ఈ కోవలోకే వస్తుంది.

## <u>ఇతివృత్తం</u>

ఒకనాటి రాత్రి రైలును సమయానికి అందుకోలేక మరొక రైలు కోసం నిరీక్షిస్తూ రైల్వే స్టేషన్‌లోనే అతను పడుకొన్నాడు. చలికాలం, ఆపై సిమెంట్ బెంచీలపై నల్లుల బాధ

పడలేక తికమక పడుతున్న అతని వద్దకు గాజుల యలమంద వస్తాడు. భద్రంగా దాచుకొన్న పెట్టెలోంచి ఒక ఉత్తరం తీసి దానిని చదివి వినిపించుమని అర్థిస్తాడు. అందులోని అక్షరాల గజిబిజి వలన చదవలేక చదవలేక రెండు అక్షరాలు చదువుతాడు అతను. ఇక ముందుకు చదవలేకపోతాడు. ఇంకా చదువుమని అడుగుతున్న యలమందను నిందిస్తాడు అతను. దాంతో యలమంద తన కథను చెప్పుకుంటాడు. తెల్లవారుతుంది. రైల్వే పోర్టరు వచ్చి యలమంద ఒక పిచ్చివాడని, అతన్ని స్టేషన్ నుండి తరిమేస్తాడు. ఆ సమయానికే రైలు రావడం అతను రైలెక్కి వెళ్ళిపోవడంతో కథ ముగుస్తుంది.

## విశ్లేషణ

వికారంగా ఉండే గాజుల యలమంద జీవితంలో ప్రయాణీకుడు యాదృచ్ఛికంగా చూపించిన మమత, సానుభూతి అతని హృదయంలో అపురూపంగా ముద్రితమవుతాయి. గాజుల యలమంద అంద వికారంగా ఉండే మనిషి. తన వారెవరంటూ లేని ఒంటరి జీవి. మొదట చీరెలు నేసి అమ్మి పొట్ట గడుపుకున్నాడు. తర్వాత సవరాలు అల్లినాడు, అయినా యలమందను ఏ స్త్రీ

ప్రేమించలేదు. ఆడదాని ప్రేమ లేకుండా మగవాడెంత కాలం బతగ్గలడు అని బాధ పడ్డాడు. చివరకు ఆ బాధలోనే పిచ్చివాడైపోతాడు. తనకు తానే ఒక బడికుర్రాడితో ప్రేమ ఉత్తరం రాయించుకొని ఎవరో కమలమ్మ తనకు ప్రేమగా ఉత్తరం రాసిందని చెప్పుకొంటూ చదువు వచ్చిన వాళ్ళందరితోనూ చదివించుకొని మురిసిపోతాడు. అలాంటి గాజుల యలమందకు, రైల్వే స్టేషన్ లోని ఒక ప్రయాణికునికి మధ్య జరిగిన సంభాషణను రచయిత కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

ఈ కథలో గాజుల యలమంద పాత్రపై ఎంతో సానుభూతి కల్గుతుంది. ఆ ఉత్తరం యలమంద తనకు తానే రాయించుకొన్నట్లు రచయిత రైల్వే పోర్టరు చేత చెప్పిస్తాడు. ఆడదాని ప్రేమకు, ఆత్మతృప్తికి నోచుకొని ఆ అభాగ్యుడు ఆత్మ వంచనలో ఆనందాన్ని వెతుకుతుంటాడు.

కథ, ఎత్తుగడ, రైల్వే ప్లాట్ ఫారమ్, చలి, ఒంటరితనం - మొదలైన వర్ణనలన్నీ పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన' కథను గుర్తుకు తెస్తాయి. 'గాలివాన' కథలో ఇద్దరు వ్యక్తుల తమ తమ

వర్గ విభేదాలను మరచి ఒక మనిషికి మరొక మనిషి అండగా, ఒకరికొకరు తోడుగా ఎలా ఉండిపోయారో వర్ణిస్తాడు పద్మరాజు. ఈ కథలో నిర్మానుష్యమైన రైల్వే ప్లాట్ ఫారమ్ మీద రాత్రివేళ చలిలో రెండు విభిన్న వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ వర్గ విభేదాలను మరచి ఒకరికొకరు ఎలా సమాశ్వాసించుకున్నారో చూపించాడు రచయిత.

మొత్తం మీద ఇది మానవ మనస్తత్వాన్ని నిరూపించే విశిష్టమైన కథ.

## మంచివాడు

### ఇతివృత్తం :

నారాయుడు మంచివాడు. ఆ ఊరిలోనే కాకుండా, చుట్టు-పక్కల ఊళ్ళకు కూడా తెలుస్తుంది నారాయుడి మంచితనం. ఆ నోట ఈ నోట పడి పడి ఈ మంచితనం అనేది నారాయుడి స్నేహితుడికి చేరుతుంది. ఒకసారి నారాయుడి ఊరిలో పని ఉండి వెళ్ళాడు స్నేహితుడు. ఎలాగు వచ్చాడు కాబట్టి ఆ రోజు నారాయుడి ఇంటికి వెళ్ళాడు. శ్రీకృష్ణుడు వస్తే గద కుచేలుడు ఎంత సంబరపడ్డాడో, నారాయుడు

ఈ స్నేహితుణ్ణి చూసి అంతకంటే ఎక్కువ సంబరపడ్తాడు. మాట ముచ్చట అయింతర్వాత స్నేహితుణ్ణి హోటల్‌కు తీసుకెళ్ళి స్నేహితుడి ఖర్చుతోనే భోజనం పెట్టిస్తాడు. ఇంట్లో భోజనం పెట్టలేకపోయినందుకు బాధ పడుతున్నానని, నా భార్య మంచిది కాదని, అయినా ప్రేమతో ఎలాగోలా వెళ్ళదీస్తున్నానని తన మంచితనాన్ని వెల్లడించుకుంటాడు. ప్రతిరోజు రాత్రి భార్యతో, వచ్చిన ప్రతి యెధవకు నీవు వండి పెట్టడం, కష్టపడడం నేను చూడలేకపోతున్నాను - అని భార్య దగ్గర తన మంచితనాన్ని ప్రదర్శించుకుంటాడు. అయితే భార్యాభర్తల సంభాషణంతా స్నేహితుడికి వినపడ్డంతో నారాయుడి మంచితనం అంటే ఏమిటో అవగతం కావడంతో కథ ముగుస్తుంది.

## విశ్లేషణ

కథానిక చిన్నదైనా చమత్కారం ఉంది. మానవ మనస్తత్వాన్ని చిత్రించే కథ ఇది. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, మహాత్ములు కూడా కొందరికి చెడ్డవారవుతున్నారే, మరి ఒక వ్యక్తి అందరికీ ఎలా మంచివాడయ్యాడు. ఏ వ్యక్తి యెదుట ఆ వ్యక్తి మనస్సుకు నచ్చే మాటలు మాట్లాడ్తూ ఏ ఒక్కరిని నిజంగా అభిమానించని వాడు నిజంగా మంచివాడు.

ఈ కథలో నారాయుడు మంచివాడు. ఇంటికి వచ్చిన స్నేహితునితో భార్య మీద నేరాలు చెప్పి, ఆ స్నేహితుడికి తన ఇంట్లో భోజనం పెట్టాలని తనకెంతో అభిలాష ఉన్నట్లు, భార్య మంచిది కాకపోవడం మూలాన్నే ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో స్నేహితున్ని హోటల్‌కు తీసుకెళ్తున్నట్లు చెప్తాడు నారాయుడు. ఆ రకంగా స్నేహితుని సానుభూతిని పొంది అతని దృష్టిలో ఎంతో మంచివాడవుతాడు.

ఆ రాత్రి, ఏమండీ! మనింటికి వచ్చిన అతిథికి హోటల్లో భోజనం పెట్టిస్తారా? ఇది మర్యాద కాదండి అన్న భార్యతో, పిచ్చిమొహమా, స్నేహితున్ని ఇంట్లో ఉంచి నిన్ను కష్టపెట్టలేనని ప్రేమతో అంటాడు. ఆ విధంగా భార్యకు మంచివాడయ్యాడు.

నారాయుడి లాంటివాళ్ళు అందరికీ మంచివాళ్ళు కావడంలో రహస్యం ఇదే. ఎవరికి నచ్చే మాట వాళ్ళ ముఖాన మాట్లాడటం. ఇదే మంచితనం. దీనినే రచయిత వ్యంగ్యంగా రాసాడు.

## రెండు కన్నీటి చుక్కలు

ఇతివృత్తం: రమణమ్మ, ఆమె బావ సూర్యప్రకాశరావు ప్రేమించుకుంటారు. పెద్దలు కూడా వీరి వివాహానికి అంగీకారం తెలిపారు. కానీ ఏదో ఒక చిన్న విషయంలో వీరి పెద్దవాళ్ళు గొడవ పడి మాట్లాడుకోని స్థితి వస్తుంది. దాంతో రమణమ్మ తల్లిదండ్రులు ఆమెకు వేరే వ్యక్తితో వివాహం నిర్ణయిస్తారు. ఈ విషయాన్ని తెలుపుతూ మద్రాసులో ఉన్న తన బావకు ఉత్తరం రాస్తుంది రమణమ్మ. అయితే రమణమ్మ వేసిన ఉత్తరం అందదు గానీ, వివాహం అయిన తర్వాత పెండ్లి కార్డు అందుతుంది. దాంతో జీవితం పైనే విరక్తి చెందిన సూర్యప్రకాశరావు ఆత్మహత్య చేసుకుంటాడు. అయితే రమణమ్మను గాఢంగా ప్రేమించిన అతని కండ్లు మాత్రం ఆమెను చూడకుండా ఉండలేవు. ఆ కండ్లు రెండు చుక్కలై రమణమ్మకు ప్రతిరోజు రాత్రి కనిపించి మాయమవుతాయి. రోజూ ఆ చుక్కలను చూస్తేనే గాని రమణమ్మకు నిద్రపట్టదు. ఈ కథనంతా తన కూతురుకు చెప్పడంతో కథ ముగుస్తుంది.

### విశ్లేషణ

ఏడు కథానికలలోని ఒకటైనా ఈ 'రెండు కన్నీటి చుక్కలు'

పేరునే ఈ కథానిక సంకలనానికి పెట్టాడు రచయిత. అభ్యుదయ రచయితగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన చిరంజీవి ఇలాంటి కథానిక రాయడం సమంజసంగా లేదనిపిస్తుంది.

ఒక తల్లి తన కూతురుకు తన ప్రేమ కథ చెప్పడం మొదటి కారణం కాగా, పెండ్లి కార్డు అందీ ఆమె రాసిన ఉత్తరం అందక పోవడం రెండవది. ఉత్తరం అందకపోవడానికి Not Found అంటూ ఉత్తరం తిరిగి రావడం అనేది జరిగితే, పెండ్లి కార్డు ఎలా అందింది అనేది వివరించలేకపోయాడు రచయిత.

రమణమ్మ, సూర్య ప్రకాశరావులు బావామరదళ్ళు. చిన్నప్పుడే వీరి పెద్దలచే భార్యాభర్తలుగా నిర్ణయించబడినవారు. వీరిని భార్యాభర్తలుగా పెద్దవాళ్ళే ప్రచారం చేసి వారిలో ఆ భావాలు మొలకెత్తడానికి అంకురార్పణ చేసారు. చివరకు పెద్దవాళ్ళ గొడవ మూలంగా వీరిని పెళ్ళి నుండి విడదీయడం అనేది మూర్ఖత్వాన్ని తెలుపుతుంది. ప్రస్తుత సమాజంలో ఇలాంటి సంఘటనలు చాల జరుగుతున్నాయి. పుట్టినప్పటి నుంచే నా కోడలు, నా అల్లుడు అని పేర్లు పెట్టుకొని పిల్లలకు స్వేచ్ఛ లేకుండ చేసి తమ తమ వాగ్దానాలు నెరవేర్చుకోవడానికి బలవంతంగా

పెళ్ళి చేసిన సంఘటనలు గ్రామాలలో చాల కనిపిస్తాయి. ఈ కథలో కూడా పెద్దవాళ్ళ వీరిని భార్యాభర్తలుగా చిన్నప్పుడే నిర్ణయించడంతో బావా మరదళ్ళ మధ్య ప్రేమ అంకురించింది. అది ప్రాణ పదంగా మారింది చివరకు పెద్దలు వీరిని పెళ్ళి నుంచి విడదీయడంతో రమణమ్మ తలవంచినా సూర్యప్రకాశరావు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటాడు. రమణమ్మను ప్రేమించిన అతని కళ్ళు మాత్రం ఆమెను విడిచిపెట్టి వెళ్ళలేక పోయాయి. ఆ కళ్ళు రెండు చుక్కలై రోజు రమణమ్మను పరామర్శిస్తాయి.

ఇంగ్లాండులో Bothring Hights అనే నవల ఉంది. అందులో ప్రేయసి మరణిస్తుంది. అయితే ప్రియుడిపై ప్రేమను చంపుకోలేక ఆత్మరూపంలో ప్రత్యక్షమై కనిపిస్తుంది. ఆ ఆత్మ కిటికి ద్వారానే అతనికి కనిపిస్తుంది. ఆ నవల కథనం Flash Back ద్వారా నడుస్తుంది. 'రెండు కన్నీటి చుక్కలు' కథానికలో కూడా ప్రియుని కళ్ళు కిటికి ద్వారానే కనిపిస్తాయి. ఇందులోని కథ కూడా Flash Back ద్వారానే నడుస్తుంది. ఈ కథానిక పై నవలకు అనుసరణ కావచ్చు. ఇదొక కాల్పనిక ప్రణయగాథ. ప్రాణాలు పోయినా ప్రేమ నశించిపోదని చెప్తాడు రచయిత ఈ కథానికలో.

# దేవుడెరగని నిజం:

సుభద్రమ్మ, నారాయణదాసు భార్యాభర్తలు. వీరి వివాహం జరిగి ముప్పై సంవత్సరాలు గడిచినా సంతానం కలుగలేదు. యాభై సంవత్సరాలు నిండిన సుభద్రమ్మలో ఇంకా సంతానంపై మక్కువ తీరలేదు. తరగని ఆస్తి ఉంది. ఎన్నో ఆసుపత్రులు తిరిగినా పూజలు, ఉపవాసాలు, తీర్థయాత్రలు చేసినా ఫలితం దక్కలేదు. స్వాములను, సన్యాసులను దర్శించింది. అయితే ఏ స్వామి కూడా ఆమెను కనికరించలేదు. ఒకరోజు ఆ ఊరి శివాలయంలో ఒక స్వామి దర్శన మివ్వడంతో అతడిని సందర్శించింది. అక్కడ ఉన్న స్వామిని చూసి మూర్ఛపోతుంది. ఆ స్వామి ఎవరో కాదు, సుభద్రమ్మ మొదటి భర్త. అతనితో సుభద్రమ్మకు చిన్నప్పుడే వివాహం జరుగుతుంది. అయితే అతను ఏనాడు సుభద్రమ్మను పట్టించుకోక ఇతర స్త్రీలతో సంబంధాలు కొనసాగించేవాడు. అకస్మాత్తుగా ఒకరోజు తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, సుభద్రమ్మ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే షరతుతో తన ఆస్తినంతటిని ఆమె పేరు మీద రాసి వెళ్ళిపోతాడు. అతనితో వివాహానికి ముందు సుభద్రమ్మ నారాయణదాసును ప్రేమిస్తుంది. అయితే పెద్దలు వీరి ప్రేమను అంగీకరించక బలవంతంగా అతనితో పెళ్ళి

జరిపిస్తారు. అతను మరణించడంతో సుభద్రమ్మ మొదట తాను ప్రేమించిన నారాయణదాసును మళ్ళీ పెళ్ళి చేసుకుంటుంది. ఇన్నిరోజుల తర్వాత అతను మళ్ళీ కనిపించడంతో ఆమె మూర్ఛపోతుంది. ఈలోపునే ఆ గ్రామం రెండు వర్గాలుగా, రెండు వీధులుగా చీలిపోతుంది. ఒకరోజు రెండు వర్గాల మధ్య గొడవ జరుగుతుంది. మరసటి రోజునే శివాలయంలో దిగిన ఆ స్వామి హత్య చేయబడ్డాడు. ఈ పని ఎవరు చేసారు? సుభద్రమ్మ చేయించిందా? లేక సుభద్రమ్మ ప్రస్తుత భర్త నారాయణ దాసు చేయించాడా? లేక మెరక వీధి వారు చేయించారా? అసలు నిజం ఎవరికీ తెలియదు. ఆ దేవుడికే ఎరుక? అంటూ కథ ముగుస్తుంది.

<u>విశ్లేషణ</u> :

ఈ కథానికలో రచయిత గ్రామ రాజకీయాలను కళ్ళకు కట్టినట్లు వివరించాడు. ఆ గ్రామంలోని ప్రజలు రెండు వర్గాలుగా విడిపోవడం, దేవతలను కూడా రెండుగా చేయడం, శివాలయం రామాలయం అని ఆలయాలు కట్టించడం అనేది గ్రామాలలో ఎంతటి కక్షలు, కార్పణ్యాలు ఉన్నాయో వివరిస్తుంది ఈ కథానిక. రమణమ్మకు 50 సంవత్సరాలు పైబడినా సంతానం కోసం

ఇంకా ప్రత్యేకపడుతుమనేది ఒక స్త్రీ బిడ్డల కోసం ఎంతగా తాపత్రయపడుతుందో వివరించాడు రచయిత. అలాగే రమణమ్మ రెండవ పెళ్ళి విషయంలో తను నచ్చినవాణ్ణి పెళ్ళి చేసుకోవడం అనేది పెద్దల కట్టుబాట్ల నుంచి స్త్రీలు ఇప్పుడిప్పుడే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందుతున్నారు అనేది తెలియచేస్తుంది. చివరకు సుభద్రమ్మ మొదటి భర్త అయిన స్వామి ఎలా చంపబడ్డాడు అనేది ఎవరికీ అంతుపట్టదు. సుభద్రమ్మే చంపించింది అని నారాయణదాసు అనుమానం, నారాయణదాసే హత్య చేయించాడు అని సుభద్రమ్మ అనుమానం. అదీకాదు మొరకవీధివారే, స్వామి పల్లపు వీధిలోని శివాలయంలో దిగాడు కాబట్టి వీధి కక్షలలో అతన్ని చంపారు అని పల్లపువీధిలోని ప్రజల విశ్వాసం. అసలు స్వామి ఆత్మహత్య చేసుకుంటానని మొదట చెప్పి మళ్ళీ ఎలా వచ్చాడు? మరల ఇప్పుడు ఎలా చనిపోయాడు! అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైన చంపారా? అనేది ఆ గ్రామంలో పెద్దప్రశ్న. అసలు నిజం దేవునికే తెలియాలి – అని అంటాడు రచయిత.

## సదువు బలికోరుద్ది

### ఇతివృత్తం:

పిచ్చన్న, లచ్చమ్మ తమ కొడుకు కోటిరెడ్డిని స్కూలుకు పంపించాలనుకుంటారు. దీనికి పిచ్చన్న తండ్రి వెంకటరెడ్డి ఒప్పుకోడు. తమ కుటుంబానికి చదువు అచ్చిరాదని చెప్తాడు. ఎందుకు పిచ్చన్న ఒప్పుకోకపోవడంతో, తమకు చదువు ఎందుకు అచ్చిరాలేదో తన కథను చెప్తాడు. వెంకటరెడ్డికి కోటయ్య అనే తమ్ముడుండేవాడు. వెంకటరెడ్డి తండ్రి, మొదట కోటయ్యను చదివించడానికి ఒప్పుకోలేదు. కానీ వెంకటరెడ్డి బలవంతం చేసి తండ్రిని ఒప్పించి తమ్ముడిని చదువుకు పంపిస్తాడు. తాను కాయకష్టం చేసి కోటయ్యను పెద్ద పెద్ద చదువులు చదివిస్తాడు. చదువుకొని తెలివిమంతుడైన కోటయ్య తల్లిని నిందిస్తాడు, తండ్రిని జీతగానిగా స్నేహితులకు పరిచయం చేస్తాడు. వీటన్నింటిని భరించి వెంకటరెడ్డి తనకున్న భూమినంతటిని అమ్మి కోటయ్యను ఇంకా చదువుకొమ్మని ప్రోత్సహిస్తాడు. ఇంత చేసిన వెంకటరెడ్డికి, తల్లిదండ్రులకు తెలియకుండానే పట్నంలో ఒక పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు కోటయ్య.

చివరకు వెంకటరెడ్డి కొడుకు జబ్బు చేసి పట్నంలోని ఆసుపత్రికి తీసుకెళ్తే అక్కడ కోటయ్య, డాక్టర్లకు వెంకటరెడ్డి తన జీతగాడని చెప్తాడు. డాక్టర్ల నిర్లక్ష్యంతో వెంకటరెడ్డి కొడుకు చనిపోతాడు. అసలు విషయం తెలుసుకున్న డాక్టర్లు, అన్నను జీతగానిగా పరిచయం చేసిన కోటయ్యను నిందిస్తారు. ఆ అవమానం భరించలేక కోటయ్య ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ కథంతా చెప్పి వెంకటరెడ్డి, చదువుకోవడం మూలంగానే తన తమ్ముడు చెడిపోయాడని, చివరకు చనిపోయాడు కాబట్టి మనకు చదువులు అబ్బరావని చెప్పడంతో కథ ముగుస్తుంది.

## విశ్లేషణ

ఈ కథానికి రాసిన కాలం నాటికి గ్రామాలలో చదువుకున్నవారిసంఖ్య చాల తక్కువ. కేవలం భూస్వాముల, మోతుబరుల పిల్లలకే చదువుకునే అవకాశం ఉండేది. పేదరైతు పిల్లలకు గానీ, రైతు కూలీల పిల్లలకు గానీ చదువుకునే అవకాశం తక్కువ. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు వారివి. అలాంటి ఒక రైతుకుటుంబంలోని కోటయ్య కథే 'చదువు బలికోరుద్ది'. కుటుంబమంతా కష్టపడి

తమలో ఒకడిని చదివించాలని శ్రమపడి ఆమెకున్న భూమిని కూడా అమ్మి కోటయ్యను చదివిస్తే అతను పట్టణ నాగరికత మోజులో పడి, తాను ఇంతవాడిగా కావడానికి కారకులైన కుటుంబసభ్యులను మరచిపోవడమే గాక తల్లిని తల్లిగా ఒప్పుకోలేకపోయాడు, తండ్రిని పాలేరుగా చెప్పుకున్నాడు, అన్నను డాక్టర్లకు జీతగాడిగా పరిచయం చేసాడు. తాను ఏ కుటుంబాన్నించి వచ్చాడో తెలుసుకోలేకపోయాడు. చివరకు తెలుసుకునేసరికి సమయం మించిపోయింది. చివరకు తన అహంకారానికి తనే బలి అయ్యాడు.

ఇది అవాంఛనీయమైన పరిణామమే. కానీ దీనికి పరిష్కారమేమిటి? చదువులు మానెయ్యడమా? చదువు బలి కోరుతుంది అని నమ్మడమా? కథ ముగింపు ఏదో వెలితిని కలుగ చేస్తుంది. అలాగాక చివర్లో 'నాకొడుకు ఏనాటికి తన తల్లిద్రి త్రాతని తనవారిగా చెప్పుకోడానికి సిగ్గుపడడు. అలా సిగ్గుపడకుండా తనవారిని తలచుకొని గర్వపడేలా నేను పెంచుతాను' అని చెప్పించి ఉంటే బాగా ఉండేది. అయితే కథ వాస్తవానికి దూరంగా లేదు. పల్లెటూరు రైతు కుటుంబాలలో కోటయ్య లాంటి వ్యక్తులెందరో?

అయితే దీనికి పరిష్కారంగా చదువే వద్దని సూచించటం ప్రగతికి భంగకరం.

విలనుడు

సాహిత్యరంగంలో రచయితలు సృష్టించిన పాత్రలు రచయితలకే ఎదురుతిరిగినట్లు సృష్టించడం ఒక విశిష్టమైన సాహితీ శిల్పం. ఈ శిల్పాన్ని ఉపయోగించుకొంటూ బుచ్చిబాబు, చలం, కొడవటిగంటి కుటుంబరావు - మొదలైన రచయితలు కొన్ని కథలు రాసారు. చిరంజీవి ఈ 'విలనుడు' కథ ఆ కోవలోనిదే. అయితే, ఈ విలనుడు రచయితపై తిరగబడలేదు. హీరోపై తిరగబడ్డాడు.

ఇతివృత్తం :

విలన్ హీరోయిన్‌ను ప్రేమిస్తాడు. దాంతో హీరో విలన్‌కు బుద్ధి చెప్పాలని వస్తాడు. అయితే విలన్ కండబలం చూపించడంతో హీరో భయపడి పారిపోతాడు. విలన్ లేకుండ నాయకుని హీరోయిజం బయట పడదనీ, నలుపు లేకపోతే తెలుపును తెలుసుకోగలమా అంటూ విలన్ తిరగబడటంతో కథ ముగుస్తుంది.

## విశ్లేషణ

ఇదొక చిన్న సెటైర్ లాంటిది. దీనిని కథానిక అనడం కంటే సెటైర్ అనడం బావుంటుంది. సినిమాలలో హీరో వేషాలు వేసే వారిపైన వ్యంగ్య విమర్శ ఉంది - ఈ రచనలో.

తెలుగు సినిమాలలో ఆమాటకొస్తే ఏ భాషా సినిమాలలో-నైనా నాయక వేష పాత్రధారి నిజానికి ఎలాంటి యుద్ధాలు చేయడు. అతనికి బదులుగా అతని వేషం వేసుకొని లాంగ్ షాట్ లోంచి ముఖం స్పష్టంగా కనపడనీయకుండా డూప్ యుద్ధం చేస్తాడు. ఏ మాత్రం ధైర్య పరాక్రమాలు లేకపోయినా, ధీరోదాత్తుడిగా జనం ముందు హీరోగా వెలిగిపోతాడు నాయకుడు. అతని చేతిలో విలన్ వేషాలు వేసేవారు విధిగా ఓడిపోవాలి. నిజానికి విలన్, నాయకుని కంటే బలమైనవాడే. అయినా సినిమా సాంప్రదాయాన్ననుసరించి విలన్ ఓడిపోవలసి వస్తుంది. సినిమాలలోని హీరోయిన్ పై విలన్‌కు ప్రేమ ఉన్నా, అతని ప్రేమలో ధర్మం ఉన్నా, సినిమా తీసేవాళ్ళు, సినిమా చూసేవాళ్ళు కూడా అది అధర్మమే అంటారు. సినిమాల్లోను, నాటకాల్లోనూ

చెప్పుకు విధిగా విలన్ పాత్ర వేయవలసి వచ్చేవాడి మనస్తత్వం ఎలా ఉంటుందో, అతని నిస్సహాయమైన తిరుగుబాటు ఎలా ఉంటుందో వ్యంగ్యంగా చూపించాడు రచయిత ఈ కథలో.

చిరంజీవి గారి కథానికలలో వస్తు వైవిధ్యం ఉంది. కానీ కథానిక శిల్ప ప్రయోగాలు తక్కువ. వీరి సాహితీ ప్రక్రియలన్నింటిలోనూ అభ్యుదయ దృక్పథానికి కొంత దూరంగా కాల్పనిక శైలిలో ప్రయాణించినవి కొన్ని కథానికలే.

# ఉపసంహారం

సృజనాత్మక రచయితగా కె. చిరంజీవి సాధించిన ప్రక్రియా బాహుళ్యం తెలుగు రచయితలలో అతి తక్కువ మంది మాత్రమే సాధించారు. నవల, నాటిక, నాటకం, రేడియో నాటిక, కథానిక మొదలైన ప్రక్రియలన్నీ చేపట్టి వాటిని సమర్థంగా నిర్వహించారు.

చిరంజీవిగారు నిబద్ధత గల రచయిత. రచయిత మార్క్సిజానికి నిబద్ధుడయి ఉండటమే సాహిత్యంలో నిబద్ధతకు రూఢ్యర్థం. సైద్ధాంతికంగా మార్క్సిస్ట్ తాత్విక ప్రాతిపదికకు నిబద్ధుడయినా, ఈయన రచనలలో ఎంతో వైవిధ్యం ఉంది. గ్రామీణ రాజకీయాలు (ఎకరెడికే ప్రస్థానం), గ్రామీణ కుటుంబ జీవితం (అనంతయాత్ర), గ్రామీక సమాజంలో స్త్రీల సమస్యలు (ఊరోళ్లు మేలుకుంటున్నారు), స్వాతంత్ర్యానంతర భారతదేశ పరిణామాలు (బోలో స్వతంత్ర భారత్ కి జై), అన్నీ ఉన్నా, వ్యవస్థకు వెలికావటంవల్ల వ్యవస్థ చేతుల్లో బలి అయిన అభాగినులు (ముళ్ళ గులాబి), రాజకీయ యంత్రాంగంలో ఒక భాగమయిన పోలీసు యంత్రాంగం చేతిలో అతిదారుణంగా

భంగపడి సంఘబలంతో తిరగబడిన బడుగువర్గాలు (చీమ మనుషులు), సైన్సు ఎంత ప్రగతిని సాధించినా ఒక్క అడుగుకూడా ముందుకు వేయని సమాజం (ఆకలిమందు), సాంప్రదాయపు మూర్ఖత్వాన్ని కదిలించలేని సైన్సు (వంశాంకురం), విశ్వాత్మకుడయిన శ్రీకృష్ణునికే శిరోభారం తెప్పించే ఆకలి పేగుల ఆర్తనాదాలు (శ్రీకృష్ణ శిరోభారం), దారుణమైన అణచివేత లోంచి జ్వలించే ప్రతిఘటన (తోళ్ళు తిరగబడుతున్నాయి), దేశం కోసం, జాతికోసం గుండెనే ముక్కలుచేసి దీపాలుగా వెలిగించిన ధీరుని త్యాగం (శాంతిసమరం), జాతినంతా ఒక తాటిపై నడిపించే నాయకుడు (నీలిదీపాలు) ఇలా ఇతివృత్తాలలో అనంత వైవిధ్యం ఉంది. వస్తువు తెలుగు సమాజంగా తోచి, భారతజాతి సమస్యగా విస్తరించి మానవత్వపు అంచులను అందుకొంటుంది.

ఇతివృత్తపరంగా ఈ రచయిత ఇంచుమించు ప్రతిరచనలోను గతితార్కిక చారిత్రక భౌతికవాదం ఊపిరిగా సమాజస్వరూపాన్ని పొరలుతీసి పాఠకునకు దర్శింపచేసారు. కమ్యూనిస్టు పార్టీ అభిమానిగా స్పష్టమవుతున్నా, నిజమైన

గాంధేయవాదులను (జండాపైకిల్ ఓగయ్య) గౌరవించారు. కమ్యూనిస్టు పార్టీలో సహితం తప్పతాగి నీచపు పనులు చేసేవారిని గర్హించారు. ఈనాటి సమాజంలోని లోపాలన్నిటికీ కారణం సొంతఆస్తిని పెంచుకోవటమే అని నిష్కర్షగా ప్రతిపాదించారు. అనుక్షణం ప్రత్యక్షంగాను పరోక్షంగాను సమాజంలో కొనసాగే వర్గసంఘర్షణను సమర్థంగా చిత్రించారు. చిరంజీవిగారి పాత్రలు అతిసాధారణమైన సామాన్య వ్యక్తులే. ఈపాత్రలన్నీ అన్ని సమాజాల్లోనూ, అన్నికాలాల్లోనూ మనకు ఎదురయ్యేవే. ఏ ఒకరూ పచ్చికిరాతకులై ఉండరు. అలాగే సద్గుణ రాశులూ ఉండరు. ప్రతి పాత్రపైనా వ్యవస్థప్రభావం, పరిస్థితుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

'ఊరోళ్లు మేలూరంటున్నరు' నాటకంలో బాలరాజు అంత కరోటకంగా తయారవటానికి ఊరి సర్పంచ్ అండే కారణం. వరమ్మ నిస్సహాయంగా బలిపశువు అయిపోవటానికి వ్యవస్థ కారణం.

'ఎకడికీ ప్రస్థానం' లో దుర్గాప్రసాదరావుకు

వ్యవస్థ అండ, మామగారిచ్చిన అలుసు కారణాలు. కుళ్ళిపోయిన కులతత్వాలు రాజకీయాల్లో చేరి పార్టీలను కూడ కుళ్ళబెట్టడమే మోహన్‌రావు వంటివారి వైఫల్యాలకు కారణం. ఎవరెవరు ఎలామారినా ఏవిధంగానూ ఎదగలేని కోటిగాడి వంటివారు తాగుబోతులుకాక ఏమవుతారు?

'ముళ్ళగులాబి'లో సుబ్బులు అలా పతనమవటానికి వ్యవస్థ కారణం. ఇలా ఈయన పాత్రలన్నీ సమాజంలోంచి తయారయిన పాత్రలు. సమాజపు లోతుపాతుల్ని పాఠకులకు చూపించే పాత్రలు.

ఈయన రచనలో నాయక ప్రతినాయకులు ఉండరు. సంఘటిత జనశక్తి నాయకుడు. బూజుపట్టిన బూర్జువా వ్యవస్థ ప్రతినాయకుడు. అనివార్యమయిన మార్పును ధ్వనింపచేస్తూ ముగుస్తుంది ప్రతి రచన.

వీరి గ్రామీణ స్త్రీ పాత్రలలో ఒక విశేషం ఉంది. వీరు మొదట ముగ్ధలుగా పరిచయమవుతారు. వ్యవస్థ దౌర్జన్యానికి కొంతవరకు తలవంచుతారు. చివరకు

కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సంఘం అందించిన చేయూతతో చైతన్యమూర్తులవుతారు. 'ఇలా స్వతంత్ర భారతానికి జై'లో పార్వతి, 'ఎకరాడికి ప్రస్థానం'లో మాణిక్యాంబ ఇలాంటి పాత్రలు. ఈయనకు స్త్రీల పట్ల అపారమైన గౌరవం ఉంది. ఏ స్త్రీ పాత్రనూ హీనంగా కానీ అవమానకరంగా కానీ చూపించరు. వారంతా ఆర్తులు అభాగినులు అసహాయులు మాత్రమే. గ్రామీణ జీవితంలోని దోపిడీ తత్వాన్ని కక్షలు కార్పణ్యాలనే కాక గ్రామీణ జీవితంలోని పరస్పర మమకారాలను స్నేహసంబంధాలను కూడా ఈయన పాత్రలు వ్యక్తం చేస్తాయి. ఒక్క మాటలో ఈయన పాత్రలన్నీ సజీవ మానవతా మూర్తులు.

రచనా శిల్పంలో ఈ రచయిత చేసిన ప్రయోగాలు అపూర్వాలు. సైరన్ని రేడియో నాటికల్లో ఇతివృత్తానికి నేపథ్యంగా వాడుకోవటం ఒక ఆధునిక ప్రయోగం. ఇది శ్రోతలను ఒక అద్భుత వాతావరణంలోకి తీసుకుపోతుంది. అయినా రచన పరమార్థాన్ని సామాజిక జీవిత సత్యంతోనే ముడివేయటం రచయిత ప్రతిభకు తార్కాణం (ఆకలిమందు

కాలయంత్రం) . శ్రీకృష్ణ శిరోభారం, మహానిష్క్రమణం, నీలిటోపీలు నాటకాలలో పురాగాథను (myth) ని సామాజిక సత్యాలుగా వ్యాఖ్యానించటానికి ఉపకరణంగా వాడుకోవటం కూడా ఆధునిక శిల్పప్రయోగమే. ఈవిధమైన ప్రయోగాలు పురాగాథలలోని సార్వజనిక సామాజిక అంశాలను స్పష్టం చేయటమేగాక పాఠకుని(శ్రోత) పూర్వ శ్రుత అద్భుత లోకాలలోకి తీసుకుపోయి అపరిచిత పూర్వమైన ప్రపంచంలోనే ఒక వినూత్న సత్యాన్ని దర్శించిన అనుభూతిని కల్గిస్తుంది.

'చీమ మనుషులు' నవలలో చీమలద్వారా కొంత కథ మానవ పాత్రలద్వారా కొంతకథ చెప్పించటం కథన శిల్పంలో మహాఅద్భుత ప్రయోగం.

" బలవంతుడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా!
బలవంతమైన సర్పము
చలిచీమల చేతఁ జిక్కి చావదె సుమతీ!"

అనే సుమతీ శతకారుని సూక్తికి వచన రూప

వ్యాఖ్యానంలా నిలుస్తుంది ఈకథనం. ఆనాటి నుంచి ఈనాటిదాకా మరి ఇంక ఎన్నాళ్ళోదాకా మాసిపోని సత్యాన్ని తన కథనశిల్పంలో ప్రదర్శించారు రచయిత.

సజీవపాత్రను (కంభంపాటి సత్యనారాయణ-'లాల్ స్వతంత్ర భారత్ కి జై') నవలలో ప్రవేశపెట్టడం నవల అంతా యథార్థమా కథనమా? - అనే భ్రమను కల్గిస్తుంది. ఇది నవలలోని వాస్తవ చిత్రణకు వన్నెతెచ్చింది.

నీలిదీపాలు కథ రచయిత నాటకాలకు తలమానికమని చెప్పుకోవచ్చును. హృదయాలను కదిలించే ఇతివృత్తానికి బుర్రకథతోడి రచనాశిల్పం విచిత్రమైన సార్వకా-లీకతను సంతరించి పెట్టింది. ఈకథ ఏనాడో ఏజానపదులో ఏసమాజపు పొరలను చీల్చుకుంటునో చెప్పుకొన్నదే. యుగయుగాలుగా పీడిత ప్రజానీకాన్ని ఉద్ధరించే ప్రజా-నాయకుడే ఆకాలంవారికి అవతారమూర్తియై తర్వాత తరాలవారికి దైవమై అనంతకాలవాహిని మీద అచంచలంగా ప్రకాశిస్తున్నాడు. చితికిన అతని గుండె శకలాలు వెలిగించిన

జ్యోతులు నిలిచిపోలు. నాటకంలో రంగస్థలం మీద ప్రదర్శించలేని ఎన్నో అంశాలను బుర్రకథ ద్వారా వ్యాఖ్యానించి నాటకంలో పట్టుచెడకుండా ప్రేక్షకుల హృదయాలను తన పిడికిట పట్టి ఉంచుతుంది. ఈకథన శిల్పంతో ప్రేక్షకులు చితికిన గుండె జ్యోతులలో తమ గుండెల శ్రుతి కలుపుకోవాలని ఆరాటపడుతారు, సంసిద్ధులవుతారు. ఇదే రచయిత ఆశించిన ధ్యేయం.

చిరంజీవి రాసిన కథానికలలో ఇతివృత్త వైవిధ్యం ఉంది. 'రెండు కన్నీటి చుక్కలు' కథలో అందుకోలేని ప్రేమ కోసం అలమటించే ఆర్త హృదయపు ఘోషణ; 'గాజులంచులమంద' కథలో ప్రేమను పొందలేని ఒక అభాగ్యుని నిరంతరాన్వేషణను; 'మంచివాడు' కథానికలో మంచివాడు అనిపించుకునే వ్యక్తి లోపల దాగే గడుసువాడిని; 'దేవుడెరగని నిజం' కథలో దేవుడు పేరుచెప్పుకొని కులతత్వాలను, గ్రామాల్లో చెలరేగే కక్షలను; 'పండువెన్నెలనిండు చీకటి' కథానికలో మానవ మనస్తత్వంలోని వైచిత్ర్యాన్ని చక్కగా చిత్రించాడు రచయిత.

మొత్తం మీద ఒక ధ్యేయంతో సాహితీ వ్యవసాయానికి పూనుకొని చివరివరకు తన ధ్యేయాన్ని సఫలీకృతం చేసుకున్న రచయిత చిరంజీవి.

# ఉపయుక్త గ్రంథసూచి

1. ఆనందారామం, సి. *తులనాత్మక సాహిత్యం - నవలా ప్రక్రియ* హైదరాబాదు: విశాలాంధ్ర బుక్ హౌస్, 1990.

2. ______. *నవలా - విమర్శ*. హైదరాబాదు: ఉమా పబ్లికేషన్స్, 1994.

3. ఇనాక్, కొలకలూరి. *సాహిత్య దర్శని*. అనంతపురం: జ్యోతి గ్రంథమాల, 1985

4. కుటుంబరాయ శర్మ, బొడ్డుపాటి. *ఆంధ్రా నవలా పరిణామము*. హైదరాబాదు: గాయత్రి ప్రచురణము, 1971.

5. కృష్ణ, అత్తిలి. *నాటకీయం*. విజయవాడ: అరుణా పబ్లిషింగ్ హౌస్, 1985.

6. గంగప్ప, ఎస్. *తెలుగు నాటకం*. గుంటూరు: నగీ ప్రచురణలు, 1985.

7. చంద్రగుప్త, విద్యాలంకార్. శాంత సుందరి, శ్రీ కె. (అను.). *హిందీ ఏకాంకికలు*. కొత్త ఢిల్లీ: నేషనల్ బుక్ డిస్ట్రిబ్యూషన్, 1973.

8. చిరంజీవి, కె. అనంతయాత్ర. విజయవాడ: నవీనగ్రంథమాల, 1963.

9. ________. ముళ్ళగులాబి. విజయవాడ: నవీనగ్రంథమాల, 1962.

10. ________. నర్తనబాల. విజయవాడ: ఛాయా పబ్లికేషన్స్, 1967.

11. ________. రెండు కన్నీటి చుకలు. విజయవాడ: ఛాయాపబ్లికేషన్స్, 1967.

12. ________. మూడు జాతీయనాటకాలు. హైదరాబాదు: హైదరాబాదు అభ్యుదయ రచయితల సంఘం, 1977.

13. ________. రేడియో నాటికలు. విజయవాడ: అరుణాపబ్లిషింగ్ హౌస్, 1982.

14. ________. టోల్ స్వతంత్ర భారత్ కీ జై. హైదరాబాదు: విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్, 1984.

15. చిరంజీవి. కె. నీలిదీపాలు. విజయవాడ: అరుణాపబ్లిషింగ్‌హౌస్, 1984.

16. ________. చీమ మనుషులు. హైదరాబాదు: విశాలాంధ్రపబ్లిషింగ్‌హౌస్, 1987.

17. ________. జీవితమే నాటకరంగం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, 1989

18. ________. ఆటబొమ్మలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, 1992.

19. ________. ఎకరాడికీ ప్రస్థానం. విజయవాడ: నవీనగ్రంథమాల.

20. జయప్రభ. నాటకో గోడ - తెలుగులో ఆధునిక నాటకం. హైదరాబాదు: చరితప్రచురణలు, 1992.

21. దక్షిణామూర్తి, పోరంకి. తెలుగు కథానిక స్వరూప-స్వభావాలు. హైదరాబాదు: విశాలాంధ్రప్రచురణాలయం, 1988.

22. నాగభూషణశర్మ, మొదలి. తెలుగు నవలా వికాసము. సికింద్రాబాదు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, 1971.

23. నారాయణబాబు, శ్రీరంగం. రుధిరజ్యోతి. విజయవాడ: నవోదయ పబ్లిషర్స్, 1972.

24. బాలు. రేడియోనాటికలు. విజయవాడ: అరుణాపబ్లిషింగ్ హౌస్, 1982.

25. బాలగంగాధర తిలక్, దేవరకొండ. అమృతం కురిసిన రాత్రి. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్-హౌస్, 1969.

26. మధుసూదన్, వనం. తెలుగు ఏకాంకికా వికాసం. వరంగల్: శరత్ ప్రచురణలు, 1988.

27. రంగనాథాచార్యులు, కె.కె.(సం). ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు. హైదరాబాదు: ఆంధ్రసారస్వతపరిషత్తు, 1982.

28. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని. ఆంధ్ర నాటక రంగ చరిత్ర. మద్రాసు: వేణుక గ్రంథమాల, 1969.

29. రామానుజరావు, దేవులపల్లి (సం). తెలుగు నవల నూరు సంవత్సరాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1973.

30. లక్ష్మీకాంతం, పింగళి. సాహిత్య శిల్ప సమీక్ష. విజయవాడ: గంగాధర పబ్లికేషన్స్, 1986.

31. లక్ష్మీనారాయణ, ఉన్నవ. మాలపల్లి. మచిలీపట్నం: త్రివేణి పబ్లిషర్స్, 1976.

32. వేణుగోపాలస్వామి, కూర్మ. (సం). ప్రసిద్ధ నాటకలు. హైదరాబాదు: దక్షిణ భాషా పుస్తక సంస్థ, 1957.

33. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. ఎల్లోరా రచనలు - సమగ్ర పరిశీలన. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1991.

34. శివలక్ష్మి, పి. శ్రీశ్రీ రేడియో నాటికలు ప్రయోగవాద ధోరణులు. ఎంఫిల్ పరిశోధనా వ్యాసం. (అ.సి.(గ్రం.). హైదరాబాదు విశ్వవిద్యాలయం, 1989.

35. శ్రీనివాసరావు, శ్రీరంగం. 1+1=1 మొదటైన రేడియో నాటికలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1987.

36. సంజీవమ్మ, పి. తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం. కడప: అభ్యుదయ రచయితల సంఘం, 1985.

37. సుబ్రహ్మణ్యం, జి.వి. (సం.). మహతి. హైదరాబాదు: యువభారతి ప్రచురణలు, 1972.

38. ____________. (సం.). సమాలోచనం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1980.

## వ్యాసాలు

1. అనంత పద్మనాభరావు, సి. రేడియో నాటికలు - ఒక విశ్లేషణ. ఆంధ్రప్రభ. 24-1-1988.

2. అమరేంద్ర. రేడియో నాటకం. భారతి. ఫిబ్రవరి, 1939.

రేడియో నాటికలు. భారతి. 29-5-1952.

4. ఈశ్వరచక్రవర్తి, బిగుళ్ళ. జనజీవిత చిత్రణ - బోలో స్వతంత్ర భారత్ కీ జై. ఆంధ్రభూమి. 5-5-1985.

5. కోటేశ్వరరావు, పోలవరపు. సాంఘిక రాజకీయ నవల. ప్రజాశక్తి. 31-3-1985.

6. చెన్ను. ప్రజామండలిచే వెలిదీపాలు. విశాలాంధ్ర. 26-12-1988.

7. చేతన్. జీవితమే నాటకరంగం. ఆంధ్రప్రభ. 29-5-1989.

8. చైతన్యప్రసాద్. కదిలించే నాటకాలు. ఉదయం (ఆదివారం). 7-6-1992.

9. నంది, ఎస్.ఆర్. నాటకం చిరంజీవి. ఆంధ్రప్రభ (వారపత్రిక). ఫిబ్రవరి 24, 3 మార్చి, 1993

10. ________. చిరంజీవి నాటికలు సర్వస్వం. ఆంధ్రభూమి. 30-4-1989.

11. పట్టాభిరామారావు, పరకాల. __టోలూ స్వతంత్ర భారత్ కి జై.__
విశాలాంధ్ర. 2-2-1986.

12. భూపతి. __టోలూ స్వతంత్ర భారత్ కి జై.__
ఆంధ్ర పత్రిక. 16-9-1986.

13. మల్లికార్జునరావు, కప్పగంతుల. __విచిత్రమైన తెలుగునవల-అనంతయాత్ర__
ఆంధ్ర జనత 14-3-1969.

14. మీనన్, కె.కె. __నవలలా సాగిన చరిత్ర.__
ఉదయం 11-3-1985.

15. రజనీకాంతరావు, బాలాంత్రపు. __రజనీ గేయనాటికలు.__
విశ్వవీణ. 1959.

16. రాజమన్నార్, పి.వి. __రేడియో నాటకములు.__
భారతి. జనవరి 1948.

17. శివాజీ. __జీవితమే రేడియో నాటకరంగం.__
ఉదయం. 24-4-1989.

18. శ్రీకాంత శర్మ, ఇంద్రగంటి. __శ్రవ్యనాటకం.__
ఆలోచన. పు. 117-131

# ENGLISH BOOKS


1. Aeschylus. — Agamemnon (Text) 525 B.C to 456 B.C.

2. Bernard Grebanier. — Play Writing - How to write for the Theatre. Barns and Nobel Books. New York: A Division of Harpes and Row Publishers. 1979.

3. G.N. Reddy. — The influence of English on Telugu Drama.

4. Macniece Louis. — Christopher Columbus. Faber and Faber, 1942.

5. Mathuen. — The Readers Encyclopaedia of World Drama. Edited by John Carsug & Edward Quinn. London: Mathew and Co Ltd. 1970.

6. Rodgar Yen. <u>Radio Drama</u>. Britain; The Mc millan press, 1982.

7. Sophocles. <u>Antigone</u>. 496 – 406 B.C

8. Wells, H.G. <u>The Time machine and other writings</u>. London: william Heinemann limited, 1895.

# సంకేత పద వివరణ

1. అను. – అనువాదం
2. అ.ర.సం – అభ్యుదయ రచయితల సంఘం
3. అ.సి.గ్రం – అముద్రిత సిద్ధాంత గ్రంథం
4. పు. – పుట
5. రా. వి. శాస్త్రి – రాచకొండ విశ్వనాథ శాస్త్రి
6. వ్యా. – వ్యాసం
7. వ్యా. సంక. – వ్యా. సంకలనం
8. శ్రీ శ్రీ – శ్రీరంగం శ్రీనివాసరావు
9. సం. – సంపాదకుడు
10. సంక. – సంకలన కర్త